

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

పేజీలు: 18 + 20

వెల: రూ. 5.00




సోమవారం | 5-3-2018

సంపుటి: 58
సంచిక: 319

శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: చవితి రా. 12.40 తదుపరి పంచమి; నక్షత్రం: చిత్త రా. 8.18 తదుపరి స్వాతి; వర్జ్యం: రా. 2.05-3.44; దుర్ముహూర్తం: మ. 12.51-1.38, మ. 3.12-3.59; అమృతఘడియలు: మ. 1.54-3.30; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.35; సూర్యాస్తమయం: 6.20

విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai



జిల్లాకో అనారోగ్యం..

విజయనగరం	హై బీపీ	విశాఖపట్నం	కీళ్లవాతం
కడప	హై బీపీ	ప్రకాశం	కీళ్లవాతం
తూర్పుగోదావరి	షుగర్	చిత్తూరు	కీళ్లవాతం
పశ్చిమగోదావరి	షుగర్	కర్నూలు	కీళ్లవాతం
కృష్ణా	గుండె జబ్బులు	అనంతపురం	కీళ్లవాతం
గుంటూరు	గుండె జబ్బులు	నెల్లూరు	ఆస్తమా
		శ్రీకాకుళం	ఆస్తమా

ఏపీకి సుస్తీ

అనారోగ్యంతో జిల్లాలన్నీ విలవిల

ప్రతిచోటా ఏదో ఒక సమస్య

ఉభయ గోదావరి జిల్లాల్లో హై షుగర్

కృష్ణా, గుంటూరులో గుండె జబ్బులు

కీళ్లవాతంతో 5 జిల్లాలు నొప్పులపాలు

హెల్త్ బులెటిన్‌లో తేటతెల్లం

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు సుస్తి చేసింది. రాష్ట్రంలో ఏ జిల్లా చూసినా ఏదో ఒక అనారోగ్య సమస్యతో బాధపడుతోంది. ఆదివారం విడుదల చేసిన రాష్ట్ర హెల్త్ బులెటిన్ చెబుతున్నది ఇదే. 5 జిల్లాల్లో కీళ్లవాతంతో జనం ఇబ్బంది పడుతుంటే.. 2 జిల్లాలు ఆస్తమా, 2 జిల్లాలు గుండె సంబంధిత సమస్యలు, మరో 2 జిల్లాలు షుగర్ వ్యాధితో, ఇంకో 2 జిల్లాలు హైబీపీతో బాధపడుతున్నాయి. ప్రతీ జిల్లాలో ఏదో ఒక అనారోగ్య సమస్య పీడిస్తోంది. ప్రభుత్వం రూ.7,500 కోట్ల బడ్జెట్ ఆరోగ్యశాఖకు

మిగతా 16వ పేజీలో...

ప్రజారోగ్యంలో నంబర్ వన్ మన లక్ష్యం

16

ఏడాదిలో దేశానికే ఆదర్శంగా మారతాం.. 15 రోజుల్లో 100% ఓడీఎఫ్

సుస్థిర అభివృద్ధిలో ఆరోగ్యశాఖ కీలకం.. ప్రతీనెలా 4న హెల్త్ బులెటిన్

పిల్లల ఆరోగ్యం కోసం 'పలకరింపు' కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం

పిల్లల వల్లే ఆనందం.. ఎక్కువ మందిని కనండి.. లేకుంటే రోబోలే దిక్కు

పెళ్లికి దూరం కావొద్దు.. పిల్లలొద్దనే పెళ్లిళ్లు అసలే వద్దు: సీఎం

హామీల అమలు కోసం..



విభజన హామీల అమలు కోరుతూ విశాఖ ఆర్కే బీచ్ రోడ్డులో ఆదివారం రాత్రి జరిగిన కాగడాల ప్రదర్శన

హామీలపైనే తొలి చర్చ

శాసనసభలో టీడీపీ వ్యూహం

హోదా, నిధులు, విద్యాసంస్థలు

ఇలా రోజుకో అంశంపై చర్చలు

సీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధిపైనా

నేటి నుంచే అసెంబ్లీ.. 8న బడ్జెట్



16

మళ్లీ సీన్ ఢిల్లీకి

నేటి నుంచే పార్లమెంటు మలివిడత

మళ్లీ నిరసనకు టీడీపీ ఎంపీలు రెడీ

సాయంత్రం అమిత్‌షాతో చర్చలు

పురోగతి లేకుంటే ఆందోళన తీవ్రతరం!

ఏపీ భవన్ వేదికగా జేఏసీల నిరసనలు

పార్లమెంటు ముట్టడికి కాంగ్రెస్ ప్రణాళిక

న్యూఢిల్లీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలంటూ తెలుగుదేశం సభ్యులు పార్లమెంటులో మళ్లీ పోరాటానికి సిద్ధమవుతున్నారు. మరోవైపు బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఆహ్వానం మేరకు కేంద్ర మంత్రి సుజనా చౌదరి నేతృత్వంలోని

మిగతా 6వ పేజీలో...

మమత ఫోన్ చేశారు

నాతో కలిసి సాగుతామన్నారు

హేమంత్ సోరెన్, మహారాష్ట్ర ఏంపీలూ మాట్లాడారు: కేసీఆర్

అసదుద్దీన్, పవన్ సంఘీభావం

6

తొలి ఓటు రాష్ట్ర ప్రయోజనాలకే!

కేసీఆర్ ఫ్రంట్‌పై వేచిచూసే ధోరణిలో బాబు

తెలంగాణకు సమస్యల్లేవ్.. ఏపీకి సాయం కావాలి

అందుకే సంయమనంతో ఒత్తిడి, పోరాటం

హామీలపై మోదీదే నిర్ణయం.. ఆయన స్పందన చూశాకే స్పందిస్తాం: టీడీపీ సీనియర్లు

చిత్తూరులో అరవింద్

రూ. 300కోట్ల పెట్టుబడితో వస్త్ర పరిశ్రమ

125 ఎకరాలు కేటాయించిన ప్రభుత్వం

15వేల మందికి ఉపాధి అవకాశాలు

సీఎం చంద్రబాబు సమక్షంలో ఎంవోయూ

వస్త్ర పరిశ్రమకు ఏపీ అనుకూలం: ఈడీ కులిన్



సీఎం సమక్షంలో పత్రాలు మార్చుకుంటున్న అరవింద్ మిల్స్, ఏపీఈడీబీ ప్రతినిధులు

Arvind
FASHIONING POSSIBILITIES

అమరావతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రలో మరో ప్రతిష్ఠాత్మక పరిశ్రమ ఏర్పాటు కానుంది. వస్త్ర రంగంలో ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులున్న అరవింద్ లిమిటెడ్‌ను చిత్తూరు జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదిరింది. సీఎం చంద్రబాబు సమక్షంలో ఆదివారం ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు(ఏపీఈడీబీ) సీఈవో జె. కృష్ణకిశోర్, అరవింద్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కులిన్ లాల్‌భాయ్ ఒప్పంద పత్రాలపై

మిగతా 16వ పేజీలో...

లాఠీ పట్టిన ఎస్పీ..



16

పులివెందులలో రచ్చ

వైసీపీ-టీడీపీ రాళ్ల దాడి

ట్రాఫిక్ ఎస్ఐ, మరో ఇద్దరికి గాయాలు

బాష్పవాయువు ప్రయోగించిన పోలీసులు

పులివెందులలో రాళ్లు రువ్వుకుంటున్న వారిని అదుపుచేసేందుకు స్వయంగా లాఠీ పట్టిన జిల్లా ఎస్పీ బాబూజీ (ఎడమ నుంచి రెండో వ్యక్తి)



22ఏ... అంటే ఏడుపే!

నిషేధిత జాబితాలో భూములు బందీ

ఎడాపెడా చేర్చేస్తున్న రెవెన్యూ

'అసైన్డ్' కాలం తీరినా తొలగించరు

భూసేకరణలో మినహాయించినా మొత్తం భూమి 22ఏ జాబితాలోనే

తొలగింపు పేరిట అక్రమార్కుల దందా

వేల సంఖ్యలో ఫిర్యాదులు, పిటిషన్లు

ఉన్నా లేనట్లుగా తయారైన కమిటీ



అమరావతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖ రాసిందే చట్టం... చెప్పిందే వేదం! '22ఏ' అంటూ ఒక్క లిటిగేషన్ వేసిందంటే... దాని నుంచి బయటపడటానికి తరాలు పట్టాల్సిందే. గజం నుంచి ఎకరాల వరకు.. విస్తీర్ణంతో సంబంధం లేకుండా.. ఆ కొర్రీల నుంచి బయటపడటానికి మూడొంతుల జీవితం గడిచిపోవాల్సిందే. దేశ విముక్తి కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులు, దేశం కోసం త్యాగాలు చేసిన మాజీ సైనికులు, సామాన్య రైతులు... ఎవరైనా.... కన్నీళ్లు పెట్టుకోవాల్సిందే. ఇది... రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ ద్వారా రెవెన్యూ విభాగానికి దక్కిన అధికారం ప్రభావం! 'ఫలానా భూమి 22ఏ సెక్షన్ కింద ఉంది' అని

మిగతా 2వ పేజీలో...









దాంపత్యం ఒక యోగం



పరంజ్యోతి

"స్త్రీ పుంస యోగోద్భవాం" ..భారతీయులు స్త్రీ పురుషుల దాంపత్యాన్ని పవిత్రమైన యోగంగా భావించారు. మానవ జీవితంలో దాంపత్యానికి అత్యంత ప్రాముఖ్యం ఉంది. చతురాశ్రమాల్లో ఒకటైన గృహస్థాశ్రమానికి లోకంలో ఒక ప్రత్యేక ప్రయోజనం ఉందన్న విషయం సర్వవిదితం. ధర్మార్థ కామ మోక్షాలసాధనలో దాంపత్యపు ఆవశ్యకత తప్పదు. అందుకే భారతీయులు దాంపత్య ధర్మాన్ని ఒక మహాయోగంగా గౌరవించారు. కేవలం శారీరక సుఖానుభూతి మాత్రమే ప్రధానంగా భావించినప్పుడు అది భౌతిక సంబంధంగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది. దానివల్ల దాంపత్య ధర్మానికి ఒక శాశ్వతత్వంగాని, ఒక నిబద్ధతగానీ, ఒక పవిత్రతగాని చేకూరదు. భారతీయ సంస్కృతిలో దాంపత్య సంబంధ విశేషాలను చెప్పే పురాణాలు, ఇతిహాసాలు మొదలైనవన్నీ కూడా స్త్రీని ఒక శక్తిస్వరూపిణిగా ప్రకృతిగా పురుషునిలో అతి ముఖ్యమైన భాగంగా భావించిన కారణంగానే పార్వతీ పరమేశ్వరులు అర్ధనారీశ్వర తత్వంగా భాసించారు. లక్ష్మీనారాయణులు స్థితికారకులై నిలిచారు. వాణీ చతుర్ముఖులు సృష్టికి ఆలంబనై వెలిగారు. దాంపత్య ధర్మ వైశిష్ట్యాన్ని చాటి చెప్పడానికి ఆదికవి వాల్మీకి మహర్షి రామాయణ గాథను లోకంలోకి తీసుకొచ్చాడు. ఆయన శోకం శ్లోకంగా మారడానికి ప్రధాన కారణం కూడా.. దాంపత్యంలోని ఆనందం విచ్ఛిన్నం కావడమేనన్నది మనకు తెలిసిన సత్యం. నేటికీ లోకంలో ఆదర్శ దంపతులుగా విశేష గౌరవాన్ని అందుకుంటున్న పుణ్యమూర్తులు సీతారాములు. జీవాత్మ పరమాత్మల కలయికగా భారతీయులు దాంపత్యాన్ని గుర్తించారు. ఇది యావద్విశ్వానికీ ఆదర్శమని నిస్సంశయంగా చెప్పవచ్చు.

- గన్నమరాజు గిరిజామనోహర బాబు



అన్నవరంలో జబర్దస్త్ ఫేం దొరబాబు వివాహానికి హాజరైన జబర్దస్త్ టీం

పెళ్లి బాజాలతో హోరెత్తిన తిరుమల

» అన్నవరంలో 'జబర్దస్త్'గా దొరబాబు పెళ్లి

ఫాల్గుణ మాసం హస్తనక్షత్రం, మేషలగ్నం శుభముహూర్తాన.. తిరుమల, అన్నవరం తదితర పుణ్యక్షేత్రాలు పెళ్లిబాజాలతో హోరెత్తాంది. తిరుమలలో ఆదివారం ఒక్కరోజే దాదాపు 174 జంటలు వివాహ బంధంతో ఒక్కటయ్యాయి. వధూవరులకు, వారి తల్లిదండ్రులతో కలిపి ఆరుగురికి టీటీడీ ప్రత్యేక దర్శనం కల్పించింది. కాగా, జబర్దస్త్ ఫేం దొరబాబుకు ప్రముఖ యాంకర్ నందినితో అన్నవరంలో ఘనంగా వివాహం జరిగింది. దొరబాబు స్వగ్రామం జిల్లాలోని తొండంగి కాగా, నందినిది నెల్లూరు. ఈ వివాహానికి జబర్దస్త్ కళాకారులు హైపర్ ఆది, రైజింగ్ రాజు, గణపతి, అప్పారావు, వినోదిని తదితరులు హాజరై ఆ జంటను ఆశీర్వదించి అభినందనలు తెలిపారు.

- తిరుమల, అన్నవరం




గియాంట్ ఎలక్ట్రిక్ రే ఫిష్, సూదిముక్కు టేకు చేప

» అరుదైన చేపలు.. అదిరే'రే'!

సముద్రపు అడుగున నిస్సారమైన నీటిలో ఉండే అరుదైన అతిపెద్ద విద్యుత్ రే (గియాంట్ ఎలక్ట్రిక్ రే ఫిష్)రకం చేపలు ఇటీవల విశాఖ తీరంలో మత్స్యకారుల వలలకు చిక్కుతున్నాయి. తాజాగా, ఆదివారం సాగర్ నగర్‌తీరంలో మత్స్యకారుల వలలో పడ్డాయి. వీటిలో సూదిముక్కు టేకు చేప ఒకటి కాగా, గియాంట్ ఎలక్ట్రిక్ రే ఫిష్ ఒకటి. దీన్ని తాము మరుమయ్య రకం చేపగా పిలుస్తామని, వీటిని ఆహారంగా తీసుకుంటామని స్థానిక మత్స్యకారుడు రామారావు తెలిపాడు. ఇవి శాస్త్రీయంగా నార్మిఫ్, నార్సినిడే కుటుంబానికి చెందినవి. ఈ చేపలు 50 కిలోల వరకు పెరుగుతాయి. కొన్ని రకాల ఎలక్ట్రిక్ రే చేపలు ముట్టుకుంటే షాక్ కొడతాయి!. తీరానికి వచ్చిన సందర్శకులు ఈ చేపలను ఆసక్తిగా తిలకించారు.

- సాగర్‌నగర్ (విశాఖపట్నం)

నీట్-2018 పరీక్షకు వయో పరిమితి సడలింపు

హైదరాబాద్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): నీట్-2018 పరీక్ష రాసేందుకు ప్రస్తుతమున్న వయో పరిమితిని సీబీఎస్ఈ సడలించింది. వయో పరిమితి విధించడంపై కొందరు విద్యార్థులు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు తీర్పు మేరకు అటువంటి వారు కూడా తాజాగా దరఖాస్తు చేసుకోవాలని సీబీఎస్ఈ వెల్లడించింది. వయోపరిమితి మించిన వారు మార్చి 9 లోగా దరఖాస్తు చేసుకోవాలని సీబీఎస్ఈ తాజాగా తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని సూచించింది.

ఎవరెవరికి అవకాశం: 1 వికలాంగులు, రిజర్వేషన్ కేటగిరిలో ఉండి 30 ఏళ్లు దాటిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. 2 స్టేట్ ఓపెన్ స్కూల్, ఎన్ఐఓఎస్ వారు. 3. బయాలజీ అదనపు సబ్జెక్టుగా తీసుకున్న వారు. 4. ప్రైవేటుగా ఇంటర్ పాస్ అయిన వారు. 5. అన్ రిజర్వ్‌డ్ కేటగిరిలో 25 సంవత్సరాలు దాటిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

టెట్ ప్రాథమిక కీ విడుదల

అమరావతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హతా పరీక్ష (టెట్) ప్రాథమిక కీ విడుదలైంది. గత నెల 21 నుంచి మార్చి 2 వరకూ విడదలవారీగా జరిగిన కంప్యూటర్ ఆధారిత పరీక్షకు సంబంధించిన ప్రాథమిక కీని https://cse.ap.go-v.in, https://aptet.apcfss.in వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ప్రాథమిక కీపై 4 నుంచి 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ అభ్యంతరాలను స్వీకరిస్తారు.

కొబ్బరి నూనె

ధరలకు రెక్కలు



» ఆ నూనె ధరపై 'కీటో' ఎఫెక్ట్

» 3 నెలల క్రితం కేజీ రూ.250

» ప్రస్తుతం 400-500కి పెంపు

విజయవాడ (మొగల్రాజపురం), మార్చి 4: ఎండా కాలం రాకముందే కొబ్బరికాయ ధరలు పెరిగాయి. ఇప్పుడు కొబ్బరినూనె రేటు కూడా రెట్టింపైంది. 4 నెలల క్రితందాకా కేజీ నూనె రూ.250 ఉండగా, ప్రస్తుతం రూ.400 నుంచి 500 దాకా పలుకుతోంది. కొబ్బరి నూనెకు ఇటీవలి కాలంలో బాగా డిమాండ్ పెరిగిపోయింది. కొబ్బరికాయల ధరల పెరుగుదలతోపాటు విజయవాడ, హైదరాబాద్ తదితర తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్య నగరాల్లో ఇటీవల బాగా వ్యాప్తిలోకి వచ్చిన కీటో డైట్ ప్రభావం కూడా ఈ పరిస్థితికి కారణమని అంటున్నారు. 'రోజుకు 70 గ్రాముల కొబ్బరి నూనె తాగితే.. ఊబకాయం మటుమాయం' అన్న ప్రచారం కీటో డైట్ వైపునకు ప్రజలను ఆకర్షిస్తోంది. దీంతో కొబ్బరినూనె వాడకం పెరిగిపోయింది. ఒక్క విజయవాడలోనే సు మారు 20 వేల పైచిలుకు మంది ఈ డైట్‌లో ఉన్నారని అంచనా. వీరంతా రోజుకు 70 గ్రాముల నూనె వాడితే.. అదనంగా 1,400 కేజీలు అవసరమవుతుంది.

గానుగకు గిరాకీ

కీటో డైట్‌లో భాగంగా తొలి పదిహేను రోజులు కొబ్బరినూనెను తీసుకోవాలి. ఈ నూనెను తాగడమే కాదు, ఏ రూపంలోనైనా శరీరంలోకి తీసుకోవచ్చు. అయితే, తలకు రాసుకునే కొబ్బరినూనెను సాధారణంగా మన వాళ్లు ఆహారంలో వినియోగించరు. ఈ నేపథ్యంలో ఆహారానికి వినియోగించే కొబ్బరినూనెను తయారు చేసే సంస్థలు పుట్టుకొచ్చాయి. ఇందులో పతంజలి వంటి సంస్థలు ముందు నిలిచాయి. విజయవాడలోని 'మన గ్రామం' అనే సంస్థ.. గానుగ నూనెను విక్రయిస్తోంది. ఈ నూనె కేజీ రూ.250కి దొరుకుతోంది. పతంజలి వంటి సంస్థలు తయారు చేసిన నూనె కేజీ రూ.400 నుంచి రూ.500 ఉంటోంది. ఎగువ మధ్యతరగతి, సంపన్న కుటుంబాల వారు పతంజలి ఉత్పత్తులను వాడుతుండగా, దిగువ మధ్యతరగతి, పేద కుటుంబాలు మాత్రం గానుగ నూనెను ఎక్కువగా వినియోగిస్తున్నాయి. దీంతో క్రమక్రమంగా కనుమరుగవుతున్న గానుగలకు తిరిగి గిరాకీ పెరిగింది. ఉదాహరణకు, విజయవాడ పటమట సెంటర్‌లోని ఓ గానుగలో గతంలో రోజుకి రెండు మూడు కిలోల కొబ్బరి నూనెను విక్రయించేవారు. అలాంటిది ఇప్పుడిక్కడ 15 నుంచి 20 కిలోలు కొంటున్నారు. సత్యన్నారాయణపురం, వన్‌టౌన్, పోరంకి తదితర ప్రాంతాలలో కూడా నూనె గానుగలున్నాయి. రెండు నెలల క్రితం వరకు ఇక్కడ వేరుశనగ నూనె, నువ్వుల ఎక్కువగా విక్రయించేవారు. వాటికి దీటుగా కొబ్బరినూనె వాడకం పెరిగిందని గానుగ యజమానులు చెబుతున్నారు.

పెరిగిన ఎగుమతులు

తూర్పుగోదావరి జిల్లా అంబాజీపేట కొబ్బరి ఉత్పత్తులకు పెట్టిందిపేరు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలకు ఇక్కడినుంచే కొబ్బరి నూనె ఎగుమతి అవుతుంటుంది. మూడు నాలుగు నెలల క్రితం, ఇక్కడి నుంచి నెలకు 10వేల టన్నుల కొబ్బరి నూనె ఎగుమతి అయ్యేది. అలాంటిది ప్రస్తుతం 25 నుంచి 30 టన్నులు రవాణా అవుతోందని స్థానిక ఆయిల్ మిల్ యజమాని ఒకరు తెలిపారు. అలాగే, ఆరునెలల క్రితం ఫస్ట్ క్వాలిటీ కొబ్బరి నూనె కేజీ రూ.200 ఉంది. ప్రస్తుతం అది 250 పలుకుతోంది. రెండో క్వాలిటీ ధర రూ.150 ఉండగా, అది ప్రస్తుతం రూ.190కి చేరింది.

కీటోజెనిక్ డైట్ వారికి ప్రమాదం

» ప్రజల ఆరోగ్యంతో వీరమాచనేని ఆటలు

» తక్షణమే అరెస్ట్ చేయండి

» ఏపీ మధుమేహ సమాఖ్య డిమాండ్

గుంటూరు(మెడికల్) మార్చి 4: కొన్ని ప్రాణాంతక వ్యాధులతో బాధపడే రోగులకు సూచించే కీటోజెనిక్ డైట్‌తో మధుమేహం పూర్తిగా తగ్గుతుందని ప్రచారం చేస్తున్న పౌష్టికాహార నిపుణుడు వీరమాచనేని రామకృష్ణను తక్షణం అరెస్ట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ డయాబెటిస్ ఫెడరేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. అశాస్త్రీయ ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ వారి ఆరోగ్యంతో ఆటలాడుతున్న రామకృష్ణను నకిలీ వైద్యుడిగా గుర్తించి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఏపీ డయాబెటిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో ఆదివారం జరిగిన 'డయాబెటిస్ అప్‌డేట్' సింపోజియంలో పలువురు మధుమేహ వైద్యనిపుణులు కీటోజెనిక్ డైట్‌పై చర్చించారు. షుగర్ రోగులు కీటోజెనిక్ డైట్ పాటిస్తే కిడ్నీ, గుండెపై ప్రభావం చూపుతుందని, ఎముకల పెళుసుబారుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.



ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ ఈశ్వర్

22ఏ... అంటే ఏడుపే!

(మొదటి పేజీ తరువాయి)

కలంతో ఒక్క పోటు పొడిస్తే చాలు! ఆ భూమి 'నిషేధిత' జాబితాలోకి వెళ్తుంది. దాన్ని సొంతదారులు విక్రయించలేరు! దాన్ని ఎవరూ కొనలేరు! ఇంకా చెప్పాలంటే.. అది ఉన్నా లేనట్లే! ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా కాపాడుకోవడానికి, అసైన్డ్ భూములు అన్యాక్రాంతం కాకుండా ఆపడానికి తీసుకొచ్చిన ఈ సెక్షన్.. అక్రమార్కులకు, దందాలకు అలవాటు పడిన నేతలకు కాసులు కురిపిస్తోంది.

మంచి కోసం తెస్తే...

ప్రభుత్వ భూముల కబ్జా, క్రయ, విక్రయాలను అడ్డుకునేందుకు భూముల రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత భూముల జాబితాను తీసుకొచ్చారు. తొలుత ప్రభుత్వ భూములను ఈ జాబితాలో చేర్చారు. కాల క్రమంలో ప్రభుత్వం వివిధ అవసరాల కోసం పేదలు, రైతులు, ఇతర వర్గాల నుంచి సేకరించిన భూములను కూడా 22ఏ జాబితాలోకి తీసుకొచ్చారు. ఆ తర్వాత స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికులు, రాజకీయ ఘర్షణల బాధితుల జీవన భృతి కోసం అసైన్ చేసిన భూములను ఈ పరిధిలోకి తీసుకొచ్చారు. అయితే.. వీరికి అసైన్ చేసిన భూములను నిర్దిష్ట కాలపరిమితి తర్వాత, అంటే ఐదు-పదేళ్ల తర్వాత అమ్ముకునే అవకాశం ఉంది. ఆ కాల పరిమితి తీరాక రెవెన్యూ అధికారులు వాటిని 22ఏ నుంచి తొలగించాలని రిజిస్ట్రేషన్ శాఖకు సిఫారసు చేయాలి. కలెక్టర్ నుంచి ఎన్‌వోసీ రాగానే ఆ భూములను అమ్ముకోవచ్చు. అయితే, ఈ విధానం కూడా దుర్వినియోగం అవుతోందని... ఇటీవల ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. సమరయోధులు, రాజకీయ బాధితులు, మాజీ సైనికుల భూములకు ఎన్‌వోసీలు అక్కర్లేదని సంచలన నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం.. పై మూడు కేటగిరీలకు చెందిన అసైన్డ్ భూములకు సంబంధించి ఎన్‌వోసీలతో, రెవెన్యూ అధికారులతో పనే ఉండకూడదు. కానీ పరిస్థితిలో ఏ మాత్రం మార్పు రాలేదు. మౌలిక సదుపాయాల కల్పన పేరిట ప్రభుత్వం పేదలు, సామాన్యులు, రైతుల నుంచి పెద్ద ఎత్తున భూములు సేకరిస్తోంది. ఇలాంటి భూములను కూడా 22ఏ జాబితాలో చేర్చారు. ఇక్కడే సామాన్యులకు అనేక చిక్కులు వచ్చాయి. ఒక గ్రామంలో ఓ రైతుకు ఉండే 10 ఎకరాలను నోటిఫై చేసి అందులో అవసరం ఉన్న మేరకు... అంటే 8 ఎకరాలే ప్రభుత్వం సేకరిస్తుంది. మిగిలిన రెండు ఎకరాల భూమి రైతు వద్దే ఉంటుంది. అయితే, రెవెన్యూ అధికారులు ఆ మొత్తం 10 ఎకరాల భూమినీ 22ఏ జాబితాలో చేరుస్తున్నారు. ఇలాంటి కేసులు 28,750కిపైగా ఉన్నాయి. దీనిపై రెవెన్యూ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా.. పట్టించుకోవడం లేదన్న ఆవేదన వ్యక్తమవుతోంది. సేకరణలో లేని భూములను 22ఏ నుంచి తొలగించాలని ప్రభుత్వం ఆర్నెల్ల క్రితమే ఆదేశించింది. ఒకట్రెండు జిల్లాలు మినహా మరెక్కడా దీన్ని చేపట్టలేదు.

వారికి కాసుల వర్షం...

22ఏను కొందరు అధికారులు, రాజకీయ నేతలు కొత్తరకం దందాకు వాడుకుంటున్నారు. గడిచిన మూడేళ్లలో పలు కారణాల వల్ల 22ఏలో చేరిన భూమి తిరిగి ఆ జాబితా నుంచి బయటకు రాలేదు. ఇది గమనించిన నేతలు.. అధికారులతో కుమ్మక్కయి దందా నడిపిస్తున్నారు. రైతులను భయపెట్టి మరీ సొమ్ము చేసుకుంటున్నారు. 'మీ భూమి జన్మలో 22ఏ నుంచి బయటపడదు. మాతో ఒప్పందం చేసుకోండి! 22ఏ సెక్షన్ నుంచి మొత్తం భూమిని తప్పిస్తాం. సగం భూమి మాకిచ్చేయండి' అంటూ ఒప్పందాలు చేసుకుంటున్నారు. విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, నెల్లూరు గుంటూరు జిల్లాల్లో ఈ దందాలు మరీ ఎక్కువయ్యాయని అధికారవర్గాలు చెబుతున్నాయి.

దేవుడు దిగిరావాల్సిందే...

భూములను అనవసరంగా, అన్యాయంగా నిషేధిత జాబితాలో 'బంధించడం'పై ఇప్పటికి 10సార్లు సమీక్షలు నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి రెవెన్యూ ఉన్నతాధికారులకు 30సార్లు గీతోపదేశం చేశారు. ఎవరెన్ని చెప్పినా.. అధికారులు మాత్రం మారడంలేదు. 13 జిల్లాల్లో కలిపి 22ఏ జాబితాలోని భూముల వివరాలను 2016లోనే గెజిట్ నోటిఫికేషన్ రూపంలో విడుదలచేశారు. దానిపై వందల మంది హైకోర్టులో కేసులు వేశారు. వీటన్నింటిని కలిపి విచారించిన హైకోర్టు 2016లోనే రాష్ట్ర సర్కారుకు ఆదేశాలు ఇచ్చింది. 22ఏ కేసుల పరిష్కారానికి ప్రత్యేకంగా రాష్ట్ర స్థాయిలో కమిటీ వేయాలని ఆదేశించింది. 2017లో ఈ కమిటీ వేశారు. ఈ కమిటీని నియమించాక... తొలి భేటీ కంటే ముందే ఇందులోని రిటైర్డ్ జడ్జి రాజీనామా చేసి వెళ్లిపోయారు. ఏడాదిగా మరో వ్యక్తిని నియమించలేదు. ఇద్దరు అధికారులతో కూడిన కమిటీనే పనిచేస్తోంది. కమిటీ ముందు వందలాది పిటిషన్లు ఉన్నాయి. ఇటీవల 65 పిటిషన్లను మాత్రం విచారించారు. కమిటీ పిటిషన్‌దారులకు వ్యతిరేకంగా తీర్పునిస్తే హైకోర్టును ఆశ్రయించాల్సిందే. అయితే కమిటీ స్థాయిలో పరిష్కారమే లేకపోవడంతో ఎవరూ ఏమీ చేయలేకపోతున్నారు.

కేఈ చెప్పినా..

"మీ వల్ల అప్రతిష్ఠ వస్తోంది. స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికులు ఈ దేశం కోసం త్యాగాలు చేశారు. వారి భూములకు ఎన్‌వోసీలు వద్దని చెప్పినా ఇంకా వాటిని 22ఏ జాబితా నుంచి తొలగించడం లేదు. మీ చుట్టూ తిరగలేక వారు విసిగిపోతున్నారు. వారి త్యాగాలకు మీరిచ్చే గౌరవం ఇదేనా? మీకు చివరగా 15 రోజులు గడువు ఇస్తున్నా... వారి భూములను 22ఏ నుంచి తొలగించకపోతే చర్యలు తప్పవు!"

- ఇటీవల జరిగిన సమావేశంలో రెవెన్యూ ఉప ముఖ్యమంత్రి కేఈ చేసిన హెచ్చరిక

పరిష్కారం లేదా?

అన్యాయంగా, నిబంధనలకు విరుద్ధంగా 22ఏలో చేర్చిన భూములకు విముక్తి కల్పించాలని ప్రభుత్వమే ఆదేశాలు ఇచ్చింది. వాటిని అమలు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అధికారవర్గాలు సూచిస్తున్నాయి. 22ఏ కమిటీని పునరుద్ధరించాలని, వీలైనంత త్వరగా ఆ కమిటీ పిటిషన్లు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆ అధికారులు చెబుతున్నారు. 'గతంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రికార్డులను ప్రజల వద్దకు తీసుకెళ్లారు. ఇప్పుడు కూడా అలాంటి సదస్సులు నిర్వహించి ఈ అంశాలపై ప్రజల్లో చర్చించి.. అక్కడే పరిష్కారాలు చూపాలి' అని ఓ సీనియర్ అధికారి చెప్పారు.



పోలవరం వద్ద పురావస్తు శాఖ తవ్వకాలు



» వెలుగుచూస్తున్న మెగాలిథిక్ సంస్కృతి అంశాలు

అమరావతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురవుతున్న ప్రాంతాల్లో విస్తృతంగా తవ్వకాలు జరుపుతున్నట్లు పురావస్తు శాఖ కమిషనర్ వాణీ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి తవ్వకాలు దక్షిణ భారతదేశంలో ఎక్కడా జరగలేదని పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాయనిపేట వద్ద, పశ్చిమగోదావరి జిల్లా రుద్రమకోట వద్ద మెగాలిథిక్ సంస్కృతి విలసిల్లిన ప్రాంతాల్లో నాలుగు నెలల నుంచి తవ్వకాల జరుపుతున్నామని వెల్లడించారు. తవ్వకాలు జరిగే ప్రాంతంలో ఆది మానవుల, జీవన విధానం నుంచి పరిపక్వతతో కూడిన కుటుంబ వ్యవస్థ, ఆదర్శవంతమైన మానవ నాగరికత వైపు అడుగులు వేస్తున్న మధ్య సంధి యుగంగా 'మెగాలిథిక్ సంస్కృతి అంశాలు బయటపడుతున్నాయని తెలిపారు. నేడు మనం అనుభవిస్తున్న సంస్కృతీ సంప్రదాయాలు, విజ్ఞానం, ఆధ్యాత్మికత, మత విశ్వాసాలు కృష్ణా, గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లో విలసిల్లిన మెగాలిథిక్ సంస్కృతి బీజాలేనని వివరించారు. నూతన రాష్ట్రంలో వారసత్వ, సాంస్కృతిక రంగాల్లో మరింత లోతైన అధ్యయనం అవసరమని పేర్కొన్నారు. ఈ మేరకు ఈ నెల 12, 13, 14వ తేదీల్లో గుంటూరు జిల్లా నాగార్జున వర్సిటీలో అంతర్జాతీయ సదస్సులు నిర్వహిస్తున్నట్లు వాణీమోహన్ వెల్లడించారు.





తవ్వకాలు జరుపుతున్న ప్రాంతంలో వాణీమోహన్

లోకం తీరు



ఇక మోసగాళ్ల ఆటలు సాగనివ్వం...

ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
కడప	39.0	17.0
కర్నూలు	38.6	22.1
గుంటూరు	38.0	20.5
విశాఖపట్నం	37.4	22.4
హైదరాబాద్	37.3	20.3
చిత్తూరు	37.0	17.0
అనంతపురం	37.0	17.0
విజయవాడ	36.2	20.0
నెల్లూరు	35.0	22.0

ఎండ తీవ్రత

విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కోస్తా, రాయలసీమల్లో ఎండతీవ్రత కొనసాగింది. పడమర గాలులు వీయడంతో మధ్యాహ్న సమయంలో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. ఆదివారం కడప, కర్నూలు, తిరుపతిల్లో 39 డిగ్రీలు నమోదైంది. శివారు ప్రాంతాలు, ఏజెన్సీలో రాత్రి పూట చలి వాతావరణం కొనసాగింది. ఆరోగ్యవరం, జంఘమహేశ్వరపురంలో 18 డిగ్రీలు నమోదైంది.



జిన్నా దేశ విభజనను కోరుకోలేదు

ముస్లిం లీగ్ నేత మహమ్మద్ అలీ జిన్నా దేశ విభజనను కోరుకోలేదు. ముస్లింలు, సిక్కులను మైనారిటీలుగా గుర్తించాలని, ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కానీ, నెహ్రూ, అబుల్ కలాం ఆజాద్, పటేల్‌లు అంగీకరించలేదు. దీంతో ముస్లింలకు ప్రత్యేక దేశం అనే అంశం తెరపైకి వచ్చింది. అప్పట్లో నాయకులు మైనారిటీ కమిషన్‌కు అంగీకరించి ఉంటే.. పాకిస్థాన్ ఉండేది కాదు.. బంగ్లాదేశ్ పుట్టేది కాదు.. వన్ ఇండియా ఉండేది.

- ఫరూఖ్ అబ్దుల్లా, జమ్మూకశ్మీర్ మాజీ సీఎం



ఫరూఖ్.. చరిత్ర చదువుకో

జిన్నా గురించి తెలుసుకోవాలంటే.. ఫరూఖ్ అబ్దుల్లా మళ్లీ చరిత్రను చదువుకోవాలి. ప్రత్యేక దేశం కావాలని జిన్నా అడిగినప్పుడు.. మహాత్మా గాంధీ ఆయనకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. బెట్టు వీడితే.. జిన్నాను భారత తొలి ప్రధానిగా ప్రకటించేందుకు జాతీయ కాంగ్రెస్ నేతలను ఒప్పిస్తానని చెప్పారు. అయితే.. అది అంత సులభం కాదని భావించిన జిన్నా .. పాకిస్థాన్ కోసం గట్టి ప్రయత్నం చేశాడు.

- జితేంద్ర సింగ్, కేంద్ర మంత్రి

రేపు, ఎల్లుండి ప్రత్యేక దర్శనాలు

తిరుమల, మార్చి 4(ఆంధ్రజ్యోతి):వృద్ధులు, దివ్యాంగులకు, ఐదేళ్ల చంటిబిడ్డల తల్లిదండ్రులకు టీటీడీ నెలకోమారు కల్పించే అదనపు దర్శన సౌకర్యాన్ని ఈనెల 6, 7తేదీల్లో ఏర్పాటు చేసింది. మంగళవారం వృద్ధులకు, దివ్యాంగులకు మొత్తం 4 వేల దర్శన టోకన్లు జారీ చేస్తారు. చంటిబిడ్డల తల్లిదండ్రులను బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సుపథం ద్వారా దర్శనానికి అనుమతిస్తారు. ఈ సౌకర్యం ఈనెల 20, 21 తేదీల్లో కూడా ఉంటుంది.

ఆర్థికమాంద్యం దెబ్బకు అనారోగ్యం

లండన్, మార్చి 4:ఆర్థికమాంద్యం దెబ్బకు 2008లో ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఇవి మాత్రమే కాదు ప్రజల ఆరోగ్యంపైనా ప్రభావం పడిందట. ఊబకాయం, మధుమేహం, మానసిక రుగ్మతలకు గురయ్యారట. యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ లండన్, కింగ్స్ కాలేజ్ లండన్ శాస్త్రవేత్తల పరిశోధనలో ఈ విషయం తెలిసింది. ఆర్థిక మాంద్యం తర్వాత ఊబకాయ రోగులు 4.1 శాతం, మధుమేహ రోగులు 1.5 శాతం, మానసిక రోగులు 4 శాతం పెరిగినట్లు పరిశోధకులు తెలిపారు.



GITAM

(DEEMED TO BE UNIVERSITY)

(Estd. u/s 3 of the UGC Act, 1956)

VISAKHAPATNAM ● HYDERABAD ● BENGALURU

Accredited by NAAC with A+ Grade

GIVE YOUR DREAM CAREER A PERFECT TAKE OFF

ADMISSIONS OPEN 2018-19

3200 + Placements for the year 2017-18

PROGRAMS OFFERED

GITAM - VISAKHAPATNAM

INSTITUTE OF TECHNOLOGY

B.Tech. Programs
Electronics & Communication Engineering
Electronics & Instrumentation Engineering
Computer Science Engineering
Mechanical Engineering
Electrical & Electronics Engineering
Information Technology
Civil Engineering
Industrial Engineering
Biotechnology

6 Yr. Dual Degree (B.Tech.+M.Tech.)
Electronics & Communication Engineering
Mechanical Engineering

M.Tech. Programs
Computer Science & Technology
Software Engineering
Cyber Forensics & Information Security
Information Technology
Data Sciences
RF & Microwave Engineering
VLSI Design
Embedded Systems
Digital Systems & Signal Processing
Electronic Instrumentation
Power Systems & Automation
Machine Design
CAD / CAM
Industrial Engineering & Management
Structural Engg. & Natural Disaster Management
Biotechnology
Food Processing Technology

Ph.D. (Full Time & Part Time)
Biotechnology
Civil Engineering
Computer Science Engineering
Electronics & Communication Engineering
Electrical & Electronics Engineering
Information Technology
Industrial Engineering
Mechanical Engineering

SCHOOL OF ARCHITECTURE
B.Arch.
M.Arch. (Sustainable Architecture)

INSTITUTE OF PHARMACY
B.Pharmacy
M.Pharmacy
Pharmaceutics
Pharmaceutical Analysis
Pharmacology
Pharmaceutical Chemistry

Ph.D. (Full Time & Part Time)

INSTITUTE OF SCIENCE
B.Sc. (Physical Sciences) - Mathematics, Physics, Chemistry / Electronics / Computer Science / Statistics
B.Sc. (Life Sciences) - Biochemistry, Microbilogy, Chemistry / Bioinformatics / Biotechnology
B.Sc. (Hons.) - Food Technology
BCA (Bachelor of Computer Applications)
BEM (Bachelor of Environmental Management)

Integrated M.Sc. Programs (5 Yr.)
Biotechnology
Chemistry (Sponsored by Laurus Labs)

M.Sc. Programs
Applied Mathematics
Biochemistry
Bioinformatics
Biotechnology
Chemistry (Analytical / Organic / Pharmaceuitical)
Data Science
Earth Science
Environmental Science
Electronics Science
Food Science & Technology
Microbiology
Physics

MCA (Master of Computer Applications)

M.Phil. & Ph.D. (Full Time & Part Time)
Applied Mathematics
Biochemistry
Bioinformatics
Biotechnology
Chemistry
Computer Science
Electronics
Environmental Science
Microbiology
Physics

INSTITUTE OF MEDICAL SCIENCES AND RESEARCH
MBBS

SCHOOL OF NURSING
B.Sc. Nursing
M.Sc. Nursing (Nursing Practitioner in Critical Care)

SCHOOL OF INTERNATIONAL BUSINESS
MBA - International Business
MBA - International Banking & Finance
MBA - Global Logistics & Supply Chain Management
Modular MBA (PGDBA) in Business Analytics

Ph.D. (Full Time & Part Time)

INSTITUTE OF MANAGEMENT
BBA : Enterpreneurial Orientation
BBA : Management Accounting + CIMA
BBA : Business Analytics + MBA (Integrated)
B.Com (Hon.) + ACCA
MBA - Master of Business Administration
MBA - Human Resource Management
MBA - FinTech

SCHOOL OF GANDHIAN STUDIES
B.A. (Social Science with Civils orientation)
M.A. (Applied Psychology)
M.A. English Language and Literature

M.Phil. & Ph.D. (Full Time & Part Time)

SCHOOL OF LAW
5 Year Integrated B.A., LL.B. (Hons.)
5 Year Integrated B.B.A., LL.B. (Hons.)
3 Year LL.B.
2 year LL.M. (Intellectual Property Rights)
2 year LL.M. (Alternative Dispute Resolution)

GITAM - HYDERABAD

SCHOOL OF TECHNOLOGY

B.Tech. Programs
Aerospace Engineering
Electronics & Communication Engineering
Electronics & Instrumentation Engineering
Computer Science & Engineering
Mechanical Engineering
Electrical & Electronics Engineering
Information Technology
Civil Engineering
Industrial Engineering

6 Yr. Dual Degree (B.Tech.+M.Tech.)
Electronics & Communication Engineering
Mechanical Engineering

M.Tech. Programs
Computer Science & Technology
Cyber Forensics & Information Security
Data Sciences
VLSI Design
Power Systems and Automation
Computer aided Design, Manufacture & Engineering

Ph.D. (Full Time & Part Time)

HYDERABAD BUSINESS SCHOOL
BBA (Business Analytics / Financial Marketeing / CPA)
BBA with CIMA
B.Com (Hon.) + ACCA
MBA - Marketing / Finance / HRM / International Business / Operations & SCM / Business Analytics
MBA - FinTech
Executive MBA

SCHOOL OF PHARMACY
B.Pharmacy

SCHOOL OF ARCHITECTURE
B.Arch.

SCHOOL OF SCIENCE
B.Sc. (Hons) Chemistry
B.Sc (Chemistry, Mathematics, Computer Science)
B.Sc (Statistics, Mathematics, Computer Science)
B.Sc (Physics, Mathematics, Computer Science)
M.Sc. Bio-Technology
M.Sc. Chemistry (Pharmaceutical)

GITAM - BENGALURU

SCHOOL OF TECHNOLOGY

B.Tech. Programs
Electronics & Communication Engineering
Electronics & Instrumentation Engineering
Computer Science & Engineering
Information Technology
Electrical & Electronics Engineering
Civil Engineering
Mechanical Engineering
Industrial Engineering

6 Yr. Dual Degree (B.Tech.+M.Tech.)
Electronics & Communication Engineering
Mechanical Engineering

Ph.D. (Full Time & Part Time)

BENGALURU SCHOOL OF MANAGEMENT STUDIES
BBA - Bachelor of Business Administration
MBA - Master of Business Administration
IMBA - 5 yr. Integrated MBA


M.Phil. & Ph.D. (Full Time & Part Time)

1980-2017 38 Years of GITAM COMMITTED TO EXCELLENCE

www.gitam.edu

/ GITAMAdmissionTest







కలభాషిణి

నిశ్శబ్దానికి రంగు ఉందా
రుచి ఉందా
శరీరం ఉందా
కవీ నీకు తెలుసా... ఏమి ఉండదుంటుందో
అర్ధరాత్రి వాన దాడికి రాలిపోయిన
నిమ్మపువ్వు ఒకటి...
నీ పద నిర్మాణానికి సూచిక
తెలుసా
కవీ...
భాష మోసకారి
భాష అవతలి భాష
కావాలె నీకు
వొక చివరాఖరి ఊపిరి కదరా
కవిత్వం
కాలిపోయే చివరి అడుగు కదరా
కవిత్వం
నువ్వు భాషను నమ్ముకుంటే
అది నట్టేట ముంచుతుంది
నువ్వు మాటను నమ్మితే
అది వెన్నుపోటు పొడుస్తుంది
ఏమీ తెలియందే... నీ దారి
తెలుసుకున్నదంతా మోసం.. ద్వేషం
బూడిద పొగ
వుత్త... నిర్జీవ విచారం
నీలో ఊపిరి ఉన్నట్టే
పదం వుంది
దానికి రూపం లేదు
దారి నిచ్చే ద్వారమూ లేదు
అంతా అమూర్త అలికిడి
నైరాప్యత... గొప్ప కత
నీకు బహుమానం అది
నిజం చెబ్తున్నా విను
కవిత్వం.. అందుకోని దాంట్లోనే వుంది
రాజిల్లని.. సెగలో వుంది
కాలిపోని.. కాంతిలో వుంది
కవీ... నా కవీ... నా తుదితండ్రీ
నా మాట విను
భాష మోసకారి.. బైరూపి
నిలువ నీడ నీయదు
సరిహద్దులు.. మోసం.. కుట్ర
రంగులూ.. రుచీ దాని లంజడి ముచ్చట్లు
వుత్త కాలిపోయే దేహం దానిది
అది.. కనబడి వినబడదు
వినబడీ.. దారినివ్వదు
నా మాటిను
నువ్వు భాష లేకుండా వాక్యం తోడు లేకుండా
అక్షరంతో కాలయాపన చెయ్యకుండా
జరుగు
వెనుదిరుగు
వొక కాంతి కాలిబాటై పరుచుకుంటుంది
జీవి ధార కురుస్తుంది
అక్కడికి ఫో.. ఫోఫో
వుత్త రాగద్వ్యాసలాగ నగ్ననిశ్శబ్దంగా...
కనువిప్పని కలింకాయ మొగ్గలాగ
దాంట్లోకి పోయి కూకో...
నా మాటిను
కవిత్వం దొరుకుతుంది

■ సిద్ధార్థ
73306 21563



మన కాలం నాటి తెలుగు సాహిత్య సృజనకారుల్లో ఆజానుబాహువు మునిపల్లె రాజు (1925-2018) మన నుంచి వెళ్ళిపోయారు. అటువంటి గంభీర మానవసన్నిధి మన మధ్య నుంచి అదృశ్యమైపోయినప్పుడు, ఎప్పుడో, ఒక ప్రాకృత కవి రాసుకున్నట్టుగా, పెద్దచెట్టొకటి, నిన్నటిదాకా ఊరిమధ్య ఉన్నది నేడు లేకపోతే, ఎంత భరించలేని ఖాళీ ఏర్పడుతుందో అంత శూన్యమూ నేడు తెలుగు సాహిత్యాన్ని ఆవహించింది.

'ఎందరికో లభించని వరమాలికా ప్రసాదుడు'

*

మునిపల్లె రాజు ప్రధానంగా కథకుడు. రాసింది కొద్దిపాటే అయినప్పటికీ, ఆయన కవిత్వం కూడా అత్యున్నతశ్రేణికి చెందిన భావవ్యక్తీకరణ. చివరి ఇరవై ఏళ్ళలో ఆయన కొంత సాహిత్యప్రశంసా, అసంఖ్యాకమైన సాహిత్యప్రసంగాలూ కూడా చేసారు. దాదాపు అరవైఏళ్ళ పాటు సాగిన ఆ సాహిత్యసృజనను సాకల్యంగా సమీక్షించి, ఆధునిక తెలుగు సాహిత్యానికి ఆయన అందించిన ఉపాదానాన్ని అంచనా వెయ్యడం ఇంకా మొదలు కావలసి ఉంది. కాని, ఈ క్షణాన, ఆయన నడిచివెళ్ళిన ఆ పాదముద్రలు ఇంకా తడి ఆరకుండా నా కళ్ళముందు కనిపిస్తుండగా, అత్యవసరంగా చెప్పుకోవలసిన ఒకటి రెండు మాటలు చెప్పడమే ఇప్పటికి నా బాధ్యత.

మునిపల్లె రాజు జీవితకాల కృషి మూడు దశల్లో సాగింది. మొదటిది, ఆయన సైన్యంలో చేరకముందు, రెండవ ప్రపంచ యుద్ధానంతరం యాభైల్లో రాసిన కథలు. రెండవ దశ, ఆయన పదవీవిరమణ చేసిన తర్వాత 85-94 మధ్యకాలంలో పదేళ్ళ పాటు ఆయనలో సాగిన అంతర్మథనం, తనని వెన్నాడుతున్న ప్రశ్నలకు సమాధానం కోసం చేసిన అన్వేషణ. మూడవ దశ, 1995లో మొదలై, ఆయనన తాను మానసికంగా సాధించిన శాంతినీ, సమాధానాన్నీ కథలుగా రాసి 2002లో 'అస్తిత్వనదం ఆవలితీరాన' సంపుటిగా వెలువరించడంతో పూర్తయ్యింది.


తాను వెతుక్కుంటున్న ప్రశ్నలకి సమాధానం లభించాక రాసిన కథల్ని మునిపల్లె రాజు మాజికల్ రియలిజం కథలు అన్నారు. ఆ మాటవినగానే చాలామంది కనుబొమలెగరేసారు. ఎందుకంటే, మాజికల్ రియలిజం ప్రధానంగా రాజకీయ ఆగ్రహాన్ని వ్యక్తంచేయడానికి సృష్టించుకున్న ప్రక్రియ అనీ, అది లాటిన్ అమెరికా అవసరమనీ, రాజుగారి రచనల్లో ఆ రాజకీయ చర్చలేదనీ వారి భావన.

మార్క్వెజ్ మరణించినప్పుడు, అతడికి నివాళిగా రాసిన ఒక వ్యాసంలో పాల్ బెర్మాన్ అనే విమర్శకుడు 'మార్క్వెజ్ తన జీవితమంతా, తొలి నుంచి తుదిదాకా, ఉదాత్త సాహిత్యానికీ, క్షుద్రజీవితానికీ మధ్య ఉన్న వైరుధ్యంలో పరిష్కరించడానికి వీలుకానంత మహాప్రహేళిక (గ్రాండ్ కోనన్‌డ్రమ్)కు చిక్కుపడ్డాడు' అని రాసాడు. అతడు మరొక ప్రసిద్ధ నికరాగ్వా కవి రూబెన్ డారియో లాగా, ప్రాచీన స్పానిష్ సాహిత్యాన్ని, ఉత్తమ సాహిత్యాన్ని అధ్యయనం చేసాడనీ, ఆ సాహిత్యంలో కవులు చిత్రించిన ప్రపంచానికీ, తాము జీవిస్తున్న సమాజానికీ పొంతన కనబడకపోవడమే మార్క్వెజ్‌ను బాధించిందనీ, 'ఆ రెండు వాస్తవాలూ- ఒకటి స్పానిష్ బరోక్, అంటే సాహిత్యం, రెండోది, ఆధునిక వాస్తవం, అంటే అసాహిత్యం' ఈ రెంటినీ సమన్వయించుకోవలసి రావడంలోనే అతడికి మళ్ళా సాహిత్య సృజన అవసరమయిందని బెర్మాన్ రాస్తాడు. అంటే, మార్క్వెజ్ ప్రాచీన స్పానిష్ కవులు గొంగోరా వంటివారు రాసింది అసత్యమనలేడు, అలాగని, తన కళ్ళముందు కనిపిస్తున్న జీవితమూ అసత్యం అనలేడు. ఆ రెండు సత్యాలమధ్యా అతడు తనదే అయిన ఒక సేతువు నిర్మించుకోవలసి రావడమే అతడి సమస్య.

మునిపల్లె రాజు చేసింది కూడా ఇదే. ఆయన ఆ రెండు వాస్తవాల్నీ సామాజిక స్పృహ, జీవన స్పృహ- అన్నాడు. 'అస్తిత్వ నదం ఆవలితీరాన' సంపుటికి రాసుకున్న ముందుమాటలో ఆయనిట్లా రాసుకున్నాడు:

"ఈ సంపుటిలోని కథలు కొన్ని నా అదృశ్య పృచ్ఛకుడికి సమాధానాలుగా వెలువడ్డవేనని నా విశ్వాసం. నేటి మానవుడి చైతన్యానికి రెండు పార్శ్వాలైన సామాజిక స్పృహ, జీవన స్పృహ,-అతని సుదీర్ఘ వికల స్వప్న జీవితనిశిలో అంతర వ్యోమయానం చేస్తూనే ఉంటాయి. ఆ పరిభ్రమణల రహస్య ప్రకంపనలను అభివ్యక్తీకరించే ప్రయత్నమే ఈ మాజికల్ రియలిజం... భౌతిక దృష్టికి గోచరించే వాస్తవాల వెనక దాగివున్న అతిలోక వాస్తవాల్ని వెలికితీసే సాధనే మాజికల్ రియలిజం లేదా అద్భుత వాస్తవికత."

తనని పట్టుకున్న కోనన్‌డ్రమ్ నుంచి బయటపడటానికి మార్క్వెజ్ స్పానిష్ భాషను గతం తాలూకు నిరంకుశత్వం నుంచి బయట పడేయడానికి ప్రయత్నించాడని బెర్మాన్ రాసాడు. కాని, మునిపల్లె రాజు తెలుగు సాహిత్యాన్ని వర్తమానం తాలూకు నిరంకుశత్వం నుంచి బయటపడెయ్యడానికి ప్రయత్నించాడని నేననుకుంటాను. దానర్థం ఆయన గతంలోకి పోయి తలదాచుకోవాలని చూసాడనిగానీ, సామాజిక పరివర్తనను వెనక్కి తిప్పాలని చూసాడనీ కాదు. నిజానికి ఆయన చూపు ఎన్నటికీ భవిష్యత్తు వైపే, మనం చూడలేనంత భవిష్యత్తులోకి. 1996లో రాసుకున్న ఒక స్వగతంలో ఇలా రాసుకున్నారు: "యుద్ధం ముగిసిన అర్ధ శతాబ్దం తర్వాత ఈనాడు వెనుదిరిగి చూస్తే-రేపటి కథావస్తువూ, శిల్పం-ఈ రెండూ క్రమక్రమంగా విజ్ఞానశాస్త్రం వేపు మొగ్గచూపక తప్పదనిపిస్తుంది" అని.



కానీ, వర్తమానం తాలూకు నిరంకుశత్వమంటే, కంటికి కనిపిస్తున్నదే పూర్తిసత్యమని నమ్మలేకపోవడం. గొప్ప సాహిత్యం వర్తమానాన్ని తీవ్రంగా పట్టించుకుంటుంది, గాఢంగా అధ్యయనం చేస్తుంది, కాని అక్కడే ఆగిపోదు. గురజాడనే చూడండి, ఆయన కాలంనాటి వర్తమానం సంఘసంస్కరణతోనూ, ఇంగ్లీషు విద్యాసక్తి తోనూ, జాతీయోద్యమం తోనూ ఉప్పొంగుతున్న వర్తమానం. కాని ఆయన ఆ మూడింటినీ తన రచనల్లో నిశితపరీక్షకు గురిచేసాడు. వాటికన్నా మించి, మనుషులు మనుషులుగా ప్రవర్తించడానికీ, జీవించడానికీ అవసరమైన 'ప్రేమవిద్య' కోసం ఆయన వెతుక్కున్నాడు.

మార్క్వెజ్‌కి ప్రాచీన స్పానిష్ సాహిత్యం ఎలాగో మునిపల్లె రాజుకి ఆయన బాల్యం అట్లాగ. ఒక కథలో కథకుడితో అనిపించిన మాటలు ఆయన మాటలే: "ఒక్క బాల్యానందం, పితరుల సమాధులు, వగులు, చెరువులు గుళ్ళుగోపురాలు, ఆనాటి మిత్రబృందం-ఇవే కాదు, ఒక అలౌకికమైన అభౌతికమైన చిదా నందం ఒక రంగులకేతనంగా, ప్రాచీనసంగీత రాగంగా, జనని మృదుల హస్తస్పర్శగా, జీవనమూల్యాలనొత్తిపలికే ప్రాణశంఖంగా నాకు స్వప్న దర్శనమిస్తుంటుంది మా వూరు. మా పెద్ద ఆధ్యాత్మిక సంపదకు ప్రతీకగా మా స్వగృహం. ఏమో, నా సంతతిలో, ఎవరికైనా ఈ దుష్ట అమానవీయ సంస్కృతి అభద్రత నుండి దూరంపోవాలనిపించినప్పుడు-ఆ ఇల్లు ఆహ్వానించదా?"

కాని, ఉద్యోగవిరమణ తర్వాత, మళ్ళా ఇక్కడి మనుషుల మధ్య అడుగుపెట్టినప్పుడు, తాను చూసిన జీవితం గురించి ఇలా చెప్తున్నారు: "రాడార్‌ను చూసి విస్తుపోయినవాడిని,-ఇప్పుడు అంతరిక్ష నౌకను తిలకిస్తున్నాను. కంప్యూటర్ల సంగీతం వింటున్నాను. అన్నిటి మధ్యా మానవుడు రాక్షసుడుగా రాజకీయాల్లో ఎదగటం వేదనతో చూస్తున్నాను. ఎన్నటికీ తరగని భారతీయ గ్రామీణ పేదరికానికి-విజ్ఞానశాస్త్రం ఏ వ్యూహ నిర్మాణంతో-అడ్డుకట్ట వేయనున్నది? నరహంతకులైన మతఛాందసవాదుల్ని-ఈ సైన్స్ అదుపులో పెట్టి వసుధైక మానవుణ్ణి తిరిగి వుద్భవింపచేయగలదా! ఎన్నో నిగూఢ రహస్యాల్ని పరిశోధించగలిగిన భారతీయ సాహిత్యం-ఈనాటి క్రూరత్వం ముందు తన శాంతి పాఠాన్ని వల్లించలేకపోతున్నదెందువల్ల? ఈ ప్రశ్నలన్నీ నా మెదడును కలిచి వేస్తుంటాయ్."

1985-94 మధ్యకాలంలో రాసిన కథలు ఆయన జీవితంలోని మలుపును స్పష్టంగా పట్టిచ్చే కథలు. ఒక్క సమాజమే కాదు, సాహిత్య ప్రపంచం కూడా ఎంత కలుషితంగా ఉందో, 'దివోస్వప్నాలతో ముఖాముఖి' (1994) కథలో చాలా వివరంగా చెప్పుకొస్తాడు. అంతా ఒక అయోమయం. కాని, అప్పుడు కూడా "అతనికెవరూ దోషులుగా కనబడటం లేదు. అందరూ తన వలెనే జీవితం అర్థంకాని అల్పజ్ఞ మానవులుగా తోచారు."

ఆ మనఃస్థితిలోనే 85 నుంచి 1994దాకా పదేళ్ళు ఆయన తన ప్రశ్నలకు సమాధానం వెతుక్కుంటూ గడిపేరు. ఇప్పుడు తన కర్తవ్యమేమిటి? తానింకా రాస్తుండాలా? ఎందుకు రాయాలి? ఆ మనఃస్థితిలో 1991లో రాసిన 'ఒక బాకీ తీరలేదు' ఆయన జీవితంలో గొప్ప మలుపు. తాను రాయాలి, ఎందుకంటే, "ఇది మామూలు దారి కాదు, అప్పుల దారి". తాను తన పూర్వీకులకి, తన సమకాలికులకి, తన సంతతికి బాకీ పడ్డాడు. ఆ బాకీ తీర్చక తప్పదు. ఆ పదేళ్ళ కాలంలో ఆయన అంతరంగమంతటా "ఒక కృతయుగ వేదఘోష, ఒక కలియుగ దుఃఖ దేవత, ఒక ప్రణవి, ఒక ప్రణవనాదం, ఒక మధుర సంగమం, ఒక మాతృశ్రీ ఆత్మీయవేదన, ఒక అన్వేషణ, ఒక నిర్వేద పరిధిలో అతిలోక అనుభూతి పర్వం."

కాని, 1996 లో 'వేరేలోకపు స్వగతాలు' రాయడానికి పూనుకున్నప్పుడు: "ఏ దిశనుండో సాధుమధురస్వరంలో ఏవో ప్రాచీన సుగంధ కెరటాలతో ఒక ప్రశ్న. ఒక మానవీయ ఆందోళన.. ఏ ఊర్ధ్వలోకాల నిర్మల సరోవరతీరాల్లోనో యోగనిద్రలో ఉన్న నిత్యపితరులెవ్వరో ఈ భూలో కవారసుడి క్షేమం గురించి కలత చెందుతున్నారా? ఎందుకీ బోధివృక్షపు కరుణతో నరలోక వాసనలతో చిక్కుకుంటున్నారు? మీకు ధర్మోదకాలు వదలని గోత్రీకులం, మీ సంవత్సరీకాలను మరిచిన వారసులం, మీకు వర్ధములు లేవు, మీకు జయంతులు రావు. అయినా మీరు ఫలవృక్షాలుగా నిత్య శిలాప్రహారాలతో గాయపడి అలసిపోయినా నీడనివ్వక ముడుచుకోరేం? పళ్ళనివ్వమని పవ్వళించరేం?" అని ప్రశ్నించుకున్నారు. ఆ పిలుపు ఆయన్ని నిలవనివ్వలేదు. అప్పుడాయన నైమిశారణ్య యాత్ర చేసారు. "మనోమయ చక్రంతాలూకు అంచు ఎక్కడ నేలకు తగిలి ఆగిపోతుందో" అక్కడికి.

తన అస్తిమితం, తన ప్రశ్నలకు వెంటనే సమాధానం దొరికితీరాలన్న మంకుపట్టు, అందరిలానే తనమీద కూడా పడ్డ పాశ్చాత్యప్రపంచపు నీడ అని గ్రహించాడు. ఆ యాత్రానుభూతిని 'నైమిశారణ్యంలో సత్రయాగం' (1997) పేరిట రాసిన కథలో ఇట్లా తనకు తాను చెప్పుకున్నాడు: "ఈ పాశ్చాత్య అన్వేషకులకు భారతదేశంలో అడుగుమోపిన తక్షణం-ఒక మార్మికానుభూతి, ఒక అలౌకిక లీల, ఒక ప్రాచీన మాహాత్మ్యం, ఒక పరమార్థ గోచరం, ఒక చిన్మయావస్థ కావాలి." కాని కావలసింది "ఎన్నేళ్ళయినా వేచి ఉండగల భారతీయుడి అచంచల విశ్వాస పరంపర, నిరంతర ప్రార్థన, ఉపవాస నిరీక్షణదీక్షలు" అని అర్థమయింది.

ఆయన జీవితమంతా ఆయన్ని నడిపిన విలువలు- తల్లి త్యాగమయజీవితం, ఏ రామనుజ పరంపరలోనో, లేదా బడిగడ్డపాలెం వాసుదేవస్వామి వారి ఉపదేశాల్లోనో, లేదా అంగలకుదురు సుబ్బదాసుగారి దాసకుటినివాస సాన్నిధ్యమో, "తన ఇల్లు విడిచిన చిన్ననాటినుండి-ఏదో ఒక మలుపులో వినబడుతూనే ఉన్న అంతర్గత ప్రతిధ్వనుల్ని" ఆయన ఇప్పుడు స్పష్టంగా వినగలిగాడు. మళ్ళా కథలు రాయడానికి పూనుకున్నాడు.

"ఈ లోకం నీలం వేరు, నక్షత్రాలు వేరు. నా పడవ చుట్టూ ఎందరెందరో పూర్వపు ఆప్తులు, శత్రువులు, స్వార్థులు, పవిత్రులు, దాతలు, రాక్షసులు, మనుషులు, మనీషులు. ఇందరి చరిత్రలు రాయలేను. ప్రయాణపు నీరసం, మా బామ్మకు, మా అమ్మకు నమస్కరిస్తున్నాను-భాష చాలక, నా జీవితపు ఆది అనుభూతుల్లో, మధ్యలో, అంతంలో నాకు ఎంతో కొంత స్నేహాన్ని పెంచిన సామాన్యుల్ని ఎంచుకుని కథ పొడిగిస్తున్నాను" అన్నాడు.

ఆ మెలకువతో ఆయన వర్తమాన నిరంకుశత్వాన్ని విదిలించేసుకోగలిగాడు. తన వర్తమానంలో నిజంగా విలువైనది, తనకేమీ కాని మనుషుల్ని, మానవసమూహాల్ని తనవాళ్ళుగా దగ్గరకు తీసుకోగలగడమే. ఇంతదాకా అప్రధానీకరణకు లోనైన అనేక మానవసమూహాలు తమ తమ ఐడెంటిటీలను నిర్ధారించుకోడానికి పడుతున్న తపన చూసాడు. వాళ్ళకీ తనకీ మధ్య ఒక సేతువు నిర్మించుకోవాలి. అందుకు తనకున్న ఏకైక మార్గం తన గతంలోని అత్యున్నత క్షణాల్ని గుర్తుపట్టడం. గతానికి, నేటికీ, రేపటికీ కూడా వర్తించగల మానవీయ సూత్రాల్ని పట్టుకోవడం. మనిషినీ, మనిషినీ ఒకటిగా కలిపే ఒక పేగుబంధాన్ని గుర్తుతెచ్చుకోవడం. తన చిన్నప్పుడు "సైడు కాలవ మురికినీట్లో ఎవరో కొట్టి తోసివేసిన యానాది పిల్లవాడికి తన చొక్కా దానం చేసి ఇంటికి చేరిన" క్షణం ఇంకా గుర్తుంది. 2000లో రాసిన 'సప్తతి మహోత్సవం' కథతో ఆయన మహాకథకుడిగానే కాదు, మహామానవుడిగా కూడా పరిణమించగలిగాడు. ఆ కథలో కథకుడు తన వైభవోజ్జ్వలమైన గతానికి ప్రతీకగా చెప్పదగ్గ 'కణ్వస భవనా'న్ని యానాది సేవా సమితికి అంకితం చేసెయ్యడంతో మునిపల్లె రాజు, ఒకవైపు తన గతం నుంచి పూర్తిగా బయటపడుతూ, ఇప్పటి ఐడెంటిటీ ఉద్యమాలు కూడా మాట్లాడని, ప్రాతినిధ్యం వహించని యానాది గురించి మాట్లాడటం ద్వారా, వర్తమాన నిరంకుశత్వం నుంచి కూడా బయటపడగలిగాడు.

*

మార్క్వెజ్ గురించి రాసిన వ్యాసాన్ని ముగిస్తూ బెర్మాన్ ఒక మాటన్నాడు: "పందొమ్మిదో మహాశతాబ్దపు కొందరు మహారచయితల్లాగా మార్క్వెజ్ కూడా చిన్నపిల్లల రచయితగానే గుర్తుండిపోవచ్చునని కొందరు భావిస్తున్నారు. బహుశా, అదే కావచ్చు కూడా. అతడు కూడా ఒక విక్టర్ హ్యూగో, ఒక మార్క్ ట్వెయిన్ కాగలడే తప్ప ఒక హెన్రీ జేమ్స్ ఒక స్టెంధాల్ కానేరడు. అలా కాకపోవడం తప్పనుకోవడం లేదు నేను.." అని. ఇప్పుడు మళ్ళా తిరగేస్తుంటే నాకు కళ్ళనీళ్ళు తెప్పిస్తున్న మునిపల్లె రాజు కథలు ఈ అర్థంలో నిజంగా చిన్న పిల్లల కథలు, నిజమైన నీతికథలు. జీవితంలో సరే, సాహిత్యంలో కూడా సరళసత్యాల్ని నమ్మలేని దురదృష్టకరకాలంలో నిజంగా ఒక సార్వకాలిక నీతి అంటూ ఉంటే అది మనుషులు తోటిమనుషుల్తో మనుషులుగా ప్రవర్తించడమే అని గుర్తుచేసే కథలు. అందుకనే ఆయన తన గురించి తాను చెప్పుకున్నట్టుగా 'ఎందరికో లభించని వరమాలికా ప్రసాదుడు.'

■ వాడ్రేవు చినవీరభద్రుడు
94909 57129

'సామాన్యశాస్త్రం' ప్రదర్శన

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని సామాన్యశాస్త్రం గ్యాలరీలో 'Everyday WOMEN' పేరిట జరిగే ఛాయాచిత్ర ప్రదర్శనను మార్చి 6 సా.6గం.లకు మామిడి హరికృష్ణ ప్రారంభిస్తారు. ప్రదర్శన నెలరోజుల పాటు జరుగుతుంది. వివరాలకు: 99480 77893.

- కందుకూరి రమేష్‌బాబు

ఇద్దరు యువకవుల తొలి సంపుటాలు

సిద్ధార్థ కట్టా, అనిల్ డ్యానిల కవితా సంపుటాల ఆవిష్కరణ సభ మార్చి 10 సా.6గం.లకు ది కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ & అమరావతి నందు జరుగుతుంది. నిర్వహణ శ్రీరాం పుప్పాల; ఆవిష్కరణ వొరప్రసాద్, క్రాంతి శ్రీనివాసరావు; విశ్లేషణ కొప్పర్తి, సీతారాం, చినుకు రాజగోపాల్, బండ్ల మాధవరావు.

- సాహితీ మిత్రులు, సాహితీ స్రవంతి

కవయిత్రుల కవిత్వ విశ్లేషణ

తెలంగాణ సాహిత్య సమాఖ్య ఆధ్వర్యంలో కవయిత్రుల కవిత్వ విశ్లేషణా కార్యక్రమం మార్చి 11 ఉ.10.30ని.లకు స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, హెరిటేజ్ బిల్డింగ్, అఫ్జల్ గంజ్, హైదరాబాద్ నందు జరుగుతుంది. శిలాలోలిత, మెర్సీ మార్గరెట్, నారదభట్ల అరుణ, కె. విమల, కొండవీటి నాగవాణి తదితరులు పాల్గొంటారు.

- ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్

హోసూరులో ఆరు గ్రంథాల విడుదల

తమిళనాడులోని హోసూరులో 'ఆంధ్ర సాంస్కృతిక సమితి భవనం'లో మార్చి 11న 'బస్తి యువక బృందం' ఆధ్వర్యంలో ఉగాది వేడుకల సభలో ఆరు పుస్తకాలు విడుదల అవుతాయి. ఈ కార్యక్రమంలో బి. వెంకటస్వామి, జయధీర్ తిరుమలరావు, గజేంద్రమూర్తి, వెంకట సత్యం, గూడూరు మనోజ, సుంకోజు దేవేంద్రాచారి, తదితరులు పాల్గొంటారు.

- అగరం వసంత్

సాహిత్య స్ఫూర్తి సదస్సు

వాడ్రేవు వీరలక్ష్మీదేవి సాహిత్య స్ఫూర్తి సదస్సు, భారతీయ నవలా దర్శనం ఆవిష్కరణ మార్చి 11 ఉ.10 గం.లకు మధుమాలక్ష్మి ఛాంబర్స్, కల్చరల్ సెంటర్, మొఘల్రాజపురం, విజయవాడ నందు జరుగుతాయి. పి.సత్యవతి, కె.శివారెడ్డి, బాలాంత్రపు ప్రసూన, కె. ఎన్.మల్లీశ్వరి తదితరులు పాల్గొంటారు.

- చినుకు పబ్లికేషన్స్


స్వామి వివేకానంద - ఓ మహాకవి

స్వామి వివేకానంద భారత దేశం కన్న ఓ మహా కవి కూడా. ఆయన 'ఇన్ సెర్చ్ ఆఫ్ గాడ్' అన్న ఇంగ్లీష్ కవితా సంపుటిని రాశారు. 46 కవితలు మనకు ఆ కవితా సంపుటిలో కనిపిస్తాయి. నేరుగా ఇంగ్లీష్‌లో 23 కవితలు రాశారు. 15 స్వీయ బెంగాలీ కవితలను ఇంగ్లీష్‌లోకి అనువదించారు. ఇతర హిందీ కవుల కవితలను కొన్ని ఇంగ్లీష్ లోకి అనువదించారు. కొన్ని సంస్కృత రచనలు చేసి వాటిని ఆయనే ఇంగ్లీష్‌లోకి అనువదించి ఇచ్చారు. 1947లో తొలిసారిగా దీన్ని అద్వైతాశ్రమం వారు ప్రచురించారు.

ఆయన రాసిన కవితలు నాణ్యతలో ఎంతో ఉన్నతమైనవి. రవీంద్రనాథ్ ఠాగూర్, ఖలీల్ జిబ్రాన్, లావ్ ట్సు, జలాలుద్దీన్ రూమీ రచనల నాణ్యతతో స్వామి వివేకానంద కవితలుంటాయి. ఆయన తమ కవితలను వేరు వేరు సందర్భాలలో రాశారు. ఇన్ సెర్చ్ ఆఫ్ గాడ్ అన్న కవిత 1893లో అమెరికాలో ప్రొఫెసర్. జాన్ హెన్రి రైట్ కు రాసిన ఉత్తరంలో రాశారు. కొన్నిటిని న్యూయార్క్ లో రాశారు. కొన్నిటిని ఆయన తమ తోటి స్వామీజీలకు రాసి బహూకరించారు. కొన్నిటిని 'ప్రబుద్ధ భారత', 'ఉద్బోధన' వంటి పత్రికలకు రాశారు. కొన్నిటిని ప్రయాణాలలో రాశారు. తమను తాము మరిచిపోయిన స్థితిలో రాసిన కవితలూ ఉన్నాయి. చాలా వరకూ ఆయన కవితలు విదేశాలలోనే రాశారు. కొన్ని కవితలను ఉపనిషత్ భావాలతో రాశారు. యజుర్వేదం, ఋగ్వేదంల నుంచీ, బృహదారణ్యకోపనిషత్, నారాయణోపనిషత్ ల నుంచీ వాక్యాలను తీసుకుని వాటిని కవితలుగా మలిచారు. ఆది శంకరాచార్య రచనలను తీసుకుని కవితలుగా రాశారు. భర్తృహరి వైరాగ్య శతకంలోని కొన్ని వాక్యాలకు స్వేచ్ఛానువాదాలుగా కవితలు రాశారు. స్వామి వివేకానంద రచనా సంవిధానాన్ని చూద్దాం-

ఇన్ సెర్చ్ ఆఫ్ గాడ్ అనే కవితలో వివేకానంద అంటారు: "కొండల పైనా, పర్వత శ్రేణులపైనా, గుళ్లలోనూ, చర్చిలలోనూ, మసీదుల్లోనూ, వేదాల్లోనూ, బైబిల్ లోనూ, ఖుర్ఆన్ లోనూ వృథాగా నిన్ను వెతికాను. అడవిలో తప్పిపోయిన పసిబిడ్డలా ఒంటరిగా ఏడ్చాను. నువ్వు ఎక్కడికి వెళ్లిపోయావు? నా దైవమా! నా ప్రేమా! ప్రతిధ్వని జవాబిచ్చింది. 'వెళ్ళిపోయింది' ". మరో కవితలో అంటారు: "కళ్లు మందగించినా, హృదయం అలిసిపోయినా, స్నేహం విఫలమైనా/ ప్రేమ ద్రోహం చేసినా, విధి నూరు విధాల భయపెట్టినా,/ ఘనీభవించిన చీకటి దారికి అడ్డుపడినా/ ఓ నా బుద్ధీ! నువ్వు భగవద్దత్తం-/ ముందుకు, ముందుకు కదులు/ కుడి, ఎడమలు కాదు/ లక్ష్యం వైపుకు".

"జీవితం అన్నది కదులుతున్న మరణం" అని అంటారు ఒక చోట. "నేను మూర్తీభవించిన నా సొంత గతాన్ని" అంటారు మరోక చోట. "సూర్యుడు మేఘం చేత కప్పబడితే/ ఆకాశం మేఘావృతమై కనిపిస్తే/ కాస్తంతసేపు ఓపిక పట్టు ధీరుడా!/ విజయం తప్పక రానున్నది" అంటారు ఓ కవితలో. "వేసవి కాలం వెంబడించని చలి కాలం లేదు" అన్నప్పుడు ఆయనలోని ఓ గొప్ప కవి మనకు సాక్షాత్కరిస్తాడు.



ఆయన 'హోల్డ్ ఆన్ ఎట్ ఎ వైల్ బ్రేవ్‌హర్ట్', 'టు ది అవేకన్డ్ ఇండియా', 'టు ద ఫోర్త్ ఆఫ్ జూలై', వంటి కవితలలో ఉన్నతమైన రచనా శిల్పం విందుచేస్తుంది. ఆయన రచనా ప్రణాళిక గొప్పగా ఉంటుంది. "మళ్లీ లే... ఓ నిజమా! నీకు మరణం లేదు" అని భారత దేశాన్ని నిద్ర లేపుతారు తమ కవిత ద్వారా స్వామి వివేకానంద. ఓ కవితలో "చూడు... అది మహోన్నతమైన బలంతో వస్తుంది/ అది శక్తి కాని శక్తి/ అది సంగీతంలో లయించిన తియ్యదనం/ అది పవిత్రమైన కళలో విరామం/ అది సంభాషణ మధ్యలో మౌనం/ అది చూడబడని అందం/ అది విడిగా నిలబడి ఉన్న ప్రేమ/ అది అంతుచిక్కని జ్ఞానం/ అది రెండు ప్రాణాల నడుమ మరణం/ అది సృష్టి ఉద్భవించిన శూన్యం/ దాని దగ్గరకు కన్నీటి చుక్కలు వెళతాయి/ చిరునవ్వుల ఆకృతిని పంచేందుకు/ అది బ్రతుకుకు లక్ష్యం, శాంతి దానికి ఆవాసం" అన్న మహోన్నతమైన కవిత స్వామి వివేకానందను ప్రపంచంలోని ఉన్నతమైన కవుల స్థాయిలో నిలబెడుతుంది. కలను సంబోధిస్తూ "నీ స్పర్శ ఎడారులను కుసుమింపజేస్తుంది" అంటారు ఆయన.

సృష్టిపైనా, సమాధి స్థితిపైనా, శివుడిపైనా, కృష్ణుడి పైనా, అమ్మవారిపైనా, రామ కృష్ణ పరమ హంస పైనా, సంస్కృతంలో స్తుతి కృతులను రాశారు ఆయన. "అతడి (శివుడి) దట్టమైన శిరోజాలలో గంగ గర్జిస్తోంది అనడం", "అతడి త్రిశూలం నుంచి అగ్ని ప్రభ విస్తోంది" అనడం, "అతడి నడుం చుట్టూ సర్పం మెరుస్తోంది" అనడం, "అతడి కనుబొమలలో జాబిల్లి తళుక్కుమంటోంది" అనడం, "అతడి తేజోవంతమైన కురులు ఆకాశాన నిండాయి" అనడం, "అతడికి సప్త లోకాలూ అతడికి తాళ గతిని ఇస్తున్నాయి" అనడం, వివేకానందలోని ఉన్నతమైన భావుకతను తెలియజేస్తాయి.

రుద్రస్తుతిని, నిర్వాణాష్టకాన్ని, సూరదాస రచనల్ని వివేకానంద ఇంగ్లీష్ లోకి అనువదించారు. "జీవితం ఒక టాన్టలస్" (అంటే గ్రీక్ పురాణాలలో కనిపిస్తూ తాగడానికి అందని మద్యం పాత్రను నిలిపి ఉంచే చట్రం) అన్నప్పుడు వివేకానంద స్వామిని 'ఋషి అయిన కవి' అని మనం తెలుసుకోగలుగుతాం.

ఓ నాలుగు పంక్తుల కవితలో స్వామి వివేకానంద ఇలా అంటారు "నేను ముందు వెనుకలు చూశాను/ అంతా సరిగ్గా ఉందని తెలిసింది/ నా దుఃఖపు లోతులలో/ బుద్ధి యొక్క కాంతి ఉంది".

సార్వజనీనత, సార్వకాలీనతలు సమ్మిళితమైన విశ్వకవి స్వామి వివేకానంద.

■ రోచిష్మాన్
94440 12279



ఒంటరి చెట్టు

తలుపు కొప్పులో
తాళం అసరబ్బపువ్వై విరిసినప్పుడు
ఇండ్లన్నీ ఏకాకై రోదించే ముసలవ్వలు

రోడ్డు భుజాలపై
మౌనాల వడ్లబస్తలు మోస్తున్నప్పుడు
వాడ పక్షులన్నీ ఎగిరిపోంగ ఒంటరైన చెట్టు

నీసు వాసనలతో నిత్యం పరిమళించే దేహాలు
బొంబాయిలో బోళ్ల నురుగుగా మారిపోయాయి
ఎండవెట్టిన చేపల తోరణాలతో కళకళలాడే దండేలన్నీ
బల్లిపాతర బూజును కప్పుకొని నిద్రపోతున్నాయి
తాతల తండ్రుల నుంచి కుంటుంబాల్ని సాదిన ఇసిరెలు
చిలుక్కొయ్యకు అస్థిపంజరాల్లా వేలాడుతున్నాయి
ఒకప్పుడు ఆ వాడకట్టు
ఊరి చెరువుపై హాయిగా సాగిపోయిన ఓడ
ఇప్పుడు ఆధునికతకు కూలిపోయిన వృత్తిమేడ
అవును
అదే బతుకుదెరువు కోల్పోయిన బెస్తోళ్లవాడ

■ గరిగె రాజేశ్
94939 71126

మహనీయుల చరిత్ర చదవండి

- ఉన్నత ఆలోచనలతోనే అభివృద్ధి
- విద్యార్థులకు వీవీ లక్ష్మీనారాయణ సూచన

గుంటూరు (నల్లచెరువు) మార్చి 4: విద్యార్థులు పుస్తకాలతో పాటు మహనీయుల జీవిత చరిత్ర కూడా చదవాలని, వారి స్ఫూర్తితో ఉన్నత శిఖరాలకు చేరాలని మహారాష్ట్ర అడిషనల్ డీజీపీ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కృష్ణదేవరాయ పేద, బలహీన వర్గాల సహాయనిధి ట్రస్ట్ ద్వారా 215 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించారు. ట్రస్ట్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. నేటితరం విద్యార్థులు పుస్తకాలకే పరిమితం అవుతున్నారని అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలన్నారు. పుస్తకాలతోపాటు మహనీయుల చరిత్ర కూడా చదివి లోకజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. పేదరికంలో పుట్టి ఉన్నతంగా ఎదిగిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్, అబ్దుల్ కలాం, లాల్ బహదూర్‌శాస్త్రి, రఘునాథ్ మాషేల్కర్ వంటి వారినుంచి స్ఫూర్తి పొందాలన్నారు. చదువుతోపాటు వ్యక్తిత్వం ఉన్నప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. పేదరికం వ్యక్తి అభ్యున్నతికి అడ్డంకి కాబోదని చెప్పారు. పేదరికంలో ఉన్నా ప్రతిభ ఉంటే ప్రోత్సహించేందుకు అనేక సంస్థలు ఉన్నాయన్నారు. ఆశయాలు ఉన్నతంగా ఉంటే సమస్యలు చిన్నగా కనిపిస్తాయన్నారు. ఆలోచన, ఆచరణ, కష్టపడి పనిచేయడం అనే మూడు లక్షణాలు ఉంటే ఎవరైనా అభివృద్ధి దిశగా దూసుకెళ్తారన్నారు. విద్యార్థులు ఈ మూడు లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ.. 1995 నుంచి విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు విద్యార్థులకు దాదాపు రూ. 16 కోట్ల సాయం అందించామన్నారు. కార్యక్రమంలో ఆదాయపు పన్ను శాఖ జాయింట్ కమిషనర్ సత్యానందం, వీఆర్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ విధాతల రజని, తులసి సీడ్స్ ప్రతినిధి యోగేశ్ చంద్ర, ట్రస్ట్ సభ్యులు రంగారావు, ఏటుకూరు మాజీ సర్పంచ్ దుగ్గిరాల సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్న లక్ష్మీనారాయణ, తులసి ప్రభు



ఆదిత్యుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి

అరసవల్లి, మార్చి4: శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లి ఆదిత్యుడ్ని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి. శ్యామ్‌ప్రసాద్ దర్శించుకున్నారు. కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకున్న ఆయనకు ఆలయ ప్రధాన అర్చకుడు ఆలయ విశిష్టతను వివరించారు. కాగా, శ్రీకాకుళం జిల్లా జడ్జి నిర్మలా గీతాంబ, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్(ఫైనాన్స్) వేణుగోపాలరావు కూడా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మన్యం బంద్ సంపూర్ణం



పాడేరు, మార్చి 4: బోయల్ని ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ, విభజన హామీలను నెరవేర్చాలనే డిమాండ్‌తో గిరిజన జేఏసీ ఆదివారం చేపట్టిన బంద్ విశాఖ ఏజెన్సీలో విజయవంతమైంది. పాడేరుతోపాటు ఏజెన్సీలోని అన్ని మండలాల్లోనూ బంద్ సంపూర్ణంగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రైవేటు వాహనాలు సైతం రోడ్డెక్కలేదు. ఆర్టీసీ బస్సులు అరకొరగా నడిచాయి. బొర్రా గుహలు, అరకులోని గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్ మూతపడ్డాయి.

పొలాలన్నీ పచ్చపచ్చగా

దాళ్వా సాగు.... 96%
అపరాల పంటలు.. 103%
మొక్కజొన్న.. 112%



- వర్షాలు లేకున్నా ప్రాజెక్టుల నీటితో సేద్యం

అమరావతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మాగాణుల్లో ఈ ఏడాది రెండో పంటగా 7.04లక్షల హెక్టార్లలో వరి సాగైంది. దాళ్వా సాగు లక్ష్యం 7.50లక్షల హెక్టార్లు కాగా, ఈనెల 20 నాటికి 6.77లక్షల హెక్టార్లలో వరి సాగవ్వాల్సి ఉంది. కానీ వ్యవసాయశాఖ నిర్దేశించుకున్న లక్ష్యంలో 96శాతం వరి సాగులోకి రావడం విశేషం. గతేడాది ఇదే సమయానికి 5.52లక్షల హెక్టార్లలోనే రెండో పంటగా వరి సాగైంది. కానీ ఈ ఏడాది వరి సాగు విస్తీర్ణం పెరగడానికి కృష్ణా డెల్టాలో పట్టిసీమ ద్వారా తెచ్చిన గోదావరి నీటి ఫలితమేనని రైతులు చెప్తున్నారు. కేవలం నాగార్జునసాగర్ ఆయకట్టుకు మినహా రాష్ట్ర వ్యాప్తంగా వరి సాగుకు అవకాశం ఉన్న ప్రాంతాలకు ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించడమే ఇందుకు ప్రధాన కారణం. ఈశాన్య రుతు పవనాలు వచ్చాక, తగిన వర్షాలు కురవకపోయినా, ప్రాజెక్టుల నీటితో వరికి నీరివ్వడం వల్ల గతేడాది కన్నా సాగు విస్తీర్ణం పెరిగిందని జలవనరుల శాఖ అధికారులు అంటున్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో తోటపల్లి ఎత్తిపోతల నుంచి ఈ ఏడాది లక్ష ఎకరాలకు సాగు నీరిచ్చారు. కానీ రైతులు రెండో పంట వరి పెద్దగా వేయలేదు. శ్రీకాకుళం జిల్లాలో అపరాలు సాగు అధికంగా చేపట్టారు. ఉభయ గోదావరి జిల్లాల్లో డెల్టాకు గోదావరి నీరు సకాలంలోనే ఇవ్వడంతో 3.26లక్షల హెక్టార్లలో వరి సాగులోకి వచ్చింది. అయితే ప్రస్తుతం గోదావరి నది అడుగంటి కొద్దిగా సాగునీటి సమస్య తలెత్తింది. కృష్ణా డెల్టాకు పట్టిసీమ నీరుతో అన్నదాతలు వరి పంటను కాపాడుకోగలిగారు. రెండో పంటకు కూడా నీరిచ్చినా, కొంతమంది రైతులు వరితో పాటు, మినుము, మొక్కజొన్న, జొన్న వంటి పైర్లు వేశారు. నెల్లూరు జిల్లాలో పెన్నా నది డెల్టాలో 1.97లక్షల హెక్టార్లలో వరి పండిస్తున్నారు. చిత్తూరు జిల్లాలోనూ 50వేల హెక్టార్లలో వరి సాగైంది. మిగిలిన జిల్లాల్లో కొద్దికొద్దిగా వరి వేశారు. ఇతర పంటల్లో మొక్కజొన్న, అపరాల పైర్లు అధికంగా పడ్డాయి. మినుము, పెసర, కంది, అలసంద వంటి అపరాల పంటలు కర్నూలు జిల్లాలో అత్యధికంగా రెండు లక్షల హెక్టార్లలో వేయగా, కృష్ణా జిల్లాలో 1.63 లక్షల హెక్టార్లలో సాగైనాయి. మొక్కజొన్న పశ్చిమగోదావరి జిల్లాలో అత్యధికంగా 56వేల హెక్టార్లలో వేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వరి 7.04లక్షల హెక్టార్లు, అపరాల పంటలు 10.04లక్షల హెక్టార్లు, మొక్కజొన్న 2.22లక్షల హెక్టార్లలో వేశారు. ఈశాన్య పవనాల వల్ల పెద్దగా వర్షాలు కురవకపోయినా, రాయలసీమ జిల్లాల్లో రబీ సీజన్ ప్రారంభంలో కురిసిన వర్షాలు అపరాల సాగుకు బాగా ఉపయోగపడ్డాయి. రబీలో అపరాల పంటల సాగు విస్తీర్ణం సాధారణంగా 9,76,842 హెక్టార్లు కాగా, 10,04,339 హెక్టార్లలో(103%) సాగయ్యాయి. మొక్కజొన్న కూడా సాధారణ సాగు విస్తీర్ణం 1,97,976 హెక్టార్లకు 2,22,600హెక్టార్లలో(112%)సాగైంది.

రెండో పంట విస్తీర్ణం (హెక్టార్లలో)

జిల్లా	వరి	అపరాలు	మొక్కజొన్న
శ్రీకాకుళం	2952	91184	22465
విజయనగరం	3678	44699	19105
విశాఖపట్నం	3579	23395	1173
తూ.గోదావరి	160823	19477	10772
ప.గోదావరి	165393	11464	56357
కృష్ణా	19722	163577	22477
గుంటూరు	16232	94596	54931
ప్రకాశం	18539	131805	15220
నెల్లూరు	197060	23241	756
చిత్తూరు	50053	13911	2328
కర్నూలు	30091	207064	10638
కడప	22542	104694	2723
అనంతపురం	13781	75232	3655
మొత్తం	7,04,445	10,04,339	2,22,600



ధర్మం దారితప్పితే చూస్తూ కూర్చోం!

- రాజకీయమూ నడిపించగలం: పరిపూర్ణానంద

తిరుపతి(సాంస్కృతికం), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య వ్యవస్థలో ధర్మం దారితప్పినప్పుడు సాధు సమాజం చేతులు కట్టుకుని కూర్చోదని... తప్పకుండా రాజకీయాల్లోనూ జోక్యం చేసుకుంటుందని శ్రీపీఠాధిపతి పరిపూర్ణానందస్వామి అన్నారు. యూపీ సీఎం ఆదిత్యనాథ్ యోగి ఇప్పటికే ఆ దిశగా ముందు వరుసలో ఉన్నారని గుర్తుచేశారు. ఆదివారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పాలకులు ధర్మాన్ని ఆచరించకపోతే ప్రజలు తప్పుదారి పడతారని, ఆ సమయంలో సాధుసంతులు, పీఠాధిపతులు ధర్మాచరణ కోసం నడుం బిగించక తప్పదన్నారు. నేడు కులపరమైన పెడధోరణలు పెరిగాయని దేవతలకు, రాక్షసులకు సైతం కులాల ముద్రవేస్తూ ప్రచారాలు చేయడం దారుణమన్నారు. హిందూ ధార్మిక ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి దానికి నిధులు కేటాయించడం ద్వారా సీఎం చంద్రబాబు హైందవ ధర్మ పరిరక్షణకు ఎంతగానో కృషి చేస్తున్నారని ప్రశంసించారు. టీటీడీ ఆధ్వర్యంలో వకుళమాత ఆలయం రూపుదిద్దుకుంటోందని, వకుళాపురం గ్రామంలో సోమవారం ఉదయం 9గంటలకు వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా 427 కుటుంబాలకు వస్త్రదానం కూడా చేస్తామని ప్రకటించారు. త్వరలో గ్రామంలో సంధ్యా గురుకులం, ప్రజారోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే శ్రీపీఠం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 370 సంధ్యా గురుకులాలు ఏర్పాటు చేశామని చెప్పారు. రాష్ట్రంలోని 1,400 గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేయాలన్నదే లక్ష్యమన్నారు.

ఆ తొమ్మిది మంది ఛత్తీస్‌గఢ్ వాసులే

- ఎన్‌కౌంటర్ మృతుల వివరాలు ప్రకటించిన పోలీసులు

భద్రాచలం టౌన్, మార్చి 4: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో శుక్రవారం జరిగిన ఎదురుకాల్పుల్లో మృతిచెందిన మావోయిస్టుల వివరాలను ఆదివారం సాయంత్రం భద్రాచలం పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో మొత్తం పది మంది మావోయిస్టులు మృతిచెందగా.. అందులో ఒకరు వరంగల్ అర్బన్ జిల్లాకు చెందిన దడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్‌గా ఇప్పటికే గుర్తించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మిగిలిన తొమ్మిది మంది మృతదేహాలు భద్రాచలం ఏరియా ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచారు. వారి వివరాలు, ఫొటోలను పోలీసులు మీడియాకు విడుదల చేశారు. ఇందులో ఏడుగురు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారని తెలిపారు. మృతులంతా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా, నారాయణపూర్, బీజాపూర్ జిల్లాల్లోని మారుమూల ప్రాంతాలకు చెందిన వారని పోలీసులు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9440795319 (భద్రాచలం ఏఎస్పీ), 9440795320 (స్టేషన్ ఎస్‌హెచ్‌వో) ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మృతుల వివరాలు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా రంగాయికి చెందిన కోసి కుకుదం, వీరాపురానికి చెందిన రామి అలియాస్ సోడి పాండే, వికదంపల్లికి చెందిన ఉందం జోగి అలియాస్ లలిత, నారాయణపూర్ జిల్లా దుంగ గ్రామానికి చెందిన పొడియం బాం అలియాస్ మల్లేశ్, బీజాపూర్ జిల్లా మూకవెల్లికి చెందిన సంగీత అలియాస్ కుమ్మ ప్రమీల, ఊసూరు బ్లాక్‌కు చెందిన పూనెం జోగాలు, కోకికూర్మకు చెందిన రత్న అలియాస్ తెల్లం సోని, అవునూర్‌కు చెందిన హేమ్లా పయాకి అలియాస్ లలిత, దెందోడు గ్రామానికి చెందిన మడివి శాంతి అలియాస్ సోని.

స్వామి అంత్యక్రియలు పూర్తి

వరంగల్ అర్బన్: మావోయిస్టు నేత దడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్ అంత్యక్రియలు ఆదివారం ఆయన స్వగ్రామమైన వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేట మండలంలోని రాంపేటలో పూర్తయ్యాయి. ప్రజా కళామండలి కళాకారులు ఉద్యమ గీతాలు ఆలపిస్తూ అంతిమయాత్ర నిర్వహించారు. హక్కుల సంఘాలు, బంధుమిత్రుల సంఘాలు, తెలంగాణ ప్రజాస్వామ్య వేదిక, ప్రజాకళా మండలి సభ్యులు హాజరయ్యారు. ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్ అన్నారు.

ఉచితంగా తీసుకోండి

ఆన్‌లైన్‌లో ఈసీలు, సీసీలు.. ఫోన్లలోనూ చూసుకునేలా యాప్

- సందేహాల నివృత్తికి కాల్ సెంటర్
- ప్రజల్ని చైతన్య పర్చేలా ప్రభుత్వం చర్యలు
- సిబ్బంది ఫోన్లకు ప్రత్యేక కాలర్‌ట్యూన్
- ఆదాయం తగ్గినా ప్రజల కోసం అమలు

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఎన్‌కంబ్రెన్స్ సర్టిఫికెట్(ఈసీ), సర్టిఫైడ్ సర్టిఫికెడ్(సీసీ)లను ప్రజలు అత్యంత సులువుగా, ఉచితంగా పూర్తిస్థాయిలో తీసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఆర్థిక సమస్యలతో ఓ వైపు ప్రభుత్వం ఇబ్బంది పడుతున్నా... వస్తున్న రాబడిని సైతం వదులుకొని... ప్రజల ప్రయోజనానికి పెద్దపీటు వేస్తూ రిజిస్ట్రేషన్ల రంగంలో ఓ భారీ సంస్కరణకు తీసుకొచ్చింది. వాస్తవానికి ఈసీలు, సీసీలను ప్రజలకు ఆన్‌లైన్‌లో ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించి ఇప్పటికే ఆ మేరకు అమలు చేస్తోంది. ఒకప్పుడు అతి రహస్యంగా దాచేసిన రిజిస్ట్రేషన్ల శాఖకు సంబంధించిన సమాచారాన్ని ప్రజల ముందు పెట్టడం, తద్వారా ఏ ఆస్తి కొనదగింది? ఏది రిజిస్ట్రేషన్ చేసేందుకు వీల్లేని ఆస్తి అన్న అంశాలన్నీ వారికే నేరుగా తెలిసేలా చెప్పాలనేది ప్రభుత్వ ఉద్దేశం. అందులో భాగంగా ఒక భూమి, ఆస్తి చరిత్ర ఏంటి? దాని యజమాని ఎవరు? ఎన్నిసార్లు చేతులు మారింది? ప్రైవేటు ఆస్తేనా? తదితర వివరాలన్నీ చెప్పే ఈసీని ఉచితంగా ఇస్తోంది. గతంలో ఈసీ తీసుకోవాలంటే మీ-సేవ కేంద్రానికి, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. అక్కడ రూ.200 చెల్లించాల్సి వచ్చేది. డబ్బు ఒక్కటే కాకుండా... దాని కోసం తిరగడానికి సమయం వృథా అయ్యేది. ఇవన్నీ నివారించి ఉచితంగా ఈసీ ఇచ్చే పద్ధతిని జనవరి నెల నుంచి అమలుచేస్తున్నారు. అదే సమయంలో సీసీలను కూడా ఆన్‌లైన్‌లో ఉచితంగానే తీసుకునే పద్ధతిని ప్రవేశపెట్టారు. ఒక ఆస్తికి సంబంధించిన పత్రాలు పోయినా, సకాలంలో కనిపించకపోయినా, ఇతర అవసరాల కోసమైనా సీసీ తీసుకోవాల్సిన అవసరాలు వస్తుంటాయి. అయితే, గత నెలరోజుల్లో 1.08 లక్షలమంది ఈసీలు తీసుకోగా... అందులో ఆన్‌లైన్‌లో ఉచితంగా తీసుకున్న వారి సంఖ్య 12,569 మాత్రమే. మొత్తం ఈసీలు తీసుకున్నవారిలో ఇది 11.6 శాతం. మిగతావారు గతంలో మాదిరిగానే మీ-సేవ కేంద్రాలు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకే వెళ్లి రూ.200కట్టి తీసుకున్నారు. సీసీలు తీసుకునేవారి శాతం కూడా దాదాపుగా ఇలాగే ఉంది.



విస్తృత అవగాహన

ఈ నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించి, అందరూ ఉచితంగానే తీసుకునేలా రిజిస్ట్రేషన్ల శాఖ చర్యలు చేపట్టింది. అందరికీ కంప్యూటర్లు, నెట్ కనెక్షన్లు లేకపోవడంతో ఆన్‌లైన్‌లో ఈసీలు, సీసీలు తీసుకోవడానికి వీలుపడట్లేదని గుర్తించిన అధికారులు... వీటిని ఫోన్లలో కూడా చూసుకునేలా ఒక యాప్‌ను తీసుకురానున్నారు. దీన్ని దాదాపుగా సిద్ధం చేశారు. అవసరమైతే ప్రింట్ కూడా తీసుకోవచ్చు. అంతేకాదు... రిజిస్ట్రేషన్ శాఖ సిబ్బందికి ఎవరైనా ఫోన్ చేస్తే... ఆన్‌లైన్‌లో ఈసీలు, సీసీలు ఉచితంగా పొందాలని చెప్పే కాలర్‌ట్యూన్‌ను పెట్టిస్తున్నారు. ఉచిత ఈసీలు, సీసీల గురించి వివరిస్తూ రాష్ట్రంలోని 295 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల దగ్గర ఫ్లెక్సీలు సైతం ఏర్పాటు చేశారు. ఎవరికైనా సందేహాలుంటే నివృత్తి చేసేందుకు 9121106359 అనే నంబరుతో ఒక కాల్‌సెంటర్‌ను కూడా ఏర్పాటుచేశారు. ఇన్ని రకాలుగా ప్రచారం చేస్తున్నా ఇంకా ఈసీలు, సీసీల కోసం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకే వచ్చేవారిని కూడా చైతన్యం చేయాలని నిర్ణయించారు. ఈసీలు ఆన్‌లైన్‌లో ఉచితంగా తీసుకోవచ్చని ముందుగా చెప్తారు. అయినా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే కావాలని కోరితే మాత్రం ఇవ్వాలని నిర్ణయించారు.

ఏదీ రహస్యం కాదు



రిజిస్ట్రేషన్ల శాఖలోని ఏ సమాచారమూ ఇక రహస్యం కాదు. అంతా ప్రజల ముందు పెట్టాం. ప్రజలే అన్నీ తెలుసుకోవచ్చు. ఆస్తుల మార్కెట్ విలువల నుంచి ఆ ఆస్తి కొనదగినదేనా? దాని యజమాని ఎవరు? తదితర విషయాలన్నీ తెలుసుకోవచ్చు. రిజిస్ట్రేషన్లు చేసేందుకు వీల్లేని నిషేధిత జాబితాలో పెట్టిన సర్వేనెంబర్లు, ఆస్తుల వివరాలూ చూసుకోవచ్చు. ప్రభుత్వానికి వచ్చే రూ.40కోట్ల ఆదాయాన్ని వదులుకుని ఈ సంస్కరణను తీసుకొచ్చాం. ప్రజలు దీన్ని పూర్తిస్థాయిలో ఉపయోగించుకునేలా చైతన్యం తెస్తాం.

- డి.సాంబశివరావు, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

ఆక్వాకు 'వైట్‌స్పాట్'!

- అనధికార హేచరీలు.. నాణ్యత లేని విత్తనాలు!
- షరా'మామూలు'గా మత్స్యశాఖ అధికారులు
- వైరస్‌తో వణుకుతున్న కోస్తా జిల్లాలు



అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అనధికార హేచరీల్లో తయారవుతున్న నాణ్యత లేని రొయ్యల సీడ్ వల్ల మొత్తం ఆక్వా రంగమే ప్రమాదంలో పడే పరిస్థితులు దాపురించాయి. కోస్తా జిల్లాల్లో కనక వర్షం కురిపించే ఆక్వా రంగాన్ని ప్రస్తుతం వైట్ స్పాట్(తెల్లమచ్చ) వైరస్ వణికిస్తోంది. 20-45 రోజుల వయస్సున్న రొయ్యలకు అంటువ్యాధిలా వైరస్ సోకడంతో మృత్యువాతపడుతున్నాయి. దీంతో మంచి రొయ్యలకు కూడా విలువ లేకుండా పోతోందని ఆక్వా సాగుదారులు ఆవేదన చెందుతున్నారు. వాస్తవంగా రొయ్య పిల్లలను ఉత్పత్తి చేసే హేచరీల నిర్వాహకులు కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ అనుమతి తీసుకోవాల్సి ఉంది. కానీ తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో రిజిస్టర్ హేచరీస్‌తో పోటీగా అనధికార హేచరీలు నడుస్తున్నాయి. అధిక లాభాలు గడించాలన్న అత్యాశతో కొందరు మెలకువలు పాటించకుండా నాణ్యత లేని సీడ్ వినియోగిస్తున్నారు. పైగా యాంటీబయోటిక్స్ విరివిగా వాడుతున్నారు. నాణ్యత లేని సీడ్ తయారు చేసి, అమాయక రైతులకు విక్రయిస్తున్నారు. ఫలితంగా రొయ్యలకు వైరస్ సమస్యలు ఎదురవుతున్నాయి. కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లో తెల్లమచ్చ వైరస్ సోకి, రొయ్యలు చనిపోతుండడంతో రైతులు భారీగా నష్టపోతున్నారు. అయినా మత్స్య శాఖాధికారులు క్షేత్రస్థాయిలో అనధికార హేచరీలను కట్టడి చేయకపోగా, లాలూచీలు పడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పరిస్థితిని చక్కదిద్దాలని ఆక్వా సాగుదారులు కోరుతున్నారు.

15 దాటితే మార్చాల్సిందే!

- పాత వాహనాలతోనే కాలుష్యం.. రాష్ట్రంలో 10% ఇలాంటివే
- ఆ వాహనాల గుర్తింపులో ఆర్టీఏ

అమరావతి, మార్చి 4:(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, గడువు తీరిన వాహనాలకు చెక్ చెప్పబోతోంది. పదిహేనేళ్లకు పైబడిన వాహనాలను తుక్కు కింద మార్చే చర్యలకు ఉపక్రమిస్తోంది. గత ఏడాది లెక్కల ప్రకారం మన రాష్ట్రంలో 89లక్షల వాహనాలు ఉండగా, ఇందులో పదిశాతానికి పైగా పదిహేనేళ్లు పైబడినవి ఉన్నట్లు రవాణాశాఖ అంచనా వేస్తోంది. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అంచనా ప్రకారం, ద్విచక్ర వాహనాల నుంచి 56.2శాతం కాలుష్యం వెలువడుతోంది. ఆ తర్వాతి రెండు స్థానాల్లో వరుసగా ఆటోలు, ట్రక్కులు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇటీవలి కాలంలో బాగా పెరిగిపోయిన పాసింజర్ ఆటోల్లో కిరోసిన్ పోసి నడుపుతున్నారు. పాత ఆటోలు, ట్రక్కులు, రవాణా వాహనాలతోపాటు ద్విచక్ర వాహనాలు సైతం 15 ఏళ్లు దాటినవి గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నట్లు రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు. దీనిపై జిల్లాలవారీగా డేటా సిద్ధం చేయాలని రవాణాశాఖ కమిషనరేట్... ఆర్టీవోలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. పాత వాహనాలు కావడంతో చేతులు మారినా యజమానులు రికార్డులు మార్చుకోనివి ఎక్కువగా ఉన్నాయి. వాహనం కొనుగోలు చేసినప్పుడు ఓనర్‌షిప్ ట్రాన్స్‌ఫర్ పేపర్లపై యజమానితో సంతకం చేయించుకుని, ఒరిజినల్ సీ-బుక్ తీసుకుని దగ్గర పెట్టుకొంటున్నారు. దీంతో ఆర్టీఏ రికార్డుల్లో ఉన్న పేర్లకు, ప్రస్తుతం వాహనాన్ని వినియోగిస్తోన్న వారి అడ్రస్‌లు వేర్వేరుగా ఉంటున్నాయి. వాటిని పసిగట్టే పనికి రవాణాశాఖ నడుం బిగించింది.

ఎలా చేస్తారంటే...

పదిహేనేళ్లు పైబడిన వాహనాలను గుజిరీకి ఇవ్వాలంటే, వాహన యజమానులు కొందరు అంగీకరించక పోవచ్చు. దీనికోసం ఇకముందు, వాహన తనిఖీల్లో పాతవాటికి పొల్యూషన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా అడుగుతారు. దీంతో వాహన యజమాని పొల్యూషన్ చెక్ చేయించుకోక తప్పదు. ఆ సమయంలో అతని సీ బుక్ చూడాలని చెకింగ్ సిబ్బందికి, ప్రైవేటు ఏజెన్సీలకు అధికారులు నిర్దేశిస్తారు. పాత వాహనమైతే యజమాని నుంచి ఆధార్, సెల్ నెంబర్లు కూడా తీసుకోవాలని సూచిస్తారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా గల మొత్తం పాత వాహనాల యజమానులను గుర్తిస్తారు. పాత వాహనం ఎక్స్ఛేంజ్ చేసుకుంటే కేంద్రం ఎంత రాయితీ ఇస్తుంది.? రాష్ట్రం ఎంత ఇస్తుందో వారికి అధికారులు వివరిస్తారు.

అగ్నికీలల్లో సింహగిరి కొండలు!



విజయనగరం జిల్లా కళ్లేపల్లి, రేగ గ్రామాల మధ్య అగ్నికి ఆహుతవుతున్న తోటలు, చెట్లు

- 300 ఎకరాల జీడిమామిడి తోటలు దగ్ధం
- అగ్నిమాపక శకటాలు రప్పిస్తున్నాం: కలెక్టర్

సింహాచలం, (విశాఖపట్నం) మార్చి 4: వేసవి మంటలు అప్పుడే దడ పుట్టిస్తున్నాయి. పలు జిల్లాల్లో భారీ అగ్ని ప్రమాదాలు బెంబేలెత్తిస్తున్నాయి. ఎండలకు తోడు ఉధృతమైన గాలులు తోడవడంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంటోంది. వరాహ లక్ష్మీనృసింహ స్వామి కొలువై ఉన్న సింహగిరిపై ఓ ప్రాంతంలో ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది, దేవస్థానానికి చెందిన 300 ఎకరాల జీడిమామిడి తోటలు దగ్ధమయ్యాయి. మాధవధార సమీపంలోని తోటల్లో శనివారం రాత్రి మంటలు చెలరేగాయి. దేవస్థానం ఈవో కె.రామచంద్రమోహన్, సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. మర్రిపాలెం అగ్నిమాపక సిబ్బందితో కలిసి మంటలను అదుపు చేయగలిగారు. అయితే ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో అదే ప్రాంతంలో మంటలు రేగాయి. దేవస్థానం అధికారుల విజ్ఞాపన మేరకు జిల్లా అదనపు అగ్నిమాపక అధికారి ఎన్.సురేంద్ర ఆనంద్ రెండు అగ్నిమాపక శకటాలతో సిబ్బందిని పంపి మంటలను ఆర్పే యత్నం ప్రారంభించారు. అయినా ఫలితం లేకపోగా, సింహగిరి హిల్‌టాప్ రోడ్డును దాటుకుని ప్రధాన కొండపై గల అటవీ ప్రాంతంలోకి ప్రవేశించాయి. సాయంత్రం ఐదు గంటలకు మంటల ఉధృతి తగ్గినా, రాత్రి వరకు అక్కడక్కడా మంటలు కనిపిస్తూనే ఉన్నాయి. సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆ ప్రాంతానికి చేరుకుని చినగదిలి తహసీల్దార్ భాస్కర్ రెడ్డి, పోలీస్, దేవస్థానం అధికారులతో సమీక్షించారు. సిగరెట్ కాల్చి పడేయంతో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ప్రమాదంలో దేవస్థానానికి చెందిన సుమారు 300 ఎకరాల జీడితోటలు దగ్ధమైనట్లు ప్రాథమిక అంచనాకు వచ్చానట్లు కలెక్టర్ తెలిపారు. మంటలను పూర్తిస్థాయిలో అదుపు చేసేందుకు జిల్లా నలుమూలల నుంచి అగ్నిమాపక శకటాలను సింహగిరికి రప్పిస్తున్నామని, అంతవరకు మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా రాత్రి వేళల్లో ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేశామని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎస్.కోటలో 120 ఎకరాల్లో తోటలు దగ్ధం

లక్కవరపుకోట, మార్చి 4: విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలంలోని కళ్లేపల్లి, రేగ గ్రామాల సమీపంలోని తోటల్లో ఆదివారం మధ్యాహ్నం 120 ఎకరాల్లో మామిడి, జీడి, టేకు, నీలగిరి చెట్లు దగ్ధమయ్యాయి. సుమారు రూ.50 లక్షలకు పైగా ఆస్తినష్టం సంభవించింది. పిందె దశలో ఉన్న జీడిమామిడి తోటలు దగ్ధమవ్వడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఎస్.కోట అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికే చాలావరకు చెట్లు కాలిపోయాయి. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు.



కువైత్‌లో నిరసన తెలుపుతున్న టీడీపీ, వివిధ తెలుగు సంఘాల నాయకులు

ఏపీకి న్యాయం చేయాలి

కువైత్‌లో టీడీపీ, తెలుగు సంఘాల ప్రదర్శన

(ఆంధ్రజ్యోతి-గల్ఫ్ ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని, విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కువైత్‌లో తెలుగుదేశం పార్టీ, తెలుగు సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. 'ఏపీ డిమాండ్స్ జస్టిస్' అనే నినాదంతో కువైత్‌లోని ఒమేరియ పార్కులో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ కువైత్ అధ్యక్షుడు, తెలుగు సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ కుదరవల్లి సుధాకరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వివిధ తెలుగు సంఘాల అధ్యక్షులతో పాటు కువైత్‌లోని టీడీపీ నాయకులు పాల్గొని కేంద్రప్రభుత్వ వైఖరిని ఖండించారు.

మోదీకి మంచి బుద్ధి ప్రసాదించు స్వామీ...



ఆంధ్రప్రదేశ్ పట్ల ప్రధాని నరేంద్ర మోదీ వైఖరి మారేలా మంచి బుద్ధిని ప్రసాదించు స్వామీ అంటూ టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మంచౌదరి ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకా తిరుమలలో వెంకన్నను వేడుకున్నారు. నాయకులంతా మోకాళ్లపై నడిచి స్వామిని దర్శించుకోవడం విశేషం.



తాడోపేడో తేల్చుకుంటాం

బీజేపీ నేతలవి దొంగ ఏడుపులు

సీపీఐ నేత రామకృష్ణ ధ్వజం

విజయవాడ/విశాఖపట్నం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రత్యేకహోదా, విభజనల హామీలపై ఢిల్లీలో తాడోపేడో తేల్చుకుంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. పార్లమెంటు వీధిలో సోమవారం నుంచి వామపక్షాలు, ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు బైఠాయిస్తారన్నారు. ఆదివారం ఆయన విజయవాడ, విశాఖల్లో విలేకరులతో మాట్లాడారు. మూడున్నరేళ్లుగా నోరు విప్పని రాష్ట్ర బీజేపీ ఇప్పుడు దొంగ ఏడుపులు ఏడుస్తోందని ధ్వజమెత్తారు. 'బీజేపీ నేతలు తలోమాట చెబుతున్నారు. టీడీపీతో కలిసి ఉంటారో లేదో తేల్చకుండా అంతర్గత నాటకాలు ఆడుతున్నారు. రాయలసీమకు వెళ్లి ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. రాష్ట్రానికి ఏమీ చేయనందుకు విచారపడుతూ ఆ పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు రాజీనామాలు చేయాలి. మళ్లీ అదే నియోజకవర్గాల్లో పోటీ చేసి ఒక్కరైనా గెలిస్తే మారు మాట మాట్లాడబోమన్న మా సవాల్‌ను స్వీకరించాలి' అని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన నష్టాన్ని పూడ్చే బాధ్యతను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు తీసుకోకుంటే చరిత్ర హీనుడిగా మిగిలిపోతారని స్పష్టం చేశారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఏర్పాటు చేసిన జేఎఫ్‌సీ (జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ) 14 రోజుల్లోనే అన్ని గణాంకాలు తెప్పించి విశ్లేషిస్తే.. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మాత్రం ఇంకా తమ సిబ్బంది లెక్కలు తయారు చేస్తున్నారని చెప్పడం హాస్యాస్పదమని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు మేలు చేసేందుకు రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు ఏకతాటిపై వచ్చి ఢిల్లీలో పోరాడాలన్నారు.

తొలి ఓటు..

రాష్ట్ర ప్రయోజనాలకే!

ఆ తర్వాతే రాజకీయ వ్యూహాలు.. వేచిచూసే ధోరణిలో చంద్రబాబు

కేసీఆర్ ఫ్రంట్‌పై టీడీపీలో చర్చ

హామీలపై మోదీదే తుది నిర్ణయం

ఆయన ప్రతిస్పందన చూశాక స్పందిస్తాం

టీడీపీ సీనియర్ నేతల మనోగతం

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి):ఇరవై రెండేళ్ల కిందే యునైటెడ్ ఫ్రంట్‌కు జాతీయ కన్వీనర్‌గా దేశ రాజకీయాల్లో చక్రం తిప్పిన టీడీపీ అధినేత చంద్రబాబు తాజా రాజకీయ పరిణామాలపై పెదవి విప్పకుండా మౌనం వహిస్తున్నారు. పొరుగునే ఉన్న తెలంగాణ సీఎం కేసీఆర్ మూడోఫ్రంట్ పేరుతో ప్రకటనలు చేస్తున్నా..ఈయన మాత్రం ఏ ప్రతిస్పందనా వ్యక్తం చేయకుండా సంయమనం పాటిస్తున్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి సాధించుకోవలసిన ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన భావిస్తున్నారని.. దానిపై స్పష్టత వచ్చాకే తన రాజకీయ వైఖరి ఏమిటో నిర్ణయించుకోవాలని అనుకుంటున్నారని టీడీపీ వర్గాలు అంటున్నాయి. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏలో టీడీపీ ప్రస్తుతం భాగస్వామిగా ఉన్న విషయం తెలిసిందే. రాష్ట్రానికి చేసిన వాగ్దానాలను నెరవేర్చకుండా కేంద్రం మొండిచేయి చూపుతోందన్న అసంతృప్తి ఉన్నా..చంద్రబాబు ఇంతవరకూ ఎక్కడా బీజేపీపై నేరుగా విమర్శలకు దిగలేదు. రాష్ట్రానికి న్యాయం జరగలేదని.. తాను ఇచ్చిన హామీలను కేంద్రం నెరవేర్చడం లేదని మాత్రమే చెబుతూ వస్తున్నారు. బీజేపీతో తెగదెంపులు చేసుకోవాలని..కేంద్రంలోని మంత్రులతో రాజీనామా చేయించాలని పార్టీ వర్గాల నుంచి గట్టి ఒత్తిడి వస్తున్నా..హామీల అమలుపై కేంద్రం ప్రతిస్పందన ఎలా ఉంటుందో మరి కొన్ని రోజులు చూద్దామని సర్దిచెబుతున్నారు. అదే సమయంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చే విషయంలో వెనుకాడవద్దని, పార్లమెంటులో గట్టిగా పోరాడాలని పార్టీ ఎంపీలను ఆయన నిర్దేశించారు.

వ్యూహంపై అంతర్గత చర్చలు..

భవిష్యత్ రాజకీయ వ్యూహం ఎలా ఉండాలో టీడీపీలో అంతర్గతంగా చాలా కాలం నుంచి చర్చలు జరుగుతున్నాయి. బీజేపీ తాను పాలిస్తున్న రాష్ట్రాల్లో బలహీనపడుతుండడం వల్ల 2019లో సొంతంగా మెజారిటీ సాధించలేదని.. జాతీయ స్థాయిలో అన్ని పార్టీలతో సంబంధాలు ఉన్న చంద్రబాబు బయటకు వస్తే మూడో ఫ్రంట్ ప్రాణం పోసుకునే అవకాశం ఉంటుందని కొందరు టీడీపీ నాయకులు వాదిస్తున్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించలేదు. 'ఆంధ్రప్రదేశ్ కొత్తగా పురుడు పోసుకున్న రాష్ట్రం. దీనిని ఆర్థికంగా నిలబెట్టి ముందుకు తీసుకెళ్లడమే నా ప్రథమ కర్తవ్యం. కేంద్రం నుంచి రావలసినవి సాధిస్తే అవి రాష్ట్రానికి ఉపయోగపడతాయి. వాటిని ఎలా రాబట్టాలన్నదానిపైనే మొదట దృష్టి పెడదాం. రాజకీయాల సంగతి ఎన్నికలు వచ్చినప్పుడు చూద్దాం' అని ఆయన వారికి సమాధానమిస్తున్నారు. తాజాగా టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కేంద్రంపై గట్టిగా విమర్శలు చేసిన వైనం.. మరోసారి టీడీపీలో ఈ దిశగా చర్చ లేవనెత్తింది. పార్టీ సీనియర్లు మాత్రం ఆచితూచి అడుగు వేయడమే మంచిదని అంటున్నారు. 'టీఆర్ఎస్ ఏ కూటమిలోనూ లేదు. తెలంగాణ రాష్ట్రం వడ్డించిన విస్తరి. ఆర్థికంగా మెరుగైన స్థితిలో ఉంది. టీడీపీది దానికి భిన్నమైన పరిస్థితి. మేం ఎన్‌డీఏలో భాగస్వాములం. ఆర్థికంగా ఎన్నో ఇబ్బందుల్లో ఉన్న కొత్త రాష్ట్రానికి కేంద్రం నుంచి నిధులు తెచ్చుకోవలసిన పరిస్థితి. అవకాశం ఉన్నంతవరకూ దానికోసం ప్రయత్నిస్తాం. ఇప్పుడు బంతి బీజేపీ కోర్టులో ఉంది. ఆ పార్టీ స్పందించకుంటే ఏం చేయాలో మాకు తెలుసు' అని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడొకరు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కేంద్రం వైఖరిపై తీవ్ర వ్యతిరేకత ఉందని.. ఈ సమయంలో బీజేపీపై విరుచుకుపడి.. బయటకు రావడం వల్ల టీడీపీకి రాజకీయంగా లబ్ధి చేకూరుతుందని.. అయినా తామింకా సంయమనం పాటిస్తున్నామని చెప్పారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా..చంద్రబాబుకు ఫోన్ చేసి..హామీలపై చర్చించేందుకు సోమవారం ఢిల్లీ రమ్మని ఆహ్వానించడం.. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల దృష్ట్యా.. కేంద్ర మంత్రి సుజనాచౌదరి, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షుడు కుటుంబరావును పంపుతానని సీఎం చెప్పడం తెలిసిందే. గతంలో మాదిరిగా పైపై చర్చలతో కాలం గడుపుతారా లేక నిర్దిష్టంగా నిర్ణయాలు తీసుకుంటారా అన్నది చర్చనీయాంశంగా మారింది. 'హామీల అమలుపై రాజకీయ నిర్ణయం జరగాలి. అదీ ప్రధాని స్థాయిలోనే జరగాలి. ఆయన చెప్పకుండా ఏదీ జరగదు. ప్రధాని స్పందనపైనే మా భవిష్యత్ రాజకీయ వ్యూహాలు ఆధారపడి ఉంటాయి' అని టీడీపీ సీనియర్ నేత ఒకరు పేర్కొన్నారు.



విజయవాడ బెంజ్‌సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

వేడెక్కిన ఢిల్లీ!

ఏపీ భవన్ వేదికగా జేఏసీల నిరసనలు

ప్రత్యేక రైల్లో వైసీపీ నాయకుల రాక

పార్లమెంటు ముట్టడికి కాంగ్రెస్ ప్రణాళిక

ప్రధానిపై పోలీసు కేసు పెట్టే యోచన

న్యూఢిల్లీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విభజన హామీలు, ప్రత్యేక హోదా సాధనే లక్ష్యంగా రాష్ట్రానికి చెందిన పలు పార్టీల నాయకులు, జేఏసీలు హస్తిన బాట పట్టడంతో దేశరాజధానిలో వాతావరణం వేడెక్కింది. ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు ప్రధాని మోదీపై పార్లమెంటు వీధి పోలీసు స్టేషన్‌లో మంగళవారం కేసు పెడతామని పీసీసీ ప్రకటించింది. దానితోపాటు 6,7 తేదీల్లో ఆత్మగౌరవ దీక్ష తలపెట్టింది. 8వ తేదీన పార్లమెంటు ముట్టడికి రంగం సిద్ధం చేసుకుంటోంది. ఇచ్చిన హామీలు బీజేపీ, టీడీపీ అమలు చేయలేకపోయాయంటూ ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదు చేసే యోచనలో కాంగ్రెస్ ఉంది. మరోవైపు.. ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ భారీగా రాజధానిలో మోహరించి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకోసం రాష్ట్రం నుంచి ప్రత్యేక రైల్లో ఆదివారం రాత్రికి దాదాపు 1200 మందిని తరలించారు. ఆ పార్టీకి చెందిన 43 మంది ఎమ్మెల్యేలు, ఏడుగురు ఎమ్మెల్సీలు, మాజీలు, ముఖ్యనాయకులు దాదాపు 150 మంది ఇక్కడకు చేరుకున్నారు. వారికి విజయసాయిరెడ్డి స్వాగతం పలికారు. కొందరు ఎమ్మెల్యేలు ముందుగానే ఢిల్లీ చేరుకున్నారు. సోమవారం పార్లమెంటు వీధిలో ధర్నా చేపట్టనున్నారు. పార్లమెంటులోనూ తమ ఎంపీలు నిరసన స్వరం వినిపిస్తారని.. బయట కూడా అదే స్థాయిలో ధర్నా చేస్తామని వైసీపీ ఎమ్మెల్యేలు వెల్లడించారు. మరోవైపు రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలంటూ వివిధ జేఏసీలు ఇప్పటికే తమ కార్యాచరణ ప్రకటించాయి. ఏపీ భవన్‌లో ఆదివారం రాజకీయేతర జేఏసీయేతర నాయకులు భిక్షాటన చేసి వినూత్న నిరసన తెలియజేశారు. సోమవారం నుంచి తమ నిరసన ఉధృతం చేయనున్నారు.



అద్దంకి సభలో మాట్లాడుతున్న జగన్

కేసీఆర్, మోదీలకు బాబు భయపడుతున్నారు

ఆడియో టేపులు, అవినీతి వల్లే: జగన్

అద్దంకి, మార్చి 4: 'నాగార్జునసాగర్ నీటితో తెలంగాణ సీఎం కేసీఆర్.. తన రాష్ట్రానికి నాలుగేళ్లుగా వరి పంటకు నీరిస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు భయపడి కుడి కాలువకు నీరు విడుదల చేయించలేదు. ఓటుకు నోటు కేసులో ఉన్న ఆడియో టేపులు కేసీఆర్ ఎక్కడ బయట పెడతారోనని భయపడుతున్నారు. గత నాలుగేళ్లలో జరిగిన అవినీతిపై కేంద్రం సీబీఐ దర్యాప్తునకు ఆదేశిస్తుందేమోనని ప్రధాని మోదీకి కూడా ఆయన భయపడుతున్నారు. పోలవరం నుండి పట్టిసీమ వరకు చేసిన అవినీతి బయటపడుతుందనే కేంద్రం వద్ద సాగిలపడ్డారు' అని వైసీపీ అధ్యక్షుడు జగన్ ఆరోపించారు. పాదయాత్రలో భాగంగా ఆదివారం ప్రకాశం జిల్లా అద్దంకి పాత బస్టాండ్ సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక హోదాతోనే రాష్ట్రానికి భవిష్యత్ అని స్పష్టం చేశారు. హోదా విషయంలో చంద్రబాబు రోజుకోమాట మారుస్తూ ఊసరవెల్లికే ట్యూషన్లు చెబుతున్నారని ఎద్దేవాచేశారు. కేంద్ర మంత్రుల రాజీనామా ఆఖరి అస్త్రమని అంటున్న ఆయన మాటల్లో ఏ మాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. 25 మంది ఎంపీలు రాజీనామా చేస్తే కేంద్రం కచ్చితంగా దిగి వస్తుందని చెప్పారు. ఎన్నికలప్పుడు మభ్యపెట్టేందుకు కిలో బంగారం, బెంజి కారు చంద్రబాబు ఇస్తానంటారని.. ఓటుకు రూ.3 వేలు కూడా ఇస్తానంటారని.. రూ.3వేలు కాదు ఐదు వేలు కావాలని డిమాండ్ చేసి తీసుకోవాలని ప్రజలను కోరారు. ఓటు వేసేటప్పుడు మాత్రం ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు.

108ని నీరుగార్చారని అంటుండగా..

'ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్సులను చంద్రబాబు నీరుగార్చారు. 108కి ఫోన్ చేసినా సరిగా స్పందించే పరిస్థితి లేదు' అని జగన్ అంటుండగానే.. అటు వైపు నుంచి 108 వాహనం సైరన్‌తో రావడంతో ఒక్కసారిగా అందరి దృష్టి అటుమళ్లింది. అక్కడకు సమీపంలో రోడ్డు ప్రమాదం జరగడంతో క్షతగాత్రులను తీసుకుని ఆస్పత్రికి బయల్దేరింది. రోడ్డుపై జగన్ సభ ఉండడం.. జనం రద్దీ ఎక్కువగా ఉండడంతో వేరే మార్గంలో దానిని మళ్లించారు.

అన్యాయం జరిగితే తెగదెంపులే: చినరాజప్ప

పులిగడ్డ(అవనిగడ్డ రూరల్), మార్చి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి అవసరమైతే బీజేపీతో తెగదెంపులు చేసుకోవటానికి వెనుకాడబోమని ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప స్పష్టం చేశారు. పులిగడ్డలో ఆదివారం మాట్లాడుతూ రాష్ట్ర పరిస్థితిని సీఎం ఎప్పటికప్పుడు కేంద్రం దృష్టికి తీసుకెళ్తున్నా ఇదిగోఅదిగో అంటూ దాటవేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు.

పవన్‌కు సీమ గోడు పట్టదా?: బీజేవైఎం

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు రాయలసీమ గోడు పట్టదా అని బీజేవైఎం జాతీయ కార్యవర్గ సభ్యుడు ఎన్. రమేశ్‌నాయుడు ప్రశ్నించారు. ఆదివారం విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాలం చెల్లిన నేతలు, స్వయం ప్రకటిత మేధావులతో పవన్ ఏర్పాటు చేసిన జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ (జేఎఫ్‌సీ).. ఫార్స్ ఫైండింగ్ చేసిందని ఎద్దేవాచేశారు.

మళ్లీ సీన్ ఢిల్లీకి

(మొదటి పేజీ తరువాయి)

బృందం ఆయనతో సోమవారం సాయంత్రం భేటీ కానుంది. మధ్యంతర విరామం తర్వాత మలివిడత బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయాన్నే తిరిగి ప్రారంభమవుతున్నాయి. కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని డిమాండ్ చేస్తున్న టీడీపీ ఎంపీలు తమ నిరసనను తీవ్రతరం చేయాలని ఇప్పటికే నిర్ణయించారు. సోమవారం ఉదయం గాంధీజీ విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహించి.. ఉభయ సభల్లో వెల్‌లోకి ప్రవేశించి హామీల అమలుకు నినదిస్తారు. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో అమిత్ షా జరిపిన ఫోను చర్చల మేరకు.. సుజనా, టీడీపీ ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర ప్రణాళికాబోర్డు ఉపాధ్యక్షుడు కుటుంబరావు సాయంత్రం షాతో చర్చలు జరిపే అవకాశాలున్నాయి. భవిష్యత్ పరిణామాలకు ఈ చర్చలే కీలకమని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. నిజానికి షా ముఖ్యమంత్రిని ఢిల్లీ రమ్మని కోరినప్పటికీ సుజనా ఇప్పటికే పలుదఫాలు కేంద్రమంత్రి అరుణ్ జైట్లీతో చర్చలు జరిపి ఉండడం, కుటుంబరావు కేంద్ర ఆర్థిక శాఖ అధికారులతో చర్చిస్తున్న దృష్ట్యా వారే చర్చలకు వెళ్లడం సరైనదని చంద్రబాబు భావించారని తెలుగుదేశం వర్గాలు తెలిపాయి. ఈ చర్చల్లో హామీల అమలుపై ఒక స్పష్టత వచ్చాక భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించుకుంటామని పేర్కొన్నాయి. రాజ్యసభలో గత సమావేశాల ముగింపు సమయంలో జైట్లీ చేసిన ప్రకటన ప్రాతిపదికగా ప్రత్యేక హోదా బదులు విదేశీ రుణ సాయంతో నడిచే ప్రాజెక్టుల(ఈఏపీ)కు తక్షణ అనుమతి, కేంద్ర ప్రాయోజిత పథకాలకు నిధులు, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు, పారిశ్రామిక రాయితీలతో పాటు రైల్వే జోన్ ప్రకటించడానికి కేంద్రం సిద్ధమైతే.. టీడీపీ-బీజేపీ మైత్రికి ఇబ్బంది ఉండదని.. లేని పక్షంలో ఈ సమావేశాల్లోనే తెగతెంపుల దాకా వెళ్లే పరిస్థితి వస్తుందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. వాస్తవానికి ఈ అంశాలపై ఎటూ తేల్చకుండా నాన్చి ప్రజల్లో భావోద్వేగాలు రేగడానికి బీజేపీ నేతలే ఆస్కారమిచ్చారని అంటున్నారు. తక్షణమే స్పందించకుండా ఆలస్యం చేసిన మాట నిజమేనని.. కానీ రాష్ట్రానికి ఏమీ చేయకూడదన్న ఆలోచన మాత్రం తమకు లేదని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. చంద్రబాబు కోరిన విధంగా చేయడానికి తాము సంసిద్ధంగా ఉన్నా.. అయితే వచ్చే ఎన్నికల్లో తమతో కలిసి ఉంటారో లేదోనన్న అనుమానాలు తమ నేతల్లో నెలకొన్నాయని అంటున్నాయి.

మార్చండి మన రాజ్యాంగాన్ని

దేశానికి దశ దిశ చూపిస్తా

మీ ఆశీర్వాదంతో ముందుకు సాగుతా

కార్యకర్తలతో కేసీఆర్



హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): "పది లక్షల కిలోమీటర్ల ప్రయాణం అయినా ఒక్క అడుగుతోనే ప్రారంభం అవుతుంది. తెలంగాణ కోసం బయల్దేరిననాడు నేను ఒక్కడినే ఉన్నా. నన్ను పెంచి, పోషించి, పెద్ద చేసింది మీరే. ప్రజలే నాకు అన్నదమ్ములు, తల్లిదండ్రులు. మీ దీవెన ఉంటే, వంద శాతం భారత రాజకీయాలకు దశ దిశ చూపించి, దేశ ప్రజలకు అద్భుతమైన మార్గదర్శనం చేస్తా" అని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యానించారు. "ఇప్పటికైనా రెండు జాతీయ పార్టీలు వాళ్ల పద్ధతి, పంథా, ఆలోచన సరళి మార్చుకోవాలి. మార్చండి మన రాజ్యాంగాన్ని! కథలు చెప్తే, ఉపన్యాసాలిస్తే పేదరికం పోదు. ప్రాక్టికల్‌గా, రాడికల్‌గా, ఔటాఫ్ బాక్స్ పోయి చైనా.. ఏమీ లేని సింగపూర్.. బాంబు దాడి తర్వాత జపాన్ ఏవిధంగా ఒళ్లు వంచి పనిచేశాయి!? మన దేశం కూడా అలాగే పైకి రావాలి" అని ఉద్వేగంగా అన్నారు. త్వరలోనే ఆర్థిక నిపుణులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు అందరినీ కలిసి, ఆలోచన చేసి ఈ దేశానికి కావాల్సిన మంచి ఎజెండాని రూపొందించి ముందుకు పోదామని తెలిపారు. ఆదివారం ప్రగతిభవన్‌కు తరలివచ్చిన టీఆర్ఎస్ కార్యకర్తలు, మద్దతుదారులతో కేసీఆర్ మాట్లాడారు. "70 ఏళ్ల తర్వాత కూడా ఈ దేశంలో రైతు ఆత్మహత్యలు ఎందుకు జరగాలి? వ్యవసాయానికి నీళ్లు లేవా? 70 వేల టీఎంసీల నీళ్లున్నాయి. అమెరికాలో ఇలా ఉంటదట? చైనాలో అలా ఉంటదట? జర్మనీలో గిట్లుంటదట? అని అంటుంటారు. జర్మనీ వాడు బంగారం తింటున్నడా? అమెరికా వాళ్లు వెండి తింటున్నరా? మనమేమన్నా మన్ను తింటున్నామా?" అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ నేతృత్వంలోని పార్టీలు ప్రజల కోసం పని చేయడంలో దారుణంగా విఫలమయ్యాయని ప్రజలకు అర్థమైందన్నారు. "తెలంగాణలో ఉండేవాళ్లలో 85 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు. వాళ్లకి రిజర్వేషన్లు ఇవ్వాలని కోరాం. 50 శాతం రిజర్వేషన్లు ఎలా సరిపోతాయి? ఒక రాష్ట్రంలో గిరిజనులు ఎక్కువ ఉంటారు. మరో రాష్ట్రంలో ఓసీలెక్కువ ఉంటారు. వాళ్ల గతేం కావాలి? ఓసీల్లోని పేదలు కూడా బాధపడే పరిస్థితి ఉంది. రిజర్వేషన్ల శాతం నిర్ణయించే అధికారాన్ని కూడా రాష్ట్రాలకు ఇవ్వాలి" అని డిమాండ్ చేశారు. కావేరీ నదీ జలాల కోసం తమిళనాడు, కర్ణాటక కొట్టుకు చావాలని, తెలంగాణ, ఏపీ మధ్య కృష్ణా, గోదావరి జలాల పంచాయితీ ఉండాలని, 'మేం ఢిల్లీల మంచిగ ఉంటాం కొడుకుల్లారా! మీరు కొట్టుకు సావండి అన్నట్టు చూసే ఈ ఢిల్లీ ప్రజలకు కావాలా? అని కేసీఆర్ ప్రశ్నించారు. "భారతదేశం బతుకుతోంది వ్యవసాయం మీదే. జీడీపీ, బీడీపీ అని ఆర్థికవేత్తలు లెక్కలు చెప్తారు. జీడీపా తోకమట్టా? రైతులు చస్తా ఉంటే ఎవనిక్కావాలె నీ జీడీపీ. ఇప్పుడు నేను మాట్లాడితే జైలుకు పంపుతామంటున్నారు. మీ పిట్ట బెదిరింపులు కేసీఆర్ మీద కాదు? దగా, కుంభకోణాలు, తప్పుడు పనులు చేసినోళ్లకి భయం ఉంటుంది" అని తేల్చి చెప్పారు.

నాకు మమత ఫోన్ చేశారు

దేశవ్యాప్తంగా పలువురి సంఘీభావం

జార్ఖండ్ మాజీ సీఎం కూడా

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయంగా కలిసి వచ్చే పార్టీల ఐక్యతకు కృషి చేస్తానన్న తన నిర్ణయాన్ని పలువురు నాయకులు స్వాగతిస్తున్నారని కేసీఆర్ తెలిపారు. "దేశంలోనే పెద్ద రాష్ట్రాల్లో ఒకటైన పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఫోన్ చేసి.. 'చంద్రశేఖర్ తమ్ముడూ! మంచి నిర్ణయం తీసుకున్నావ్. నువ్వు ఏం చెప్తే దాన్ని పాటిద్దాం. త్వరలోనే మనం కలిసి మాట్లాడదాం' అన్నారు. మహారాష్ట్ర నుంచి ఐదారుగురు ఎంపీలు ఫోన్ చేసి.. 'మీరు స్టార్ట్ చేసిన రోజే మేం రాజీనామా చేసి వస్తాం' అన్నారు. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఫోన్ చేసి 'మేం మీతో ఏకీభవిస్తున్నాం' అని తెలిపారు" అని కేసీఆర్ వివరించారు. మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ, జనసేన అధిపతి పవన్ కల్యాణ్ కూడా కేసీఆర్ వాదనతో ఏకీభవించారు.



బీచ్‌రోడ్డులో ర్యాలీ

విశాఖలో జనఘోష

విశాఖపట్నం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రజా పోరాటంతోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించగలమని మాజీమంత్రి, ఉత్తరాంధ్ర చర్చా వేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ అన్నారు. విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ ఆదివారం రాత్రి విశాఖ ఆర్కే బీచ్‌రోడ్డులో 'జనఘోష' పేరిట కాగడాల ప్రదర్శన నిర్వహించారు. విభజన హామీల అమలును పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం తెలుగువారిని అవమానిస్తోందని కొణతాల అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ చట్టపరంగా ఏపీకి, ముఖ్యంగా ఉత్తరాంధ్రకు ఇచ్చిన హామీల అమలుకు నిర్దిష్ట కార్యాచరణతో పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. పీసీసీ చీఫ్ రఘువీరా మాట్లాడుతూ 'విశాఖఉక్కు ఆంధ్రులహక్కు' మాదిరిగానే 'విభజన హామీల అమలు.. ఆంధ్రుల హక్కు' అంటూ పోరాటం చేద్దామన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బాబ్జీ, సీపీఎం నేతలు పాల్గొన్నారు. సినీహీరో శివాజీ ప్రజలతో ప్రత్యేకహోదా ప్రతిజ్ఞ చేయించారు.



థర్డ్ ఫ్రంట్‌ను నడిపించగల

సమర్థుడు కేసీఆర్

మనస్ఫూర్తిగా జనసేన మద్దతు ఇస్తోంది

ఏపీ ఎంపీలు టీఆర్ఎస్ మద్దతు తీసుకోవాలి

జనసేన అధినేత పవన్ కల్యాణ్

హైదరాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): "చాలా సున్నితమైన సమస్యలను కేంద్రం పట్టించుకోవడంలేదు. వాటి పరిష్కారం గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది. దేశంలో బూజు పట్టిన విధానాలు పోవాలి. నాయకత్వంలో కొత్త రక్తం రావాలి. థర్డ్ ఫ్రంట్ ఏర్పాటవ్వాలని సర్వత్రా చర్చ జరుగుతోంది. ఫ్రంట్‌కు అంకురార్పణ చేద్దామనుకున్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కి సాటి తెలుగువాడిగా మద్దతిస్తున్నా" అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని సుదీర్ఘకాలం నడిపించిన కేసీఆర్‌కు థర్డ్ ఫ్రంట్‌కు నాయకత్వం వహించే సమర్థత ఉందన్నారు. దేశ, స్థానిక సమస్యలపై ఆయన బాగా అవగాహన ఉన్న వ్యక్తి అని పేర్కొన్నారు. దేశ రాజకీయాల్లో గుణాత్మకమైన మార్పు కోసం ప్రయత్నిస్తానని కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో ఆదివారం జనసేన కార్యాలయంలో పవన్ మాట్లాడుతూ... ఎలాంటి హింసకు తావివ్వకుండా, ఒక్క రక్తపు చుక్క కూడా నేల రాలకుండా తెలంగాణ ఉద్యమాన్ని నడిపిన కేసీఆర్‌కు జనసేన మనస్ఫూర్తిగా మద్దతునిస్తోందని ప్రకటించారు. యూపీఏ పాలనలో దేశం అస్తవ్యస్తం అయిందని, దాన్ని ఎన్డీయే సరిదిద్దుతుందనే ఉద్దేశంతో తాను మద్దతునిచ్చానని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో జాతీయ పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఫ్రంట్ అవసరమని పవన్ అభిప్రాయపడ్డారు. ప్రాంతీయ పార్టీలు త్రికరణ శుద్ధితో ముందుకు వెళ్తే థర్డ్ ఫ్రంట్ విజయం సాధిస్తుందన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చే విషయమై కూడా కేంద్రం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేసినందుకు ఆ రాష్ట్ర ప్రజల తరపున తాను కేసీఆర్‌కి కృతజ్ఞతలు చెప్తున్నానని పేర్కొన్నారు. ఇంకెంత కాలం మోసపోతామనే బాధతో ఏపీ ప్రజలు రగిలిపోతున్నారన్నారు. విశాఖ రైల్వే జోన్‌కి తెలంగాణ ఎంపీలు మద్దతిస్తే... ఏపీ ఎంపీలు బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం అండగా నిలుస్తారని తెలిపారు. ఇలా తెలంగాణ, ఏపీ అంశాలవారీగా పరస్పరం మద్దతు ఇచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఏపీకి రావాల్సిన నిధులు, తదితర అంశాల కోసం పార్లమెంటులో టీఆర్ఎస్ ఎంపీల మద్దతు తీసుకోవాలని ఏపీ వైసీపీ, టీడీపీ ఎంపీలకు సూచించారు. జాతీయ పార్టీలు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటంలేదన్నారు. దేశంలో అస్థిరతలకు దారితీసేలా కేంద్రం వ్యవహరిస్తోందన్నారు. భవిష్యత్తంతా జాతీయ పార్టీలదే అని, ప్రాంతీయ పార్టీలకు ఉనికి ఉండబోదని బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షా ఒక సందర్భంలో అన్నారని గుర్తుచేశారు. కేంద్రంలో అధికారం పొందేందుకు బీజేపీకి ప్రాంతీయ పార్టీలు సహాయం చేశాయని, అలాంటి పార్టీల ఉనికిని అంతం చేస్తామంటే ఎలా అని ప్రశ్నించారు. తన ప్రాంత ప్రజల కష్టాలని తీర్చేందుకు రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు, ఇక్కడి ప్రజల మనోభావాలు, ఆకాంక్షలను పట్టించుకోవడంలేదన్నారు.

బ్యూటీ



తెల్లసొనతో మెరుపులు...

గుడ్డులోని తెల్లసొనలో మేనిఛాయను పెంచే పోషకపదార్థాలు చాలా ఉంటాయి. అవి శిరోజాల టెక్చర్‌ని మెరిసేలా చేస్తాయి. జుట్టును ఆరోగ్యంగా, దృఢంగా ఉంచుతాయి. చర్మంలో దెబ్బతిన్న టిష్యూలను బాగు చేసి చర్మం బిగువుగా ఉండేలా తోడ్పడతాయి. శిరోజాల పెరుగుదలకు సైతం సహకరిస్తాయి. తెల్లసొన చిట్కాలు కొన్ని...

- కీర పేస్టులో తెల్లసొన వేసి మెత్తగా చేసి ఆ పేస్టును ముఖానికి రాసుకొని 20 నిమిషాలు అలాగే ఉంచుకోవాలి. ఆ తర్వాత గోరువెచ్చటి నీళ్లతో ముఖాన్ని కడుక్కోవాలి. అలా వారానికి రెండుసార్లు చేయాలి. దీనివల్ల చర్మంలో కొల్లాజన్ పెరుగుతుంది. చర్మంలో రక్తప్రసరణ బాగా జరుగుతుంది. చర్మం మెరుస్తుంది.
- చర్మకాంతిని తెల్లసొన పెంచుతుంది. తెల్లసొనలో ఒక టేబుల్‌స్పూను నిమ్మరసం, రెండు టేబుల్‌స్పూన్ల ఆలివ్ ఆయిల్ వేసి బాగా కలిపి ఆ పేస్టును ముఖానికి రాసుకుని పదిహేను నిమిషాలు అలాగే ఉంచుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మం మృదువుగా తయారవడమే కాకుండా మేనిఛాయ కూడా పెరుగుతుంది.
- వయసు కనిపించకుండా ఉండడానికి ఒక ఎగ్ తెల్లసొనలో చక్కెర, పెరుగు ఒక్కొక్క టేబుల్‌స్పూను వేసి పేస్టులా చేసి ముఖానికి రాసుకొని పదిహేను నిమిషాలు అలాగే ఉంచుకోవాలి. ఆతర్వాత ముఖాన్ని చల్లటి నీళ్లతో కడగాలి. దీనివల్ల చర్మం బిగువుగా అవడమే కాదు టోనింగ్ కూడా బాగా ఉంటుంది. చర్మంపై మచ్చలు పోతాయి. ఈ మాస్కు చర్మాన్ని బాగా శుభ్రం చేస్తుంది. దీనివల్ల వయసు కనపడదు. ఇలా వారానికి రెండుసార్లు మాస్కు వేసుకుంటే మంచి ఫలితాలు కనిపిస్తాయి.
- తెల్లసొనలోని పోషకాల వల్ల శిరోజాలు మెరవడంతోపాటు బాగా పెరుగుతాయి. దీనికి చేయాల్సిందేమిటంటే, తెల్లసొనలో కొద్దిగా ఆలివ్ ఆయిల్ వేసి మాడు బాగా మర్దనా చేసి అరగంటపాటు అలాగే ఉంచుకోవాలి. ఆ తర్వాత మైల్డ్ షాంపుతో తల రుద్ది, నీటితో శుభ్రపరచాలి.

బయోపిక్

ఏకకాలంలో మలయాళం, ఇంగ్లీషులో అద్భుతమైన రచనలు... మహిళల్ని భిన్న కోణాల్లో 'బోల్డ్'గా అక్షరీకరించిందామె. కొంతమంది విమర్శించారు... చాలామంది ప్రేమించారు. ఆమె కథలు, కవితలే కాదు జీవితం కూడా వివాదాస్పదమే. మతం మార్చుకుని కమలాదాస్, కమలా సురయ్యాగా మారిన 'ఆమి'... మలయాళ చిత్రసీమలో తాజా బయోపిక్. వెండితెరపై మరో క్లాసిక్.





'ఆమి'గా
మంజు వారియర్

'ఆమి' జీవితానికి దృశ్యరూపం!

విభిన్న ఇతివృత్తాలతో నిరంతరం ప్రయోగాలు చేసే మలయాళ చిత్రసీమలో తాజాగా 'ఆమి' చర్చనీయాంశంగా మారింది. ప్రసిద్ధ మలయాళీ రచయిత్రి కమలాదాస్ బయోగ్రఫీ ఇది. కమలాదాస్ పాత్రలో ముందుగా విద్యాబాలన్‌ను తీసుకున్నప్పటికీ కొన్ని కారణాల వల్ల చివరికి మంజువారియర్ నటించింది. సాంప్రదాయ హిందూ కుటుంబంలో పుట్టిన కమలాదాస్ 65 ఏళ్ల వయసులో ఇస్లాంను స్వీకరించడం అప్పట్లో (1999) పెద్ద దుమారాన్నే రేపింది. అందుకే 'ఆమి' విడుదలకు అనేక ఆటంకాలు ఎదురయ్యాయి. కోర్టు జోక్యంతో ఈనెల 9న విడుదలైన 'ఆమి'ని దృశ్యకావ్యంగా చెబుతున్నారు విమర్శకులు. ఇంతకీ ఎవరీ కమలాదాస్? ఏమా కథ??

> కమలాదాస్ తొలి కవితాసంకలనం 'సమ్మర్ ఇన్ కలకత్తా' అందరి ప్రశంసలు అందుకుంది. కాలమిస్ట్‌గా కూడా మహిళల లైంగికతపై అనేక కోణాల్లో రచనలు చేసి, ఎన్ని విమర్శలు ఎదురైనా ధైర్యంగా వాటిని ఎదుర్కొన్నారు. 42 ఏళ్ల వయసులో కమల మలయాళంలో 'ఎంటె కథ' (ఇంగ్లీషులో 'మై స్టోరీ') పేరిట ఆత్మకథ 'బోల్డ్'గా రాయడం అప్పట్లో సంచలనం సృష్టించింది. 65 ఏళ్ల వయసులో (1999) ఆమె ఇస్లాంను స్వీకరించి తనపేరును కమలా సురయ్యాగా మార్చుకున్నప్పుడు కూడా చాలామంది దుమ్మెత్తిపోశారు.



కమలాదాస్... కమలా సురయ్యా...

మలయాళీలకు మాధవీకుట్టిగా, మిగతా ప్రపంచానికి కమలాదాస్‌గా, కమలా సురయ్యాగా... ఆమె రచనల్లోని భావుకత సాహిత్యాభిమానులకు బాగా తెలుసు. అనేక మహిళా సమస్యలపై తాను సంధించిన అస్త్రాలు చాలాసార్లు వివాదాస్పదమైనప్పటికీ ధైర్యంగా ముందడుగేశారు కమలాదాస్. ఆమె ఆత్మకథ 'మై స్టోరీ' ఆధారంగా బయోపిక్ తెరకెక్కిస్తున్నట్టు ప్రసిద్ధ మలయాళ దర్శకుడు, జాతీయ అవార్డు గ్రహీత కమల్ చేసిన ప్రకటన సంచలనం సృష్టించింది. తొలుత ఈ పాత్ర పట్ల విద్యాబాలన్ ఆసక్తి చూపారు. ఫోటోషూట్‌లో కూడా పాల్గొన్నారు. షూటింగ్ ప్రారంభానికి వారం రోజుల ముందు ఆమె ప్రాజెక్టు నుంచి తప్పుకున్నారు. దాంతో మంజువారియర్‌కు ఆ అవకాశం దక్కింది.

మలయాళంలో మాధవీకుట్టి పేరుతో విమెన్ సెక్సువాలిటీపై అనేక కథలు రాసిన కమల, ఇంగ్లీషులో కమలాదాస్‌గా సాహిత్యంలో తనదైన ముద్ర వేశారు. కేరళలోని సాహితీ కుటుంబంలో జన్మించిన కమల తండ్రి వి.ఎం.నాయర్ మలయాళం దిన పత్రిక 'మాతృభూమి'కి మేనేజింగ్ ఎడిటర్‌గా పనిచేశారు. ఆమె తల్లి నాలపట్ బాలమణి అమ్మ పేరున్న మలయాళీ కవయిత్రి. ప్రసిద్ధ కేరళ రచయిత నాలపట్ నారాయణ్ మీనన్ కమలకు తాతగారే. తండ్రి ఉద్యోగరీత్యా కమల చిన్నతనమంతా కోల్‌కతా, కేరళల మధ్య గడిచింది. సాహితీ కుటుంబం కావడంతో ఆమెకు చిన్నతనంలోనే రచనావ్యాసాంగం పట్ల ఆసక్తి ఏర్పడింది. 15 ఏళ్లకే బ్యాంకు అధికారి మాధవ్‌దాస్‌తో కమలకు పెళ్లిచేశారు. పెళ్లయ్యాక భర్త ప్రోత్సాహం కూడా లభించడంతో ఆమె మలయాళం, ఇంగ్లీషులలో రచనలు చేయడం ప్రారంభించారు. ఆమె తొలి కవితాసంకలనం 'సమ్మర్ ఇన్ కలకత్తా' అందరి ప్రశంసలు అందుకుంది. కాలమిస్ట్‌గా కూడా మహిళల లైంగికతపై అనేక కోణాల్లో రచనలు చేసి, ఎన్ని విమర్శలు ఎదురైనా ధైర్యంగా వాటిని ఎదుర్కొన్నారు. 42 ఏళ్ల వయసులో కమల మలయాళంలో 'ఎంటె కథ' (ఇంగ్లీషులో 'మై స్టోరీ') పేరిట ఆత్మకథ 'బోల్డ్'గా రాయడం అప్పట్లో సంచలనం సృష్టించింది. 65 ఏళ్ల వయసులో (1999) ఆమె ఇస్లాంను స్వీకరించి తనపేరును కమలా సురయ్యాగా మార్చుకున్నప్పుడు కూడా చాలామంది దుమ్మెత్తిపోశారు. ప్రపంచంలోని అనేక భాషల్లోకి ఆమె రచనలు అనువాదమయ్యాయి. 2009లో కమలాదాస్ కన్నుమూశారు. ఆమె అంత్యక్రియలు కేరళలోని జమా మసీదులో ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. దగ్గరి వారు కమలను 'ఆమి' అని పిలుస్తారు. అదే పేరుతో దర్శకుడు కమల్ ఆమె బయోపిక్ తీశారు.



బయోపిక్‌పై వివాదం...

మలయాళ చిత్రసీమలో 30 ఏళ్లకు పైగా పనిచేస్తున్న కమల్ రెండేళ్ల క్రితం కమలాదాస్ ఆత్మకథ 'మై స్టోరీ'ని సినిమాగా తీస్తున్నట్టు ప్రకటించగానే అంతా ఆశ్చర్యంగా చూశారు. జాతీయస్థాయిలో మూడుసార్లు అవార్డులు అందుకున్న కమల్ ఈ ప్రాజెక్టును చాలెంజ్‌గా తీసుకున్నారు. కమల్ పంపిన స్క్రిప్టు చదివిన విద్యాబాలన్ మరోమాటకు తావివ్వకుండా ఓకే చెప్పారు. అప్పటికే సిల్క్‌స్మిత బయోపిక్ (డర్టీపిక్చర్) చేసిన విద్యాబాలన్ 'ఆమి'గా సరిగ్గా సరిపోతుందనుకున్నారు. ఫోటోషూట్ కూడా చేశారు. అయితే చివరి నిమిషంలో ఆమె ప్రాజెక్టు నుంచి తప్పుకోవడంతో ఆ పాత్రకు న్యాయం చేసే హీరోయిన్ కోసం వెదికి చివరికి మంజు వారియర్‌ను ఎంచుకున్నారు. షూటింగ్ మొదలు పెట్టినప్పటి నుంచే ఈ సినిమాపై ఆందోళన మొదలయ్యింది. కమలదాస్ ఇస్లాంలోకి మరి ఒక ముస్లింను ప్రేమించడంతో 'లవ్ జీహాద్' ముద్రవేసిన కొందరు సినిమా విడుదలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. 'అయితే అప్పట్లో లవ్ జీహాద్ అనేదే లేదని, ప్రస్తుతం కొందరు మాత్రం స్వార్థ ప్రయోజనాల కోసం ఆ పదాన్ని వాడుతున్నారని, కమలదాస్ రచనలైనా, వ్యక్తిగత జీవితమైనా ఎప్పుడూ గౌరవప్రదంగానే సాగాయి కానీ ఆమె వ్యక్తిత్వాన్ని ఏనాడు తక్కువచేయలేద'ని దర్శకుడు కోర్టును ఆశ్రయించారు. కోర్టు జోక్యం చేసుకోవడంతో సినిమా విడుదలయ్యింది. ఈ బయోపిక్ ప్రథమార్థం కమల బాల్యం, చిన్నవయసులోనే తనకన్నా 20 ఏళ్లు పెద్దవాడైన వాడిని పెళ్లి చేసుకోవడం, సంసారం, పిల్లల్ని కనటం, కృష్ణుడి పట్ల ఆమెకున్న అమలిన ప్రేమ, విభిన్న పరిస్థితుల్లో ఆమె భావోద్వేగాలను చూపితే... ద్వితీయార్థంలో విధవగా మారిన తర్వాత కొత్త ప్రేమ కోసం వెదుకులాట, ఓ మహిళగా తన స్వేచ్ఛ కోసం ఆరాటం వంటివి ఆమె జీవితాన్ని ఏ మలుపు తిప్పాయనేది ఉంటుంది. మొత్తానికి 'ఆమి' జీవితంలోని అనేక పార్శ్వాలకు ఈ బయోపిక్ అద్దం పడితే, ఆ అద్దంలో మంజువారియర్ ప్రతిబింబించింది.

మానవత్వం

ఒక్కడు చాలు!

పొద్దున్నే భార్యభర్తలిద్దరూ ఉద్యోగానికి వెళ్లిపోతున్నారు. మూడేళ్లయినా నిండకుండానే పిల్లలు బడి బాట పడుతున్నారు. మరి ఇంట్లో ఖాళీగా ఉన్న వృద్ధుల మాటేమిటి! పొద్దుపోక ఒంటరిగా మిగిలిపోతున్నారు. అనాథలను ఆదుకోవడానికి వృద్ధాశ్రమాలున్నాయి. కానీ... అందరూ ఉండి ఏకాకిలా కాలం వెళ్లదీస్తున్న ఇలాంటి వారి పరిస్థితేమిటి? ఈ ఆలోచనే వచ్చింది మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌కు. అనుకున్నదే తడవుగా వృద్ధుల కోసం 'డే కేర్ సెంటర్' ప్రారంభించారు. ఆట... పాట... వినోదం... వ్యాయామం... వైద్యం... ఒక్కటేమిటీ... ఉదయం నుంచి సాయంత్రం వరకూ అన్నీ ఇక్కడే! దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు చేసిన ఈ తరహా కేంద్రం విశేషాలు 'నవ్య'కు ప్రత్యేకం...

కాలం పరుగెడుతోంది. ఇంటి యజమాని నుంచి పిల్లల దాకా ఇంట్లో ఎవరికీ క్షణం తీరిక ఉండటం లేదు. పొద్దున గుమ్మం బయట అడుగు పెడితే... మళ్లీ ఏ రాత్రికో ఇంటికి చేరేది. ఈ గజి'బిజీ' జీవన శైలిలో ఇంట్లో ఉన్న వృద్ధులతో ఓ గంట గడిపే సమయం ఎవరికీ లేదు. అందుబాటులో అన్నీ ఉన్నా... నాలుగు మాటలు పంచుకోవడానికి చుట్టూ ఎవరూ లేక ఒంటరి అవుతున్నారీ వృద్ధులు. ముఖ్యంగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ బిక్కు బిక్కుమంటున్నారు. వీరి కోసమే 'సన్‌షైన్ వృద్ధుల డే కేర్ సెంటర్' ప్రారంభించారు కలెక్టర్ కర్ణన్. డే కేర్‌లనగానే మనకు ఇప్పటి వరకూ తెలిసింది చిన్న పిల్లల కోసమే. కానీ దేశంలోనే మొదటిసారిగా ఒంటరి వృద్ధుల కోసం గత ఏడాది అక్టోబర్‌లో డే కేర్‌ను అందుబాటులోకి తెచ్చారు కర్ణన్. మంచిర్యాల కలెక్టరేట్ రోడ్డులో ఉన్న ఓ పాత భవనాన్ని రూ.20 లక్షల ప్రభుత్వ నిధులతో మరమ్మతులు చేయించి, అందులో ఈ కేర్ సెంటర్ ఏర్పాటు చేశారు. 2016లో జిల్లా ఏర్పడిన తర్వాత కలెక్టర్‌గా ప్రమోషన్‌పై మంచిర్యాలకు వచ్చారు. మొదటి నుంచీ సేవా దృక్పథం ఉన్న కర్ణన్... ఐటీడీఏ అధికారిగా ఉన్నప్పుడు తరచూ వృద్ధులు వచ్చి తమ బాధలు చెప్పుకొనే వారు. పిల్లలు ఉన్నా వృద్ధ తల్లిదండ్రులను పట్టించుకోకపోవడం... వాళ్ల రిటైర్మెంట్ సొమ్మంతా తీసుకుని వేధించడం వంటివి ఆయన దృష్టికి వచ్చాయి. ఇలాంటివన్నీ చూసే డే కేర్ సెంటర్ ప్రారంభించారు.



ఆర్వీ కర్ణన్,
మంచిర్యాల జిల్లా కలెక్టర్

ఎన్నో సౌకర్యాలు...

కేర్ సెంటర్ ఆవరణలో గడ్డి పెంచి, మొక్కలు నాటించి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. అందరూ సమావేశమయ్యేందుకు పెద్ద హాల్, టీవీ, వ్యాయామానికి, ఫిజియో థెరపీకి అవసరమైన పరికరాలను తెప్పించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఈ సెంటర్ పనిచేస్తుంది. అనారోగ్యంతో బాధపడేవారికి ప్రతి మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. దినపత్రికలు, టీవీలు అందుబుటులో ఉన్నాయి. ఆడుకోవడానికి కేరమ్స్, చెస్, షటిల్ కోర్టు వంటివి కలెక్టర్ ఏర్పాటు చేయించారు. 1250 మంది వృద్ధులు సభ్యత్వం తీసుకున్నారు. రోజూ కనీసం ఐదు వందల మంది ఇక్కడకు వచ్చి వారి అభిరుచికి తగ్గట్టుగా గడుపుతారు. సెకండ్ ఇన్నింగ్స్ ముచ్చట్లు చెప్పుకుంటూ, కష్టసుఖాలను పంచుకుంటూ హుషారుగా ఉంటారు. వారిలో ప్రభుత్వ, ప్రైవేటు మాజీ ఉద్యోగులు, రైతులు, కవులు, కళాకారులు వంటి సీనియర్ సిటిజన్లు ఉన్నారు.

వృద్ధుల సంక్షేమం కోసమే..

ఇప్పుడన్నీ చిన్న కుటుంబాలే. మూడు నాలుగేళ్లు వచ్చేసరికి పిల్లలు స్కూలుకి, తల్లిదండ్రులు ఉద్యోగాలకు వెళుతున్నారు. ఇంట్లో ఉండే పెద్దలు... అంటే సీనియర్ సిటిజన్స్ జీవితం నాలుగు గోడల మధ్యే గడిచిపోతోంది. తమలాంటి వారితో కనీసం మాట్లాడుకోలేని పరిస్థితి. ఒంటరితనం వారిని మానసిక ఒత్తిడిలోకి నెట్టేస్తుంది. అలాంటి వారి కోసమే 'సన్‌షైన్ డే కేర్ సెంటర్' ఏర్పాటు చేశాం. సీనియర్ సిటిజన్ మెయింటెనెన్స్ చట్టం 2007 ప్రకారం ఆర్డీవో, కలెక్టర్ అథారిటీగా వృద్ధుల సంక్షేమం కోసం కృషి చేయవచ్చు. జిల్లా సంక్షేమాధికారి (డీడబ్ల్యూవో) దీనికి ఇన్‌చార్జిగా ఉంటారు. ఇక్కడే ఆర్గానిక్ కూరగాయలు పండించేందుకు ప్రయత్నిస్తున్నాం. నాకు తెలిసి దేశంలో ఇలాంటి డే కేర్ సెంటర్ మరెక్కడా లేదు. విదేశాల్లో ఈ సంస్కృతి ఉంది.

- ఆర్వీ కర్ణన్, మంచిర్యాల కలెక్టర్



భవనంలో సమావేశమైన వయోవృద్ధులు

బాధలు చూసి చలించి...

2011 బ్యాచ్ ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన కర్ణన్‌కు కలెక్టర్‌గా ఇదే తొలి పోస్టింగ్. తమిళనాడులోని మదురై పట్టణానికి చెందిన ఆయన తొలుత గ్రూప్-1 అధికారిగా ఎంపికయ్యారు. మహారాష్ట్ర గిరిజన ప్రాంతంలో పనిచేశారు. వారి ఆకలి బాధలు, ఆర్థిక ఇబ్బందులు చూసిన ఆయన చలించిపోయారు. వాటికి పరిష్కారం చూపాలంటే తనకు మరిన్ని అధికారాలు కావాలి. అందుకే ఐఏఎస్ రాశారు. 158వ ర్యాంకు సాధించారు. ఐటీడీఏ పీఓగా నియమితులయ్యారు. ఆయన సతీమణి ప్రియాంక మంచిర్యాలలోనే డీఆర్ఓ (జిల్లా రెవెన్యూ అధికారి)గా పనిచేస్తున్నారు. కలెక్టర్‌గా మంచిర్యాలలోనే ఆయనకు తొలి పోస్టింగ్.

సమస్యలు ఎక్కడుంటే అక్కడే...

ప్రస్తుతం భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న కర్ణన్‌కు గొప్ప మానవతావాదిగా పేరుంది. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టగానే ఇరాన్‌లో మొదలైన 'వాల్ ఆఫ్ కైండ్‌నెస్' స్ఫూర్తితో మంచిర్యాలలో కూడా 'ఆపన్న హస్తం' పేరిట ఏర్పాటు చేశారు. తమకు అక్కర్లేని వస్త్రాలు, వస్తువులు ఏవైనా ఆ గోడ వద్ద పెడితే అవసరమైన వారు తీసుకోవడం దీని ముఖ్య ఉద్దేశం. రాష్ట్రంలోనే మొట్టమొదటిది ఇది. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకున్న ఓ సాధారణ మధ్యతరగతి కుటుంబం ఆయనది. కలెక్టర్ అయ్యుండి కూడా తన తండ్రి చెయ్యి విరిగితే స్థానిక ప్రభుత్వాసుపత్రిలోనే చికిత్స చేయించారు. తన కుటుంబంలో ఎవరికి ఏ ఆరోగ్య సమస్య వచ్చినా వైద్యం అక్కడే. గతంలో 100 పడకలుగా ఉన్న ఏరియా ఆసుపత్రిని 250 పడకలకు పెంచి, తొలిసారిగా ప్రసూతి విభాగాన్ని ఏర్పాటు చేయించారు. కర్ణన్ వచ్చిన తరువాతే ఇక్కడ తెలంగాణలోనే అత్యధికంగా ప్రసవాలు జరిగాయి.

వయసు తగ్గినట్టనిపిస్తోంది...



ఈ డే కేర్ సెంటర్ మాలో ధైర్యం నింపుతోంది. ఆత్మవిశ్వాసాన్ని పెంచి జీవితానికి భరోసానిస్తోంది. చాలామంది సీనియర్ సిటిజన్స్‌ది ఒక్కోరిదీ ఒక్కో బాధ. వాటన్నింటినీ మర్చిపోయి, కాస్తంత ఉల్లాసంగా గడపడానికి ఇది మంచి కేంద్రం. ఇక్కడికి వచ్చిన తరువాత నా వయసు తగ్గినట్టనిపిస్తోంది.

- ఎండీ హాఫీజ్ (75), సింగరేణి రిటైర్డ్ సూపర్ వైజర్

• ఎండీ మునీర్,
ఫొటోలు: చిన్ని శ్రావణ్

సమ్మర్ జ్యూస్

బనానా కూలర్

కావలసినవి:
మిగలపండిన అరటిపండ్లు - నాలుగు, పుల్లటి మజ్జిగ - రెండు కప్పులు, యాలకుల పొడి - సగం టేబుల్‌స్పూన్, పంచదార - రుచికి సరిపడా, చల్లటి నీళ్లు - రెండు కప్పులు.

తయారీ:
- మిక్సీలో అరటిపండ్ల ముక్కలు, పంచదార, మజ్జిగ పోసి ఒక నిమిషం లేదా నురుగు వచ్చే వరకు గ్రైండ్ చేయాలి.
- తరువాత అందులో రెండు కప్పుల చల్లటి నీళ్లు వేసి మరొక అర నిమిషం పాటు తిప్పాలి.
- జ్యూస్ రెడీ అయిన తరువాత అందులో యాలకల పొడి కలిపి ఫ్రిజ్‌లో పెట్టాలి.
- ఐస్ ముక్కలను వేసుకుని తాగితే చల్లచల్లగా, తియ్యతియ్యగా బాగుంటుంది.
- జ్యూస్ చేసేందుకు మిక్సీ లేకపోతే ఫోర్క్ లేదా కవ్వంతో చిలకొచ్చు.



పేరెంటచ్

'రైటింగ్ ప్రాక్టీస్' కూడా అవసరమే..!

పిల్లలు ఎంత చదివినా, చివరిగా పరీక్షల్లో ఎంత రాశారు అన్న దాని మీదే కదా మార్కులు పడతాయి. కాకపోతే, బాగా రాయాలంటే బాగా చదవాలి కదా? అని ఎవరైనా అనవచ్చు. అయితే, బాగా చదివిన వాళ్లంతా బాగా రాస్తారన్న గ్యారెంటీ ఏదీ లేదు కదా! పిల్లలు అహోరాత్రులూ చదివినా తక్కువ మార్కులు వచ్చిన సందర్భాలు ఎన్నో. అలాగని ఎక్కువ మార్కులు సంపాదించిన వాళ్లంతా తక్కువ చదివిన వాళ్లే అనుకోవడానికి వీల్లేదు. ఎవరైనా బాగా చదవాల్సిందే! కాకపోతే, ఆ చదివినదంతా రాయగలిగే నైపుణ్యాలు కూడా పెంచుకోవాల్సిన అవసరం ఉంది. అందుకే చదవడంతో పాటు, రాయడం కూడా బాగా ప్రాక్టీస్ చేయాలి. అలాకాకుండా కేవలం చదవడానికే పరిమితమైపోతే, ఆ చదివిన విషయాల్ని కాగితం మీద పెట్టడానికి ఒక్కోసారి చేయి సహకరించ కపోవచ్చు. పరీక్షలకు రెండు గంటలో, మూడు గంటలో ఒక నిర్దిష్టమైన కాల పరిమితి ఉంటుంది. ఆ నియమిత కాలంలో పిల్లలు ఎంత రాయగలిగితే అదే పరిగణనలోకి వస్తుంది. అందుకే పరీక్షల్లో పిల్లలు రాసే వేగాన్ని పెంచుకోవడం చాలా అవసరం.



చాలాసార్లు పిల్లలు "ఆ ఐదూ రాయగలిగి కూడా సమయం సరిపోక మూడే రాశాను" అంటూ ఎగ్జామ్ హాల్ నుంచి బయటికి వచ్చాక వాపోతుంటారు. ఏదో గొప్ప కోసం అలా చెబుతారని కూడా కాదు. నిజంగానే ఆన్సర్ చేయగలిగి కూడా, కేవలం వేగంగా రాయలేని కారణంగానే కొంతమంది అలా వదిలేసి వస్తుంటారు. అందుకే ప్రతి విద్యార్థీ చదవడంతో పాటు వేగంగా రాసే నైపుణ్యాన్ని పెంచుకోవడానికి కూడా ప్రతిరోజూ ఎంతో కొంత సమయం కేటాయించాలి. పైగా ఒకసారి రాయడం, పదిసార్లు చదవడానికి సమానం అన్నది అక్షరాలా నిజం. ఎందుకంటే చదువుతున్నప్పుడు మనసు ఎంతో కొంత అటూ ఇటుగా వెళ్లవచ్చేమో గానీ, రాస్తున్నప్పుడు మాత్రం ఆ చంచలత్వం ఉండదు. రాసే అలవాటు పెంచుకుంటే ప్రతి వాక్యం మెదడులో బలంగా రిజిస్టర్ అవుతుంది. ప్రాక్టీసు ఉంటుంది కాబట్టి పరీక్షల్లో వేగంగా రాయడానికి కూడా ఇబ్బంది ఉండదు. ఏమైనా పిల్లలు ఫైనల్ పరీక్షల్లో మార్కులు బాగా స్కోరు చేయాలంటే చదవడంతో పాటు రోజూ ఒక గంట రైటింగ్ ప్రాక్టీస్ చేయడం చాలా అవసరం.

హోమ్ కేర్

ఈ జాగ్రత్తలతో ఎయిర్ 'కండిషనింగ్'!



గృహోపకరణాలన్నింటిలో అతి తక్కువ కేర్ తీసుకునేది ఎసి(ఎయిర్ కండిషనర్). ఎండ వేడికి తట్టుకోలేక చల్లగాలి కోరుకున్నప్పుడు దానివైపు ఓ లుక్ వేస్తారే తప్ప మామూలు రోజుల్లో పట్టించుకునే నాథుడు ఉండడు ఎసి మెషిన్లను. ఎక్కువ డబ్బు పెట్టి కొన్న ఎసిని పట్టించుకోకపోతే ఎలా చెప్పండి? క్రమం తప్పకుండా చెక్ చేస్తేనే అది మీకు అవసరమైనప్పుడు సరిగా పనిచేస్తుంది. ఆ జాగ్రత్తలు ఏంటంటే... నీళ్లు బయటకు పోయే మార్గానికి ఎటువంటి అవరోధాలు ఉండకూడదు. ఆ మార్గం సరిగా ఉందా, లేదా చూడాలి. కండెన్సేషన్ లైన్ డ్రెయిన్‌లో నీరు నిల్వ ఉందంటే నీళ్లు బయటికి వెళ్లే మార్గంలో ఏదో అడ్డుపడిందని అర్థం. దాన్ని క్లియర్ చేయాలి. ఇలా చేయడం వల్ల నాచు పేరుకోదు. ఒకవేళ నాచు పేరుకుపోతే దాని స్పోర్స్(బీజ పరాగములు) గాలి ద్వారా వచ్చి మీ ఇంట్లోకి వచ్చి చేరతాయి. అలాగే ఎయిర్ కండిషనర్ స్క్రీన్‌కు అడ్డంకులు లేకుండా జాగ్రత్తపడాలి. చెత్త అడ్డు పడితే గాలి సరఫరా సరిగా జరగదు. ఇదొక్కటే కాకుండా గాలి సరఫరా సరిగా జరగకపోతే గదిని చల్లబరిచేందుకు ఎసి ఎక్కువ విద్యుత్‌ను వినియోగించుకుంటుంది.

టెక్ సందేహాలు

అప్‌డేట్ చేయకపోతే ఏమవుతుంది?



గూగుల్ ప్లే సర్వీసెస్ అప్పుడప్పుడు అప్డేట్ చెయ్యమని మెసేజ్ వస్తుంది కదా, ఒక వేళ అప్‌డేట్ చేయకపోతే గనుక ఏమవుతుంది?

- **కార్తీక్,** మంచిర్యాల

ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్ ఆధారంగా పనిచేసే ఫోన్లలో గూగుల్ ప్లే సర్వీసెస్ అతి ముఖ్యమైన అప్లికేషన్. యాప్స్, గేమ్స్ డౌన్‌లోడ్ చేసుకోవడానికి మనం ఉపయోగించే గూగుల్ ప్లే స్టోర్, ఇతర ముఖ్యమైన బ్యాక్‌గ్రౌండ్ సర్వీసులు సక్రమంగా పనిచేయడానికి ఈ గూగుల్ ప్లే సర్వీసెస్ తప్పనిసరిగా మన ఫోన్ లో ఉండాలి. అలాగే ఎప్పటికప్పుడు కొత్త వెర్షన్లకు అప్‌డేట్ చేయబడాలి. ప్రపంచంలో ఉన్న అన్ని ఆండ్రాయిడ్ ఫోన్ లకు గూగుల్ సంస్థ ఏదైనా కొత్త సదుపాయాన్ని ప్రవేశపెట్టాలని భావించినట్లయితే గూగుల్ ప్లే సర్వీసెస్ ఆ ప్రయత్నాన్ని చేస్తుంది. సహజంగా శాంసంగ్, షియోమీ వంటి అనేక థర్డ్ పార్టీ కంపెనీలు ఆండ్రాయిడ్ ఫోన్లను తయారు చేస్తూ ఉంటాయి కాబట్టి వాటంతటవి కొత్త సదుపాయాలు ప్రవేశపెట్టే వరకూ మన ఫోన్ ల విషయంలో గూగుల్ పెద్దగా జోక్యం చేసుకోలేదు. కానీ దొంగిలించబడిన ఫోన్లను వెదికి పట్టుకునే 'ఆండ్రాయిడ్ డివైజ్ మేనేజర్' వంటి అనేక అంతర్గత సదుపాయాలు ఈ రోజు ప్రతీ ఒక్కరం వాడగలుగుతున్నామంటే అది ఈ గూగుల్ ప్లే సర్వీసెస్ పుణ్యమే. అందుకే ఒక వేళ గూగుల్ ప్లే సర్వీసెస్‌కి ఏదైనా అప్‌డేట్ వచ్చినట్లయితే నిర్లక్ష్యం చేయకుండా దాన్ని ఇన్‌స్టాల్ చేయవలసి ఉంటుంది. దాంతో మరింత మెరుగైన సదుపాయాలు లభిస్తాయి.

ఆ అప్లికేషన్లు ఆండ్రాయిడ్‌లో పనిచేస్తాయా?

విండోస్ కంప్యూటర్లో పనిచేసే అప్లికేషన్లని ఆండ్రాయిడ్ ఫోన్లలో వాడుకోవటానికి అవకాశం ఉంటుందా?

- **వినీల్‌కృష్ణ,** హైదరాబాద్




నేరుగా అయితే విండోస్ అప్లికేషన్లు ఆండ్రాయిడ్ ఫోన్లలో రన్ చేయడం అసలు సాధ్యపడదు. అయితే 'వైన్' అనే సంస్థ ఇటీవల విండోస్ అప్లికేషన్లు ఆండ్రాయిడ్ ఫోన్లలో వాడేలా ఓ కంపాటబులిటీ లేయర్‌ని విడుదల చేసింది. దీన్ని వాడడం ద్వారా కొంతవరకూ ప్రయోజనం ఉంటుంది. ముఖ్యంగా దాదాపు మనం వాడే ఆండ్రాయిడ్ ఫోన్లు అన్నీ 'ఏఆర్‌ఎం' ఆర్కిటెక్చర్ ఆధారంగా పనిచేస్తాయి కాబట్టి ఈ 'వైన్'ని వాడడం ద్వారా కేవల మైక్రోసాఫ్ట్ స్టోర్లో లభించే యాప్స్‌ని మాత్రమే ఆండ్రాయిడ్ ఫోన్లలో పొందొచ్చు. ఒకవేళ అదృష్టవశాత్తూ మీ దగ్గర ఎక్స్ 86 ఆర్కిటెక్చర్ ఆధారంగా పనిచేసే ఫోన్ ఉన్నట్టైతే విండోస్ కంప్యూటర్లో పనిచేసే అధిక శాతం అప్లికేషన్లను విజయవంతంగా మీ ఆండ్రాయిడ్ ఫోన్లో ఉపయోగించుకోవచ్చు.

ఒకేసారి వైఫై, మొబైల్ డేటా వాడుకోవచ్చా?

ఒకేసారి వైఫై, మొబైల్ డేటా రెండూ వాడి వేగంగా ఫైళ్లను డౌన్లోడ్ చేసుకోవడానికి ఇదేం అవకాశముంటే తెలుపగలరు.

- **ప్రగతి,** విజయవాడ



సహజంగా వై-ఫై ఆన్‌లో ఉన్నప్పుడు మొబైల్ డేటా వాడుకోవడం కుదరదు. అయితే గూగుల్ ప్లేస్టోర్ లో లభించే కొన్ని థర్డ్ పార్టీ యాప్స్‌ని వాడడం ద్వారా ఇంటర్నెట్ నుండి ఏవైనా ఫైళ్లను డౌన్లోడ్ చేసేటప్పుడు ఒకేసారి వైఫై, మొబైల్ డేటా రెండూ ఉపయోగించి ఆ రెండింటి ద్వారా గరిష్ఠంగా ఎంత ఇంటర్నెట్ స్పీడ్ లభిస్తుందో అంత వేగంతో ఫైళ్లను డౌన్లోడ్ చేసుకోవడానికి వీలుపడుతుంది. దీనికోసం 'సూపర్ డౌన్లోడ్ - బూస్టర్' అనే అప్లికేషన్ గూగుల్ ప్లే స్టోర్లో లభిస్తుంది. దాన్ని మీరు ప్రయత్నించవచ్చు.

మీ టెక్ సందేహాలకు సమాధానాల కోసం navya@andhrajyothy.com

న్యూ గ్యాడ్జెట్స్

చెవిలోనే ఇమిడిపోతాయి!



ఇయర్‌ఫోన్స్ కొనాలనుకుంటున్నారా? వాటిలో బోలెడన్ని రకాలు ఇప్పుడు మార్కెట్‌ని ముంచేస్తున్నాయి. వైర్‌లెస్ ఇయర్‌ఫోన్స్ ఇప్పుడు లేటెస్ట్ ట్రెండ్. హాంగ్‌కాంగ్‌కు చెందిన 'అన్షమ్' అనే కంపెనీ లేటెస్ట్‌గా 'ఈటీ300' ఇయర్‌ఫోన్స్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. వీటిలో విశేషమేటంటే చెవిలో పట్టేంత చిన్నగా ఉంటాయి. కేవలం గంట చార్జింగ్‌తో మూడు గంటల పాటు వీటిని వాడచ్చు. ఈ ఇయర్‌ఫోన్స్ వాటర్ రెసిస్టెంట్ కూడా! వీటి ధర రూ.5,990.

టెక్ గురు

చాలామంది ఇప్పటికీ కొత్తగా ఫోన్లు కొనబోయేటప్పుడు స్పెసిఫికేషన్లు గురించి మాత్రమే ఆలోచిస్తూ ఉంటారు. స్పెసిఫికేషన్ బాగుంటే ఫోన్ వేగంగా పనిచేస్తుంది అన్నది వారి భావన. అయితే విచిత్రంగా ఫోన్ ఇంటికొచ్చిన తర్వాత వాడేటప్పుడు ఆశించిన దానికి భిన్నంగా చాలా స్లోగా పనిచేయడం వారిని నిరుత్సాహపరుస్తుంది, ఈ నేపథ్యంలో మంచి ఫోన్లు కూడా ఎందుకు స్లో అవుతుంటాయో ఇప్పుడు తెలుసుకుందాం.

నా ఫోన్ ఎందుకంత స్లో!



ప్రాసెసర్ గురించి ఆలోచించేటప్పుడు దాని క్లాక్ స్పీడ్, మొత్తం కోర్ల సంఖ్య, ప్రాసెసర్ మోడల్ పేరుని బట్టి అది స్పీడుగా ఉంటుందా లేదా అని ఓ అంచనాకి వస్తుంటారు. వాస్తవానికి ఒక ప్రాసెసర్‌కి తగ్గట్టు ఈ ఫోన్లో నిక్షిప్తం చేయబడిన ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టం ఏ మేరకు ఆప్టిమైజ్ చేయబడింది, ఫోన్ తయారీ కంపెనీ బ్యాటరీ బ్యాకప్ ఎక్కువ రావడానికి ప్రయత్నిస్తోందా, లేదా మెరుగైన పనితీరు అందించడానికి ఆ ఫోనును ట్వీక్ చేసిందా అన్న దాన్ని బట్టి ఫోన్ పనితీరు ఆధారపడుతుంది. కొన్నిసార్లు హై-ఎండ్ ప్రాసెసర్ల కన్నా అన్నీ చక్కగా కుదిరితే మిడ్-రేంజ్ ప్రాసెసర్లు మెరుగ్గా పని చేస్తాయి.

ర్యామ్ ఎక్కువ ఉన్నా నో యూజ్

ఇప్పుడు చాలా ఫోన్లలో 4జీబీ, 8 జీబీ మధ్య ర్యామ్ ఉంటోంది. అయితే ర్యామ్ ఎక్కువ ఉన్నంత మాత్రాన ఫోన్ వేగంగా ఉంటుంది అనడం సరైనది కాదు. భారీ మొత్తంలో ర్యామ్‌ని వాడుకునే అప్లికేషన్లు, గేమ్‌లను మన ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్నప్పుడు మాత్రమే అధిక మొత్తంలో ర్యామ్ వల్ల ఉపయోగముంటుంది. లేకపోతే ఎంత ర్యామ్ ఉన్నా నిష్ప్రయోజనమే. ఒకటే మొత్తంలో ర్యామ్ ఉన్న రెండు ఫోన్లను తీసుకుంటే రెండింటి పనితీరు ఒకేలా ఉండదు. ఇంతకు ముందు చెప్పుకున్నట్లు ఫోను పనితీరు, వేగం అందులో నిక్షిప్తం చేయబడిన ఆపరేటింగ్ సిస్టం ఎలాగ ఆప్టిమైజ్ చేయబడిందన్న దాని మీదే ఆధారపడి ఉంటుంది. కేవలం మన సంతృప్తి కోసమే అంత ర్యామ్ ఉంది, ఇంత ర్యామ్ ఉంది అని గొప్పలు చెప్పుకుంటాం.

ఫోన్ స్క్రీన్ వల్ల

సహజంగా ఫోన్ స్క్రీన్‌ల విషయంలో స్క్రీన్ టైప్, రిజల్యూషన్, పిక్సల్ డెన్సిటీ వంటి అనేక సాంకేతిక పదాలు వినిపిస్తుంటాయి. అమోల్డ్ డిస్‌ప్లేలు, ఎక్కువ రిజల్యూషన్ ఉన్న స్క్రీన్లు ఎక్కువగా బ్యాటరీ ఖర్చు చేసుకుంటుంటాయి. అలాగే ఈ మధ్య కాలంలో కొన్ని ఫోన్లలో 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్ లభిస్తోంది. ఇది మనకు స్మూత్‌గా స్క్రోలింగ్ ఎఫెక్ట్ అందిస్తుంది. దాంతో ఫోన్ వేగంగా ఉన్న భావన కలుగుతుంది. మున్ముందు ఇంతే మొత్తంలో రిఫ్రెష్ రేట్ కలిగిన మరిన్ని ఫోన్లు రాబోతున్నాయి. తక్కువ స్క్రీన్ రిఫ్రెష్ రేట్ ఉన్న ఫోన్లు ఖచ్చితంగా స్లోగా ఉన్న భావన కలిగిస్తాయి.

బ్యాటరీ బ్యాకప్

బ్యాటరీ గురించి ఆలోచించేటప్పుడు చాలామంది బ్యాటరీ కెపాసిటీ ఎక్కువగా ఉంటే అంతకన్నా అవసరం లేదని భావిస్తుంటారు. ఇది పూర్తిగా తప్పుడు అభిప్రాయం. తక్కువ బ్యాటరీ కెపాసిటీ ఉన్నంత మాత్రన అది చెత్త ఫోన్ కాదు. ఈ మధ్యకాలంలో శాంసంగ్ గెలాక్సీ ఎస్8, ఎస్ 8 వంటి శక్తివంతమైన ఫోన్లలో తక్కువ బ్యాటరీతో కూడా రోజంతా బ్యాకప్ వచ్చే విధంగా ఆప్టిమైజ్ చేయబడి ఉంటోంది. అంతేకాదు ఆయా ఫోన్లలో వాడబడే ప్రాసెసర్లు కూడా తక్కువ విద్యుత్‌ని వినియోగించుకునేవి కావడం వల్ల బ్యాటరీ బ్యాకప్ అద్భుతంగా వస్తోంది.

స్టోరేజీ స్పీడ్ తక్కువగా

చాలామంది తమ ఫోన్లో ఎక్కువ మొత్తంలో స్టోరేజ్ ఉంటే చాలు అనుకుంటారు.. ఆ చిప్ నాణ్యతని బట్టి దాని ట్రాన్స్‌ఫర్ రేట్ ఉంటే ఖచ్చితంగా ఫోన్ పనితీరు కూడా ప్రభావితం అవుతుంది. అలాగే మనం ఉపయోగించే మెమరీ కార్డ్ ఏ క్లాస్ కి చెందింది అన్నదాన్ని బట్టి పరోక్షంగా ఫోన్ పనితీరు ఆధారపడి ఉంటుంది. కొద్దిగా ధర ఎక్కువైనా క్లాస్ 10కి చెందిన మెమరీ కార్డులు కొనుగోలు చేసినట్లయితే వాటి రీడ్, రైట్ స్పీడ్‌లు అటు సీక్వెన్షియల్‌గానూ, ఇటు రాండమ్‌గానూ మెరుగ్గా ఉంది ఫోన్లో ఉన్న అప్లికేషన్లు వేగంగా ఓపెన్ అవుతాయి, అలాగే ఫోటోలు, వీడియోలు, మ్యూజిక్ వంటి మెమరీ కార్డులో మనం భద్రపరచుకునే మల్టీమీడియా డేటా కూడా వేగంగా యాక్సెస్ అవుతుంది.

రోజుల గడిచే కొద్దీ


చాలా సందర్భాల్లో ఆండ్రాయిడ్ ఫోన్లు వాడుతున్న వారు ఐదారు నెలలు గడిచి పోయిన తర్వాత ఫోన్ స్లో అవుతున్న భావనకు గురవుతూ ఉంటారు. ఎప్పటికప్పుడు మనం ఇన్‌స్టాల్ చేసి అలాగే వదిలేసే అప్లికేషన్లు పరోక్షంగా మన ఫోన్ పనితీరుని క్షీణింపజేస్తుంటాయి. కొన్ని అప్లికేషన్లు నిరంతరం బ్యాక్‌గ్రౌండ్‌లో పనిచేస్తూ ర్యామ్, ప్రాసెసర్‌లను వినియోగించుకుంటూ ఉంటాయి. అందుకే కనీసం నెలరోజులకోసారైనా మన ఫోన్లో పెద్దగా వాడని యాప్స్ గుర్తించి తొలగించడం చేయాలి. అలాగే అప్లికేషన్ల క్యాచే వల్ల కూడా స్టోరేజ్ నిండిపోతూ పరోక్షంగా ఫోన్ నెమ్మదిస్తుంటుంది. ముఖ్యంగా తక్కువ స్టోరేజ్ ఉన్న ఫోన్లలో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. అప్లికేషన్ సెట్టింగుల్లోకి వెళ్లి క్యాచేని క్లీన్ చేసుకోవడం మంచిది.

ప్రమాదకరమైన యాప్స్

కొన్నిసార్లు అశ్లీల, పైరేటెడ్ సమాచారంతో కూడిన వెబ్సైట్లను యాక్సెస్ చేసేటప్పుడు, అలాగే పొరబాటున అవాంఛిత యాప్స్‌ని మన ఫోన్లో ఇన్‌స్టాల్ చేసినప్పుడూ ఇకపై అవి నిరంతరం బ్యాక్‌గ్రౌండ్‌లో రన్ అవుతూ భారీ మొత్తంలో సిస్టం వనరుల్ని వినియోగించుకుంటూ ఉంటాయి. దీంతో మన ఫోన్ నెమ్మదిస్తుంది. అందుకే గూగుల్ ప్లే స్టోర్ నుండి తప్పింది ఇతర ప్రదేశాల ఎక్కడినుండి పొరబాటున కూడా అప్లికేషన్లను డౌన్లోడ్ చేయకండి. వీటి ద్వారా మాల్వేర్లు వచ్చిన ఫోన్ స్లో అవుతుంది.

స్లో అయితే ఏం చేయాలి?

మనం ఇంతకు ముందు చెప్పుకున్నట్లు ఫోన్ ఎందుకు నెమ్మదించిందో అర్థం చేసుకోగలిగితే సగం సమస్య తొలగిపోయినట్లే. ఫోన్‌లో పెద్దగా వాడని అప్లికేషన్లను తొలగించడం, కేవలం అవసరమైన అప్లికేషన్లు మాత్రమే డౌన్లోడ్ చేసుకోవటం, ఫొటోలు, వీడియోల వంటివాటిలో ఏవైనా డూప్లికేట్ ఫైళ్లు ఉంటే గుర్తించి వాటిని తొలగించడం, తరచూ వాట్సప్‌కి వచ్చే ఫార్వార్డెడ్ మెసేజ్‌లు, వీడియోలు, ఫొటోలు తొలగించడం, ఎప్పటికప్పుడు ఫోన్ ఇంటర్నల్ స్టోరేజ్ తగినంత మొత్తంలో ఉండేలా జాగ్రత్త వహించడం చేయగలిగితే చాలా వరకూ మన ఫోన్ పనితీరు మెరుగ్గా ఉండేలా చూసుకోవచ్చు. ఫోను ఏ కారణం చేత స్లో అయిందో అర్థం కాకపోయినట్లయితే ఇక తప్పనిసరి పరిస్థితుల్లో మన ముఖ్యమైన డేటా మొత్తాన్ని ఇంటర్నల్ స్టోరేజ్ నుండి మెమరీ కార్డులోకి గానీ, కంప్యూటర్లోకి గానీ కాపీ చేసుకొని ఫోన్ ఫ్యాక్టరీ రీసెట్ చెయ్యడం మంచిది. ప్రస్తుతం మనం ఫోన్లో ఇన్‌స్టాల్ చేసుకున్న అప్లికేషన్లు, ఆ యాప్ డేటా, కాంటాక్టులు, కాల్ లాగ్స్, మెసేజ్‌లు అన్నీ ఉన్నవి ఉన్నట్లు బ్యాకప్ తీయగలిగే అప్లికేషన్లు కూడా లభిస్తున్నాయి కాబట్టి వాటి సాయంతో ముఖ్యమైన డేటాని బ్యాకప్ తీసుకోండి. ఫ్యాక్టరీ రీసెట్ చేశాక వాటిని తిరిగి రీస్టోర్ చేసుకోవచ్చు.



నల్లమోతు శ్రీధర్
fb.com/nallamothusridhar

గూగుల్‌కు ఏమైంది?

టెక్ న్యూస్



'వాలెంటైన్స్ డే' దాటి రెండు రోజులు గడిచాయో లేదో..గూగుల్ ఇచ్చిన షాక్‌కు అందరూ పరేషాన్ అయిపోయారు. 'ఓహ్... గూగుల్ ఇంత పని చేసిందా?' అని నెటిజన్లు ఫైర్ అవుతున్నారు. మరి కొందరైతే వేరే సెర్చ్ ఇంజిన్లను ఆశ్రయిస్తున్నారు. అందుబాటులో ఉన్న సౌకర్యాన్ని తీసేస్తే ఎవరికి మాత్రం కోపం రాదు? అదే గూగుల్ చేసిన తప్పు. ఏ చిన్న ఫొటో కావాలన్నా మొన్నటివరకూ గూగుల్ ఒక్కటే దిక్కు. కావాల్సిన ఫొటో మీద క్లిక్ చేసి, 'వ్యూ ఇమేజ్' ఆప్షన్‌లోకి వెళితే చాలు. ఎంత ఎక్కువ రిజల్యూషన్‌లోనైనా డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం ఉండేది. ఫిబ్రవరి 16న హఠాత్తుగా వ్యూఇమేజ్ ఆప్షన్‌ను తొలగించింది. ఒక వేళ వాటి మీద రైట్ క్లిక్ చేసి డౌన్‌లోడ్ చేసినా ఉపయోగం లేదు. తక్కువ సైజ్‌లోని ఫొటోలు మాత్రమే సేవ్ అవుతుండటంతో నెటిజన్లు కంగారెత్తిపోయారు.

ఎంత పని చేశావ్ 'గెట్టి'!

గతంలో ఏ వెబ్‌సైట్‌తోనూ సంబంధం లేకుండా కావాల్సిన ఇమేజ్‌ను డౌన్‌లోడ్ చేసే ఆప్షన్ ఉండేది. ఇలా చేసుకోవడం వల్ల కాపీరైట్ సమస్యలు వస్తున్నాయని 'గెట్టి ఇమేజస్' అనే సంస్థ ఇటీవలే గూగుల్‌కి ఫిర్యాదు చేసింది. దీంతో ఈ రెండు సంస్థలకు మధ్య జరిగిన ఒప్పందం కారణంగా 'వ్యూ ఇమేజ్'కు టాటా చెప్పేసింది. కేవలం వెబ్ పబ్లిషర్స్, కాపీరైట్ హోల్డర్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని గూగుల్ పేర్కొంది. అలాగే 'సెర్చ్ బై ఇమేజ్' ఆప్షన్‌నూ తొలగించింది. నెటిజన్లు తమకు ఏదైనా ఇమేజ్ కావాలంటే కచ్చితంగా దానికి సంబంధించిన వెబ్‌సైట్ ఓపెన్ చేసి మరీ సేవ్ చేసుకోవాలి. కానీ అక్కడ కావాల్సిన సైజ్‌లో ఇమేజ్ దొరుకుతుందా? అనేది సందేహమే. ఒక వేళ ఉన్నా ఫ్రీగా డౌన్‌లోడ్ చేసుకునే వీలు ఉండదు. దీంతో సామాజిక మాధ్యమాల్లో ఈ నిర్ణయం మీద పెద్ద చర్చ కాదు రచ్చ చేస్తున్నారు నెటిజన్లు. ఆఫీసు పనుల కోసం ఈ ఆప్షన్‌ను ఉపయోగిస్తామనీ, దీన్ని తీసేయడం అన్యాయమనీ వారు వాపోతున్నారు. అయితే, ఎప్పటినుంచో గూగుల్ పోటీదారులు అయిన యాహూ, బింగ్ సెర్చ్ ఇంజిన్లలో ఇమేజ్ డౌన్‌లోడ్ సౌకర్యం యథాతథంగా ఉండటంతో నెటిజన్లు ఊపిరి పీల్చుకున్నారు.

కొత్త కోంప్‌బుక్



ఐబాల్ కంపెనీ కోంప్‌బుక్ అనే పేరుతో మార్కెట్లోకి నోట్‌బుక్‌ను మార్కెట్లోకి కొన్నేళ్ల క్రితం వదిలింది. మంచి సక్సెస్ అయింది కూడా. తాజాగా మరో కోంప్‌బుక్ మార్కెట్లో సందడి చేస్తోంది. దాని పేరే 'ప్రీమియో'. 4జీబీ ర్యామ్, 32 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ ఉన్న ఈ కోంప్‌బుక్‌కి హెచ్‌డీఎమ్ఐ పోర్ట్, లాన్ పోర్ట్ సౌకర్యాలు కూడా ఉన్నాయి. విండోస్-10 ఆపరేటింగ్ సిస్టమ్‌ను ఇందులో డిఫాల్ట్‌గా ఉంటుంది. దీని ధర

టీవీ కొనేద్దామా!



స్మార్ట్ టీవీ... ఈ పేరులోనే కిక్ ఉంటుంది కదా! కావాల్సిన ఛానెల్స్ చూడచ్చు, ఇంటర్నెట్‌లో షాపింగ్ చేసుకోవచ్చు, సినిమాలూ చూసుకోవచ్చు. అందుకే మార్కెట్లో బోలెడన్ని స్మార్ట్‌టీవీలు. అందులో ఒకటి 'దైవా డీ325ఎస్‌సీఆర్'. ఇటీవలే మార్కెట్లోకి వచ్చింది. ఆండ్రాయిడ్ 4.4 ఓఎస్, డ్యూయల్ కోర్ ప్రాసెసర్ ఉన్న ఈ టీవీలో కూడా స్క్రీన్ మిర్రరింగ్, రిమోట్ మౌస్ అదనపు ఫీచర్లు కూడా ఉన్నాయి. 32 అడుగులు ఉండే ఈ టీవీ ధర రూ. 15,390

ఈజీటెక్


ఒక్క మాట చాలు!



మీకు అన్ని పనులూ గుర్తు చేసే స్మార్ట్ అసిస్టెంట్ మీ దగ్గర ఉందా? అదేనండి వాయిస్ అసిస్టెంట్. ఇప్పుడివి గ్యాడ్జెట్ ప్రియులను తెగ ఆకట్టుకుంటున్నాయి. వీటికి క్రేజ్ తెచ్చింది మాత్రం అమెజాన్. ఈ కంపెనీ స్మార్ట్ అసిస్టెంట్ 'అలెక్సా'ను నాలుగేళ్ల క్రితం మార్కెట్లోకి దించింది. కేవలం స్పీకర్‌లా ఉండే ఈ అలెక్సాతో ఒక్క మాట చెబితే చాలు. దూసుకెళిపోతుంది. అలారం సెట్ చేసుకోవచ్చు, ఫోన్లు మాట్లాడుకోవచ్చు, పాటలు వినొచ్చు. అందుకే బాగా హిట్ అయింది. ఆ తర్వాత కొంత కాలానికి గూగుల్ కూడా 'హోమ్' పేరుతో ఓ స్మార్ట్ అసిస్టెంట్‌ను రంగంలోకి దించింది. ఈ హోమ్‌తో ఎనిమిది ప్రపంచ భాషల్లో ముచ్చట్లు చెప్పచ్చు. అసలు చెప్పాలంటే, మొదటగా పర్సనల్ వాయిస్ అసిస్టెంట్‌ను ప్రవేశపెట్టింది యాపిల్. దాని పేరు 'సిరి'. కానీ అంతగా క్లిక్ కాలేదు. ఇప్పుడా 'సిరి'కి కొత్త హంగులు దిద్దాలన్న ప్రయత్నాల్లో యాపిల్ ఉంది.

టెక్ ఫీచర్

డిలీట్ చేస్తే పోయేది కాదులే!



వాట్సాప్‌లో మెసేజ్‌ను డిలీట్ చేసుకునే ఆప్షన్ మీ ఫోన్‌లో బాగానే పనిచేస్తోందా? లేదంటే తిప్పలు పెడుతోందా? సందేహం వస్తే ఒక్కసారి చెక్ చేసుకోండి. ఎందుకంటే ఈ ఫీచర్ సరిగ్గా పనిచేయడం లేదని చాలా మంది 'స్మార్ట్' యూజర్లు గగ్గోలు పెడుతున్నారు వాట్సాప్‌లో ఎవరికైనా సందేశాలు పంపితే, ఇక అంతే! అవి తప్పయినా, ఒప్పు అయినా వెనక్కి తీసుకునే ఛాన్సే ఉండేది కాదు. ఇది కొన్నాళ్ల క్రితం మాట. ఇప్పుడలా లేదు. ఏడు నిమిషాల్లో మనం కావాలనుకుంటే 'డిలీట్ ఫర్ ఎవ్రీవన్' అనే ఒక్క ఆప్షన్‌తో ఆ సందేశాన్ని తుడిచేయచ్చు. ఇది ఇప్పటి మాట. మెసేజ్ డిలీట్ చేసినా దానికి సంబంధించి 'యు డిలీటడ్ దిస్ మెసేజ్' అనే కోట్ మాత్రం వారికి వెళిపోతోంది. ఇక డిలీట్ చేసినా ఉపయోగం ఏంటని చాలా మంది వాదన. అలాగే ఏ సందేశం పంపించినా, దానికి సంబంధించిన లాగ్ డేటాతో ఎదుటివారు డిలీట్ చేసిన సందేశాన్ని మరో యాప్ సాయంతో గుర్తించే అవకాశం లేకపోలేదు. దీనికి సంబంధించి బోలెడన్ని యాప్స్ ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి.

నవజీవన గీతం

నేను పుట్టిందే మీకోసం...!



లోకంలో, కోటానుకోట్ల మంది అభిమానించి... ఆరాధించే అరుదైన కళాకారులు కొందరుంటారు. ఆ ఆరాధకుల్లో కొందరు ఆ కళాకారుల్ని తమ జీవితంతో ముడివేసుకుంటారు. జీవితమంతా ఆ కళామూర్తి ఆవిష్కరణలను చూస్తూ కాలం గడిపేయాలనుకుంటారు. కానీ, ఆ అనుకోని రీతిలో ఆ కళాకారులు హఠాత్తుగా కాలగర్భంలో కలిసిపోయినప్పుడు అనూహ్యమైన ఆ పరిణామానికి ఆ నమ్ముకున్న హృదయాలు ఆవేదనతో విలవిల్లాడిపోతాయి. అభినేత్రి శ్రీదేవి హఠాన్మరణంతో ఆమె ఆరాధకులకు అదే మిగిలింది. 1992లో విడుదలైన 'హీర్ రాంఝా' సినిమా కోసం ఆనంద్ బక్షీ రాసిన ఈ పాటలో ఆ ఆవేదనే ప్రతిధ్వనిస్తుంది. లక్ష్మీకాంత్ - ప్యారేలాల్ సంగీత సారథ్యంలో అనురాధా పౌడ్వాల్, సురేశ్ వాడేకర్ పాడిన పాటలోని ఒక బాధామయ చరణంలో శ్రీదేవి చూపిన నటనా వైదుష్యం గుండెల్ని పిండివేస్తుంది.

•••

హో ఆజా దిలనే తుఝ్‌కో పుకారా....
రబ్ నే బనాయా తుఝే మేరే లియే - ముఝే తేరే లియే
ఏక్ బనాకే దో టుకడే కియే -
దిల్ తడ్‌పాయా తేరా మేరే లియే - మేరా తేరే లియే

(నా హృదయం పిలుస్తోంది రారాదా!
దైవం సృష్టించింది నిన్ను నా కోసం , నన్ను నీకోసం
ముందు ఒకటిగానే చేసి ఆ పై రెండు ముక్కలు చేసింది
నీ ఎదను నా కోసం... నా ఎదను నీ కోసం తపించేలా చేసింది)

"నువ్వు పుట్టిందే నాకోసం, నేను పుట్టిందే నీకోసం" అంటూ ఏ ప్రేయసీ ప్రియులైనా ప్రేమోద్వేగంలో పాడుకోవచ్చు. అయితే, కళాభిమానులు కూడా తాము ప్రాణ సమానంగా ఆరాధించే అభినేత్రిని ఉద్దేశించి ఆరాధనతో అలాగే పాడుకుంటారు. "ఆ పాటను మీరు ఎప్పటికీ అలాగే పాడుకుంటూ ఉండిపోండి" అంటూ, అశేష ప్రజానీకాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తూ ఆమె హఠాత్తుగా అంతర్థానమైపోయింది. ఆమె భూమి పైకి వచ్చిందే మీకోసం అంటూ ఇప్పటిదాకా నమ్మించిన భగవంతుడు నిర్దాక్షిణ్యంగా మాటమార్చేశాడు. ఇరువురినీ విడదీసి అభిమానుల్ని పాతాళంలోకి, అభినేత్రిని ఆకాశంలోకి విసిరేశాడు.

ఆజ్ కీ అబ్ కీ ములాకాత్ నహీం హై యే - తేరీ యా మేరీ సోచీ బాత్ నహీం హై యే
హుక్మ్-ఏ- ఇలాహీ హై యే కీ కరియే- ఓ రబ్బా కీ కరియే /రబ్‌నే బనాయా/

(ఈ నాటి ఇప్పటి కలయిక కాదిది, నీ నా ఆలోచనా విషయమే కాదిది
దైవాజ్ఞ సుమా ఇది ఏం చేయగలం? ఓ దేవా ఏంచేయగలం?)

రసజ్ఞులకూ, కళాకారులకూ మధ్యనుండే బంధం ఒకటి రెండు రోజులదా? ఆకాశమంతా వెతికి వెతికి ఒక అపురూప నక్షత్రాన్ని పట్టుకున్నట్టు, ఆ అరుదైన కళామూర్తిని ఎన్నో దశాబ్దాలుగా గుండెలో దాచుకున్నారు. కానీ, ఏమయ్యింది? తల్లి ఒడి దాటి, ఇల్లూ, ఊరూ దాటి, రాష్ట్రాల సరిహద్దులు దాటి, కాలికి గజ్జె కట్టి దేశం దేశమంతా జీవితాన్ని నర్తింప చేసిన ఒక దివ్య కళామూర్తి, కన్ను మూసి తెరిచేలోగా కనుమరుగైపోయింది! కారణం ఏదైతేనేమిటి? ఆమెను ఎవరైనా మళ్లీ తెచ్చి కళ్లముందు నిలపగలరా? ఇంకా ఎన్నో దశాబ్దాలు అలా మహానందంగా సాగిపోతుందిలే అనుకున్న బంధం. ఉన్నట్టుండి హఠాత్తుగా ఇలా అయిపోయిందేమిటి?

ఇష్క్ కో దిల్ కా ఇమాన్ బనాకర్ - అప్నే ఖుదా కా ఫర్మాన్ బనాకర్
ఖస్మే ఉఠాయీ హమ్నే వాదే కియే- హమ్ నే వాదే కియే /రబ్‌నే/

(ప్రేమనే హృదయ ధర్మంగా ఎంచి, భగవంతుడి ఆదేశంగా భావించి
అదే ప్రమాణంగా వాగ్దానాలు చేశాము, ఆఁ వాగ్దానాలు చేశాం)

దేని మీదైనా ప్రేమంటూ లేకుండా ఏం చేయగలం? ఏ రసపోషణైనా, ఏ కళావిష్కరణ అయినా ప్రేమలోంచే కదా పుట్టుకొస్తుంది! దైవ సంకల్పం కూడా తోడైతే, అంకిత భావం ఉన్న కళాకారులు అద్భుతాలే చేస్తారు. కోట్లాది మంది అభిమానులకేసీ చూస్తూ ఎప్పుడూ మీనుంచి దూరంగా వెళ్లేది లేదని, అలా ఎప్పటికీ జరగదని వాగ్దానాలెన్నో చేస్తారు. అయినా, మృత్యుదేవత ఎంత కసాయిదో గానీ, ఒక్కసారి, వారి సంకల్పాల్నీ, వాగ్దానాల్నీ ఒక్కవేటుతో తునాతునకలు చేసి కోటి దిక్కులా గిరాటు వేస్తుంది. ఇప్పుడు జరిగింది కూడా అదే కదా!


సితమ్ సబ్ హై లోగ్ఁ గవారాఁ హమేఁ - జుదా మత్ కరో ఫిర్ ఖుదారా హమేఁ
ముహబ్బత్ నే హర్ బార్ పైదా కియే -జమానే నే హర్ బార్ మారా హమేఁ
కభీ షిరి ఫర్హాద్ హమ్ కో కహా - కభీ లైలా కభీ మజ్నూ కహా
దునియా నే హమ్ కో కితనే నామ్ దియే - హాయే నామ్ దియే /రబ్ నే/

(లోకమా! ఎన్ని గాయాలకైనా సిద్ధమే గానీ - కనీసం దైవం కోసమైనా మమ్మ విడదీయకండి
ప్రేమ ప్రతిసారీ జన్మనే ఇచ్చింది - కానీ, లోకమే ప్రతిసారీ ఛిద్రం చేసింది
మమ్మల్ని ఒకసారి షిరీ ఫర్హాద్‌లు అంది - ఒకసారి లైలా మజ్నూలంది
లోకం మాకు ఎన్ని పేర్లు పెట్టింది! - ఓహో ఎన్ని పేర్లు పెట్టింది!)

కళాకారుల్లో వ్యక్తిగత జీవితపు కల్లోలంలో మునిగిపోయే వాళ్లే ఎక్కువ. కానీ, అరుదుగా కొందరు ఆ కల్లోలాన్ని అధిగమించి కళలకోసమే జీవిస్తారు. వ్యక్తిగత జీవితం ఎంత పెద్దదయినా అతి కొద్దిమందితోనే అది పెనవేసుకుని ఉంటుంది. కళాకారుల హృదయం అలా కాదుగా! అది కోటానుకోట్ల రసాస్వాదకులతో ముడిపడి ఉంటుంది. కష్టాల కడగండ్లు జీవితాన్ని ముంచేస్తున్నా, కళకోసం ఎదురీతకే సిద్ధమవుతారు. శిథిలావస్థలోంచి కూడా పలుమార్లు పునరుత్థానం పొందుతారు. కాకపోతే ఇప్పుడు అలా ఇలా కాదుగా! ఏకంగా ప్రాణాలే ఆకాశంలో కలిసిపోయాయి. జీవితమే పరిసమాప్తమైపోయింది. ఇప్పుడింక పునరుజ్జీవాలూ... పునరుత్థానాలూ... కాదు.. పునర్జన్మే జరగాలి. కాకపోతే, ఆమె మళ్లీ నటిగానే పుట్టి, మహానటిగా కోటానుకోట్ల హృదయాల మీద మహోజ్వలంగా ఆనంద నర్తనం చేయాలన్నదే ఆరాధకులందరి ఆకాంక్ష!!

- బమ్మెర

లైఫ్ లెసన్



అలెగ్జాండర్‌కి అప్పటికి పదేళ్లు. ఓసారి ఓ వ్యాపారి ఓ పందెం వేశాడు. ముక్కుపుటాల నుంచి వేడిగాలితో రొప్పుతూ ఎగిరెగిరి పడుతోన్న తన గుర్రాన్ని అదుపులో పెట్టాలి. గెలిచిన వారికే ఆ అశ్వం. వీరులంతా వెళ్లారు. వెర్రిగా సకిలిస్తూ, గిర్రున తిరుగుతోందా గుర్రం. ఎవ్వరూ ఆపలేకపోయారు. నిజానికి అది దాని నీడనే చూసి భయపడుతోంది. ఇది పసిగట్టాడు ఆ పసివాడు. వెంటనే గుర్రాన్ని సూర్యుడి వైపు తిప్పించాడు. దాంతో నీడపోయింది. అది మామూలైపోయింది. నాటి నుంచి ఆ తురంగం అలెగ్జాండర్ వశమైంది. దానికి 'బుసిఫేలస్' అనే పేరు పెట్టుకొన్నాడు. ఓ విషయం అర్థమైంది అతగాడికి! శత్రువు మన కన్నా బలవంతుడనుకోడం ఓ భ్రమ.

పోరాటం చేద్దాం! ఆరాటం వదిలేద్దాం!

అలెగ్జాండర్ పుట్టింది క్రీ.పూ. 356, జూలై 20న! పెల్లా నగరంలో! ఇది గ్రీసు దేశపు మాసిడోనియా రాజధాని. అప్పటి రాజు 2వ ఫిలిప్ జీవితాశయం ఒకటే! అంతఃకలహాలతో మునిగిన... గ్రీస్ రాజ్యాలన్నింటినీ జయించాలి. అఖండ గ్రీస్ దేశానికి అధిపతినవ్వాలి. అందుకే వరసగా రాజ్యాలు జయిస్తూ వచ్చాడు.

అతని నాలుగవ భార్య ఒలింపియాస్. వారి సంతానమే అలెగ్జాండర్. ఆమె కూడా చాలా శక్తిమంతమైన స్త్రీ. కొడుక్కి ఎప్పుడూ ధైర్యాన్నే నూరిపోసేది. తండ్రి యుద్ధాల్ని ఎప్పటికప్పుడు చూస్తూ పెరిగాడు అలెగ్జాండర్. బాల్యంలోని నర్స్ ఆలనికె, ట్యూషన్ టీచర్ లియోనిడాస్ కూడా - ఆ పిల్లాడికి నేర్పింది సాహసాన్నే!

ఇన్ని ప్రభావాలతో ఆకాశమే హద్దుగా పెరిగాడు. అది కాస్తా విశృంఖలతకు దారితీసింది. పొగరుబోతు అయ్యాడు. మద్యపానానికి బానిస అయ్యాడు. ఇలాంటివాడిని దారిలో పెట్టాలంటే మంచి గురువు కావాలి. ఆరా తీస్తే అరిస్టాటిల్ గుర్తుకొచ్చాడు ఫిలిప్‌కి. వెంటనే రప్పించాడు.

తాను పుట్టిన 'స్టాజీరా' గ్రామాన్ని బాగు చేయిస్తే- చదువు చెబుతానన్నాడు అరిస్టాటిల్. ఆ ఊరిని ధ్వంసం చేసింది ఫిలిప్పే! సరేనన్నాడు కొడుకు కోసం! పాఠాలు ప్రారంభమయ్యాయి. మీజా ప్రాంతంలోని నింఫ్ దగ్గరి గుడిలో బడి. ఆ రాజ్యపు సంపన్నుల పిల్లలందరూ అందులో చేరారు.

మొదట్లో మాస్టారి మాట వినలేదు 13 ఏళ్ల అలెగ్జాండర్. క్రమంగా మారాడు. శాస్త్రాలన్నీ నేర్చాడు. దేన్నైనా ఇట్టే పట్టేసేవాడు. లాజికల్‌గా, కాలిక్యులేటెడ్‌గా ఆలోచించేవాడు. పుస్తకాలంటే పిచ్చి. మరోవైపు- ఎప్పుడూ సింహాసనం పైనే దృష్టి. ఎప్పుడెప్పుడు ప్రపంచంపై విరుచుకుపడదామా అన్న ఆశ, ఆవేశం!!

క్రీ.పూ 336లో ఫిలిప్‌ని అతని అంగరక్షకుడే చంపేశాడు. ఈ హత్యలో భార్య హస్తమూ, అలెగ్జాండర్ పాత్ర కూడా ఉన్నాయంటారు. ఏది ఏమైనా తండ్రి మరణంతో 20 ఏళ్ల అలెగ్జాండర్ రారాజు అయ్యాడు. విజ్ఞాన పరిశోధనల నిమిత్తం గురువుకు ఊహించనంత ధనం ఇచ్చాడు. తనతో చదువుకొన్న వారిని సైన్యాధికారుల్ని చేశాడు. చిన్నప్పటి నర్స్ సోదరుడు క్లీస్‌ని జనరల్ చేశాడు. తన ప్రాణమిత్రుడు హెఫాస్టన్‌ని తనతోనే ఉంచుకొన్నాడు. గ్రీకు రచయిత హోమర్ రాసిన 'ఇలియడ్' గ్రంథాన్ని చేత పట్టుకొన్నాడు. తన గుర్రం బుసిఫేలస్‌ని అధిరోహించి, అదిలించాడు.

దండయాత్రల మీద దండయాత్రలు చేశాడు. ఒక్క యుద్ధంలోనూ ఓడిపోలేదు. పర్షియాపై దాడి చేసి మూడవ డేరియస్‌ని తరిమి కొట్టాడు. అక్కడి రాజ్యక్షేత్రాలన్నింటినీ సైనికులకు ఉదారంగా పంచిపెట్టాడు. అక్కడి యువకుల్ని తన సైన్యంలోకి తీసుకొన్నాడు. లెక్కకు మిక్కిలి పదే పదే సలహాలిస్తున్నాడని 'కాలిస్థనీస్' అనే గురుతుల్యుణ్ణి చంపించేశాడు.

క్రీ.పూ. 329 నాటికి పర్షియా సామ్రాజ్యాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకొన్నాడు. ఆపై హిందూకుష్ పర్వతాలు దాటి భారతదేశంలోకి అడుగుపెట్టాడు. అశ్వాయన, అష్మకస్, మాళవ లాంటి స్థానిక తెగలు అలెగ్జాండర్‌ను ప్రతిఘటించాయి. అశ్వాయనులతో జరిగిన యుద్ధంలో అలెగ్జాండర్ గాయపడ్డాడు. అయినా యుద్ధం చేశాడు. మాళవుల కోట గోడ ఎక్కుతుండగా బాణం తగిలి అలెగ్జాండర్ గాయపడ్డాడు. దాంతో ఉద్రిక్తులైన సైనికులు కోటలోని వారందరినీ చంపి మాళవుల్ని లొంగతీసుకొన్నారు.

ఆపై పదపల్లో సింధునదిని దాటి వాయవ్య ఉత్తర భారత్‌లోకి అడుగుపెట్టాడు. నేటి పాక్‌లోని నాటి తక్షశిల పాలకుడు అంభి కాస్తా అలెగ్జాండర్‌కి లొంగిపోయాడు. కానీ పంజాబ్ ప్రాంత పాలకుడు పురుషోత్తముడు ఎదురు తిరిగాడు.

పురుషోత్తముడిపై యుద్ధం ప్రకటించాడు. జీలం నదికి వరదలు రావడంతో అక్కడే కొన్ని వారాల పాటు మకాం వేశాడు. చివరికి ఓ రాత్రి చీకటిలో నదిని దాటి, పురుషోత్తముడిపై లంఘించాడు. అదే క్రీ.పూ.326లో జరిగిన హైడాస్పస్ యుద్ధం.

ఈ యుద్ధంలో పురుషోత్తముడు తీవ్రంగా గాయపడ్డాడు. అయినా భయపడలేదు. లొంగిపోలేదు. పోరాడుతూనే ఉన్నాడు. అది నచ్చింది అలెగ్జాండర్ కి! ఓడిన పురుషోత్తముడికే తిరిగి రాజ్యాన్ని ఇచ్చేశాడు. సరిహద్దు ప్రాంతాల్నీ కట్టబెట్టాడు. కానీ ఈ యుద్ధంలో అలెగ్జాండర్ గుర్రం బుసిఫేలస్ చనిపోయింది. దాని స్మృత్యర్థం జీలం నది ఒడ్డున 'బుసిఫేలా' పట్టణాన్ని నిర్మించాడు. కొంత కాలానికి తన ఆప్తుడు హెఫాస్టన్ మరణించాడు. ఇది అలెగ్జాండర్‌ని బాగా కుంగదీసింది. ఏళ్ల పాటు ఇళ్లకు దూరంగా ఉన్న సైనికులు కూడా ఇక యుద్ధం చేయలేమన్నారు.

ఇంకా భారతదేశంలోకి చొచ్చుకుపోవాలన్న ఆలోచన విరమించుకొన్నాడు అలెగ్జాండర్. తిరుగు ప్రయాణమయ్యాడు. ఇరాక్ చేరాక తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. క్రీ.పూ 323 జూన్ 11న మరణించాడు. - 32 ఏళ్లకే!

ముగ్గురు భార్యల్ని కట్టుకొని, 20 యుద్ధాలు చేసి, 60కి పైగా ప్రాంతాల్ని జయించి, అనూహ్యమైన సంపద పోగేసి అలెగ్జాండర్ ఏం చేశాడు? తన రెండు చేతుల్ని బయటనే ఉంచి శవాన్ని పాతి పెట్టమన్నాడు! తానేమీ పట్టుకుపోవడం లేదన్నాడు! పోరాటం చేయమంటుంది అలెగ్జాండర్ జీవితం! ఆరాటం వద్దంటుంది అలెగ్జాండర్ మరణం! అర్థం చేసుకున్నవారికి అర్థం చేసుకున్నంత!!



● ఆకెళ్ల రాఘవేంద్ర

జ్ఞాపకశక్తిని నిలబెట్టే 'ఆలివ్'

ప్రకృతి వరం

వయసు పెరిగే కొద్దీ శరీరంలోని వివిధ భాగాలు క్షీణించడం సహజ పరిణామమే. అయితే, ఆ పరిణామాన్ని పూర్తి స్థాయిలో నియంత్రించడం ఎవరి వల్లా కాదు. కాకపోతే ఆ క్షీణించే వేగాన్ని బాగా తగ్గించే అవకాశాలు మాత్రం ఉన్నాయి. ప్రకృతి సిద్ధమైన కొన్నింటి ఆధారంగా ఆ నియంత్రణ సాధించవచ్చు. మెదడు కణాల క్షీణతా వేగాన్ని తగ్గించే శక్తి, ఆలివ్ నూనెలో పుష్కలంగా ఉంది. నూనె అనగానే కొవ్వు, కొలెస్ట్రాల్ పెరిగిపోతాయంటూ, చాలా మంది వాటికి దూరంగా ఉండాలనుకుంటారు. ఒకవేళ ఆ కారణంగా ఎవరైనా వంటల్లో నూనె వాడకాన్ని బాగా తగ్గించివేస్తే, నరాలన్నీ పెళుసుబారిపోయే ప్రమాదం ఉంది. ఆ క్రమంలో కేంద్ర నాడీ వ్యవస్థ అంటే మెదడు కూడా క్షీణిస్తుంది. ఇతర నూనెల మాట ఎలా ఉన్నా, ఈ క్షీణతా వేగాన్ని తగ్గించడం మాత్రం ఆలివ్‌నూనెతో సాధ్యమవుతుంది. ఎందుకంటే మెదడు ఆరోగ్యంగా ఉండడానికి దాదాపు 60 శాతం ఆరోగ్యవంతమైన ఫ్యాట్స్ అవసరం. ఇవి ఆలివ్ నూనెలో సమృద్ధిగా ఉన్నాయి. గింజధాన్యాలు, అవకాడో, నువ్వులనూనెలోనూ ఈ ఫ్యాట్స్ ఉన్నాయి, కాకపోతే ఆలివ్ నూనెలోని ఫ్యాట్స్‌కు కణజాలాల్లోకి వెళ్లే శక్తి చాలా ఎక్కువ. ఈ ఫ్యాట్స్‌కి మెదడు కణాల మెంబ్రేన్ దెబ్బ తినకుండా నిలబెట్టే శక్తి ఉంది. ప్రత్యేకించి, వార్ధక్యం కారణంగా మెదడు కణాలు క్షీణించి, జ్ఞాపకశక్తి దెబ్బతినే పరిస్థితి నుంచి ఈ ఫ్యాట్స్ బాగా రక్షిస్తాయి. ఇటీవల విడుదల అయిన 'టాక్సికాలజీ అండ్ అప్లైడ్ ఫార్మకాలజీ' అనే జర్నల్‌లో ఈ విషయాలు తెలిపే ఒక వ్యాసం ప్రచురితమైంది, మెదడులోని న్యూరాన్లను దెబ్బ తీయడం ద్వారా అల్జీమర్ వ్యాధి కారకమయ్యే హానికారక ప్రొటీన్‌ల నుంచి ఆలివ్‌నూనెలోని ఆలియోకాంథల్ అనే మూలకం కాపాడుతుందని ఆ జర్నల్‌లో స్పష్టంగా పేర్కొన్నారు.



మీకు మీరే డాక్టర్



అశ్వగంధతో లాభాలెన్నో...

- అశ్వగంధ వేళ్లను ముక్కలుగా చేసి, వాటిని నేతిలో వేసి కాచి, ఆ నేయిని పూటకు రెండు తులాల మోతాదులో ప్రతి రోజూ మూడు పూటలా తీసుకున్నా లేదా ఆ నేతిని అన్నంలో కలిపి తింటూ ఉన్నా, కీళ్ల నొప్పులు, నడుము నొప్పి తగ్గుతాయి. నరాలు శక్తివంతమవుతాయి.
- అశ్వగంధ చూర్ణాన్ని వెన్నపూసలో కలిపి, ప్రరోజూ ఉదయం, సాయంత్రం సేవిస్తూ ఉంటే, జుత్తుకు సంబంధించిన పలు సమస్యలు తొలగిపోతాయి. వెంట్రుకల్లోని పెళుసుదనం పోయి, మృదువుగా మారడంతో పాటు ఒత్తుగా పెరుగుతాయి.
- ప్రతి ఏటా రెండు మాసాల పాటు అశ్వగంధ చూర్ణాన్ని వాడితే, చక్కని ఆరోగ్యంతో పాటు, నిండు యవ్వనం వారి సొంతమవుతుంది.
- అశ్వగంధ చూర్ణానికి సమానంగా దానిమ్మ చూర్ణం పొడిని సమానంగా కలిపి, భోజనం తర్వాత ఒక స్పూను పొడి తేనెతో కలిపి నెలరోజుల పాటు తీసుకుంటే వీర్య వృద్ధి కలుగుతుంది.
- 4 గ్రాముల అశ్వగంధ చూర్ణాన్ని తేనె, నెయ్యితో కలిపి పాలతో తీసుకుంటూ ఉంటే వృద్ధాప్యంలో కూడా శరీరం పుష్టిని పొందుతుంది.
- ఒక తులం అశ్వగంధ చూర్ణాన్ని నెయ్యి, చక్కెరతో కలిపి సేవిస్తూ, ఆ పైన కప్పు పాలు తాగితే చక్కని నిద్ర పడుతుంది.
- అశ్వగంధ చూర్ణాన్ని పాలు, నువ్వులనూనె, నెయ్యి, గోరువెచ్చని నీరు వీటిలో ఏదో ఒక దానితో సేవిస్తూ ఉంటే బాగా బక్కచిక్కిన పిల్లలు సైతం బలంగా తయారవుతారు.
- రెండు స్పూన్ల చూర్ణాన్ని పాలతో తీసుకుంటే, పసిపిల్ల తల్లులకు పాలు వృద్ధి అవుతాయి.
- అశ్వగంధ చూర్ణం, శుద్ధి చేసిన పటిక సమపాళ్లలో తీసుకుని కలిపి, ఒక స్పూను మోతాదులో రోజుకు రెండు సార్లు రుతు సమయంలో తీసుకుంటే తెల్లబట్ట తగ్గుతుంది.

సింగర్ స్పెషల్

ఆయన... '2050' అని పిలుస్తారు!

మనసు చేరుకోవాలనుకునే గమ్యం ఒకటుంటుంది. దారులు మాత్రం చాలానే ఉంటాయి. ఒక్కో మార్గం ఒక్కో అనుభూతిని పరిచయం చేస్తుంది. వాటన్నిటిని దాటుకుని వెళ్తే తీరం ఆహ్వానిస్తుంది. స్వీకార్ అగస్తి జీవితం ఇందుకు కచ్చితమైన ఉదాహరణ. ర్యాప్ లిరిసిస్ట్‌గా, సింగర్‌గా, ప్రోగ్రామర్‌గా తనదైన ముద్రతో సంగీత రంగంలో ప్రయాణం చేస్తున్న స్వీకార్ అగస్తి మనసులోని అభిప్రాయాల మాలిక..



స్వీకార్ అగస్తి

మా స్వస్థలం మచిలీపట్నం. నాన్న సాయినాథ్‌బాబు అగస్తి లాయర్. అమ్మ పద్మజ గృహిణి. నేను పుట్టి పెరిగింది అంతా విజయవాడలోనే. ఎటువంటి సంగీత నేపథ్యం లేని కుటుంబం మాది. మాటలు సరిగ్గా రాని వయసు నుంచీ శ్రుతిలో ఏవో రాగాలు తీసేవాడినని అమ్మ చెబుతుంటుంది. తొమ్మిదేళ్ల వయసు వచ్చాక స్కూల్లో స్నేహితులు, అల్లరి పెరగడం గమనించిన అమ్మ ఇవన్నీ ఎందుకని, అదనంగా ఇంకేదన్నా హాబీగా ఉండాలని సంగీతం క్లాసులో చేర్చారు. శ్రీమతి హైమావతి, యశోదర, భారతిగారు కర్ణాటక క్లాసికల్ గురువులు. హిమాంగినేని హిందూస్థానీ గురువు. వాయిద్యాల పరంగా మొదట కీబోర్డ్, డ్రమ్స్ నేర్చుకోమన్నారు. గిటార్ అంటే ఇష్టమని అదే నేర్చుకుంటానని చెప్పా. సుధాకర్‌గారి దగ్గర గిటార్ నేర్చుకుని ఇంటర్ కాలేజీలో రాక్‌బ్యాండ్ ఫామ్ చేశా. సంగీతమే నా కెరీర్ అనుకుని ఇంకేదో నేర్చుకోవాలని అందుకు చెన్నై ఆయితే మంచిదని ట్రైన్ ఎక్కేశా. అక్కడ నాకేం అర్థం కాక మళ్లీ విజయవాడ వచ్చేశా. 'భవిష్యత్తు గురించి ఆలోచించు. సంగీతం నేర్చుకుంటూనే ఏదన్నా గ్రాడ్యుయేషన్ చెయ్యి' అని నాన్న చెప్పారు.

అందుకే రాక్ బ్యాండ్ కొనసాగిస్తూనే విజయవాడలో లా కాలేజీలో చేరి, చెన్నైలో ఆడియో ఇంజనీరింగ్ నేర్చుకున్నా. సుధీర్ తతవర్తి అప్పటి నా గురువు. జాతీయ స్థాయి పోటీల్లో ఫోక్, లైట్ మ్యూజిక్, వెస్టర్న్ వోకల్స్‌లో పాడి ఎన్నో బహుమతులు గెలుచుకున్నా. ఆ తర్వాత హైదరాబాద్ వచ్చేశా. అగ్గిపెట్టి లాంటి ఓ గది అద్దెకు తీసుకుని అందులోనే ప్రాక్టీస్ చేసేవాడిని. ఇంటి నుంచి డబ్బులు తెచ్చుకోకూడదని స్నేహితుల సహకారంతో డివోషనల్ ఆల్బమ్స్, వోకల్స్ పాడటం స్టార్ట్ చేశా. హైదరాబాద్ సినిమాలకు డబ్బింగ్, వాయిస్ ఓవర్ కూడా చెప్పేవాడిని.

అది తప్పనిసరి...

నేను అన్నగా భావించే సీనియర్ డ్రమ్మర్ నాని పిలిచి ఆడియో ఇంజనీర్‌గా పెట్టుకున్నారు. అలా ఒక్కో ప్రాజెక్ట్ రావడం స్టార్ట్ అయింది. ఆ స్టూడియోలో ఇద్దరు సింగర్స్ పాడే విధానాన్ని గమనిస్తూ.. నాకున్న నాలెడ్జ్‌తో వారు తప్పు పాడుతుంటే కరెక్ట్ చెయ్యడంతో ఆ పాట సగం నాతోనే పాడించారు. ఆ పని పూర్తయ్యాక బయటికొస్తూ 'ఏది ఏది కుదురేది' పాట పాడకుంటూ బయటికొస్తుంటే ఓ మ్యూజిక్ డైరెక్టర్ ఆపి 'ఇప్పుడు హమ్ చేసింది మీరేనా వాయిస్ బావుంది. నా సినిమాలో పాడతారా అనడిగారు. అదే 'సెకెండ్ హ్యాండ్' సినిమా. అందులో రెండు పాటలు, రాప్ పాడా. బాగా పాడుతున్నానని సురేశ్ బొబ్బిలి పిలిచి అవకాశం ఇచ్చారు. అప్పటి నుంచీ ఆయన ప్రతి రికార్డింగ్‌లోనూ నేను భాగమవుతూ వచ్చా.

ఆ కాల్ జీవితాన్ని మార్చేసింది...

మణిశర్మగారి దగ్గర పనిచేస్తున్న నా స్నేహితుడు నరేంద్ర నా గురించి ఆయనకు చెబితే... సాగర్ నన్ను పిలిచి ట్యూన్ ఇచ్చి పాడమన్నారు. ఆ తర్వాత మణిశర్మగారి స్టూడియో నుంచి రికార్డింగ్ ఉందంటూ ఫోన్ వచ్చింది. 'దూసుకెళ్తా'లో '2010 సమ్మర్‌లో...' పాట పాడించారు. ప్లేబ్యాక్ సింగింగ్ ఆ పాటతోనే ప్రారంభమైంది. 'నాన్నగారికి వాయిస్ నచ్చింది. నీ పాటే ఫిక్స్' అని చెప్పాడు సాగర్. అలాగే ఆయన స్టూడియోలో ఆడియో ఇంజనీర్‌గా కూడా పని చెయ్యమని అడిగారు. అంతకన్నా ఆనందం ఇంకేం ఉంటుంది. బయట పదిచోట్ల పాడితే డబ్బులొస్తాయి. మణిశర్మగారి దగ్గర చేరితే విద్య వస్తుంది. నాకు విద్యే ముఖ్యం అనుకుని వెంటనే ఆయన దగ్గర చేరిపోయా. ఆడియో ఇంజనీర్‌గా రెండేళ్లు చేసి మానేశా. ప్రస్తుతం అదే స్టూడియోలో పాడుతున్నా, ప్రోగ్రామింగ్ చేస్తున్నా. మ్యూజిక్‌కి సంబంధించి నా దగ్గరున్న సాఫ్ట్‌వేర్ చూసి సాగర్ షాకయ్యాడు. 'జెంటిల్‌మెన్'లో 'అలజడి' పాటకు రఫ్ ప్రోగ్రామ్ చేశా. అది మణిగారికి నచ్చింది. 'వాడిని కూడా సర్దుకోమన్రా చెన్నైకి' అని సాగర్‌కు చెప్పి నన్నూ చెన్నైకి తీసుకెళ్లారు. ఆ పాట ప్రోగ్రామింగ్ చెన్నైలో పూర్తయింది. అప్పటి నుంచి ఆయన దగ్గర ప్రోగ్రామర్‌గా స్థిరపడ్డా. నా వేగాన్ని, అడ్వాన్స్‌గా ఆలోచించే తత్వాన్ని బట్టి నన్ను '2050' అని పిలుస్తారాయన.

గుర్తింపు తెచ్చిన పాటలు
- హలాల (ఎక్స్‌ప్రెస్‌రాజా)
- బిపా అంబాని పిల్ల (లయన్)
- చెప్పవే బాలామణి (ఛలో)
- తకధిమి (అమీతుమీ)
- పిచ్చెక్కుంతుంది (ఒక్కక్షణం)

అది చాలా కష్టం...

'అలజడి', 'డింటకు డింటకు' (జెంటిల్‌మెన్), తకధిమి తాన (అమీ తుమీ), 'పిచ్చెక్కిపోతుంది' (ఒక్కక్షణం), 'కనులేమిటో' (ఫ్యాషన్ డిజైనర్) వంటి పాటలకు ప్రోగ్రామింగ్ నేనే చేశా. అనూప్‌గారి సంగీతంలో 'లొక్యం'లో 'తేరే బ్యూటిఫుల్ అంఖే' 'పింక్ లిప్స్' (ఇంగ్లిష్), ఓ మెరీ జానేజాన (ఒకలైలా కోసం), 'జరజర నవ్వరాదే' రాప్ (అఖిల్) లిరిక్స్ రాసి, రాప్ పాడాను. ఇండిపెండెంట్ మ్యూజిక్ కూడా చేస్తా. ఈ మధ్యనే సింగర్ మనీషా ఈరబత్తిని చేసిన 'అరెరే' మాష్‌అప్‌కి మేల్ వోకల్స్, ప్రోగ్రామింగ్ నేనే చేశా. మాష్‌అప్ చెయ్యడం అంత ఈజీ కాదు. 20, 30 పాటల్ని ఒక ఫ్లోలోకి తీసుకొచ్చి ట్యూన్‌కి తగ్గట్టు ఒకదాని తర్వాత ఒకటి కూర్చడం అనేది చాలా టఫ్ వర్క్. కానీ అది పూర్తయ్యాక వచ్చే మజా వేరుగా ఉంటుంది.

డైలీ సుడోకు - 122

	1				7	9		5
					9			8
	2		5				6	4
3						6		
	9		7		5		1	
		1						2
7	3				6		5	
1			9					
6		4	3				2	

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు-121 సమాధానం

7	8	6	3	4	9	5	2	1
5	1	4	8	2	7	3	6	9
9	2	3	6	5	1	4	7	8
3	5	8	4	9	6	2	1	7
4	7	2	5	1	8	6	9	3
1	6	9	7	3	2	8	5	4
8	9	1	2	6	3	7	4	5
2	3	5	1	7	4	9	8	6
6	4	7	9	8	5	1	3	2

ఆంధ్రజ్యోతి నవ్య చిత్రజ్యోతి
సోమవారం • 5 మార్చి 2018 10

శ్రీకారం...'శ్రీనివాస కల్యాణం'



నితిన్, రాశీ ఖన్నా

గత ఏడాది వరుసగా ఆరు విజయవంతమైన చిత్రాలను నిర్మించిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ తెరకెక్కిస్తోన్న తాజా చిత్రం 'శ్రీనివాస కల్యాణం'. 'దిల్' తర్వాత ఈ సంస్థలో నితిన్ హీరోగా నటిస్తున్నారు. సతీశ్ వేగేశ్న దర్శకుడు. రాశీ ఖన్నా, నందితా శ్వేత నాయికలు. ప్రకాశ్ రాజ్ కీలక పాత్రధారి. ఈ నెల 16న రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. జూన్‌కి సినిమాను పూర్తి చేసి జూలై చివరి వారంలో గానీ, ఆగస్ట్ మొదటి వారంలో గానీ విడుదల చేసేలా సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి మిక్కి జె.మేయర్ సంగీతాన్ని, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు. ఈ చిత్రానికి ఆర్ట్: రామాంజనేయులు, ఎడిటింగ్: మధు, లైన్ ప్రొడ్యూసర్ : బండి రత్నకుమార్, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: సతీశ్ వేగేశ్న.

లీకువీరులు సిగ్గుపడాలి



రజనీకాంత్

శంకర్ దర్శకత్వంలో రజనీకాంత్ నటించిన భారీ బడ్జెట్ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ '2.0' టీజర్‌ను ఎవరో ఇంటర్‌నెట్‌లో లీక్ చేశారు. టీజర్ పైరసీకి గురైంది. దీనిపై రజనీ చిన్న కుమార్తె సౌందర్య ట్విట్టర్‌లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "అధికారికంగా కంటెంట్ విడుదల చేయకముందు లీక్ చేయడాన్ని ఎంతమాత్రం సహించరాదు. ప్రోత్సహించకూడదు. చిత్రబృందం కృషిని, ప్రయత్నాలను, సెంటిమెంట్స్‌ని పట్టించుకోకుండా కొద్ది క్షణాల ఆనందం కోసం మనసు లేని వ్యక్తులు ఇటువంటి పనులు చేస్తారు. వాళ్ళు సిగ్గుపడాలి. పైరసీ చేయడం మానేయాలి. డిజిటల్ మీడియాను దుర్వినియోగం చెయ్యొద్దు" అని సౌందర్యా రజనీకాంత్ పేర్కొన్నారు. ఈ లీక్ గురించి చిత్రబృందం స్పందించలేదు.

నవ్వుల్ నవ్వుల్



అల్లరి నరేశ్

'అహనా పెళ్లంట', 'యాక్షన్ త్రీడీ', 'జేమ్స్ బాండ్' చిత్రాల తర్వాత అనిల్ సుంకర నిర్మాణంలో అల్లరి నరేశ్ హీరోగా ఓ సినిమా తెరకెక్కుతోంది. ఈ చిత్రం పూజా కార్యక్రమాలు ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమయ్యాయి. ఎటీవీ సమర్పణలో, ఎ.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తోంది. రామబ్రహ్మం సుంకర నిర్మాణ సారథ్యం వహిస్తున్నారు. పి.వి. గిరి దర్శకుడు. నరేశ్ నటిస్తోన్న 55వ చిత్రమిది. ఆద్యంతం వినోదాత్మకంగా రూపొందించనున్నారు. ఈ చిత్రానికి కెమెరా: నగేశ్, కళ: గాంధి, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: కిశోర్ గరికపాటి.

ఏం జరుగుతుందో...



నాగ అన్వేష్

నాగ అన్వేష్ హీరోగా 'ఏ నిమిషానికి ఏమి జరుగునో' సైన్స్ ఫిక్షన్ చిత్రం ఇటీవల హైదరాబాద్‌లో మొదలైంది. గణేశ్ క్రియేషన్స్ నిర్మిస్తోంది. షో టైమ్ స్టూడియోస్ సమర్పిస్తోంది. లండన్ గణేశ్, సి.హెచ్.వి. నాగేశ్వరరావు నిర్మాతలు. శ్రీకృష్ణ గొర్లె దర్శకుడు. నిర్మాతలు మాట్లాడుతూ "కథ చాలా బాగా వచ్చింది. తెలుగు తెరమీద కొత్త తరహాలో ఉంటుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి" అని అన్నారు. టైటిల్ చాలా బావుందని, క్లైమాక్స్ వరకు అంతా సస్పెన్స్‌గా ఉంటుందని హీరో చెప్పారు. "హైదరాబాద్, లండన్, ఫారెస్ట్‌లో మూడు షెడ్యూళ్లలో సినిమాను తెరకెక్కిస్తాం. సైన్స్ ఫిక్షన్ చిత్రమిది. 'పుష్పక విమానం', 'ఆదిత్య 369' తరహాలో సాగుతుంది" అని దర్శకుడు శ్రీకృష్ణ గొర్లె అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: భాస్కర్ సామల.



జయసుధ, జయప్రద, జీవిత, బాబూమోహన్, కృష్ణంరాజు, రాజశేఖర్, టి. సుబ్బరామిరెడ్డి, పి. సుశీల, జగపతిబాబు

శ్రీదేవి గొప్ప ధనవంతురాలు

- సంతాపసభలో టి. సుబ్బరామిరెడ్డి

"బోనీ కపూర్, శ్రీదేవిది ఎంతో అన్యోన్య దాంపత్యం. ఎప్పుడు ఎక్కడికి వెళ్ళినా వాళ్ళు కలిసే వెళ్ళేవారు. ఈ సందర్భంగా ముఖ్యమైన విషయం ఒకటి అందరికీ చెప్పాలి. శ్రీదేవి గొప్ప ధనవంతురాలు. నాకెలా తెలుసంటే... ఆ అమ్మాయి స్టార్‌గా ఉన్నప్పుడు వాళ్ళమ్మగారు జాగ్రత్తగా చెన్నైలో పెద్ద పెద్ద ప్రోపర్టీస్ కొన్నారు. అప్పుడప్పుడూ నాతో 'సార్... ఈ ప్రోపర్టీస్‌ని ఎవరికైనా డెవలప్‌మెంట్‌కి ఇవ్వాలా? అమ్మేసి హైదరాబాద్‌లో గానీ ముంబయ్‌లో గానీ ఇల్లు తీసుకోవాలా?' అనేవారు. శ్రీదేవి మరణించడానికి వారం ముందు ముంబయ్‌లో ఆమెను కలిశా. 'సార్... చెన్నైలో మా ఇంటికి 30కోట్లు ఇస్తామంటున్నారు. అది అమ్మేసి ఇక్కడ ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నా' అని చెప్పింది. ఏది ఏమైనా... మనం నిమిత్తమాత్రులం. జన్మిస్తారు, జీవిస్తారు, మరణిస్తారు. కొంతమంది మరణించినా శాశ్వతంగా చెరగని ముద్ర వేసుకుని జీవిస్తూ ఉంటారు. ఆ కోవకు చెందిన వ్యక్తి శ్రీదేవి" అని రాజ్యసభ సభ్యుడు, నిర్మాత, టి. సుబ్బరామిరెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయన అధ్యక్షతన శ్రీదేవి సంతాపసభ నిర్వహించారు. కృష్ణంరాజు మాట్లాడుతూ "సాధారణంగా చచ్చినవాళ్ళ కళ్ళు చారడేసి అంటారు. అంటే... 'పోయినతర్వాత ఎక్కువ పొగుడుతారు' అని. శ్రీదేవివి బతికుండగానే చారడేసి కళ్ళు. ఆవిడ గురించి ఎంత చెప్పినా తక్కువ చెప్పినట్టే అవుతుంది. ఆర్టిస్టుగా తను చేసిన కొన్ని కొన్ని పాత్రలను ఎవరూ చేయలేదు. ఎవరూ చేయలేరు అన్నట్టుగా చేసింది. గొప్ప నటి. మంచి సంస్కారం ఉన్న మనిషి" అన్నారు. గాయని పి. సుశీల మాట్లాడుతూ "దేవలోకం నుంచి వచ్చిన సుందరిలా శ్రీదేవి మన కళ్ళ ముందుకు వచ్చి... అందర్నీ మైమరపించి మళ్ళీ తన లోకానికి వెళ్ళినట్టుగా అనిపిస్తుంది. ఓ చిత్రంలో తనకు ఎనిమిదేళ్ళ వయసుప్పుడు పాట పాడాను. తర్వాత తను కథానాయికగా పరిచయమైన చిత్రంలోనూ పాడాను" అన్నారు. నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ "బోనీ కపూర్ నాకు స్నేహితుడు. శ్రీదేవిగారితో పెళ్ళైన కొన్నాళ్ళ తర్వాత ఫోన్ చేస్తే ఇంటికి రమ్మన్నాడు. వెళ్ళా. శ్రీదేవి మనకి దేవత. వాళ్ళింట్లో మాత్రం ఇల్లాలు. స్వయంగా టీ కప్పు ఇవ్వడానికి వస్తే... నిలబడి తీసుకోవాలనే ఫీలింగ్ వచ్చింది. ఆమె సంస్కారానికి మనసులోపల ఏడ్చా. ఆ రోజు నాతో అశ్వనీదత్‌గారు ఉన్నారు. కారులోకి వచ్చాక అతడితో అదే మాట చెప్పా. ఆమెను పెళ్ళి చేసుకున్న తర్వాత మొత్తం అందరూ బోనీ కపూర్‌ని దూరం పెట్టారు. వాళ్ళిద్దరూ 20 ఏళ్ళు ఏకాకులుగా నడిచారు. వాళ్ళ బంధాన్ని కుటుంబం ఒప్పుకోకపోవచ్చు... మరొకటి కావొచ్చు... కారణాలు ఏవైనా ఇవాళ అటువంటి కుటుంబానికి బోనీ దగ్గర కావాలని, పిల్లల్ని అందరూ వచ్చి అక్కున చేర్చుకుంటారని నమ్ముతున్నా" అన్నారు "శ్రీదేవిగారిని దేవుడు నటిగా పుట్టించాడు. ఆమె నటించింది. వెళ్ళిపోయింది" అన్నారు కోట శ్రీనివాసరావు. "రామానాయుడుగారు శ్రీదేవిని తెలుగు చలనచిత్ర పరిశ్రమకి దేవతను చేశారు. ఎన్టీ రామారావుగారు ఆమెను 'అనురాగ దేవత'ను చేశారు. అలాంటి అనురాగ దేవత నటిగా స్వర్ణోత్సవం జరుపుకోవలసిన వేళ ఇలా జరగడం బాధాకరం" అన్నారు పరుచూరి గోపాలకృష్ణ. "ఏదో తెలియని దుఃఖం. తెలుగు బిడ్డగా శ్రీదేవి ఎంతో సాధించింది. జీవితంలో ప్రతి అడుగులోనూ తనకు ఓ లక్ష్యం ఏర్పరుచుకుంది. ప్రతి మలుపులోనూ తెలియని సవాల్‌ని స్వీకరించింది. తనకు తనే పోటీగా ఉండేది. మేమిద్దరం 15 చిత్రాలు చేశాం. ప్రతి చిత్రంలోనూ మా ఇద్దరి మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండేది" అన్నారు జయప్రద. "తెలుగులో శ్రీదేవితో కలిసి సుమారు పది చిత్రాలు చేశా. నేను 'మా ఆంటీ, అంకుల్ కాకుండా నేను చూసిన ఫస్ట్ యాక్టర్ శ్రీదేవి. అప్పుడామెకు ఆరేళ్ళు. మా అమ్మగారు, ఆమె అమ్మగారు మంచి స్నేహితులు. మా చెల్లెలు సుభాషిణి, తనూ మంచి స్నేహితులు. వాళ్ళిద్దరూ బురఖాలు వేసుకుని సినిమాలకు వెళ్ళేవారు" అన్నారు జయసుధ. "మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) తరపున ఈ కార్యక్రమం ఏర్పాటు చేయాలనుకుంటున్న తరుణంలో టీఎస్సార్‌గారు 'నేను చేస్తా' అన్నారు. మహానటి కోసం ఎవరు చేస్తే ఏంటని సరేనన్నాం" అన్నారు శివాజీ రాజా. మహానటి సావిత్రికి, శ్రీదేవికి రీప్లేస్‌మెంట్ లేదని సీనియర్ నరేశ్ అన్నారు. శ్రీదేవి ఎక్కడికీ వెళ్ల లేదని, చిరస్థాయిగా ప్రేక్షకుల మనసుల్లో ఉంటారని సి. కల్యాణ్ చెప్పారు. శ్రీదేవి అమర్ రహే అని జగపతిబాబు నివాళులర్పించారు. శ్రీదేవి ఆత్మకు శాంతి చేకూరాలని బీవీఎస్ఎన్ ప్రసాద్, రేలంగి నరసింహారావు, రాజశేఖర్, బాబూ మోహన్, అలీ, సుమంత్, టీఎస్సార్ కుమార్తె పింకీరెడ్డి, శోభన కామినేని, ఉపాసన, అమల అక్కినేని, కవిత, నివేదా థామస్ తదితరులు ప్రార్థించారు.




అత్యాశకు అంతు ఉంటుందా?

- నయనతార

"సినిమాల్లో అడుగుపెట్టిన రోజు ఉన్న అజ్ఞానం, భయం, ఆందోళన ఇప్పుడు నాలో లేవు. ఇక్కడ నేను ఎంతో మంది గొప్పవారిని కలిశాను. దశాబ్దానికి పైగా కమర్షియల్ హీరోయిన్‌గా విజయవంతంగా సాగడం అంత తేలికైన పనికాదు. అయినా తేలిగ్గానే సక్సెస్ అయ్యాను" అని అంటున్నారు నయనతార. ఓవైపు పెద్ద హీరోల చిత్రాల్లో కమర్షియల్ నాయికగా నటిస్తూనే.. మరోవైపు కథకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంపిక చేసుకుని మెప్పిస్తున్నారు నయనతార. ఆమె మాట్లాడుతూ "నేను నటించిన సినిమా బాక్సాఫీస్ దగ్గర పెద్ద హిట్ అయినప్పుడు డబ్బులు పెట్టిన నిర్మాత ఎంతో సంతోషిస్తారు. నిర్మాత హ్యాపీగా ఉంటే మరికొన్ని చిత్రాలు తీస్తారు. ఇంకో పది మందికి ఉపాధి లభిస్తుంది. సినిమా విమర్శకుల ప్రశంసలు పొందినప్పుడు, ఆత్మీయులు ఫోన్ చేసి 'బాగా నటించావు' అని పొగిడినప్పుడు నటిగా నేను చాలా సంతృప్తి చెందుతాను. మరికొన్ని ప్రయోగాలు చేయడానికి నాకు కొత్త శక్తి వస్తుంది. పబ్లిక్ ఫంక్షన్లకు వెళ్లినప్పుడు అభిమానులు మెచ్చుకుంటే ఆనందంగా ఉంటుంది. గొప్ప గొప్ప కథలన్నిటినీ కథకులు నాకే చెబితే బావుంటుందనిపిస్తుంటుంది. అత్యాశకు అంతు ఉండదు కదా?" అని ఆమె అన్నారు.

పరిశ్రమలో మిగతా సమస్యల సంగతేంటి?

- తమ్మారెడ్డి భరద్వాజ



"డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్(డిఎస్‌పి)కి వ్యతిరేకంగా థియేటర్లు మూసివేయాలని తెలుగు చిత్ర పరిశ్రమ తీసుకున్న నిర్ణయం మంచిదే. అలాగే, దీనితో పాటు చిత్రపరిశ్రమలో కొన్ని సమస్యలున్నాయి. వాటన్నిటినీ తీసుకుని థియేటర్లు మూసేస్తే (సమ్మె చేస్తే) బాగుండేది. ఒక్క సమస్య కోసం మూసేస్తే? మిగిలిన సమస్యలు ఎవరు పరిష్కరిస్తారు?" అని దర్శక-నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ప్రశ్నించారు. "లేదంటే చిత్రపరిశ్రమలో ఈ సమస్య ఒక్కటే ఉందని ఎవరైనా చెప్పగలరా?" అంటున్నారాయన. దక్షిణాది (తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ) చిత్ర పరిశ్రమలు ఐకాసగా ఏర్పడి 'డిఎస్‌పి'లు వర్చువల్ ప్రింట్ ఫీజ్ (వీపీఎఫ్) తగ్గించాలని ఈ నెల 2 నుంచి థియేటర్లు బంద్ చేస్తున్న సంగతి తెలిసిందే. తొలిరోజు తెలుగు రాష్ట్రాలు, కేరళలో సంపూర్ణంగా బంద్ జరిగింది. తర్వాతి రోజు నుంచి తెలుగు రాష్ట్రాలలోని కొన్ని మల్టీప్లెక్స్‌లలో హిందీ, ఇంగ్లిష్ చిత్రాలను ప్రదర్శించడం ప్రారంభించారు. మిగతా రాష్ట్రాల్లోనూ ప్రదర్శనలు మొదలయ్యాయి. దీనిపై, చిత్ర పరిశ్రమలో సమస్యలపై తమ్మారెడ్డి భరద్వాజ 'చిత్రజ్యోతి'తో మాట్లాడారు. కొన్ని అంశాలను లేవదీశారు. వాటి గురించి ఆయన మాటల్లో....

మొదటి అంశం: అమెరికాలో వీపీఎఫ్ లేదు. మన దగ్గర వీపీఎఫ్ కొంత తగ్గించడం కాదు, వందశాతం తగ్గించాలి. అంత వరకూ కరెక్ట్. కానీ, అదొక్కటే సమస్య కాదుగా! ఇప్పుడు థియేటర్లలో 20 నిమిషాలు యాడ్స్ వేస్తున్నారు. వాటి ద్వారా వచ్చే డబ్బులను 'డిఎస్‌పి'లు తీసుకుంటున్నాయి. అందుకని, యాడ్స్ ప్రదర్శించే సమయాన్ని 8 నిమిషాలకు కుదించాలంటున్నారు. నేను ఏమంటానంటే... కంటెంట్ ఇచ్చేది నిర్మాత కాబట్టి సగం డబ్బులు నిర్మాతకు ఇచ్చి, మిగతా సగం థియేటర్లకు రావాలి. 'డిఎస్‌పి'లకు కంటెంట్ ట్రాన్స్‌ఫర్ చేయడానికి డబ్బులు ఇస్తున్నాం. అలాంటప్పుడు యాడ్ రెవెన్యూ వాళ్ళు ఎందుకు తీసుకుంటారు? యాడ్ రెవెన్యూలో సగం నిర్మాతకు వస్తే కొంతైనా లాభం చేకూరుతుంది

రెండో అంశం: 'బుక్ మై షో' ద్వారా ప్రేక్షకులు టికెట్ బుక్ చేసుకుంటే 15 రూపాయలు ఎక్కువ. అందులో యాభై శాతం థియేటర్‌కు వెళ్తోంది. నిజానికి, నిర్మాత థియేటర్ యాజమాన్యానికి రెంట్ ఇస్తున్నాడు. ప్రభుత్వం మెయింటెనెన్స్ ఛార్జీలు ఇస్తుంది. అందుకని, 'బుక్ మై షో' డబ్బులు నిర్మాతకు రావాలి. ఇటీవల 70 శాతం టికెట్‌లను దాని ద్వారానే విక్రయిస్తున్నారు. నిర్మాత థియేటర్‌కి ఎంత రెంట్ కడుతున్నాడో... అంత మొత్తం 'బుక్ మై షో' ద్వారా వస్తుంది. అసలు, ఎందుకు 15 రూపాయలు ఎక్కువ వసూలు చేస్తున్నారు? ఛాంబర్, నిర్మాతల మండలి తరపున ఒక ఆన్‌లైన్ బుకింగ్ పోర్టల్ ఓపెన్ చెయ్యొచ్చు కదా!

మూడో అంశం: జీఎస్టీ వల్ల త్వరలో టికెట్ రేట్లు పెరగబోతున్నాయ్. దీని గురించి ఒక్కరూ మాట్లాడడం లేదు. ఎందుకని? నగరాల్లో 28 శాతం జీఎస్టీ పెరగనుంది. 150 రూపాయలున్న టికెట్ రెటు రెండువందలు కానుంది. దీని వల్ల ప్రేక్షకులు చిన్న సినిమాలకు రావడం మానేసే ప్రమాదం ఉంది. అప్పుడు చిన్న చిత్రం చచ్చిపోతుంది.

నాలుగో అంశం: కొందరు నిర్మాతలు 'ఎల్ఎల్‌పి' అనే సంస్థను స్థాపించి పబ్లిసిటీ పేరుతో 28 కోట్లు తినేశారని టీవీల్లో వార్తలు వస్తున్నాయి. వాళ్ళు తినేస్తుంటే... నిర్మాతల మండలి ఏం చేస్తుంది? నిర్మాతల మండలిని కాదని వాళ్ళు సంస్థ పెడితే రెండేళ్ళ నుంచి ఏం చేస్తున్నారు? అది అబద్ధమైతే ఖండించాలి. నిజమైతే... అందుకు కారణమైనవారిని పరిశ్రమలో లేకుండా చేయాలి. నిర్మాతల మండలికి రావలసిన డబ్బును ఇతరులు తినడం కరెక్ట్ కాదు.

అందువల్ల, థియేటర్లు మూసి ఉన్నప్పుడే ఈ అంశాల గురించి చర్చించాలి. ఒక పరిష్కారాన్ని కనుగొనాలి. నేను చెప్పినవన్నీ కలిపితే ఇండస్ట్రీకి ఇంకా పెద్ద సమస్య. ఈ సమస్యలను వదిలేసి ఒక్క 'డిఎస్‌పి' అంశం గురించి మాత్రమే ఎందుకు? దక్షిణాది చిత్ర పరిశ్రమలు మద్ధతు పలుకుతున్నాయని చెబుతున్నారు కదా! 'డిఎస్‌పి'లు దిగివచ్చిన తర్వాత వీపీఎఫ్ తగ్గించి యాడ్ రెవెన్యూ, 'బుక్ మై షో' డబ్బులు నిర్మాతకు వచ్చేలా కృషి చేయాలని కోరుతున్నా. అలాగే, విరామ సమయాల్లో సినిమా ట్రైలర్లు ప్రదర్శించాలి. ఎలాగో థియేటర్లు మూశారు కాబట్టి అన్ని సమస్యలనూ ఒకేసారి పరిష్కరిస్తే మంచిది.



కావ్య థాపర్, రాహుల్

ప్రేమ - కుటుంబం!

ప్రముఖ ఫైట్ మాస్టర్ విజయ్ తనయుడు రాహుల్ హీరోగా వి.ఎస్. క్రియేటివ్ వర్క్స్ పతాకంపై ఓ చిత్రం రూపొందుతోంది. దివ్య విజయ్ నిర్మాత. దర్శకుడు రాము కొప్పుల మాట్లాడుతూ "టాకీ పూర్తయింది. మేకింగ్‌లో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా తెరకెక్కించాం. రాహుల్ వ్యావహారిక శైలికి తగ్గ కథ ఇది" అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ "మా దర్శకుడు ఈ చిత్రాన్ని చాలా బాగా డీల్ చేస్తున్నారు. ప్రేమ, కుటుంబ విలువలున్న చిత్రమిది. ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతుంది. రాహుల్, కావ్య థాపర్ జోడీ స్క్రీన్‌పై బావుంటుంది. మణిశర్మ అద్భుతమైన బాణీలను అందించారు. శ్యామ్ కె. నాయుడుగారి సినిమాటోగ్రఫీ సినిమాకు మరో ఎసెట్ అవుతుంది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను త్వరలోనే ప్రారంభిస్తాం" అని అన్నారు. రాజేంద్ర ప్రసాద్, మురళీ శర్మ, పవిత్రా లోకేష్, పోసాని కృష్ణమురళి, ఈశ్వరీరావు, రాళ్లపల్లి, సత్యం రాజేశ్, జోష్ రవి తదితరులు నటించిన ఈ చిత్రానికి ఎడిటింగ్: నవీన్ నూలి, ఫైట్స్: విజయ్, ఆర్ట్: చిన్నా, సాహిత్యం: శ్రీమణి, లైన్ ప్రొడ్యూసర్: రాజు ఓలేటి.

రూ.516 కోట్ల రుణాల మాఫీ

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో (ఏప్రిల్-సెప్టెంబరు) ప్రభుత్వరంగంలోని బ్యాంకులు 516 కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేశాయి. ఈ మొత్తం ఉద్దేశ పూర్వకంగా రుణాలు ఎగవేసిన 38 మంది రుణగ్రహీతలకు సంబంధించినవని ఆర్థిక మంత్రిత్వ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. రుణమాఫీ చేయడమంటే బ్యాంకులు ఈ మేరకు 100 శాతం తమ రాబడుల నుంచి కేటాయింపులు జరపడమన్నమాట. మాఫీ కారణంగా బ్యాంకులపై ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఈ మేరకు ఆయా బ్యాంకుల నిర్వహణ లాభం తగ్గిపోతుంది. ఉద్దేశపూర్వకంగా రుణాలు ఎగవేసిన వారు తమ బకాయిలను తిరిగి చెల్లించే అవకాశాలు చాలా తక్కువ. కాబట్టి ఈ మొత్తాన్ని భవిష్యత్‌లో బ్యాంకులే భరించాల్సి ఉంటుంది. గత ఏడాది మార్చినాటికి రుణగ్రహీతలు ఉద్దేశపూర్వకంగా ఎగవేసిన సొమ్ములో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 27 శాతంగా ఉంది.

రూ.20 వేల కోట్లతో మనీలా విమానాశ్రయం విస్తరణ

పెట్టుబడుల ప్రతిపాదనలు సమర్పించిన జీఎంఆర్-మెగావైడ్ కన్సార్షియం

హైదరాబాద్: ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలోని నినోయ్ అక్వినో అంతర్జాతీయ విమానాశ్రయ విస్తరణ ప్రాజెక్ట్ కోసం జీఎంఆర్-మెగావైడ్ కన్సార్షియం 300 కోట్ల డాలర్ల (సుమారు రూ.20,000 కోట్లు) పెట్టుబడుల ప్రతిపాదనలను సమర్పించింది. జీఎంఆర్-మెగావైడ్ కన్సార్షియం.. ఫిలిప్పీన్స్‌లో ఇప్పటికే మక్టన్-సెబు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. మనీలాలోని నినోయ్ అక్వినో అంతర్జాతీయ విమానాశ్రయం.. ప్రస్తుత రద్దీని తట్టుకోలేకపోతుండటంతో రీడెవలప్ చేయాలని ఫిలిప్పీన్స్ ప్రభుత్వం నిర్ణయించింది. నినోయ్ అక్వినో విమానాశ్రయం రీడెవలప్‌మెంట్ కోసం 300 కోట్ల డాలర్ల పెట్టుబడులతో ప్రతిపాదనలు సమర్పించినట్లు ఫిలిప్పీన్స్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు మెగావైడ్ తెలిపింది. ప్రస్తుతం ఈ విమానాశ్రయం నుంచి రోజుకు 730 విమానాలు కార్యకలాపాలు సాగిస్తుండగా దీన్ని 950-1,000 విమానాలకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపు ప్రయాణికుల సామర్థ్యాన్ని ఏటా 7.2 కోట్లకు చేర్చాలని భావిస్తోంది. ప్రస్తుతం ఈ విమానాశ్రయం ద్వారా ఏటా 3.2 కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. 300 కోట్ల డాలర్ల పెట్టుబడితో చేపట్టనున్న కార్యకలాపాల విస్తరణలో భాగంగా ఎయిర్‌సైడ్, టెర్మినల్ సహా ఇతరత్రా పనులు చేపట్టనున్నట్లు జీఎంఆర్-మెగావైడ్ కన్సార్షియం తెలిపింది. మూడు దశల్లో ఈ పనులను చేపట్టాలని చూస్తున్నట్లు పేర్కొంది. విమానాశ్రయాల నిర్వహణలో అపారమైన అనుభవం కలిగిన ప్రైవేట్ ఆపరేటర్‌కు నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని భావిస్తున్నట్లు మనీలా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ తెలిపింది. కాగా జీఎంఆర్-మెగావైడ్ కన్సార్షియం సారథ్యంలోని మక్టన్‌సెబు అంతర్జాతీయ విమానాశ్రయం ఫిలిప్పీన్స్‌లో రెండో అతిపెద్ద విమానాశ్రయంగా ఉంది. ఈ జాయింట్ వెంచర్ సంస్థలో జీఎంఆర్ గ్రూప్‌కు 40 శాతం వాటా ఉండగా మెగావైడ్‌కు 60 శాతం వాటా ఉన్నాయి.

బీమా రంగంలోనూ 'ఓఎన్‌జిసి' తరహా విలీనాలు !

ఒకే బీమా కంపెనీ ఏర్పాటు దిశగా యోచన

న్యూఢిల్లీ: సాధారణ బీమా రంగంలోనూ ఓఎన్‌జిసి తరహా ప్రయోగాన్ని ప్రభుత్వం అమలు చేసే అవకాశం కనిపిస్తోంది. ప్రభుత్వ రంగంలోని చిన్న చిన్న బీమా కంపెనీలను ముందుగా మంచి ఆర్థిక వనరులున్న మరో పెద్ద బీమా కంపెనీకి అప్పగించి, తర్వాత ఆ కంపెనీ షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. హెచ్‌పిసిఎల్ ఈక్విటీలో తనకున్న మెజారిటీ వాటా షేర్లను ప్రభుత్వం పుష్కలంగా నిధులున్న ఓఎన్‌జిసికి రూ.36,915 కోట్లకు విక్రయించింది. దీంతో ప్రభుత్వ ఖాతాకు భారీగా నిధులు లభించడంతో పాటు, ఆయిల్ రంగంలో బలమైన కంపెనీ ఏర్పడింది. ప్రభుత్వ రంగంలోని నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్, ఓరియంటల్ ఇండియా ఇన్సూరెన్స్.. మూడింటి దగ్గర ప్రస్తుతం రూ.5,860 కోట్ల వరకు మిగులు నిధులు, బ్యాంక్ బ్యాలెన్స్ ఉన్నాయి. ఇందులో అత్యధికంగా రూ.2,537 కోట్ల నిధులు ఓరియంటల్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ వద్ద ఉన్నాయి. మిగతా రెండు ప్రభుత్వ రంగ బీమా కంపెనీల వద్ద చెప్పుకోదగ్గ స్థాయిలోనే నిధులు ఉన్నాయి. దీంతో ప్రభుత్వం ఏ బీమా కంపెనీని ఏ కంపెనీకి అప్పగిస్తుందన్నది ప్రశ్నార్థకంగా మారింది. అవసరమైతే ఈక్విటీ షేర్ల మార్పిడి ద్వారానూ ఈ కంపెనీలను ముందు విలీనం చేసే అవకాశం ఉందని అధికారవర్గాలు చెబుతున్నాయి. దీంతో ప్రైవేట్ పోటీని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ రంగంలో బలమైన సాధారణ బీమా కంపెనీ ఏర్పడడంతో పాటు షేర్ల విక్రయం ద్వారా ప్రభుత్వ ఖజానాకి పెద్ద మొత్తంలో నిధులు సమకూరనున్నాయి.

ఆస్తులు విక్రయించకుండా 64 సంస్థలపై నిషేధం

▸▸ పిఎన్‌బి కుంభకోణం నేపథ్యంలో ఎన్‌సిఎల్‌టి ఆదేశం



న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి)లో 12,700 కోట్ల రూపాయల మోసానికి సంబంధించి దర్యాప్తు జరుగుతున్న నేపథ్యంలో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్(ఎన్‌సిఎల్‌టి) నుంచి సంచలన ప్రకటన వెలువడింది. 64 సంస్థలు తమ ఆస్తులను విక్రయించకుండా నిషేధిస్తూ ఎన్‌సిఎల్‌టి ఆదేశాలు జారీ చేసింది. ఇందులో పిఎన్‌బి మోసంలో ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీతోపాటు వారి సంస్థలు, బంధువులు, కొంత మంది వ్యక్తులు, కంపెనీలు, లిమిటెడ్ లయబిలిటీ పార్ట్‌నర్‌షిప్ (ఎల్‌ఎల్‌పి) సంస్థలు ఉన్నాయి. కంపెనీల్లో గీతాంజలి జెమ్స్, గిల్లి ఇండియా, నక్షత్ర బ్రాండ్స్, ఫైర్ స్టార్ డైమండ్, పార్ట్‌నర్‌షిప్ సంస్థల్లో సోలార్ ఎక్స్‌పోర్ట్స్, స్టెల్లర్ డైమండ్ ఉన్నాయి. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కంపెనీల చట్టం 2013లోని వివిధ సెక్షన్ల కింద దాఖలు చేసిన పిటిషన్ నేపథ్యంలో ఎన్‌సిఎల్‌టి ఎక్స్‌పార్టీ ఆదేశాన్ని జారీ చేసింది. పిఎన్‌బి కుంభకోణం నేపథ్యంలో గత నెల 23న కార్పొరేట్ మంత్రిత్వ శాఖ పిటిషన్‌ను ఎన్‌సిఎల్‌టి ముంబై బెంచ్ అత్యవసరంగా విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా 64 సంస్థలు ఆస్తులు విక్రయించకుండా నిషేధం విధించింది. ఈ మేరకు తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఆదేశాలు వర్తించే వ్యక్తులు, సంస్థలు తమ ఆస్తులను బదిలీ చేయడంగానీ, విక్రయించడంగానీ చేయరాదు. ఈ కేసులో ఈ నెల 26న మళ్లీ విచారణ జరగనుంది. ఈ రోజున సంస్థలు ట్రిబ్యునల్ ముందు హాజరుకావాల్సి ఉంటుంది. పిఎన్‌బిలో కుంభకోణం నేపథ్యంలో సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, తీవ్ర నేరాల పరిశోధనా కార్యాలయం (ఎస్‌ఎఫ్‌ఐఒ)లు దర్యాప్తు చేపడుతున్న విషయం తెలిసిందే. 110 కంపెనీలపై దర్యాప్తు జరపాలని గత నెలలో ఎస్‌ఎఫ్‌ఐఒను కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశించింది. వీటిలో కొన్ని స్టాక్ మార్కెట్లో నమోదైన కంపెనీలు కూడా ఉన్నాయి. 10 ఎల్‌ఎల్‌పిలకు మోదీ, చోక్సీలతో సంబంధం ఉన్నట్టు తెలుస్తోంది.

తగిన చర్యలు తీసుకుంటాం : మారిషస్

పిఎన్‌బిలో మోసానికి సంబంధించి వివిధ దేశాల నుంచి ఆర్థిక లావాదేవీల సమాచారాన్ని భారత ప్రభుత్వం కోరుతున్న నేపథ్యంలో మోసపూరిత లావాదేవీలతో సంబంధం ఉన్నట్టు తేలితే ఆయా సంస్థలపై తగిన చర్యలు తీసుకోనున్నట్టు మారిషస్ హామీ ఇచ్చింది. పిఎన్‌బిలో మోసం, ఇందులో ప్రధానంగా వినిపిస్తున్న నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీల గురించి మీడియా కథనాల ద్వారా తెలుసుకున్నట్టు మారిషస్ ఫైనాన్షియల్ సర్వీసుల కమిషన్ చెబుతోంది. బ్యాంక్ ఆఫ్ మారిషస్, మారిషస్ రెవెన్యూ అథారిటీ, ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్‌లతో కలిసి ఈ వ్యవహారాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు ఎఫ్‌ఎస్‌సి తెలిపింది. మారిషస్‌లో నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసులు, గ్లోబల్ బిజినెస్ సెక్టార్లను ఎఫ్‌ఎస్‌సి నియంత్రిస్తోంది.

డీఫాల్ట్ ప్రమోటర్లను బిడ్డింగ్ నుంచి నిషేధించాలి



దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం మెరుగైన క్రెడిట్ సంస్కృతిని సృష్టించాల్సిన అవసరం ఉందని యాక్సిస్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ శిఖాశర్మ పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇన్‌సాల్వెన్సీ ప్రొసీడింగ్స్‌లో భాగంగా తమ ఆస్తుల బిడ్డింగ్‌లో పాల్గొనకుండా డీఫాల్ట్ అయిన ప్రమోటర్లను నిషేధించాల్సిన అవసరం ఉందని ఆమె చెప్పారు. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్స్ (ఎన్‌సిఎల్‌టి)ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. చాలా కేసులు ఎన్‌సిఎల్‌టికి వెళుతున్నాయని, ఈ నేపథ్యంలో వాటి సామర్థ్యాలను పెంచాల్సిన అవసరం ఉందని పిటిఐ ఇంటర్వ్యూలో ఆమె పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. వ్యవసాయ రుణాల మాఫీకి సంబంధించి తరచూ వినిపిస్తోందని, ఈ నేపథ్యంలో తాము తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదని రైతులు భావిస్తుండటం వల్ల వ్యవసాయ రుణాల్లో ఎగవేతలు బాగా పెరిగిపోతున్నట్టు శిఖాశర్మ చెప్పారు.

రంగంలోకి సెబి

ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబి మరిన్ని చర్యలు తీసుకోనుంది. ఇందులో భాగంగా స్టాక్ మార్కెట్లో నమోదైన కంపెనీలు భారీ రుణ ఎగవేతల వివరాలను తప్పనిసరిగా తక్షణమే ప్రకటించాల్సి ఉంటుంది. కొన్నేళ్ల తర్వాత పంజాబ్ నేషనల్ బ్యాంకులో మోసం వెలుగుచూసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన సెబి ఆర్థిక మోసాలను ముందే పసిగట్టే విధంగా చర్యలు తీసుకోనుంది. కాగా ఈ ప్రతిపాదన ఈ నెల చివర్లో సెబి బోర్డులో చర్చకు వచ్చే అవకాశం ఉంది. అయితే ఎంత మొత్తం రుణం ఎగవేస్తే తెలియజేయాలన్న దానిపై ఇంకా ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని అధికారవర్గాలు చెబుతున్నాయి. కార్పొరేట్ గవర్నెన్స్‌కు సంబంధించి కోటక్ కమిటీ ఇచ్చిన నివేదికపైనా సెబి బోర్డు చర్చించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. లిస్టెడ్ కంపెనీల కార్పొరేట్ గవర్నెన్స్‌కు సంబంధించిన నిబంధనలను పూర్తిగా మార్చివేయాల్సిన అవసరం ఉందని ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కోటక్ సారథ్యంలోని కమిటీ నివేదించింది.

వాణిజ్య రుణాలపై దెబ్బ

పిఎన్‌బిలో కుంభకోణం నేపథ్యంలో వాణిజ్య రుణాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. రుణదాతలు ఈ రుణాల విషయంలో చాలా అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఏ బ్యాంకు కూడా లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌ఒయు) ఇవ్వడానికి సిద్ధంగా లేదని బ్యాంకర్లు చెబుతున్నారు. ఎల్‌ఒయు ద్వారా విదేశాల్లో నిధులు పొందడం కంపెనీలకు చాలా కష్టంగా మారిపోయిందని అంటున్నారు. న్యాయంగా వ్యాపారం చేసుకుంటున్న వారు కూడా ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోందని ఓ ప్రైవేట్ బ్యాంకర్ అన్నారు. ఈ కుంభకోణం నేపథ్యంలో దేశీయ ఎగుమతి/దిగుమతిదారుల నిధుల వ్యయం బాగా పెరిగిపోయినట్టు చెప్పారు. ఎల్‌ఒయు ఆధారిత రుణాల కోసం 0.1-0.3 శాతం వరకు, కొన్ని సందర్భాల్లో 0.5 శాతం వరకు అధికంగా చెల్లించాల్సి వస్తోందని మరో బ్యాంకర్ తెలిపారు.

5జి స్పెక్ట్రమ్ సిద్ధం చేస్తున్నాం

▸▸ టెలికాం కార్యదర్శి అరుణ సుందరరాజన్



బార్సెలోనా (స్పెయిన్): మొబైల్ హ్యాండ్‌సెట్లపై సెకనుకు వెయ్యి మెగాబైట్ల వేగంతో డౌన్‌లోడ్ చేసుకునేందుకు వీలు కల్పించే కొత్త తరం 5జి సర్వీసులను భారత్‌లో ప్రారంభించేందుకు వీలుగా స్పెక్ట్రమ్‌ను సిద్ధం చేస్తున్నామని భారత టెలికాం కార్యదర్శి అరుణా సుందరరాజన్ చెప్పారు. మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌లో పాల్గొనేందుకు ఆమె ఇక్కడకు వచ్చారు. తొలి దశలోనే 5జి సర్వీసులు ప్రారంభించిన దేశాల్లో ఒకటిగా భారత్ నిలవాలనుకుంటున్నదని ఆమె అన్నారు. 5జి సర్వీసులు ప్రారంభించడానికి వీలుగా 3500 మెగాహెడ్జ్, 26 గిగాహెడ్జ్ సామర్థ్యం గల ఇ, వి బ్యాండ్లలో స్పెక్ట్రమ్‌ను సిద్ధం చేస్తున్నామని ఆమె అన్నారు. ప్రస్తుతం దేశంలో 2600 మెగాహెడ్జ్ స్పెక్ట్రమ్‌పై 4జి సర్వీసులు అందిస్తున్నారు. అధిక ఫ్రీక్వెన్సీ గల బ్యాండ్‌తో సిగ్నల్ కవరేజ్ ప్రదేశం తగ్గినా టెక్నాలజీ ట్రెండ్ ప్రకారం డేటా పంపిణీలో వేగం పెరుగుతుంది. 700 మెగాహెడ్జ్ బ్యాండ్‌ను 5జి సర్వీసులకు ఉపయోగించుకునేలా ఇప్పటికే తగు మార్పులు చేశామని ఆమె తెలిపారు. 5జి సర్వీసుల ద్వారా ఆటోమెటెడ్ కార్లు, మారుమూల ప్రాంతాల్లో రోబోటిక్ సర్జరీకి, విద్య కార్యక్రమాల నిర్వహణకు టెలికాం కంపెనీలు ఇప్పటికే ప్రయోగాలు నిర్వహిస్తున్నాయి. వ్యవసాయ రంగంలో కూడా 5జి సర్వీసులు ఉపయోగించుకునేందుకు గల అవకాశాలను పరిశీలించాలని టెలికాం మంత్రి మనోజ్ సిన్హా టెక్నాలజీ కంపెనీలను కోరినట్టు అరుణ తెలిపారు.

5జిలో రానున్న అవకాశాలు అందిపుచ్చుకునేందుకు భారత్‌లోని అన్ని టెలికాం కంపెనీలు సమాయత్తం అవుతున్నాయని ఆమె అన్నారు. భారత్ అతి పెద్ద ఐటి మార్కెట్ అని, ఐటి సొల్యూషన్లు తయారుచేసేందుకు తాము సిడాట్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్టు దేశంలోని అతి పెద్ద చిప్‌సెట్ కంపెనీ ఒకటి ప్రకటించింది. టెలికాం గేర్ల తయారీదారులకు ప్రమాణాలు ఇంకా సిద్ధం చేయక ముందే హువే, ఎరిక్సన్, నోకియా, జడ్‌టిఇ, ఎన్‌టిటి, సామ్‌సంగ్ కంపెనీలు 5జి పరికరాల తయారీకి కృషిని వేగవంతం చేశారని ఆమె చెప్పారు. 5జి సర్వీసులకు అవసరం అయిన సాఫ్ట్‌వేర్ తయారీకి భారత సాఫ్ట్‌వేర్ కంపెనీలు కూడా సమాయత్తం అవుతున్నట్టు ఆమె తెలిపారు. 5జి స్పెక్ట్రమ్ వేలం ఎప్పుడనేది టెలికాం నియంత్రణ సంస్థ నుంచి సిఫారసుల అనంతరం ప్రభుత్వం నిర్ణయిస్తుందని ఆమె ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

వేగంగా ఆధార్ అనుసంధానం

మరింత గడువు కోరుతున్న అసోచామ్



న్యూఢిల్లీ : బ్యాంకు ఖాతాలు, మొబైల్ ఫోన్ కనెక్షన్లతో ఆధార్ అనుసంధాన ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఫిబ్రవరి నెలాఖరునాటికి 80 శాతం బ్యాంకు ఖాతాలు, 60 శాతం మొబైల్ ఫోన్ కనెక్షన్లు ఆధార్‌తో అనుసంధానమైనట్లు భారత విశిష్ట ప్రాధికార సంస్థ (యుఐడిఎఐ) అధికారి ఒకరు చెప్పారు. ఈ నెలాఖరులోగా ప్రతి ఒక్కరూ తమ బ్యాంకు ఖాతాలను, మొబైల్ ఫోన్ కనెక్షన్లను ఆధార్‌తో అనుసంధానం చేయించుకోవాలని ప్రభుత్వం గడువు విధించింది. ఆదాయ పన్ను చెల్లింపుదారులు కూడా ఈ గడువులోపే తమ ఆధార్-పాన్ నంబర్లు అనుసంధానం చేసుకోవాలి. బ్యాంక్ ఖాతాలను ఆధార్ నంబర్‌తో అనుసంధానం చేయడం వల్ల తప్పుడు గుర్తింపు పత్రాలతో జరిగే బ్యాంకు మోసాలకు తెరపడుతుందని అని యుఐడిఎఐ సిఇఒ అజయ్ భూషణ్ పాండే చెప్పారు.

దేశ పారిశ్రామిక, వాణిజ్య సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న అసోచామ్... ఆధార్‌తో అనుసంధాన గడువును మరింత పొడిగించాలని కోరింది. కనీసం ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో (పిఎస్‌బి) ఖాతాలున్న వారికైనా ఈ విషయంలో వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేసింది. పిఎన్‌బి కుంభకోణం నేపథ్యంలో ఇప్పుడు పిఎస్‌బిల సిబ్బందిలో ఎక్కువ మంది యుద్ధ ప్రాతిపదికన రుణ ఖాతాల పరిశీలనలో ఉన్నందున, ఆధార్ అనుసంధాన గడువు పొడిగించాలని కోరింది. చాలినంత మంది సిబ్బంది లేకపోవడంతో ఇప్పటికే ఆధార్ సంఖ్య అనుసంధానం కోసం అవసరమైన పత్రాలు సమర్పించిన ఖాతాదారులకూ కెవైసి కోసం వివరాలు సమర్పించాలని సందేశాలు వస్తున్న విషయాన్ని అసోచామ్ గుర్తు చేసింది.

10625 పైన మాత్రమే నెలకు ట్రెండ్ సానుకూలం

(మార్చి 5-9 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ఆస్ట్రో గైడ్

గత వారం నిఫ్టీ : 10458 (-33)

నిఫ్టీ గత వారం 10632-10447 నడుమ సంచరించి 33 పాయింట్ల నష్టంతో కనిష్ఠ స్థాయికి చేరువలో స్వల్ప నెగిటివ్ దృక్పథంలో క్లోజయింది.

- చంద్రుడు కుంభ, మీనరాశుల సంచార సమయంలో నిఫ్టీ 10613-10303 పాయింట్ల మధ్యన సంచరించి 303 పాయింట్ల పరిధి ఏర్పరచుకుంది. గత వారంలో గరిష్ఠ స్థాయిని స్వల్పంగా బ్రేక్ చేసి 10632 వరకు వెళ్లినా అదే స్థాయిల్లో క్లోజ్ కాలేదు. ఈ వారంలో ఈ రెండు స్థాయిల్లో ఏదైనా బ్రేక్ చేస్తుందేమో చూడాలి.
- స్వల్పకాలిక ట్రెండ్ చాలా బేరిష్‌గా మారింది. మధ్యకాలిక ధోరణిలో బుల్లిష్‌గాను, దీర్ఘకాలిక ధోరణిలో మరింత బుల్లిష్‌గాను ఉంది. 10625 పైన ముగిస్తే స్వల్పకాలంలో కూడా బుల్లిష్ అవుతుంది.
- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 10530, 10624, 10437, 10112 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- ప్రస్తుతం నిఫ్టీ 100, 200 డిఎంఎలకన్నా పైన ట్రేడవుతోంది. నిఫ్టీ 200 డిఎంఎ పైన ఉండడం 50 డిఎంఏ 200 డిఎంఎకన్నా పైకి రావడం (గోల్డెన్ క్రాస్) దీర్ఘకాలిక ట్రెండ్ బుల్లిష్‌గా ఉందనేందుకు సంకేతం.

బ్రేకౌట్ స్థాయి : 10625
బ్రేక్‌డౌన్ స్థాయి : 10250
నిరోధ స్థాయిలు : 10615, 10700 (10535 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు : 10310, 10240, 10165 (10385 దిగువన బేరిష్)

ఇన్వెస్టర్లకు సూచన

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు.

ప్రథమార్ధం నిస్తేజం

(సోమవారానికి)

తిథి : ఫాల్గుణ బహుళ చతుర్థి
నక్షత్రం : చిత్ర

పుష్యమి, అనూరాధ, ఉత్తరాభాద్ర నక్షత్ర జాతకులు, వృశ్చిక, మీన రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

ట్రెండ్ మార్పు వేళలు : 2.12; 3.17

ధోరణి : గ్రహగతులను బట్టి నిలకడగా ప్రారంభమై 9.50 వరకు అదే ధోరణిలో ఉంటూ 1.50 మధ్యలో నిస్తేజంగా ఉండి తదుపరి ముగింపు వరకు మెరుగ్గా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 10 గంటల సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 1.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 2 గంటల తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్‌చేసుకోవచ్చు.

నిరోధం : 10500, 10535
మద్దతు స్థాయిలు: 10420, 10385

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

గ్రహగతులివే..

- తులలోని చిత్త పాదం 3 నుంచి వృశ్చికంలోని జ్యేష్ఠ పాదం 3 మధ్యలో చంద్ర సంచారం
- కుంభంలోని పూర్వాభాద్ర పాదం 1-2 మధ్యలో రవి సంచారం
- మీనంలోని ఉత్తరాభాద్ర పాదం 1-3 మధ్యలో బుధ సంచారం
- మీనంలోని ఉత్తరాభాద్ర పాదం 1-2 మధ్యలో శుక్ర సంచారం
- వృశ్చికంలోని జ్యేష్ఠ పాదం పాదం4-ధనుస్సులోని మూల పాదం 1 మధ్యలో కుజ సంచారం
- ధనుస్సులోని మూల పాదం 4లో కర్కాటక నవాంశలో శని సంచారం
- తులలోని విశాఖ పాదం 3లో మిథున నవాంశలో బృహస్పతి సంచారం, ఈ వారంలో వక్ర గతి ప్రవేశం
- కర్కాటకంలో రాహువు, మకరంలో కేతువు ధనుస్సు, మిథున నవాంశల్లో సంచారం

రిలయన్స్ ఇండస్ట్రీస్

ఈ వారం మార్కెట్ స్ట్రాటజీలో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్)కు సంబంధించిన వ్యూహం ఇస్తున్నాం. ఇందులో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఫ్యూచర్ ఒక లాట్ 948 రూపాయల్లో కొనుగోలు చేయాలి. 1000 రూపాయల కాల్స్ రెండు లాట్లు 5.40 రూపాయల్లో షార్ట్ చేయాలి. దీనికి అదనంగా 980 రూపాయల పుట్ ఒక లాట్ 40.25 రూపాయల్లో కొనుగోలు చేయాలి. మార్చి నెల కాంట్రాక్టుల ముగింపు నాటికి రిలయన్స్ షేరు ధర 1,020 రూపాయల కంటే దిగువన ఎక్కడ ముగిసినా లాభం కచ్చితంగా 2,550 రూపాయల నుంచి 22,500 రూపాయల మధ్యన పొందవచ్చు. అంటే షేరు ధర తగ్గినా, నిలకడగా ఉన్నా లేదా పెరిగినా 1,020 (అధిగమించనంత వరకు) లాభం కచ్చితంగా పొందవచ్చు. ఒక వేళ షేరు ధర భారీగా పెరిగి 1,020 రూపాయలు దాటుతుంటే మాత్రం లాభనష్టాలతో సంబంధం లేకుండా వ్యూహం నుంచి బయటకు రావాలి.

– గొండాల రాంబాబు

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	72.00	విజయవాడ	73.00
కరీంనగర్	73.00	గుంటూరు	72.00
వరంగల్	72.00	ఒంగోలు	75.00
మహబూబ్‌నగర్	72.00	చిత్తూరు	68.00
కర్నూలు	72.00	నెల్లూరు	70.00
విశాఖపట్నం	78.00	అనంతపురం	67.00
గోదావరి	72.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.05		నెక్ (100 గుడ్లు)	
హైదరాబాద్	345.00	చిత్తూరు	378.00
వరంగల్	347.00	చెన్నై	385.00
విజయవాడ	340.00	నమక్కల్	370.00
గోదావరి	340.00	బెంగళూరు	370.00
విశాఖపట్నం	350.00	ముంబై	390.00

10500 ఎగువన అప్‌ట్రెండ్



నిఫ్టీ గత వారం 10630 వరకు వెళ్లి రియాక్షన్‌లో పడి వారం మొత్తానికి స్వల్ప నష్టంతో బలహీనంగా ముగిసింది. కాని మద్దతు స్థాయి 10300 పాయింట్ల పైనే ఉంది. గత నాలుగు వారాలుగా 10700-10300 మధ్య సైడ్‌వేస్, కన్సాలిడేషన్ ట్రెండ్‌లో ఉంది. టెక్నికల్‌గా స్వల్పకాలిక కరెక్షన్ స్థితి కొనసాగుతోంది. అమెరికన్ మార్కెట్ వారాంతపు సెషన్లలో బలహీనంగా ముగిసినందువల్ల నెగిటివ్ ట్రెండ్‌కే ఆస్కారం ఉంది. ఇప్పుడు కీలక మద్దతు స్థాయిల్లో మరో పరీక్షకు సిద్ధంకావచ్చు.



బుల్లిష్ స్థాయిలు

మైనర్ నిరోధం 10500పైన బలంగా క్లోజయితే మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమిస్తుంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ఈ కీలక స్థాయి కన్నాపైన కొద్ది రోజులపాటు కన్సాలిడేట్ కావాలి. ప్రధాన నిరోధం, టార్గెట్ 10630. ఆ పైన నిలదొక్కుకుంటే తదుపరి స్వల్పకాలిక ప్రధాన నిరోధం 10700. నాలుగు వారాల క్రితం ఏర్పడిన గరిష్ఠ స్థాయి ఇదే.

బేరిష్ స్థాయిలు

ప్రధాన మద్దతు స్థాయి 10400. ఇక్కడ రికవరీకి ఆస్కారం ఉంది. అంతకన్నా దిగువన క్లోజయితే ప్రధాన మద్దతు స్థాయి 10300 పాయింట్లు. గత నెల రోజులుగా ఈ స్థాయిలో రెండుసార్లు కనిష్ఠ స్థాయిని ఏర్పరచుకుంది.

బ్యాంక్ నిఫ్టీ: గత కొద్ది వారాలుగా 26000-25000 మధ్యన సంచరిస్తూ సైడ్‌వేస్ ధోరణి ప్రదర్శిస్తోంది. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం 25000 వద్ద కన్సాలిడేట్ కావాలి.

స్వల్పకాలిక వ్యూహం: ప్రస్తుత స్థాయిల్లో అప్రమత్తంగా వ్యవహరిస్తూ గట్టి స్టాప్‌లాస్‌తో ట్రేడర్లు స్వల్పకాలిక బై పొజిషన్లు పరిశీలించవచ్చు.

పాటర్న్: "ఏటవాలుగా దిగువకు కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్"కన్నా మార్కెట్ దిగువనే ఉండడం ట్రెండ్‌లో బలహీనతను సూచిస్తోంది. పాజిటివ్ ట్రెండ్ కోసం ఈ రేఖకన్నా పైకి రావాలి. 10700 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద బలాన్ని ప్రదర్శించినప్పుడే ట్రెండ్‌లో సానుకూలత ఏర్పడుతుంది. 10300 వద్ద ఏర్పడిన డబుల్ బాటమ్ వద్ద గట్టి మద్దతు ఉంది. తక్షణ అప్‌ట్రెండ్ ఆశల కోసం ఇక్కడ రికవరీ తప్పనిసరి. అలాగే ప్రస్తుతం మార్కెట్ కీలకమైన 20, 50, 100 డిఎంఎల వద్ద పరీక్షకు సమాయత్తం అవుతోంది. అప్‌ట్రెండ్ కోసం ఈ సూచికల కన్నా పైన రికవరీ తప్పనిసరి.

టైమ్: ఈ సూచిక ప్రకారం మంగళవారం తదుపరి రివర్సల్ ఉంది.

టెక్ వ్యూ

సోమవారం స్థాయిలు
నిరోధం: 10500, 10630
మద్దతు: 10400, 10300

■ వాసిరాజు సుందర్ రాజా
www.sundartrends.in



గత మూడేళ్లుగా రేసు గుర్రంలా పరుగెత్తిన దేశీయ స్టాక్ మార్కెట్ ప్రస్తుతం ఒక అడుగు ముందుకు ఒక అడుగు వెనక్కు అన్నట్లు సాగుతోంది. రెండు రోజులు లాభపడితే..మరో రెండు రోజులు నష్టాల్లోకి జారుకుంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో రిటైల్ ఇన్వెస్టర్లు ఎలాంటి వ్యూహాలు అనుసరిస్తే బాగుంటుందో 'బిజినెస్ ప్లస్' పాఠకులకు ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ ఎఎంసి మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ నిమేష్ షా వివరిస్తున్నారు.



మార్కెట్లో కరెక్షన్!

పెట్టుబడులపై జర జాగ్రత్త

ప్రపంచవ్యాప్తంగా దిద్దుబాటు

ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు దిద్దుబాటుకు (కరెక్షన్) లోనవుతున్నాయి. భారత స్టాక్ మార్కెట్‌పైనా ఈ ప్రభావం కనిపిస్తోంది. అయినా సంస్థాగతంగా చూస్తే మరో పదేళ్ల వరకు మన ఈక్విటీ మార్కెట్‌కు ఢోకా లేదని చెప్పొచ్చు. అంతర్జాతీయంగా చూస్తే ప్రస్తుతం మనం బుల్ మార్కెట్ మధ్యలో ఉన్నాం. ఇటీవల 10-15 రోజుల్లోనే డౌజోన్స్ ఇండెక్స్ దాదాపు 1000కి పైగా పాయింట్లు దూసుకు పోయింది. బడ్జెట్‌కు నెల రోజుల ముందు (జనవరిలో) వరకు దేశీయ స్టాక్ మార్కెట్ ప్రధాన ఇండెక్స్‌లు దాదాపు ఆరు శాతం పెరిగాయి. దీంతో జనవరిలోనే అంతర్జాతీయ మార్కెట్లు ఓవర్‌బాట్ పొజిషన్‌లోకి పోయాయి.

చెప్పడం కష్టమే..

2009 నుంచి 2018 వరకు అమెరికా స్టాక్ మార్కెట్ వరుసపెట్టి పరుగులు తీసింది. దీంతో ఇన్వెస్టర్లు ఉన్న సొమ్మంతా ఈక్విటీ షేర్లలోనే ఇన్వెస్ట్ చేశారు. ఇపుడు మార్కెట్ మళ్లీ దిద్దుబాటుకు లోనవుతోంది. దేశీయ స్టాక్ మార్కెట్లోనూ ఈ దిద్దుబాటు ఇంకా కొనసాగుతుందా? లేదా? అనే విషయం చెప్పాలంటే కష్టమే. మన దేశంలో ఇంకా ఎర్నింగ్స్ (రాబడులు) ప్రారంభం కాలేదని మా అభిప్రాయం. మరో ఏడాదిన్నర తర్వాత కానీ మన కార్పొరేట్ రంగం ఈ దశకు చేరుకోలేదు. అన్ని రంగాల్లో ఉత్పత్తి సామర్థ్య వినియోగం పెరిగితే తప్ప వచ్చే 18 నెలల్లో కార్పొరేట్ కంపెనీల లాభాలు పుంజుకోకపోవచ్చు.

పెట్టుబడి అవకాశాలు

భారత స్టాక్ మార్కెట్ ఇప్పటికీ ఇంకా ఆపసోపాలు పడుతోంది. ఈ దిద్దుబాటు మరెన్నాళ్లు కొనసాగుతుందో తెలియడం లేదు. అయినా మౌలిక సదుపాయాల కంపెనీలు, విద్యుదుత్పత్తి కంపెనీలు, ఐటి, ఫార్మా కంపెనీల షేర్లు ఇప్పటికీ ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. కాకపోతే ఈ షేర్లలో ఇన్వెస్ట్ చేసే ముందు ఇన్వెస్టర్లు కంపెనీ ట్రాక్ రికార్డ్, ఫండమెంటల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించి ఇన్వెస్ట్ చేయాలి. లేకపోతే చేతులు కాల్చుకునే అవకాశం ఉంది.

చవకేం కాదు

మార్కెట్ ఇటీవలి కాలంలో కొంత దిద్దుబాటుకు లోనైంది. అయినా విలువ (వాల్యుయేషన్)పరంగా చూస్తే మన మార్కెట్ చవకగా ఏమీ లేదు. ఇలాంటి సమయంలోనే పెట్టుబడుల వివిధీకరణకు కట్టుబడుతూ జాగ్రత్తగా వ్యవహరించాలి. రెండు మూడేళ్ల క్రితం స్టాక్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేసిన మదుపరుల్లో ఇప్పటికీ చాలా మంది మంచి లాభాల్లోనే ఉన్నారు. వాళ్ల దృష్టిలో ఈక్విటీ షేర్లలో పెట్టుబడి అంటే ఇప్పటికీ రిస్క్ లేని పెట్టుబడే. ఇది కొద్దిగా ఆందోళన పరిచే అంశం.

విలువపరంగా

విలువ (వాల్యుయేషన్)పరంగా చూస్తే స్మాల్, మిడ్ క్యాప్ కంపెనీల షేర్లు ఇప్పటికే అధిక ధరల దగ్గర ట్రేడవుతున్నాయి. వీటితో పోలిస్తే ఇపుడు లార్జ్ క్యాప్ కంపెనీలు షేర్లు కొద్దిగా ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. స్మాల్, మిడ్ క్యాప్ షేర్లతో పోలిస్తే వీటిల్లో ఆటుపోట్లూ తక్కువ కాబట్టి పెట్టుబడుల భద్రతకూ పెద్దగా ఢోకా ఉండదు.

మ్యూచువల్ ఫండ్స్

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే ఇన్వెస్టర్లు.. డైనమిక్ అసెట్ అలొకేషన్ ఫండ్స్, లార్జ్ క్యాప్ ఫండ్స్, క్రెడిట్ (డెట్) ఫండ్స్‌ను పరిశీలించటం మంచిది. పక్కా ఈక్విటీ పథకాలతో పోలిస్తే డైనమిక్ అసెట్ అలొకేషన్ ఫండ్స్ అత్యుత్తమం అని చెప్పవచ్చు. ఆయా ఆస్తుల లాభదాయక అంచనాలను బట్టి ఈ ఫండ్స్ ఈక్విటీ షేర్లతో పాటు రుణ పత్రాల్లోనూ ఇన్వెస్ట్ చేస్తాయి. దీంతో మార్కెట్ తీవ్ర ఆటుపోట్లకు లోనైనా ఇన్వెస్టర్ల పెట్టుబడులకు పెద్దగా నష్టం ఉండదు.

డెట్ ఫండ్స్

డెట్ ఫండ్స్‌పై ఆసక్తి ఉన్న మదుపరులు క్రెడిట్ ఓరియంటెడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసే విషయం ఆలోచించడం మంచిది. ఈ ఫండ్స్ మూలధన వృద్ధితో పాటు ఎప్పటికప్పుడు ఏదోలా రాబడులు వచ్చే మధ్యకాలిక రుణ పత్రాల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. అన్నిటికంటే ముఖ్యంగా ప్రస్తుత మార్కెట్ ఆటుపోట్లకు భయపడి క్రమానుగత పెట్టుబడి ప్రణాళిక (సిప్) పక్కనపెట్టొద్దు. ఎప్పటిలాగే ఈ పెట్టుబడులు కొనసాగించాలి.



భారత్ ఫోర్జ్



స్టీల్ ఫోర్జింగ్స్, క్రాంక్ షాఫ్ట్, ఫ్రంట్ యాక్సిల్స్, అసెంబ్లీ తదితర ఆటో విడిభాగాల తయారీలో నిమగ్నమై ఉన్న కంపెనీ ఇది. ప్రపంచంలో అతిపెద్ద ఫోర్జింగ్ కంపెనీల్లో ఒకటైన ఈ కంపెనీ సామర్థ్యం ఏటా 583 మెట్రిక్ టన్నులు. భారత్, జర్మనీ, స్వీడన్, ఫ్రాన్స్, అమెరికాలో మొత్తం పది మాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రాలను కలిగి ఉంది. మొత్తం రాబడిలో 45 శాతం ఇండస్ట్రియల్, 45 కమర్షియల్ వాహనాలు, 9 శాతం ప్యాసింజర్ వాహన విభాగాల నుంచి వస్తోంది. కాగా మొత్తం రాబడిలో భారత్ వాటా 44 శాతంగా ఉండగా అమెరికా వాటా 38 శాతం, యూరప్ వాటా 15 శాతం, ఆసియా పసిఫిక్ వాటా 3 శాతంగా ఉంది. మొత్తం రెవెన్యూలో 60 శాతం ఎగుమతుల నుంచే వస్తోంది. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో ఎగుమతుల ఆదాయం 61 శాతం మేర పెరిగి 781 కోట్ల రూపాయలకు చేరుకుంది. అమెరికా ట్రక్ తయారీదారుల నుంచి అత్యధిక రాబడి వస్తోంది. వాహనాల్లో ఉపయోగించే విడిభాగాల తయారీ రేంజ్‌ను పెంచుకోవటం ద్వారా మార్కెట్ వాటాను కూడా పెంచుకోగలిగింది. ఉత్తర అమెరికా దేశాల క్లాస్ 8 ట్రక్కుల విభాగం 10 నుంచి 12 శాతం వృద్ధి రేటును సాధిస్తుందని అంచనా. ఉత్తర అమెరికా చమురు, సహజ వాయువు మార్కెట్ పుంజుకుంటున్న నేపథ్యంలో ఆయిల్ డ్రిల్లర్స్‌కు విడిభాగాల సప్లయ్‌తో పాటు నాన్ ఆటో విభాగం నుంచి ఆర్డర్లు భారీగా ఉంటాయని అంచనా. ఇటీవల రక్షణ రంగం నుంచి రాబడి గణనీయంగా పెరిగింది.

30 కోట్ల రూపాయల పెట్టుబడితో ఎలక్ట్రికల్ వెహికల్ స్టార్టప్ కంపెనీ టార్క్ మోటార్‌సైకిల్‌లో 45 శాతం వాటాను ఈ ఏడాది జనవరిలో కొనుగోలు చేసింది. దీని ద్వారా ప్యాసింజర్ల వాహన విభాగానికి బల్క్ ఆర్డర్లు వస్తాయని అంచనా. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో వంద ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. ఇందులో లైట్ వెయిట్ టెక్నాలజీ (ఎల్‌డబ్ల్యుటి) తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు సన్నాహాలు చేస్తోంది. అల్యూమినియం, మెగ్నీషియంలతో తేలికపాటి పరికరాలను తయారు చేయనుంది. వీటిని ఆటోమొబైల్, ఏరోస్పేస్, ఇండస్ట్రియల్ విభాగాల్లో వినియోగించనున్నారు.

టెక్నికల్స్..

గత వారం ఈ షేరు ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిలో క్లోజైంది. 13 వారాల ఫ్లాట్ బ్రేకౌట్ జరిగిన తర్వాత రీటెస్ట్ చేసింది. గత వారం 50 వారాల సగటు వాల్యూమ్స్ కన్నా ఎక్కువ వాల్యూమ్స్‌తో కొత్త గరిష్ఠ స్థాయిలో క్లోజైంది. 200 డిఎంఎకు 20 శాతం ఎగువన షేరు ట్రేడవుతోంది. 50 డిఎంఎ ఎగువన స్థిరంగా గత 20 నెలలుగా ట్రేడవుతోంది. మూమెంటమ్ ఇండికేటర్లన్నీ బుల్లిష్ ధోరణిని ధ్రువీకరిస్తున్నాయి. ట్రెండ్ స్ట్రెంత్‌ను తెలిపే ఎడిక్స్ 27తో అప్‌ట్రెండ్ పటిష్ఠతను తెలుపుతోంది. విలియం ఓ నీల్ రిలేటివ్ ప్రైస్ స్ట్రెంత్ 75తో బలంగా ఉంది. పైవోట్ స్థాయికి ఐదు శాతంఎగువన ట్రేడవుతోంది. ఈ షేరును 750 రూపాయల నుంచి 790 రూపాయల మధ్యన అక్యుములేట్ చేసుకోవచ్చు. వచ్చే ఏడాది కాలానికి లక్ష్యం 1,005 రూపాయలు. టెక్నికల్ స్టాప్ లాస్ 650 రూపాయలు.

ఫండమెంటల్స్..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో అంచనాలకు మించిన ఫలితాలను ప్రకటించింది. రెవెన్యూ 47.4 శాతం పెరిగి 1,391 కోట్ల రూపాయలకు చేరుకుంది. దేశీయ మార్కెట్ నుంచి ఆదాయం 32.9 శాతం పెరిగి 577 కోట్ల రూపాయలకు పెరిగింది. ఎగుమతి ఆదాయం 61 శాతం వృద్ధితో 781 కోట్ల రూపాయలకు చేరుకుంది. అలాగే అన్ని సెగ్మెంట్లలోనూ గణనీయమైన వృద్ధి రేటును సాధించింది. దేశీయ ఆటో విభాగం నుంచి రాబడి 49 శాతం పెరిగి 322 కోట్ల రూపాయలకు చేరుకుంది. అంతర్జాతీయ ఆటో విభాగ రాబడి 44.7 శాతం వృద్ధి చెంది 322 కోట్ల రూపాయలకు చేరుకుంది. స్థూల లాభ మార్జిన్లు కూడా 2.33 శాతం పెరిగి 29.9 శాతానికి చేరుకున్నాయి. నికర లాభం 77.4 శాతం పెరిగి 228.20 కోట్ల రూపాయలకు చేరింది. గడచిన నాలుగేళ్లగా రిటర్న్ ఆన్ ఈక్విటీ 17 శాతానికి పైగా ఉంది. ఆర్ఒసిఇ గత ఆర్థిక సంవత్సరంలో 16.7 శాతంగా ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 23.2 శాతం, వచ్చే ఆర్థిక సంవత్సరానికి 29.5 శాతంగా ఉంటుందని అంచనా. 2017-18 ఆర్థిక సంవత్సరానికి ఇపిఎస్ 19.3 రూపాయలుగాను, 2018-19 ఆర్థిక సంవత్సరానికి 27.3 రూపాయలు సాధిస్తుందని అంచనా. ఇందులో అక్యుములేషన్ గత నాలుగు వారాలుగా పెరిగింది. సంస్థాగత ఇన్వెస్టర్ల వాటా 34.16 శాతం, మ్యూచువల్ ఫండ్స్ వాటా గత త్రైమాసికంలో 0.55 శాతం పెరిగి 7.82 శాతానికి చేరుకుంది. 471 ఎఫ్ఐఐలు ఈ షేరులో మదుపు చేశాయి.

టి బ్రహ్మాచారి
హెడ్, అసోసియేషన్ ఆఫ్ టెక్నికల్ మార్కెట్ ఎనలిస్ట్స్,
హైదరాబాద్ చాప్టర్
tbchary@gmail.com

గమనిక : ఈ శీర్షికలో అందించే రికమండేషన్ల ఆధారంగా జరిపే లావాదేవీలకు ఇన్వెస్టర్లదే పూర్తి బాధ్యత. వారి లాభనష్టాలకు ఆంధ్రజ్యోతి పత్రిక, కాలమిస్ట్ ఎలాంటి బాధ్యత వహించరు. లావాదేవీలు చేపట్టే ముందు మీ వ్యక్తిగత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ సలహా తీసుకోండి.

కాస్మోటిక్, ప్లాస్టిక్ సర్జరీకి

జిఎస్‌టి చెల్లించాల్సిందే..



రాంబాబు గొండాల



మన దేశంలో హెల్త్‌కేర్ రంగం ఈ మధ్య కాలంలో బాగా విస్తరించింది. దీనికి తగ్గట్టుగానే ఫార్మాసుటికల్ రంగం కూడా అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. భారత్‌లో తయారైన ఔషధాలు, బల్క్ డ్రగ్స్ దాదాపు ప్రపంచంలోని అన్ని దేశాలకు ఎగుమతి అవుతుండగా.. మన హాస్పిటల్స్‌లో వైద్య సేవలు పొందేందుకు విదేశాల నుంచి కూడా రోగులు వస్తున్నారు. మరి ఇంత ప్రాముఖ్యత సంతరించుకున్న హెల్త్‌కేర్ రంగానికి సంబంధించి జిఎస్‌టి ప్రభావం ఏమిటో తెలుసుకుందాం.

ఏ ప్రభుత్వమైనా ప్రజలందరికీ మెరుగైన వైద్యసేవలు అందించాలనే ప్రయత్నిస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆరోగ్య సంరక్షణకు వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)లో అత్యంత ప్రాధాన్యతను ఇచ్చారు. దీన్ని బట్టి ఏదేని ఒక క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లో అందించే అన్ని రకాల ఆరోగ్య సంరక్షణ సేవలకు జిఎస్‌టి నుంచి మినహాయింపు లభిస్తుంది. మరి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్, ఆరోగ్య సంరక్షణ సేవలు (హెల్త్‌కేర్ సర్వీస్) అంటే ఏమిటి?

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ అంటే ఏదేని ఒక వైద్యశాల అంటే హాస్పిటల్, క్లినిక్, నర్సింగ్ హోమ్ లేదా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసే లాబ్స్ మొదలైనవి. అలాగే హెల్త్‌కేర్ సర్వీస్ అంటే అన్ని రకాల వ్యాధులకు చేసే వైద్యం. అంటే ఏదేని ఒక హాస్పిటల్ పేషంట్‌కు అందించే మొత్తం వైద్యంతో పాటుగా ఒక మెడికల్ ప్రాక్టీషనర్, పారామెడికల్స్ అందించే వైద్య సేవలకు కూడా జిఎస్‌టి నుంచి మినహాయింపు ఉంది. అయితే ఈ వైద్యం మన దేశంలో గుర్తించిన వైద్య రంగాలకు చెందినదై ఉండాలి. అంటే అల్లోపతి, హోమియో, ఆయుర్వేద మొదలగునవి.

అలాగే అందం పెంచుకోవటానికి చేయించుకునే కాస్మోటిక్, ప్లాస్టిక్ సర్జరీ లేదా హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్వీస్‌లు ఈ కోవలోకి రావు. అంటే వీటికి జిఎస్‌టి నుంచి మినహాయింపు లభించదు. కాని, ఏదేని ట్రీట్‌మెంట్‌లో భాగంగా ఇవి చేయాలంటే మాత్రం మినహాయింపు లభిస్తుంది. ఉదాహరణకు అందం కోసం ఒక వ్యక్తి ముక్కుకో, మొహానికో ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుంటే మినహాయింపు లభించదు. ఒకవేళ అదే వ్యక్తి ఏదేని ప్రమాదానికి గురయి ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోవాల్సి వస్తే మాత్రం జిఎస్‌టి నుంచి మినహాయింపు లభిస్తుంది.

అలాగే ఏదేని ఒక వ్యక్తి హాస్పిటల్‌లో అడ్మిట్ అయినప్పుడు అతను చెల్లించే మొత్తం బిల్లు మీద అంటే చికిత్సతో పాటుగా రూమ్ రెంట్, డాక్టర్ కన్సల్టింగ్ చార్జీలు, అతనికి సమకూర్చే భోజనం, మందులు మొదలైన వాటి మీద జిఎస్‌టి నుంచి మినహాయింపు లభిస్తుంది. ఇవేకాకుండా అంబులెన్స్‌లకు సంబంధించి ఏదైనా సర్వీస్ పొందినా దానికి కూడా జిఎస్‌టి వర్తించదు. కాని, అదే వ్యక్తి ఔట్ పేషెంట్‌గా మందులు తీసుకుంటే మాత్రం జిఎస్‌టి వర్తిస్తుంది.

ఇకపోతే, హాస్పిటల్ పొందే సేవలు, కొనుగోలు చేసే వస్తు సామాగ్రి అంటే ఇన్ పేషెంట్స్ కోసం వాడే మందుల దగ్గర నుంచి హౌజ్ కీపింగ్, మెయింటెనెన్స్, హాస్పిటల్‌లో వాడే ఫర్నీచర్, ఆపరేషన్ థియేటర్‌లో వాడే ఎక్విప్‌మెంట్ , హాస్పిటల్‌లో ఉన్న మెడికల్ షాప్, కాంటీన్ నుంచి పొందే అద్దె, అలాగే హాస్పిటల్ భవన నిర్మాణం మొదలగు వాటికి మాత్రం జిఎస్‌టి నుంచి మినహాయింపు లేదు. అంటే ఒక హాస్పిటల్ ఏదేనీ పేషెంట్ నుంచి వసూలు చేసే బిల్లు మీద మాత్రమే జిఎస్‌టి నుంచి మినహాయింపు లభిస్తుంది.

జిఎస్‌టికి సంబంధించిన వీడియోలను https://goo.gl/bzX8s1 ద్వారా వీక్షించవచ్చు.

గమనిక : ఈ వ్యాసాల ద్వారా ఇస్తున్న సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమే. పాఠకులు ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత చట్టాలు/నిబంధనలను కూలంకషంగా పరిశీలించాలి.

ఐఏఎస్ ఇంజనీర్లు!

ఆలిండియా సర్వీసుల్లో సగంమంది ఇంజనీర్లే



- **60శాతం మంది ప్రభుత్వోద్యోగుల పిల్లలు**
- **మహిళల శాతంలో నిలిచిన పెరుగుదల**
- **గత రెండేళ్లలో తెలుగు రాష్ట్రాల నుంచి 46మంది ఎంపిక...**
- **తెలుగు మీడియం నుంచి ఇద్దరే**

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): గత నాలుగేళ్లుగా అఖిల భారత సర్వీసుల్లో ఒకే విధమైన ట్రెండ్ కొనసాగుతోంది. సివిల్స్‌కు ఎంపికవుతున్న వారి అర్హతలు, వారి సామాజిక, భౌగోళిక నేపథ్యాల్లో పెద్దగా మార్పేమీ లేకుండా యథాతథంగానే ఉంటున్నాయి. ఈ సర్వీసులకు ఎంపికవుతున్నవారిలో సగం మంది ఇంజనీరింగ్ విద్యను అభ్యసించిన వారు కాగా, దాదాపు 60శాతం మంది ప్రభుత్వోద్యోగుల పిల్లలే కావడం గమనార్హం. మహిళా అధికారుల సంఖ్య ఒక సంవత్సరం పెరుగుతూ, మరో సంవత్సరం తగ్గుతూ ఉన్నా సగటు పరంగా చూస్తే ఒకేలా ఉంటోంది. గత రెండేళ్లలో తెలుగు రాష్ట్రాల నుంచి 46 మంది సివిల్స్‌కు ఎంపికవగా.. వారిలో తెలుగు మీడియం ఎంచుకుంది కేవలం ఇద్దరే కావడం గమనార్హం. అఖిల భారత సర్వీసులకు 2017లో 369మంది ఎంపికవగా ఇందులో 56శాతం ఇంజనీర్లున్నారు. 2016, 2015, 2014 సంవత్సరాల్లోనూ మొత్తం అభ్యర్థుల్లో వీరి సంఖ్య 49.5 శాతం ఉంది. గత నాలుగేళ్లలో 2016 మినహా సివిల్స్‌కు ఎంపికైన డాక్టర్ల సంఖ్య 37 వద్ద స్థిరంగా ఉంది. 2016లోనే 61కి చేరింది. ఇంజనీర్ల తర్వాత స్థానాల్లో మెడిసిన్, ఆర్ట్స్ విద్యార్థులున్నారు. కాగా, ఆర్ట్స్, కామర్స్, ఇంజనీరింగ్‌ల్లోని మెనేజ్‌మెంట్ విభాగాలకు చెందిన విద్యార్థుల సంఖ్య ప్రతిఏటా సింగిల్ డిజిట్‌కే పరిమితమవుతోంది.

- 2017ం బ్యాచ్‌లో మొత్తం 369 మంది శిక్షణలో పాల్గొన్నారు. ఇందులో ఐఏఎస్‌లు 164మంది, ఐపీఎస్‌లు 44 మంది ఉన్నారు.
- 2016 బ్యాచ్‌లో ఏపీ నుంచి ఎంపికైనవారు 11మంది ఉన్నారు. ఇందులో ముగ్గురు మహిళలు. తెలంగాణ నుంచి 14 మంది ఎంపికయ్యారు. ఇందులో ఇద్దరు మహిళలున్నారు. అఖ్నఉగా యూపీ నుంచి 61 మంది ఉన్నారు.
- 2017 బ్యాచ్‌లో కూడా ఏపీ నుంచి 11మంది ఎంపికయ్యారు. ఇందులో ఒకే ఒక మహిళ ఉన్నారు. తెలంగాణ నుంచి ఎంపికైన 10మందిలో ఇద్దరు మహిళలున్నారు. ఈ బ్యాచ్‌లోనూ అత్యధికంగా యూపీ నుంచి 52మంది ఎంపికయ్యారు. వీరిలో 14మంది మహిళలున్నారు.
- గత నాలుగు బ్యాచ్‌లకు చెందిన అఖిల భారత సర్వీసు అధికారుల్లో జనరల్, ఓబీసీ కేటగిరీలకు చెందినవారు అధికంగా ఉన్నారు. మహిళలు, పురుషుల్లోనూ ఇదే ట్రెండ్ కొనసాగింది. ఎస్సీ, ఎస్టీ వర్గాలవారు చివరి స్థానాల్లో ఉన్నారు.
- 2014 బ్యాచ్‌కి చెందిన 282 మందిలో జనరల్ కేటగిరీ-134 మంది, ఓబీసీ-90, ఎస్సీలు-41, ఎస్టీలు-17 మంది ఉన్నారు.
- 2015 బ్యాచ్ శిక్షణలో 353 మంది ఉండగా, ఇందులో జనరల్ కేటగిరీ- 176 మంది, ఓబీసీ-100 మంది, ఎస్సీలు 54 మంది, ఎస్టీలు 23 మంది ఉన్నారు.
- 2016 బ్యాచ్‌లో 376 మంది ఉండగా, ఇందులో జనరల్ కేటగిరీకి చెందిన వారు 197 మంది ఉన్నారు. ఓబీసీ వర్గానికి చెందిన వారు 112 మంది, ఎస్సీలు 50 మంది, ఎస్టీలు 17 మంది ఉన్నారు.
- 2017 బ్యాచ్‌లో 369 మంది శిక్షణలో ఉండగా, ఇందులో జనరల్ కేటగిరీకి చెందినవారు 207 మంది ఉన్నారు. ఓబీసీలు 92 మంది, ఎస్సీలు 53 మంది, ఎస్టీలు 17 మంది ఉన్నారు.
- మహిళలు 2017 బ్యాచ్‌లో 102 మంది(28శాతం), 2016 బ్యాచ్‌లో 83మంది(22శాతం), 2015 బ్యాచ్‌లో 105మంది(30శాతం), 2014 బ్యాచ్‌లో 82 మంది(29శాతం) ఉన్నారు. వీరి సంఖ్యలో స్థిరమైన పెరుగుదల లేదు. గత నాలుగేళ్లలో అఖిల భారత సర్వీసుల్లో మహిళల సగటు 93 మాత్రమే.
- 2017 బ్యాచ్ శిక్షణలో ఉన్న అధికారుల్లో 26-30ఏళ్ల లోపు వారు 45శాతం మంది ఉండగా, 28శాతం మంది 22-26 ఏళ్ల లోపు, మరో 27శాతం మంది 30ఏళ్లకు పైబడిన వారు ఉన్నారు.
- 2016 బ్యాచ్‌లో 26-30 ఏళ్ల లోపు ఉన్నవారు 46 శాతం, 22-26 ఏళ్లు, 30ఏళ్లు దాటినవారు చెరో 27 శాతం చొప్పున ఉన్నారు.
- 2017 బ్యాచ్ శిక్షణ సమయంలో అధికారుల సగటు వయసు 27.97 సంవత్సరాలు కాగా, 2016లో 28.49 సంవత్సరాలు, 2015లో 27.59 సంవత్సరాలు, 2014లో 27.31 సంవత్సరాలుగా ఉంది.
- అఖిల భారత సర్వీసులకు ఎంపికైన అధికారుల్లో 2014 బ్యాచ్‌లో 83శాతం, 2015 బ్యాచ్‌లో 86శాతం, 2016 బ్యాచ్‌లో 64 శాతం, 2017 బ్యాచ్‌లో 72 శాతం పట్టణ ప్రాంతాలకు చెందినవారు ఉన్నారు.
- ఈ సర్వీసులకు ఎంపికవుతున్న వారిలో సగానికి పైగా అభ్యర్థుల తండ్రులు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నవారే. 2017 బ్యాచ్‌లో ఇలాంటివారు 212 మంది (58శాతం) ఉన్నారు. తండ్రులు ప్రైవేటు, కార్పొరేట్ రంగాల్లో ఉన్నవారు 9శాతం, స్వయం ఉపాధిలో రంగంలో ఉన్నవారు 10శాతం ఉన్నారు.
- 2016 బ్యాచ్‌లో కూడా ఇదే ట్రెండ్ కొనసాగింది. మొత్తం బ్యాచ్‌లో 376 మంది ఉండగా, ఇందులో 55 శాతం అంటే 207 మంది అభ్యర్థుల తండ్రులు ప్రభుత్వోద్యోగులే. స్వయం ఉపాధి రంగంలో ఉన్నవారు 14 శాతం, రైతులు 12శాతం, వ్యాపారులు 11శాతం, ప్రైవేటు, కార్పొరేట్ రంగాల్లో ఉన్నవారు 7శాతం ఉన్నారు.
- 2016, 2017 సంవత్సరాల్లో సివిల్స్ పరీక్షల్లో సంవత్సరానికి ఒకరు చొప్పున మాత్రమే తెలుగు మీడియం ఎంచుకున్నారు. 2017లో 95శాతం మంది ఇంగ్లీషు మీడియంలో రాయగా, 4శాతం హిందీ, ఒకరు మరాఠీ, మరొకరు కన్నడ, ఇంకొకరు తమిళంలో రాశారు.

అర్హత/ సంవత్సరం	2017	2016	2015	2014
ఇంజనీరింగ్	210	184	173	140
ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్	10	4	3	-
మెడిసిన్	38	61	38	37
సైన్స్	34	33	23	19
మేనేజ్‌మెంట్	16	28	37	33
ఆర్ట్స్	36	41	49	-
ఆర్ట్స్, మేనేజ్‌మెంట్	4	3	4	-
లా	7	8	14	9
కామర్స్	10	12	7	3
కామర్స్ మేనేజ్‌మెంట్	4	1	5	-
ఇతరాలు	0	1	-	5



గాలి ఆగిందా!

శాంతికి చిహ్నం.. సొగసైన రూపం.. ఐకమత్యంగా పయనం.. నిత్యం గోపురంపైనే కాపురం.. రెక్కలు కదిలిస్తే చాలు సందడి వాతావరణం. పావురాల గురించి ఇలా ఎంత చెప్పినా తక్కువే. వాటి అందానికి మైమరచిందో.. ఆ రెక్కల చప్పుడుకు గాలి ఆగిందో... ఆకాశంలో వెండి మబ్బులు సైతం నిశ్చలంగా మారినట్టుంది కదా ఈ దృశ్యం. తిరుపతి గోవిందరాజులస్వామి గాలిగోపురంపై నుంచి శాంతి కపోతాలు ఎగిరిపోతూ 'ఆంధ్రజ్యోతి' కెమెరా కంటికి చిక్కాయి. -తిరుమల

టేబుళ్లన్నీ ఖాళీ!

ఫైళ్లన్నీ కంప్యూటర్లలో నిక్షిప్తం



- **పెరిగిన ఈ-ఆఫీస్ వినియోగం**
- **నెల్లూరులో 225 శాఖల్లో అమలు**
- **తూర్పులో అత్యధిక యూజర్లు**
- **సచివాలయాన్ని దాటిన పశ్చిమ**

అమరావతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ-ఆఫీసు వ్యవస్థ ప్రభుత్వ కార్యాలయాల్లో పని స్వరూపాన్నే మార్చేసింది. సాధారణ ఫైళ్లను పక్కనబెట్టేసిన యంత్రాంగం కంప్యూటర్ ఫైల్స్‌లో మునిగిపోయింది. ఈ-ఆఫీసు వ్యవస్థతో ప్రభుత్వ కార్యాలయాల్లో టేబుళ్లన్నీ ఖాళీ అవుతున్నాయి. నిత్యం గంపెడు ఫైళ్లు ముందేసుకుని కూర్చునే అధికారులు ఇప్పుడు కంప్యూటర్లలో నిమగ్నమైపోతున్నారు. మొదట్లో దీనిపై పెదవి విరిచిన అధికారులు రానురానూ టెక్నాలజీకి అలవాటుపడిపోయారు. ఈ క్రమంలో ఈ-ఆఫీసు వినియోగంపై ప్రభుత్వం తాజాగా నివేదిక తయారుచేసింది. ఈ విధానంలో ఎవరు ఎక్కడ ఉన్నారు అనే గణాంకాలు రూపొందించింది. సచివాలయం సహా అన్ని జిల్లాల్లో కలిపి మొత్తం 1,861 శాఖలు (జిల్లాల వారీగా వేరుచేస్తే) ఈ-ఆఫీసు వ్యవస్థలోకి మారాయి. సచివాలయంలో 298 శాఖలు, విభాగాలు దీని పరిధిలోకి వస్తే, అత్యధికంగా నెల్లూరు జిల్లాలో 225 శాఖలు ఈ-ఫైళ్ల నిర్వహిస్తున్నాయి. శ్రీకాకుళంలో అత్యల్పంగా 88 శాఖలు మాత్రమే ఈ-వ్యవస్థను నిర్వహిస్తున్నాయి. ఇక వినియోగదారుల (యాక్టివ్ యూజర్స్) వివరాలు పరిశీలిస్తే ఈ-ఫైల్స్‌ను మొత్తం 86,297 మంది వాడుతున్నారు. సచివాయంలో 20,922 మంది, తూర్పుగోదావరిలో 5,960 మంది, అనంతపురంలో 5,665 మంది అత్యధిక వినియోగదారులు ఉన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, ప్రకాశం జిల్లాలు సుమారు 4 వేల మంది యూజర్లతో స్వల్పస్థాయిలో చివరన నిలిచాయి. ఇప్పటివరకూ మొత్తం 25,69,604 ఫైళ్లను ఈ-ఫైల్స్‌గా మార్చారు. 33,80,741 ఈ-రిసిప్ట్ తయారుచేశారు. సచివాలయంలో 3,74,803 ఈ-ఫైళ్లు రూపొందిస్తే, పశ్చిమలో 11,97,052 ఫైళ్లు తయారుచేయడం విశేషం.

జిల్లా	శాఖలు	యాక్టివ్ యూజర్స్	ఈ-ఫైళ్లు తయారీ
సచివాలయం	298	20922	374803
అనంతపురం	130	5665	54152
చిత్తూరు	122	5145	47874
తూర్పుగోదావరి	117	5960	103976
గుంటూరు	109	5009	41559
కడప	117	5053	110268
కృష్ణా	100	5170	341328
కర్నూలు	135	5454	68642
నెల్లూరు	225	5368	44542
ప్రకాశం	102	4354	55914
శ్రీకాకుళం	88	3683	24322
విశాఖపట్నం	106	5374	63547
విజయనగరం	105	3567	41625
పశ్చిమగోదావరి	107	5573	1197052
మొత్తం	1861	86297	2569604

అప్పుడు వద్దన్న వారే...

ఈ-ఆఫీసు ప్రవేశపెట్టిన కొత్తల్లో దానిపై అధికారులు, ఉద్యోగుల్లో చాలా వ్యతిరేకత వ్యక్తమైంది. ఇప్పుడు ఈ-ఆఫీస్‌కి పూర్తిగా అలవాటుపడిన ఉద్యోగులు, అందులోనే సౌకర్యం ఉందని అంటున్నారు. ఉదాహరణకు గతంలో ఎక్సైజ్ శాఖలో పక్క రాష్ట్రాల మద్యం రవాణాకు సంబంధించిన అనుమతుల జారీకి సుమారు వారం పది రోజులు పట్టేది. వేరే రాష్ట్రంలో తయారై, మన రాష్ట్రంతో సంబంధం లేకపోయినా ఇక్కడినుంచి ఆ వాహనం ప్రయాణిస్తే మన ఎక్సైజ్‌శాఖ అనుమతి ఇవ్వాలి. ఇటీవల దాన్ని ఆన్‌లైన్ చేయడంతో ఈ ప్రక్రియ గంటలోనే ముగుస్తోంది. దీంతో అధికారులకు చాలా సమయం ఆదా అవుతోంది.

మా వద్దకు రావట్లేదు

ఈ విధానం బాగుందని చాలా మంది అభిప్రాయపడుతుంటే కొందరు మాత్రం అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే అది పనిలో ఇబ్బందుల గురించి కాదు. గతంలో ఓ ఫైలు పరిష్కారం కావాలంటే కింది నుంచి పై వరకూ సంబంధిత వ్యక్తి అందరి వద్దకూ వెళ్లాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు అంతా ఆన్‌లైన్ కావడంతో ఆ ఫైలుకు సంబంధించిన వ్యక్తులు అధికారులను కలవడం లేదు. నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాల్సి రావడంతో దాన్ని అధికారులూ ఆపలేకపోతున్నారు. దీంతో దానికి సంబంధించిన వారు తమ వద్దకు రావడం లేదనే అసంతృప్తి కొందరిలో కనిపిస్తోంది. 'మా వద్దకు వస్తే మా లాభాలు మాకుంటాయి. ఎవరూ రాకపోతే ఎలా?' అని కొందరు వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం.



మూలుగుతున్న నిధులు!

- **53 కార్పొరేషన్లలో రూ.5 వేల కోట్లు..**
- **ఇంకా వివరాలివ్వని 23 కార్పొరేషన్లు**
- **వినియోగంలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు**
- **బడ్జెట్ భారం తగ్గించేందుకు ఆర్థిక శాఖ వ్యూహం**

అమరావతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని వచ్చే ఏడాది కొనసాగకుండా చూసేందుకు ఆర్థిక శాఖ ప్రయత్నాలు చేస్తోంది. ఇందుకోసం బడ్జెట్ నిబంధనల్లో పలు మార్పులు చేసింది. దీంతోపాటు అన్ని కార్పొరేషన్లలో ఖాళీగా పడి ఉన్న నిధుల వివరాలు సేకరిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 100 కార్పొరేషన్లు ఉన్నాయి. వీటిల్లో వేల కోట్ల నిధులు మూలుగుతున్నాయి. ఇందులో 5 కార్పొరేషన్లలో కలిపి రూ.10 వేల కోట్లకు పైగా నిధులున్నాయి. ఈ నిధులను రెండు నెలల క్రితమే ఆర్థిక శాఖ వాడుకుంది. ఇప్పటి వరకు 53 కార్పొరేషన్లు నిధుల వివరాలు పంపించాయి. ఆ 53 కార్పొరేషన్లలో రూ.5,000 కోట్లకు పైగా నిధులున్నాయని ఆర్థిక శాఖ గుర్తించింది. ఇంకా రూ.23 కార్పొరేషన్ల నుంచి నిధుల వివరాలు రావాలి. ఆర్థిక శాఖ గతంలో 5 కార్పొరేషన్ల వద్ద నిధులను వాడుకున్న నేపథ్యంలో కొన్ని కార్పొరేషన్లు తమ వద్ద ఖాళీగా ఉన్న నిధుల వివరాలు చెప్పడానికి ఇష్టపడడం లేదని ఆర్థిక శాఖ అధికారులు పేర్కొన్నారు. ఆ నిధులను కూడా ఆర్థిక శాఖ వాడేసుకుంటుందేమోనన్న అనుమానాలను కార్పొరేషన్లు వ్యక్తం చేస్తున్నాయి. అయితే, అలాంటిదేమీ ఉండదని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. కేంద్రం నుంచి ప్రత్యేక ప్యాకేజీ, రెవెన్యూ లోటు అందకపోవడంతో రాష్ట్ర ఆర్థిక స్థితి సంక్షోభంలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నిధులున్న కార్పొరేషన్లకు మరీ అత్యవసరమైతే తప్ప బడ్జెట్‌లో అదనంగా నిధులు కేటాయించబోమని చెప్పారు. కార్పొరేషన్ల వద్ద ఇప్పటికే ఉన్న నిధులను వినియోగంలోకి తేవడం ద్వారా బడ్జెట్‌లో కొంత మేర భారం తగ్గించుకోవాలని భావిస్తోంది. అలా మిగిలిన నిధులను రాష్ట్రప్రభుత్వ ప్రాధాన్య ప్రాజెక్టులు, పథకాలకు అధిక నిధులు ఖర్చుపెట్టే అవకాశం ఉంటుందని ఆశాఖ పేర్కొంది. ఆర్థిక శాఖలో నెలకొన్న సంక్షోభం వచ్చే బడ్జెట్‌లో కొనసాగకుండా అధికారులు జాగ్రత్త పడుతున్నారు. ఇందుకోసం ప్రతీ శాఖ నుంచి వచ్చిన బడ్జెట్ ప్రతిపాదనలు, వారి అవసరాలు, ప్రాధాన్యతల ప్రకారం కొంత మొత్తాన్ని కేటాయించి, దాన్ని తమ ప్రాధాన్యాల ప్రకారం వాడుకోవాలని ఆర్థిక శాఖ ఇప్పటికే ఆదేశాలిచ్చింది. అదనపు బడ్జెట్ కేటాయింపులతోనే ఆర్థిక సంక్షోభం సమస్య మరింత ముదురుతోందని, వచ్చే బడ్జెట్‌లో ఈ సమస్య రాకుండా జాగ్రత్త పడాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

రాజ్యసభ సీట్లకు..

టీడీపీలో గట్టి పోటీ

ఆశావహుల చిట్టా పెద్దదే..జాబితాలో సీఎం రమేశ్, కంభంపాటి

- **మస్తాన్‌రావు, శ్రీనివాసరెడ్డి, మూర్తి కూడా**
- **రేసులో స్వామిదాస్ దంపతులు, పద్మజ**
- **ఉత్కంఠ కొనసాగిస్తున్న చంద్రబాబు**
- **సమర్థ రాజకీయవేత్త కోసం అన్వేషణ?**



అమరావతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ సీట్లకు గట్టి పోటీ ఏర్పడింది. పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు ఈ పదవులను ఆశిస్తుండడంతో అధిష్ఠానం ఎంపిక ఎలా ఉంటుందన్నది ఆ పార్టీ వర్గాల్లో ఆసక్తి కలిగిస్తోంది. ఇంతవరకూ ఏ సంకేతాలు ఇవ్వకుండా ఆ పార్టీ అధినేత చంద్రబాబు ఉత్కంఠ కొనసాగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఈసారి మూడు రాజ్యసభ సీట్లకు అభ్యర్థులను ఎన్నుకోవలసి ఉంది. ఇందులో ఒక సీటుకు తాము అభ్యర్థిని నిలుపుతున్నట్లు ప్రతిపక్షం వైసీపీ ప్రకటించింది. ఆ పార్టీ తరపున నెల్లూరు జిల్లాకు చెందిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పోటీ చేస్తున్నారు. వైసీపీ వరుసగా రెండోసారి కూడా అదే జిల్లాకు చెందిన అదే సామాజిక వర్గం నేతను నిలుపుతుండడం విశేషం. పోయినసారి ఆ పార్టీ తరపున విజయసాయిరెడ్డి రాజ్యసభ ఎంపీగా గెలిచారు. సామాజిక కోణాలకు పెద్దపీట వేసే టీడీపీ ఈసారి కూడా అటువంటి లెక్కలతోనే అభ్యర్థుల ఎంపిక చేపట్టే అవకాశముందని అంటున్నారు. ఆ పార్టీ రెండు సీట్లకు పోటీచేస్తుందా.. మూడు స్థానాలకా అన్నది ఇంకా స్పష్టత రాలేదు. రెండు స్థానాలకు పోటీచేస్తే ఎన్నికలు ఏకగ్రీవమవుతాయి. ముగ్గురు పోటీచేస్తే పోలింగ్ తప్పనిసరి. రాష్ట్రం నుంచి ప్రస్తుతం టీడీపీ ఎంపీ సీఎం రమేశ్ రిటైరవుతున్నారు. మరోసారి అవకాశం కోసం ఆయన గట్టి ప్రయత్నాల్లో ఉన్నారు. రెండు దశాబ్దాలుగా పార్టీని అంటిపెట్టుకుని.. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఆర్థికంగా అండదండలు ఇచ్చినందువల్ల అధిష్ఠానం తనకు రెండో చాన్సు ఇస్తుందని ఆయన ఆశాభావంతో ఉన్నారు. మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహనరావు కూడా తీవ్రంగానే ప్రయత్నిస్తున్నారు. తనకు ఇదివరకు రాజ్యసభ పదవి కొనసాగించకపోయినా పార్టీని అంటిపెట్టుకుని ఉన్న అతి కొద్ది మంది నేతల్లో తానూ ఒకడినని, తనకు అవకాశం ఇస్తే ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ వాణిని మరింత మెరుగ్గా వినిపిస్తానని ఆయన చెబుతున్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు ఇప్పటికే ముఖ్యమంత్రిని కలిసి తన ఆసక్తి వ్యక్తం చేశారు. బీసీ వర్గాలకు చెందిన తనకు అవకాశం ఇవ్వాలని, దీనివల్ల ఆ వర్గాలకు పార్టీ ప్రాధాన్యం ఇస్తోందన్న సంకేతం వెళ్తుందని ఆయన అంటున్నారు. కడప జిల్లా పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఈసారి రేసులో ఉన్నారు. ఆయన పోయినసారి కడప లోక్‌సభ స్థానానికి పోటీచేశారు. తనను రాజ్యసభకు పంపి.. తన బదులు పార్టీ నేతలు ఆదినారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డిల్లో ఒకరిని కడప ఎంపీ అభ్యర్థిగా నిలిపితే జమ్మలమడుగు నియోజకవర్గంలో సమస్య పరిష్కారమవుతుందని ఆయన పేర్కొంటున్నారు. కృష్ణా జిల్లా తిరువూరు మాజీ ఎమ్మెల్యే స్వామి దాసు, ఆయన సతీమణి సుధారాణి కూడా ఆశావహుల్లో ఉన్నారు. దళిత వర్గాలకు చెందిన తాము ప్రభుత్వ ఉద్యోగాలు వదులుకుని వచ్చి పార్టీలో పనిచేస్తున్నామని, అంకిత భావం కలిగిన తమ దంపతుల్లో ఒకరికి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. కర్నూలు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ మసాల పద్మజ కూడా రేసులో ఉన్నారు. మెడిసిన్‌లో గోల్డ్ మెడలిస్టును అయిన తాను పార్లమెంటులో పార్టీ వైఖరిని సమర్థంగా వినిపించగలనని, రాయలసీమ నుంచి తనకు అవకాశమివ్వాలని ఆమె కోరుతున్నారు. ఉత్తరాంధ్ర నుంచి మాజీ ఎంపీ ఎంవీవీఎస్ మూర్తి కూడా రాజ్యసభ సభ్యత్వం ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆయన ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. చంద్రబాబు మాత్రం ఇంతవరకూ తన మనసులో ఏముందో బహిర్గతం చేయలేదు. కానీ రాజ్యసభలో పార్టీ వాణిని వినిపించగలిగిన రాజకీయవేత్తను ఆయన అన్వేషిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. పూర్తి స్థాయి రాజకీయ నాయకులైతే ఢిల్లీలో పార్టీ వాదన మరింత బలంగా వినిపిస్తారని, అటువంటి వారు లేని లోటు ప్రస్తుతం అక్కడ కనిపిస్తోందని కొందరు సీనియర్ నేతలు భావిస్తున్నారు. అయితే సార్వత్రిక ఎన్నికలు తొంగిచూస్తున్న తరుణంలో ప్రాంతాలు, సామాజిక కోణాలు, రాజకీయపరంగా సర్దుబాట్ల వంటివి కూడా ఉంటాయని, వీటినీ సీఎం పరిగణనలోకి తీసుకుంటారని అంటున్నారు.

ప్యూర్ గోల్డ్

బంగారం బండారం!

- **మీ ఊరిలోనే స్వర్ణ నాణ్యత పరీక్ష.. పరిశీలనకు మొబైల్ విధానం**
- **జిల్లాకో ప్యూరిటీ టెస్టింగ్ యంత్రం**
- **తూనికలు, కొలతల శాఖ ఏర్పాటు**
- **జూన్ నుంచి అమల్లోకి కొత్త విధానం**

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మీ ఇంట్లో ఉన్న బంగారం మంచిదేనా? అది 24 క్యారెట్ల స్వచ్ఛమైనదేనా? అంటే ఎవరూ కచ్చితంగా చెప్పలేరు. కానీ.. ఇలాంటి సందేహాలన్నీ నివృత్తి చేసేందుకు తూనికలు, కొలతల శాఖ ముందుకొచ్చింది. ప్రత్యేక కార్యక్రమం ద్వారా బంగారం నాణ్యత పరీక్షలను ప్రజలకు ఉచితంగా అందుబాటులోకి తీసుకుకొచ్చేందుకు సిద్ధమైంది. అది కూడా మొబైల్ తరహాలో గ్రామీణ ప్రాంతాల్లో ఈ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీంతో మీ దగ్గరున్న బంగారంలోని బండారం బయటపడనుంది. ఇంతవరకు ఇలాంటి సౌలభ్యం ప్రజలకు అందుబాటులో లేకపోగా, ఇప్పుడు తూనికల కొలతల శాఖ ప్రజలకు ఉచితంగా నాణ్యత పరీక్షలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కొత్త యంత్రాలు కొనుగోలు చేసేందుకు సిద్ధమైంది. గతంలో రాష్ట్రంలోని ఐదు చోట్ల ఈ యంత్రాల ఏర్పాటుకు రూ.కోటి నిధులు అవసరమని ప్రతిపాదన చేశారు. ఒక్కో యంత్రం రూ.27లక్షలు అవుతుందని అంచనా వేశారు. అయితే దానికి ఆర్థికశాఖ స్పందించలేదు. తాజాగా నిధుల విడుదలకు ఆర్థికశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ క్రమంలో నాణ్యత పరీక్షల యంత్రాలు కూడా తక్కువకే లభిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సుమారు రూ.7 లక్షలకే ఒక్కో యంత్రాన్ని కొనుగోలు చేయొచ్చని తెలిపారు. దీంతో కనీసం జిల్లాకో యంత్రాన్ని కొనుగోలు చేయొచ్చని అధికారులు భావిస్తున్నారు. రానున్న బడ్జెట్‌లో నిధులు విడుదల చేస్తామని ఆర్థికశాఖ హామీ ఇచ్చింది. దీంతో జూన్ నాటికి 'గోల్డ్ ప్యూరిటీ టెస్టింగ్ మెషీన్లు' కొనుగోలుచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. అయితే వాటిని ఒకే చోటకు పరిమితం చేయకుండా ఒక వాహనంలో ఏర్పాటుచేసి దాన్ని గ్రామీణ ప్రాంతాల్లో రోజుకో ప్రాంతానికి తిప్పాలని నిర్ణయించారు. ఈ యంత్రాలనే బంగారం దుకాణాల్లో తనిఖీలకు కూడా వినియోగించనున్నారు. టెస్టింగ్ మెషీన్లు లేకపోవడంతో ప్రస్తుతం దుకాణాలపై దాడులు చేసినా కేవలం తూనికల పరీక్షలకే పరిమితం అవుతున్నారు. ఇకనుంచి నాణ్యతా పరీక్షలను సైతం చేపట్టనున్నారు.



రంగును బట్టి నిర్ధారణ

బంగారం నాణ్యతను లేజర్ కిరణాల ద్వారా పరీక్షిస్తారు. ఆభరణాలపై కాంతి కిరణాలు పంపితే అవి లోపలిభాగం వరకూ వెళ్ళి నాణ్యతను అంచనా వేస్తాయి. నాణ్యత స్థాయిని బట్టి టెస్టింగ్ మెషీన్‌లో రంగులు వెలుగుతాయి. 24 క్యారెట్లు ఉంటే ఒక రంగు, తక్కువ ఉంటే ఒక రంగు, మరీ తక్కువగా ఉంటే మరొక రంగు కనిపిస్తుంది. పరీక్ష చేసిన వెంటనే వచ్చిన రంగును బట్టి ఆ బంగారం నాణ్యతను నిర్ధారిస్తూ ఒక రిసిప్ట్ ఆటోమేటిక్‌గా వస్తుంది. నాణ్యత పరిశీలనలో అధికారుల జోక్యం కూడా ఉండదు. ఈ సేవలన్నీ ప్రజలకు పూర్తిగా ఉచితంగా అందుబాటులోకి తీసుకురానున్నారు.

సివిల్స్ పర్సనాలిటీ టెస్ట్..

ప్రశ్నల తీరు ఎలా ఉంది?

టార్గెట్ సివిల్స్



సివిల్స్ ప్రయాణంలో చివరిది, కీలకమైన పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ ప్రక్రియ) ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభమైంది. ఏప్రిల్ 24 వరకు కొనసాగనుంది. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) గత పది రోజులుగా నిర్వహిస్తున్న సివిల్స్ పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ ప్రక్రియ)కు తెలుగు రాష్ట్రాల నుంచి చాలా మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిని ఇంటర్వ్యూలో ఎటువంటి ప్రశ్నలు అడుగుతున్నారు, వాటికి ఏవిధంగా సమాధానాలు ఇస్తున్నారు అనే అంశం.. ఇంటర్వ్యూకు అర్హత సాధించిన మిగతా అభ్యర్థులకు ఆసక్తి కలిగిస్తుంది. అదేవిధంగా సివిల్స్ లక్ష్యంగా ఉన్నవారికి భవిష్యత్ కోణంలో ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే పర్సనాలిటీ టెస్ట్ పూర్తి చేసుకున్న వారి అనుభవాల ఆధారంగా... ఇంటర్వ్యూలో ఎలాంటి ప్రశ్నలు వేస్తున్నారు, వాటిని ఆధారంగా చేసుకొని మిగతా వారు ఏవిధంగా సన్నద్ధం కావాలో చూద్దాం..

పర్సనాలిటీ టెస్ట్ అనే పేరుతోనే పరీక్ష ఉద్దేశం అర్థమైపోతుంది. ఇక్కడ సబ్జెక్ట్ నాలెడ్జ్ కంటే అభ్యర్థుల ఆలోచనా విధానం, ఆత్మవిశ్వాసం స్థాయి, హుందాతనం వంటి అంశాల్ని పరిశీలిస్తారు. భవిష్యత్‌లో పరిపాలనలో రాణించగలరా లేదా అనే అంశం ఆధారంగా మార్కులు వేస్తారు. అయితే ఈ క్రమంలో అభ్యర్థి సామర్థ్యాన్ని పరిశీలించేందుకు వారు దరఖాస్తు సమయంలో అందించిన డిటైల్డ్ అప్లికేషన్ ఫామ్ (DAF)లోని అంశాల్ని ఆధారంగా చేసుకుంటారు. దాని ద్వారా బోర్డు సభ్యులు ప్రశ్నలు సంధిస్తుంటారు. వాటితోపాటు వర్తమాన అంశాల పైనా అభ్యర్థి అవగాహనను పరిశీలిస్తారు.



పథకాలపై కూడా

వర్తమాన అంశాలతోపాటు ప్రభుత్వ పథకాలకు సంబంధించి కూడా పలు ప్రశ్నలు వేశారు. తద్వారా ప్రభుత్వ పథకాలు, పరిపాలన అంశాలపై అభ్యర్థులకు ఉన్న అవగాహనను పరీక్షించారు. ఉదాహరణకు..

- ★ భారత్‌మాల ప్రాజెక్ట్ అంటే ఏమిటి? పోర్టుల అనుసంధానం ప్రాధాన్యత ఏమిటి?
- ★ మేకిన్ ఇండియా విజయవంతం కావాలంటే ఏమి చేయాలి?
- ★ స్వర్ణ చతుర్భుజి అంటే ఏమిటి?

మీకు ఏం తెలుసన్నది ప్రధానం కాదు, మీ ఆలోచనలు, వాటిని వ్యక్తం చేసే విధానం కీలకం. మీరు అఖిల భారత సర్వీసుల్లో చేరితే పరిపాలనలో కీలక హోదాల్లో పని చేయాల్సి ఉంటుంది. కాబట్టి బోర్డు సభ్యులు మీ వ్యక్తిత్వాన్ని పరిశీలిస్తారే తప్ప, ఒకటి, రెండు ప్రశ్నలకు తెలియదని సమాధానం చెబితే మార్కులు తగ్గించడం, సమాధానాలు చెప్పినంత మాత్రాన ఎక్కువ మార్కులు వేయడం జరగదు.
మీరు ఏం చెప్పారనేకంటే ఎలా చెప్పారనేదే ముఖ్యం. పూర్తి ఆత్మ విశ్వాసంతో తగిన సన్నద్ధతతో ముందుకు వెళ్లండి. విజయం తప్పక వరిస్తుంది.

UPSC

ఈసారి అడిగిన ప్రశ్నల్లో కొన్ని (అభ్యర్థుల అనుభవాల ఆధారంగా)

- ★ మీ పేరుకు ఉన్న అర్థం ఏమిటి? ఆ పేరుతో ప్రముఖులు ఎవరైనా ఉన్నారా? వారి గురించి మీకు తెలిసిన విషయాలు చెప్పండి.
- ★ మీ గురించి రెండు నిమిషాల్లో చెప్పండి.
- ★ సివిల్ సర్వీస్‌లో ఎందుకు చేరాలనుకుంటున్నారు?
- ★ మీకు ప్రస్తుత ఉద్యోగం ఇష్టమా లేక సివిల్స్ సర్వీస్ ఇష్టమా.. నిజాయితీగా చెప్పండి? (మల్టినేషనల్ కంపెనీ ఉద్యోగిని ఉద్దేశించి అడిగిన ప్రశ్న)
- ★ మీరు ఎందుకు అంత మంచి ఉద్యోగాన్ని వదులుకుని రావాలనుకుంటున్నారు? ఇందులో ఉద్యోగం రాకుంటే ఏమి చేస్తారు? (మల్టినేషనల్ కంపెనీ ఉద్యోగిని ఉద్దేశించి అడిగిన ప్రశ్న)
- ★ మీ జిల్లాలో ఉన్న సమస్యలు ఏమిటి? నువ్వు ఐఏఎస్ అయితే వాటి ఎలా పరిష్కరిస్తావు?

ఇలాంటి సాధారణ ప్రశ్నలతోపాటు అభ్యర్థుల నేపథ్యం... ముఖ్యంగా విద్య, గత ఉద్యోగ అనుభవాలు, వాటిలోని సవాళ్లు, వర్తమాన, సామాజిక అంశాలపై ప్రశ్నలు అడిగారు. ఉదాహరణకు..

- ★ ఇటీవల ఇరాన్ అధ్యక్షుడు హసన్ రహౌనీ భారత్‌లో పర్యటించారు. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని భారత్ - ఇరాన్ సంబంధాలు ఎలా ఉన్నాయి? చాబహార్ పోర్టుకు ఉన్న ప్రాముఖ్యత ఏమిటి?
- ★ మాల్దీవుల్లో ఎమర్జెన్సీ విధించడం, అక్కడి రాజకీయ అనిశ్చిత పరిస్థితుల గురించి రోజూ వార్తలు వింటూనే ఉన్నాం. ఈ అంశం ఆధారంగా మాల్దీవుల పరిస్థితులపై మీ అభిప్రాయం ఏమిటి?
- ★ ఇటీవల తమిళనాడులో ప్రముఖ నటుడు కమల్ హాసన్ నూతనంగా ఒక రాజకీయ పార్టీని ప్రారంభించారు. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ సినిమా తారలు రాజకీయాల్లోకి రావచ్చా?
- ★ రోహింగ్య శరణార్థుల సమస్య ఇటీవలి కాలంలో మీడియాలో ప్రధానంగా కనిపించింది. ఈ అంశం ఆధారంగా రోహింగ్య శరణార్థుల సమస్యపై మీ అభిప్రాయం ఏమిటి?
- ★ గౌరీ లంకేష్ హత్య ఎందుకు జరిగింది?

ఇలా చేయాలి

ఇంటర్వ్యూలో కంగారుపడకుండా ప్రశాంతంగా ముందుగా బోర్డు సభ్యులు అడిగిన ప్రశ్నను అవగాహన చేసుకోవాలి. ఇచ్చే సమాధానం ఎదుటి వారిని సంతృప్తి పరిచేలా ఉండాలి. అంతేకానీ ఎక్కువగా ప్రభావితం చేయాలనే ఉద్దేశంతో సంబంధం లేని అంశాల్ని ప్రస్తావించకూడదు. విషయాన్ని మరీ సాగదీసి చెప్పడం, మరీ ఒకటి, రెండు వాక్యాల్లో అవును, కాదు తరహా సమాధానాలు చెప్పకూడదు. ఏదైనా ప్రశ్నకు జవాబు తెలియకుంటే నిజాయితీగా ఆ విషయాన్ని ఒప్పుకోవడం మేలు. మార్కులు కోత పెడతారని ఏదో చెప్పి మేనేజ్ చేయాలని ప్రయత్నిస్తే అనవసరపు చిక్కులు ఎదురవుతాయి. వ్యక్తిగత అంశాలకు సంబంధించి మీరు ప్రస్తుత ఉద్యోగాన్ని వదులుకొని సివిల్ సర్వీస్‌లోకి ఎందుకు రావాలనుకుంటున్నారు వంటి ప్రశ్నలు ఎదురైనప్పుడు అబద్ధాలు, కల్పిత కథలు చెప్పకూడదు. ఇలాంటి అంశాలకు ఎలా సమాధానం చెప్పాలో ముందుగా ఆలోచించుకుంటే మంచిది.

- ★ ప్రభుత్వ వైద్యులకు ప్రైవేట్ ప్రాక్టీస్ అవసరమా? భారత్‌లో వైద్యుల కొరత ఉన్నప్పుడు మెడికల్ టూరిజం అవసరమా? (వైద్య వృత్తి నేపథ్యం ఆధారంగా)
- ★ మీ జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యల గురించి చెప్పండి? రైతు ఆత్మహత్యలు ఎందుకు జరుగుతున్నాయి? (గ్రామీణ వ్యవసాయ నేపథ్యం ఉన్న వారిని)

చర్చనీయాంశాలు సైతం

ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశాలైన పర్యావరణ పరిరక్షణ, విపత్తు నిర్వహణ, శాస్త్ర సాంకేతిక రంగాల గురించి అభ్యర్థుల అవగాహనను పరిశీలించేందుకు కూడా ఇంటర్వ్యూ బోర్డు సభ్యులు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ నేపథ్యంలో అడిగిన ప్రశ్నలు..

- ★ ఢిల్లీలో కాలుష్యానికి కారణాలు ఏమిటి?
- ★ అనేక చట్టాలు ఉన్నప్పటికీ పర్యావరణ కాలుష్యాన్ని ఎందుకు నియంత్రించలేక పోతున్నారు?
- ★ క్లౌడ్ కంప్యూటింగ్ అంటే ఏమిటి?
- ★ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అంటే ఏమిటి? దాని భవిష్యత్ ఏమిటి? యంత్రాలు మానవ మేధస్సును అధిగమించగలవా?

ఆర్థిక అంశాలు

ప్రభుత్వ పథకాలు, అంతర్జాతీయ అంశాలతోపాటు ఆర్థిక అంశాలకు సంబంధించి కూడా ప్రస్తావించారు. తద్వారా అభ్యర్థుల విస్తృత అవగాహనను తెలుసుకోవడానికి ప్రాధాన్యం ఇచ్చారు. ఈ నేపథ్యంలో అడిగిన ప్రశ్నలు..

- ★ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటే ఏమిటి?
- ★ క్రౌడ్ ఫండింగ్ అంటే ఏమిటి?
- ★ ఫెమినైజేషన్ ఆఫ్ అగ్రికల్చర్ అంటే ఏమిటి?
- ★ బడ్జెట్ మేనేజ్‌మెంట్ అంటే ఏమిటి?
- ★ బ్యాంకింగ్ రంగ సంస్కరణలపై దేశవ్యాప్తంగా విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో బ్యాంకుల ప్రైవేటీకరణను సమర్థిస్తారా?

అధికారి కోణంలో

సివిల్ సర్వీసెస్ అధికారులుగా ఏదైనా విషయం ఎదురైతే తక్షణం ఎలా వ్యవహరిస్తారు, ప్రతిస్పందిస్తారు అనే అంశాన్ని పరిశీలించే కోణంలో కూడా కొన్ని ప్రశ్నలు వేశారు. మీరు చైనా ప్రతినిధి అయితే దక్షిణ చైనా సముద్ర వివాదాన్ని ఎలా సమర్థిస్తారు? నక్సలిజం, ఉగ్రవాదం, పేదరికం, అంతర్జాతీయ సంబంధాలు ఇలా అనేక అంశాలపై అభిప్రాయం, అటువంటివి కొన్ని... తద్వారా అభ్యర్థి ఆలోచన, వ్యూహ రచన సామర్థ్యాన్ని ప్రశ్నించడంతోపాటు అప్పటికప్పుడు ఏదైనా విషయం ఎదురైతే సమయస్ఫూర్తిగా ఎలా స్పందిస్తారనే అంశాన్ని నిశితంగా పరిశీలించే ప్రయత్నం చేశారు.

హాబీస్ ఆధారంగా

అభ్యర్థులు దరఖాస్తు సమయంలో అందించిన డిటైల్డ్ అప్లికేషన్ ఫామ్‌లో పేర్కొన్న హాబీస్ (అలవాట్లు, ఆసక్తి) ఆధారంగా కూడా ప్రశ్నలు వేశారు. అందులో కొన్ని..

- ★ మీరు చాలా యంగ్‌గా ఉన్నారు. ధ్యానం ఎందుకు చేస్తారు?
- ★ మీరు తిరిగిన ప్రదేశాలు ఏమిటి, ప్రయాణం ఎలా ఉపయోగపడుతుంది? (ట్రావెలింగ్ హాబీ అని పేర్కొన్న అభ్యర్థిని ఉద్దేశించి)

గతం కంటే భిన్నం కాదు

బహుముఖ కోణాల్లో అభ్యర్థి పర్సనాలిటీని అంచనా వేయడమే ఇంటర్వ్యూ ప్రధాన ఉద్దేశం. ప్రశ్నల సరళి గతంకంటే భిన్నంగా ఏమీ లేదు. ప్రతి అభ్యర్థిని 30 నిమిషాలపాటు ఇంటర్వ్యూ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎలాంటి ప్రశ్నలు వేస్తున్నారు అనే దానికంటే వేసిన ప్రశ్నలకు ఏవిధంగా సమాధానం చెబుతాన్నామనేదే ప్రధానమనే విషయాన్ని గమనంలోకి తీసుకోవాలి. వస్త్రధారణ మొదలు హావభావాల వరకూ అన్నింటినీ బోర్డు సభ్యులు గమనిస్తారు. కాబట్టి ప్రతి విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి.

కంగారు పక్కన పెట్టి...

ఇంటర్వ్యూకి వెళ్లాల్సిన అభ్యర్థులు ముందుగా కంగారు పడకుండా ఇతర అభ్యర్థులతో వివిధ అంశాలపై చర్చించడం ముఖ్యం. కాస్త అవగాహన ఉన్న వారికి డీఏఎఫ్ ఇచ్చి దాని ఆధారంగా ప్రశ్నలు అడగమనడం వంటివి చేయాలి. డీఏఎఫ్‌లో పేరు - ఇంటి పేరు, స్వగ్రామం - ప్రాంతం, విద్య - వికాసం, అలవాట్లు, అనుభవం తదితర అంశాలు ఉంటాయి. ఆ అంశాలపై అభ్యర్థులకు సంపూర్ణ అవగాహన ఉండాలి. ఎందుకంటే వీటి ఆధారంగా కూడా ప్రశ్నలు అడగొచ్చు. పేరు, ఊరుకు సంబంధించి ఏదైనా ప్రాధాన్యం ఉంటే దాన్ని తెలుసుకోవాలి. అంతేకాకుండా చారిత్రక విశేషాలు, జాగ్రఫీ, సమకాలీన ప్రాథమిక, ద్వితీయ, తృతీయ రంగాలు, మతపరమైన విషయాలపై కూడా దృష్టి సారించాలి. ఆయా అంశాలపై అడిగే అవకాశం ఉన్న ప్రశ్నలను రూపొందించుకోవాలి. ఇంటర్వ్యూ సమయంలోనూ స్నేహపూర్వక వాతావరణమే ఉంటుంది. ఈ విషయాన్ని గుర్తిస్తే అనవసరపు కంగారును మనసులో నుంచి తీసేయవచ్చు. కొత్త వ్యక్తులతో మాట్లాడటానికి సిగ్గుపడేవారు ఇప్పటికైనా రోజూ ఇతరులతో చర్చించడం, మాట్లాడటం చేస్తే కచ్చితంగా విజయం సాధించవచ్చు.



మల్లవరపు బాలలత

2016 సివిల్స్ ర్యాంకర్

జాబ్ కార్నర్

ఇండియన్ ఎయిర్ ఫోర్స్

ఇండియన్ ఎయిర్ ఫోర్స్ డైరెక్ట్ ప్రాతిపదికన గ్రూప్ సి సివిలియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ❑ ఖాళీలు: 16
- ❑ పోస్టులు: లోయర్ డివిజన్ క్లర్క్ 14, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ 1, హౌస్ కీపింగ్ స్టాఫ్ 1
- ❑ అర్హత: ఎల్‌డీసీ పోస్టులకు ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణతతోపాటు నిమిషానికి 35 ఇంగ్లీషు పదాలు / 30 హిందీ పదాల టైపింగ్ వేగం ఉండాలి. మిగిలిన పోస్టులకు పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు ఏడాది అనుభవం ఉండాలి.
- ❑ వయసు: దరఖాస్తు నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
- ❑ ఎంపిక: దరఖాస్తుల షార్ట్‌లిస్ట్, రాత పరీక్ష ద్వారా
- ❑ రాత పరీక్ష వివరాలు: పోస్టును అనుసరించి ఇంటర్ / పదోతరగతి స్థాయిలో రాత పరీక్ష ఉంటుంది. ఇందులో జనరల్ ఇంటెలిజెన్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్ నుంచి ప్రశ్నలు వస్తాయి.
- ❑ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 1
- ❑ చిరునామా: The Air Officer Commanding, Air Force Central Accounts Office, Subroto Park, New Delhi - 110010

లా ఆఫీసర్లు

కాండ్లా పోర్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని దీన్ దయాళ్ పోర్ట్ ట్రస్ట్ - రెగ్యులర్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ❑ పోస్టులు: లా ఆఫీసర్ (గ్రేడ్ 1) 1, అసిస్టెంట్ ఎస్టేట్ మేనేజర్ 1, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ (సివిల్) 2
- ❑ వయసు: లా ఆఫీసర్‌కు 40 ఏళ్లు, ఎస్టేట్ మేనేజర్‌కు 30 ఏళ్లు, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్‌కు 42 ఏళ్లు.
- ❑ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 9
- ❑ వెబ్‌సైట్: www.kandlaport.gov.in

ప్రమాణాల నవోదయం

స్కూల్ ఎడ్యుకేషన్

దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో జవహర్ నవోదయ విద్యాలయాలు ముందుంటాయి. పాఠశాల స్థాయిలో నాణ్యమైన విద్యను అందించడంలో నవోదయ విద్యాలయాలకు మరే విద్యాసంస్థలు సాటి రావని చెప్పొచ్చు. నవోదయ విద్యాలయాల్లో 2018-19 విద్యా సంవత్సరానికి 9వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ప్రకటన వెలువడింది. దీనికి సంబంధించిన వివరాలను చూద్దాం..

జాతీయ విద్యా విధానం - 1986 ప్రకారం దేశ వ్యాప్తంగా (తమిళనాడు మినహా) జవహర్ నవోదయ విద్యాలయాలను ప్రారంభించారు. ప్రస్తుతం దేశంలో 626 నవోదయ విద్యాలయాలు ఉన్నాయి (రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కలిపి). విద్యతోపాటు విలువలు, సంస్కృతి, పర్యావరణం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించడమే వీటి లక్ష్యం. అంతేకాకుండా జాతీయ సమగ్రతను పెంపొందించే ప్రయత్నం చేస్తారు. క్రీడలకు తగిన ప్రాధాన్యం ఉంటుంది. తద్వారా విద్యార్థి సర్వోతోముఖాభివృద్ధికి అవసరమైన అన్ని రకాల అంశాలకు జవహర్ నవోదయ విద్యాలయాలు వేదికలుగా ఉంటాయి.

ప్రత్యేకతలు

- ❍ బాల బాలికలకు ప్రత్యేక హాస్టల్ వసతి
- ❍ ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ
- ❍ 1:8 నిష్పత్తిలో కంప్యూటర్ ల్యాబ్
- ❍ యోగా శిక్షణ
- ❍ నీట్ - 2017 పరీక్షలో 11875 మంది నవోదయ విద్యార్థులు అర్హత సాధించారు.
- ❍ జేఈఈ - అడ్వాన్స్‌డ్ 2017లో 1176 మంది నవోదయ విద్యార్థులు అర్హత సాధించారు.



ప్రవేశం

రాత పరీక్ష ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. పరీక్ష ఫలితాలను సంబంధిత పాఠశాల నోటీస్ బోర్డుతోపాటు వెబ్‌సైట్‌లో ఉంచుతారు. ఎంపికైన అభ్యర్థులకు పోస్ట్ ద్వారా కూడా సమాచారాన్ని చేరవేస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లీష్ / హిందీ భాషల్లో మాత్రమే ఉంటుంది. ఓఎంఆర్ షీట్‌లో సమాధానాలను గుర్తించడానికి రెండున్నర గంటల (150 నిమిషాలు) సమయం ఇస్తారు. ఇందులో ఉండే సబ్జెక్టులు..

సబ్జెక్ట్	మార్కులు
ఇంగ్లీష్	15
హిందీ	15
మ్యాథ్స్	35
సైన్స్	35
మొత్తం	**100**

అర్హత

2017-18 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ / ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల నుంచి ఎనిమిదో తరగతి చదివి ఉండాలి (జవహర్ నవోదయ ఉన్న జిల్లాలోని స్థానిక విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి)

వయసు: 2002, మే 1 - 2006, ఏప్రిల్ 30 (రెండు తేదీలు కలిపి) మధ్య జన్మించి ఉండాలి.

ముఖ్య సమాచారం

- ❍ దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- ❍ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 5, 2018.
- ❍ రాత పరీక్ష తేదీ: మే 19, 2018.
- ❍ వెబ్‌సైట్: http://nvshq.org/

సిలబస్

ENGLISH: Comprehension (Unseen Passage), Word and Sentence Structure, Spelling, Rearranging jumbled words, Passivation, Use of degrees of comparison, Modal auxiliaries, Use of prepositions, Tense forms, Reported speech.

क्रम	विषय
(क)	भाषिक अनुप्रयोग और व्याकरणिक कुशलताएँ
(i)	वर्ण विचार / वर्तनी विवेक
(ii)	शब्दभेद (स्रोत / उत्पत्ति) (iii) पर्याय / विलोम
(iv)	शब्द विवेक (शब्द प्रयोग में सूक्ष्म अंतर)
(v)	पद भेद (व्याकरणिक कोटि) की पहचान
(vi)	पद परिचय (vii) अशुद्ध वाक्य को शुद्ध करना
(viii)	वाक्य रचनान्तरण (सरल / संयुक्त / मिश्र)
(ix)	मुहावरा (x) लोकोक्ति
(ख)	अपठित बोधात्मक प्रश्न

MATHEMATICS: Rational Numbers, Squares and Square Roots, Cubes and Cube Roots, Exponents and Powers, Direct and Inverse Proportions, Comparing Quantities (Percentage, Profit and Loss, Discount, Simple and Compound Interest), Algebraic Expressions and Identities including Factorization, Linear Equations in One Variable, Understanding Quadrilaterals (Parallelogram, rhombus, rectangle, square, kite), Menstruation: (a. Area of plane figures, b. Surface area and volume of cube, cuboid and cylinder), Data Handling (Bar graph, pie chart, organizing data, probability).

GENERAL SCIENCE : Food - Crop Production and Management; Microorganism; Food Preservation, Materials I - Synthetic fibers; Plastics; Metals and Non - metals, Material II - Coal and Petroleum; Refining of Petroleum; Fossil Fuels; Combustion and Flame, Living / Non living; Cell structure and Function; Conservation of Plants and Animals - Wildlife Sanctuary and National Parks, Reproduction - Asexual and Sexual Reproduction, Reaching the age of adolescence, Force - Frictional Force; Gravitational Force; Thrust and Pressure, Light - Reflection of Light; Multiple Reflection; Human eye; Care of the Eyes; Sound; Human ears; Loudness and Pitch, Audible and inaudible Sounds, Chemical Effects of Electric Current; Electroplating, Natural Phenomena etc.

తెలుగు రాష్ట్రాల్లో ఖాళీల వివరాలు

జిల్లా	ఖాళీలు	జిల్లా	ఖాళీలు
ఆదిలాబాద్	2	కరీంనగర్	7
ఖమ్మం	7	మహబూబ్‌నగర్	7
మెదక్	6	నల్గొండ	6
నిజామాబాద్	9	రంగారెడ్డి	5
వరంగల్	2	చిత్తూరు	9
తూర్పు గోదావరి-1	10	తూర్పు గోదావరి-2	1
గుంటూరు	13	కడప	7
కృష్ణా	9	కర్నూలు	2
నెల్లూరు	6	ప్రకాశం-1	4
ప్రకాశం-2	8	శ్రీకాకుళం	3
విశాఖపట్నం	4	విజయనగరం	5
పశ్చిమగోదావరి	8		



అమెరికన్ల నోట

తెలుగు మాట!

ఆశ్చర్యపరుస్తున్న కాన్సులేట్ అధికారులు.. ఎఫ్ఎస్ఐలో వీరికి ముందస్తు శిక్షణ

ఉత్తీర్ణత సాధిస్తేనే ఇక్కడ ఉద్యోగం.. తొలిసారిగా 'ఆంధ్రజ్యోతి'తో మాటామంతీ



అమెరికా వీసా కోసం మీరు ఇంటర్వ్యూకి వెళ్లారు. కౌంటర్ దగ్గరకు వెళ్లిన వెంటనే అమెరికన్ అధికారి- 'నమస్కారం.. అమెరికాలో మీ బంధువులు ఉన్నారా? అక్కడికి వెళ్లి ఎంత కాలం ఉంటారు?' అని తెలుగులో అడిగితే ఎలా ఉంటుంది? హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ అధికారులు ఇదే తీరులో అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. వీసాకు భాష అడ్డంకి కాకూడదనేది అమెరికా ప్రభుత్వ సిద్ధాంతం. ఇందుకు అనుగుణంగా తమ విదేశాంగ శాఖ అధికారులకు ప్రపంచంలోని రకరకాల భాషలపై వాషింగ్టన్‌లో ఉన్న ఫారెన్ స్టడీస్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్ఎస్ఐ) ద్వారా శిక్షణ ఇస్తుంది. ఉదాహరణకు హైదరాబాద్ కాన్సులేట్‌లోని వీసా అధికారులకు తెలుగు, హిందీలో తర్ఫీదు ఇచ్చి పంపుతారు. వారు ఇక్కడికి వచ్చిన తర్వాత కూడా భాష నేర్చుకుంటూ ఉంటారు. ఇలా తెలుగు, హిందీ నేర్చుకున్న ఆరుగురు వీసా అధికారులను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. సాధారణంగా మీడియాకు దూరంగా ఉండే కాన్సులేట్ అధికారులు తొలిసారిగా ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పిన విశేషాలివి..

\- స్పెషల్ డెస్క్



ఎఫ్ఎస్ఐలో ప్రతి భాషకూ విభాగం

తెలుగు నుంచి పష్తూ దాకా ప్రపంచంలోని రకరకాల భాషలను తమ అధికారులకు నేర్పించటానికి అమెరికా ప్రభుత్వం ఎఫ్ఎస్ఐను ఏర్పాటు చేసింది. ఇందులో అన్ని భాషల నిపుణులు ఉంటారు. వివిధ భాషల్లో వచ్చే పత్రికలు, యూట్యూబ్ వీడియోలు, సినిమాలు, నవలలు- శిక్షణ పొందే వారి కోసం అందుబాటులో ఉంటాయి. ఇక్కడ ప్రతి భాషకూ ఒక్కో విభాగం ఉంటుంది. శిక్షణ పొందే వారు దాదాపు ఆరు నెలలు పాటు ఇక్కడ ఉండి భాష నేర్చుకోవాలి. ఆ తర్వాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారినే విదేశాంగ శాఖ అధికారులుగా ఎంపిక చేస్తారు.



హిందీ చాలా కష్టం

నేను కాలేజీలో రష్యన్ నేర్చుకున్నా. దాంతో పోలిస్తే హిందీ చాలా కష్టమనే చెప్పాలి. రష్యన్‌లో వ్యాకరణం.. మాట్లాడే భాష.. రాసే భాష.. వీటన్నింటిలోనూ సారూప్యత ఉంటుంది. కానీ హిందీ అలా కాదు. ఒక్కో మాటకు ఒక్కో పరిస్థితిలో ఒక్కో అర్థం ఉంటుంది. హిందీ మాట్లాడుతుంటే ఒక గేమ్ ఆడుతున్నట్లుగా ఉంటుంది. హైదరాబాద్‌లో హిందీ కన్నా ఉర్దూ మాట్లాడేవారే ఎక్కువ. **- తిమోతి**

మాట్లాడేందుకు ప్రయత్నిస్తా

అమెరికాలో నాకు చాలా మంది భారతీయ మిత్రులు ఉన్నారు. నేను ఉన్న ప్రాంతంలో బాలీవుడ్ పాటలు వినిపిస్తూ ఉండేవి. చాలా ప్రాంతాల్లో భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను చూసేవాళ్లం. ఇక్కడకు వచ్చిన తర్వాత ఆ రోజులు గుర్తుకొస్తున్నాయి. భాషను ఎంత ఎక్కువగా మాట్లాడితే అంత సులువు అవుతుంది. అందుకే ఇక్కడ పనిచేసే వారందరితోనూ మాట్లాడటానికి ప్రయత్నిస్తూ ఉంటా. **- మార్టిన్**



తెలుగు భాష గొప్పదనం తెలిసింది



ఇక్కడ నేనే అందరి కన్నా జూనియర్. నేను ఎఫ్ఎస్ఐలో నేర్చుకున్న తెలుగు తక్కువనే చెప్పాలి. అక్కడ మాకు భాషలో మెలకువలతోపాటు రాయటం, మాట్లాడటం నేర్పుతారు. కోర్సు పూర్తయిన తర్వాత పరీక్ష కూడా పెడతారు. అందులో ఉత్తీర్ణత సాధిస్తేనే పోస్టింగ్ వస్తుంది. కోర్సులో భాగంగా పత్రికలు చదివించటంతో పాటు యూట్యూబ్‌లో సినిమాలు, వార్తలు చూపించేవారు. ప్రాక్టీసు చేసే క్రమంలో- 'చందమామ రావే..'వంటి చిన్న చిన్న పద్యాలు చదివేవాడిని. దీనివల్ల తెలుగు భాష గొప్పదనం తెలిసింది. ఇప్పటికీ వీలైనంత వరకూ తెలుగు మాట్లాడటానికే ఇష్టపడతా నేను ఇంటర్వ్యూ చేసే వాళ్లలో 90% మంది తెలుగు వాళ్లే. నేను తెలుగు మాట్లాడుతుంటే వాళ్లు షాకవుతారు.

\- విల్

మహేశ్‌బాబు సినిమాలు ఇష్టం



అమెరికాలో మాకు ఇచ్చిన శిక్షణ వల్ల భాష ఎలా ఉంటుంది? ఇక్కడి ప్రజల ఆచార వ్యవహారాలు ఎలా ఉంటాయి? వారి ప్రవర్తన ఎలా ఉంటుంది? అనే విషయాలు తెలిశాయి. మాకు చాలా తెలుగు సినిమాలు చూపించేవారు. అయితే అవన్నీ క్లాసిక్స్. సినిమా భాషకు.. ఇక్కడ మాట్లాడే తెలుగుకు చాలా తేడా ఉంటుంది. అందుకే ఒక్కో సినిమాను నాలుగైదు సార్లు చూస్తా. అప్పుడు డైలాగ్‌లతో సహా అన్నీ అర్థమవుతాయి. నాకు శిక్షణలో ఉన్నప్పటి నుంచి నటుడు మహేశ్‌బాబు అంటే ఇష్టం. అతడి సినిమాలే చూపించమని అడిగేదాన్ని. ఇప్పుడు కౌంటర్‌లో నేను తెలుగు మాట్లాడుతుంటే చాలా మంది ఆశ్చర్యపోతారు.

\- కెల్లి

నేనూ చాలా నేర్చుకున్నా



పిల్లలు తమంతట తామే భాష నేర్చుకుంటారు.. పెద్దవాళ్లకు మనం నేర్పాల్సి ఉంటుంది. నేను 18 ఏళ్లుగా హిందీ నేర్పుతున్నా. అదే క్రమంలో నేనూ చాలా నేర్చుకున్నా. ముఖ్యంగా వీళ్లను చూసి సమయ పాలన నేర్చుకోవాలి. నేను వీరికి వారానికి ఒక గంట క్లాసు చెబుతాను. మిగిలినదంతా వాళ్లే నేర్చుకుంటారు. అస్సలు భాష రాని వాళ్లు కూడా వారానికి ఐదు గంటలు నేర్చుకుంటే.. ఆరు నెలల్లో భాష వచ్చేస్తుంది. ఇప్పుడు హిందీకి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. చాలా మంది నా వద్ద స్కైప్‌లో పాఠాలు చెప్పించుకుంటారు.

\- హిందీ శిక్షకురాలు

అప్పుడు బంగ్లా.. ఇప్పుడు హిందీ



ప్రపంచంలో ఎవరికైనా అమెరికా వీసా పొందే హక్కు ఉంది. దీనికి భాష అడ్డు రాకూడదనేది మా ప్రభుత్వ లక్ష్యం. అందుకే మా అధికారులకు స్థానిక భాష నేర్పటానికి ప్రభుత్వం చాలా ఖర్చు పెడుతుంది. వాస్తవానికి వీసా అధికారులు చాలా బిజీగా ఉంటారు. అయినా వారు కొత్త భాషలను నేర్చుకోవటానికి ప్రయత్నిస్తారు. మా అధికారులను ఎక్కడికైనా పంపేముందు- వారికి ఆ ప్రాంత భాష నేర్పి పంపుతాం. నేను టోక్యో వెళ్లే ముందు జపనీస్.. కోల్‌కతా వెళ్లే ముందు బంగ్లా నేర్చుకున్నా.. ఇప్పుడు హిందీ నేర్చుకుంటున్నా.

\- ఆశిష్ సూరి

డ్రైవర్‌తో మాట్లాడుతుంటా



తెలుగులో నేను చేసిన తొలి ఇంటర్వ్యూ ఇంకా గుర్తుంది. ఆ రోజు చాలా టెన్షన్ పడ్డా. నెమ్మదిగా తెలుగులో మాట్లాడటానికి అలవాటు పడిపోయా. నా దగ్గరకు వచ్చే వాళ్లలో ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల వారే ఉంటారు. చాలా మందికి నేను మాట్లాడే భాష.. నా రూపు వేర్వేరుగా ఉండటం వల్ల ఆశ్చర్యంగా చూస్తారు. ఇక, నా భాషను మెరుగుపరుచుకోవటానికి డ్రైవర్‌తో మాట్లాడుతుంటా. అయితే నాకు వచ్చిన తెలుగు కన్నా.. మా డ్రైవర్‌కు వచ్చిన ఇంగ్లిషే ఎక్కువ. ఎఫ్ఎస్ఐలో మాకు తెలుగు వ్యాకరణం నేర్పేవారు. యూట్యూబ్‌లో వార్తలు చూపించేవారు. పత్రికల హెడ్‌లైన్స్ చదివించేవారు. అయితే అక్కడ తెలుగు మాట్లాడేవారు ఎవరూ ఉండేవారు కాదు. అందువల్ల ఎక్కువ మందితో తెలుగులో మాట్లాడే అవకాశం లభించేది కాదు. ఇక్కడికి వచ్చిన తర్వాత స్థానిక ప్రజలు మాట్లాడే భాషను గమనిస్తున్నా. కానీ, హైదరాబాద్‌లో ట్రాఫిక్ వల్ల బయటకు వెళ్లటం కుదరదు.

\- పాల్

పరమశివుడి జలవాసం

నత్తా రామేశ్వరం... పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలంలోని ఒక గ్రామం! ఊరి పేరులోకి 'నత్త' ఎలా పాక్కుంటూ వచ్చిందనే సందేహం రావడం సహజం! ఇక్కడున్న ఆలయ విశేషమే... ఆ ఊరికి పేరుగా మారింది.



ని-దర్శనం
Nidarshanam

సీతా సమేతంగా వచ్చిన శ్రీరామచంద్రుడు నత్త గుల్లలు, ఒండ్రుమట్టి కలిపిన ఇసుకతో ఇక్కడ శివలింగం ప్రతిష్ఠించారట! రాముడు ప్రతిష్ఠించిన ఈశ్వరుడు కాబట్టి... 'రామేశ్వరుడు' అయ్యాడు. ఈ లింగాన్ని నత్తగుల్లలు, ఒండ్రు మట్టి, ఇసుకతో చేయడంతో 'నత్తా రామేశ్వరుడు'గా మారాడు. ఈ క్షేత్రం విశేషమేమిటంటే.. ఇక్కడి శివలింగం ఏడాదిలో 11నెలలపాటు నీటిలోనే ఉంటుంది. దీనికి కారణంగా ఒక పురాణ గాథ ప్రచారంలో ఉంది. క్షత్రియులను సంహరిస్తూ సాగిన పరశురాముడు.. ఈ హత్యల వల్ల ఏర్పడిన దోషాన్ని పరిహరించుకునేందుకు, శివుడి ఆనతితో క్రౌంచ పర్వతం నుంచి ఒక శివలింగాన్ని తీసుకొచ్చి గోస్తనీ నదీ తీరంలో ప్రతిష్ఠించాడు. కానీ.. అది అగ్నిలింగంగా కనిపించేసరికి, తనలోని అహంకారం తగ్గనందుకే శివుడు ఇలా ఆగ్రహించినట్లు పరశురాముడు భావించాడు. శివలింగం చుట్టూ చెరువులా తవ్వి దానిని గోస్తనీ నది నీటితో నింపేశాడు. స్వామి చల్లబడ్డాడు. ఇప్పుడు పూజలు చేయడం ఎలా అని మథనపడుతుండగా.. 11 నెలలు నీళ్లలో ఉంటానని, వైశాఖ మాసంలో మాత్రం అందరికీ దర్శనమిస్తానని శివుడు చెప్పాడట! దీని ప్రకారం.. ఇప్పటికీ ఆలయ నిర్వాహకులు వైశాఖ మాసం ఆరంభంలో కొలనులోని నీటిని పూర్తిగా తోడేస్తారు. శివుడికి నెల రోజులపాటు అభిషేకాలు, ప్రత్యేక పూజ లు నిర్వహిస్తారు. వైశాఖ మాసం చివరి రోజున స్వామికి నైవేద్యం సమర్పించి, ఆలయం తలుపులు మూసి, శివుడిని జలాధివాసం చేస్తారు. ఆ తర్వాత ఏడాదిపాటు ఆ నీళ్లు అలాగే ఉంటాయి.

\- పెనుమంట్ర

కోడ్ రాసేస్తాం.. బహుమతి పట్టేస్తాం

సీ, సీ ప్లస్ ప్లస్, జావా లాంటి కంప్యూటర్ ప్రోగ్రామింగ్ భాషలు వాళ్ల మెదడులో నాట్యం చేస్తుంటాయి. ఎంతటి కష్టమైన సమస్యనైనా సరే వాళ్ల ముందుపెట్టి దానికి కోడ్ రాయమని కోరితే గంటల్లో రాసే కోడ్‌ను కూడా నిమిషాల్లో రాసేస్తారు. అందుకే 103 దేశాల్లోని 2,948 బృందాలతో పోటీ పడి 'ప్రోగ్రామింగ్ ఒలింపిక్స్' ఫైనల్‌కు చేరారు. వాళ్లే.. హైదరాబాద్ ట్రిపుల్ ఐటీకి చెందిన తనుజ్ ఖతార్, సీజీ వేదాంత్, రాజస్ మనపజే. ఏప్రిల్‌లో బీజింగ్‌లో జరుగనున్న ఫైనల్ పోటీని నెగ్గేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నారు. వేలాది మంది విద్యార్థులు పోటీపడిన ఈ ప్రతిష్ఠాత్మక పోటీలో ఫైనల్ దాకా ఎలా వెళ్లగలిగారని వాళ్లను 'ఆంధ్రజ్యోతి' పలుకరించగా.. ప్రాజెక్టు వివరాలు, ప్రాముఖ్యతను వివరించారు. ఆ వివరాలు వారి మాటల్లోనే.. ప్రతి ఏడాది కంప్యూటింగ్ రంగంలో సమర్థులైన విద్యార్థులను ఎంపిక చేయటానికి అసోసియేషన్ ఆఫ్ కంప్యూటింగ్ మెషినరీ ఇంటర్నేషనల్ కాలేజియేట్ ప్రోగ్రామింగ్ కాంటెస్ట్(ఏసీఎం-ఐసీపీసీ)ను నిర్వహిస్తారు. ఈ ఏడాది బీజింగ్‌లో జరుగనున్న ఫైనల్ పోటీలో వంద బృందాలు పాల్గొంటున్నాయి. ఈ పోటీల్లో వాస్తవిక ప్రపంచంలో ఎదురయ్యే కంప్యూటింగ్ సమస్యలను 5 గంటల లోపు పరిష్కరించాల్సి ఉంటుంది. ఇది చాలా కఠినమైన పోటీ. దీనిలో రకరకాల రౌండ్‌లు ఉంటాయి. ఐఐటీ పరీక్ష కంటే ఈ ప్రోగ్రామింగ్ పోటీ కష్టంగా ఉంటుంది. 5 గంటల్లో 10 నుంచి 12 సమస్యలకు పరిష్కారాలు కనుగొనాలి. నిర్ణీత సమయంలో కోడ్ రాయాల్సి ఉన్నందున ఒత్తిడి బాగా పెరుగుతుంది' అని చెప్పారు.


ప్రోగ్రామింగ్ ఒలింపిక్స్ ఫైనల్స్‌లో.. హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు
ఏప్రిల్‌లో బీజింగ్‌లో పోటీ

\- స్పెషల్ డెస్క్



ఆకాశ్ అంబానీ, శ్లోక మెహతా పెళ్లి?





న్యూఢిల్లీ, మార్చి 4: దేశంలోనే అత్యంత సంపన్నుడు ముకేశ్ అంబానీ, రోజీ బ్లూ డైమండ్స్ అధిపతి రస్సెల్ మెహతా వియ్యంకులు కాబోతున్నారా? ముకేశ్ కుమారుడు ఆకాశ్ అంబానీ, రస్సెల్ కుమార్తె శ్లోక మెహతా మూడుముళ్ల బంధంతో ఒక్కటి కానున్నారా? విశ్వసనీయ వర్గాలు అవుననే అంటున్నాయి. వీరిద్దరి పెళ్లి గురించి రెండు కుటుంబాలు పెదవి విప్పడానికి నిరాకరించినా... వారి సన్నిహిత వర్గాల సమాచారం ప్రకారం కొన్ని వారాల్లో నిశ్చితార్థం జరగనుంది. డిసెంబరులో పెళ్లి చేయాలని భావిస్తున్నారట. అంబానీ, మెహతా కుటుంబాలు ఒకరికొకరు బాగా పరిచయస్థులే. ఆకాశ్, శ్లోక- ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో కలిసి చదువుకున్నారు. ముకేశ్, నీతా అంబానీ దంపతుల ముగ్గురు పిల్లల్లో ఆకాశ్, కవల సోదరి ఇషా తొలి సంతానం. రిలయన్స్ గ్రూపులో శరవేగంగా అభివృద్ధి సాధిస్తున్న 'జియో' బోర్డులో ఆకాశ్ కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పాఠశాల విద్య పూర్తయ్యాక శ్లోక 2009లో ఆంత్రోపాలజీ చదివేందుకు ప్రిన్స్‌టన్ యూనివర్సిటీకి వెళ్లారు. ఆపై 'లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, పొలికట్ సైన్స్'లో న్యాయశాస్త్రంలో మాస్టర్స్ చేశారు. 2014 నుంచి రోజీ బ్లూ ఫౌండేషన్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆమె 'కనెక్ట్‌ఫర్' సహవ్యవస్థాపకురాలు కూడా. ఈ సంస్థ స్వచ్ఛంద సంస్థలకు, వారికి అవసరమైన కార్యకర్తలకు అనుసంధానకర్తగా వ్యవహరిస్తుంటుంది. రస్సెల్, మోనా మెహతా ముగ్గురు పిల్లల్లో ఈమె ఆఖరి సంతానం. పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీకి మోనా బంధువు అని చెబుతున్నారు.

ప్రపంచవ్యాప్తంగా రోజీ బ్లూ

రస్సెల్ మెహతా అధిపతిగా ఉన్న 'రోజీ బ్లూ'... ప్రపంచంలో అతి పెద్ద వజ్రాభరణాల సంస్థ. బెల్జియం కేంద్రంగా నడుస్తున్న రోజీ బ్లూ... 50 ఏళ్ల క్రితం బి.అరుణ్‌కుమార్ పేరిట వ్యాపారం ప్రారంభించింది. 1973లో దిలీప్ మెహతా సారథ్యంలో ప్రపంచవ్యాప్తంగా వ్యాపారాన్ని విస్తరించడానికి అడుగులు వేసింది. రోజీ బ్లూకు ఒరా పేరిట మన దేశంలో సుమారు 30 దుకాణాలు ఉన్నాయి. మెహతా పెద్ద కుమార్తె దియా... మరో వ్యాపార సామ్రాజ్యాధిపతి అమిత్ జాటియా కోడలు. మెక్‌డొనాల్డ్ ఇండియా ఫ్రాంచైజీ, హార్డ్‌కేజిల్ రెస్టారెంట్స్ ఎండీ జాటియా కుమారుడు ఆయుష్‌కు దియాను ఇచ్చి చేశారు. "చాలా డైమండ్ కంపెనీలు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలోనే నడుస్తాయి. మేం ఆ కంపెనీలకు భిన్నంగా ముందుకెళ్లాం. బయటవాళ్లకు శిక్షణ ఇచ్చి నిపుణులుగా మలిచాం. ఇదే మా ఎదుగుదలకు కారణం" అని రస్సెల్ అంటుంటారు.

పాక్ ఎగువసభకు హిందూ మహిళ



ముస్లిం మెజారిటీ గల పాకిస్థాన్‌లోని ఎగువసభకు తొలిసారిగా దళిత హిందూ మహిళ ఎన్నికై చరిత్ర సృష్టించింది. సింధ్ రాష్ట్రంలోని నాగర్‌పర్కార్ జిల్లాలో మారుమూల గ్రామానికి చెందిన కృష్ణకుమారి కోహ్లి మైనారిటీ కోటాలో ఎగువసభకు ఎన్నికయ్యారని పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) తెలిపింది. బిలావల్ భుట్టో నేతృత్వంలోని పీపీపీలో ఆమె సభ్యురాలు. పాకిస్థాన్‌లోని మహిళలు, మైనారిటీ హక్కుల కోసం పోరాడుతున్న వారికి ఆమె ఎన్నిక మైలురాయి అవుతుందని భావిస్తున్నారు. ఇంతకుముందు రత్న భగవన్‌దాస్ చావ్లా అనే హిందూ మహిళను పీపీపీ సెనేటర్‌గా ఎన్నుకుంది. 1979 ఫిబ్రవరిలో పేద రైతు కుటుంబంలో కోహ్లి జన్మించారు. పదహారేళ్ల వయసులో ఆమెకు లాల్‌చంద్ అనే భూస్వామితో పెళ్లి జరిగింది. ఆ సమయంలో ఆమె తొమ్మిదో తరగతి చదువుతున్నారు. అయితే 2013లో ఆమె తన విద్యాభ్యాసాన్ని మళ్లీ కొనసాగించారు. సింధ్ యూనివర్సిటీ నుంచి సోషియాలజీలో ఆమె మాస్టర్స్ డిగ్రీ చేశారు. తన సోదరుడితో ఆమె సామాజిక కార్యకర్తగా పీపీపీలో చేరారు. అనంతరం యూనియన్ కౌన్సిల్ బెరానోకు ఆమె చైర్మన్‌గా ఎన్నికయ్యారు. పాకిస్థాన్‌లో అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం కోహ్లి పోరాడారు. ఆమె ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు రూప్లో కోహ్లి కుటుంబానికి చెందిన వారు. 1857లో సింధ్ రాష్ట్రంపై బ్రిటిష్ వారు దండయాత్ర చేసినపుడు రూప్లో కోహ్లి బ్రిటిష్ వారిపై యుద్ధం చేశారు. 1858 ఆగస్టు 22న ఆయన్ను బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసి ఉరితీసింది.

ఏపీకి సుస్తీ

(మొదటి పేజీ తరువాయి)

కేటాయిస్తోంది. ఏ రాష్ట్రం అమలు చేయని ఆరోగ్య పథకాలు, వేల మంది ఆరోగ్య సిబ్బంది ఉన్నా..ఇవేమీ రాష్ట్ర పరిస్థితిని మార్చలేకపోయాయి. వ్యాధులు పక్కనపెడితే మాతా, శిశు మరణాల విషయంలో ఆశించిన ఫలితాలు రాలేదు. గర్భిణుల ప్రసవాలు కాస్త మెరుగుపడ్డాయి. కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో వందశాతం ప్రసవాలు ఆస్పత్రుల్లో జరుగుతున్నాయి. శ్రీకాకుళం, గుంటూరు, అనంతపురం జిల్లాల్లో మాతా, శిశుమరణాల రేటు పెరిగింది. విజయనగరం, పశ్చిమ గోదావరి, ప్రకాశం, చిత్తూరు జిల్లాలు ఈ విషయంలో కాస్త మెరుగ్గా ఉన్నాయి.

అక్కడే షుగర్ ఎక్కువ!

రాష్ట్రవ్యాప్తంగా చూస్తే గోదావరి జిల్లాల్లో షుగర్ వ్యాధి గ్రస్థులు ఎక్కువగా ఉన్నారు. ఇక్కడ వరి ఎక్కువగా పండుతుంది. పైగా ఈ మధ్య పాలిష్ బియ్యానికి అలవాటు పడ్డారు. ఈ మారిన అలవాటు కూడా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో షుగర్ వ్యాధి పెరగడానికి ఒక కారణంగా అనుమానిస్తున్నారు. ఇక రాజధానిలో భాగమైన కృష్ణా, గుంటూరు జిల్లాల్లో గుండె సంబంధిత జబ్బులు ఎక్కువగా ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. దీనికి కారణాలను అన్వేషించి ప్రజలను చైతన్య పర్చాల్సిన అవసరం ఉంది.

ఏపీకి 8వ స్థానం

మొత్తంగా చూస్తే ప్రజారోగ్యంలో ఆంధ్రప్రదేశ్ 8వ స్థానంలో ఉంది. ఈ నివేదిక చూసి ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా కాస్త విస్మయానికి లోనయ్యారు. అనారోగ్య సమస్యలకు మందులు, వైద్యం కంటే అవగాహన, నివారణ ముఖ్యం అనే భావనకు వచ్చారు. సమయం లేకున్నా ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించేందుకు ఆయనే డాక్టర్‌గా మారి గంటన్నర సమయం కేటాయించారు. ఈసారి బడ్జెట్‌లో ఇంకా ఎక్కువ నిధులు కేటాయిస్తానని ప్రకటించారు. ఏపీని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అధికారులకు దిశానిర్దేశం చేశారు.

నేటి నుంచి వైద్యుల ఆందోళన

- తొలిరోజు ఆలయాల్లో పూజలు

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు వైద్యులు సిద్ధమయ్యారు. ఎంబీబీఎస్ వైద్యులకు ఉద్యోగ విరమణ వయసు 63 ఏళ్లు చేయాలని, టైం పదోన్నతులు కల్పించాలని, ఏపీవీవీపీ విభజన పూర్తి చేయాలని కోరుతూ ఆందోళన బాట పడుతున్నట్టు రెండు రోజుల క్రితం ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ ప్రకటించింది. సోమవారం నుంచి ఈనెల 18వ తేదీ వరకూ ఆందోళన కొనసాగించేందుకు కార్యచరణను ప్రకటించారు. ఆందోళనలో భాగంగా మొదటి రోజు వైద్యులంతా తమ ప్రాంతాల్లోని ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని దేవుడిని ప్రార్థిస్తారు. వైద్యులంతా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

పిల్లలు వల్లే ఆనందం

ఎక్కువ మందిని కనండి
డబ్బుకు ప్రాధాన్యం ఇచ్చి.. పెళ్లికి దూరం కావొద్దు
పిల్లలొద్దనే పెళ్లిళ్లు అసలే వద్దు
వినకపోతే జపాన్‌లా మనకూ రోబోలే దిక్కు: సీఎం

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి):'అప్పట్లో నేను కుటుంబ నియంత్రణపై ప్రచారం చేశా. చాలా మంది వ్యతిరేకించారు. మహిళలు చదువుకుని, పేదరికం పోతే కుటుంబ నియంత్రణ సాధ్యమవుతుంది' అని సీఎం తెలిపారు. ఈ మూడూ నేను ఒకేసారి అమలు చేశానని అన్నారు. 'ప్రస్తుతం డబ్బులు బాగా వస్తున్నాయి కాబట్టి చాలా మంది పెళ్లిళ్లు వద్దంటున్నారు. కొన్ని దేశాల్లో 30,40 శాతం యువత పెళ్లి చేసుకోవడం లేదు. ఒంటరిగానే ఉంటున్నారు. లండన్‌లో ఏకంగా మినిస్ట్రీ ఫర్ లోన్లీ అనే శాఖనే పెట్టారు. యువతకు ఐటీ ఉద్యోగాలు రావాలని నేను ఐటీని ప్రోత్సహిస్తే..యువత డబుల్ ఇన్‌కమ్, ఎంజాయ్ లైఫ్ అంటున్నారు. మీ తల్లిదండ్రులు అలా అనుకుంటే మీరు వచ్చేవాళ్లు కాదు కదా? కొంతమంది షరతులు పెడుతున్నారు. పిల్లలు కావాలంటే పెళ్లి వద్దు. పెళ్లి చేసుకుంటాం కానీ పిల్లల్ని కనం అంటున్నారు. ఎక్కువ మంది పిల్లల్ని కనండి. లేదంటే జపాన్ మాదిరి మనం కూడా రోబోలను తెచ్చుకోవాలి. బంగారం వంటివి ఆనందాన్ని ఇవ్వవు. పిల్లలు ముఖ్యం. ప్రపంచంలో కుటుంబ వ్యవస్థ గొప్పది. చాలా సమస్యలకు పరిష్కారం చూపిస్తుంది. మనిషికి మానవత్వం కావాలి. అప్పుడే సమాజంలో విలువలు పెరుగుతాయి' అని చంద్రబాబు వివరించారు.



ప్రజారోగ్యంలో

నంబర్ వన్ మన లక్ష్యం

ఏడాదిలో దేశానికే ఆదర్శం.. 15 రోజుల్లో ఏపీలో 100 % ఓడీఎఫ్.. సుస్థిర అభివృద్ధిలో ఆరోగ్యశాఖ కీలకం

- రాష్ట్ర హెల్త్ బులెటిన్ విడుదల
- ఇకపై ప్రతీనెలా 4న ప్రకటన
- 'పలకరింపు' ప్రారంభించిన సీఎం చంద్రబాబు

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): 'దేశంలో ఆరోగ్యవంతమైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవాలి. ఇందుకు ఏడాదే గడువు. ఆలోగా పూర్తి మార్పు రావాలి. ఇందుకు సంబంధించిన సమస్యలను వందశాతం అధిగమించాలి. ఈ నెల నుంచి మూడునెలలలోపు ప్రజారోగ్యానికి ఒక రూపు తీసుకొచ్చేందుకు కృషి చేయాలి' అని సీఎం చంద్రబాబు ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని గ్రీవెన్స్‌సెల్ హాలులో 'పలకరింపు', 'హెల్త్ బులెటిన్' కార్యక్రమాలను ఆయన ఆదివారం ప్రారంభించారు. వైద్యానికి ఆంధ్రప్రదేశ్‌ను రోల్ మోడల్‌గా మార్చే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వివరించారు. రాష్ట్ర సుస్థిర అభివృద్ధిలో ఆరోగ్యశాఖదే కీలక పాత్ర అని చెప్పారు. దీనికోసమే హెల్త్ బులెటిన్ ప్రారంభించామని, దేశంలో ఎక్కడా లేని సంస్కరణలు తీసుకొచ్చామని తెలిపారు. గ్రామ, మండలస్థాయిలో ప్రజలు ఎలాంటి సమస్యలతో బాధపడుతున్నారో గుర్తించి, అందుకు తగిన పరిష్కారాలు సూచిస్తారని, అవసరం అనుకుంటే మరిన్ని సదుపాయాలు కల్పిస్తామని ప్రకటించారు. ఇక నుంచి ప్రతీ నెలా 4వ తేదీన రాష్ట్రంలో హెల్త్ బులెటిన్ విడుదల చేస్తామన్నారు.



పలకరింపు కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఆరోగ్య కార్యకర్తలకు కిట్ అందజేస్తున్న సీఎం

వైద్యుల మ్యాపింగ్

ఎంఎంఆర్, ఐఎంఆర్, హైపర్ టెన్షన్, షుగర్ వంటి సమస్యల్లో ఏ నెలలో ఎక్కడున్నాం, ఎంత వరకూ తగ్గించామో బేరీజు వేసుకుంటామని, కేవలం ఒక్క ఏడాదిలోనే రాష్ట్రంలో అద్భుతమైన ఆరోగ్య పారామీటర్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని సీఎం చెప్పారు. ఇకపై ప్రతినెలా రెండుగంటలపాటు తాను ప్రజారోగ్యానికి సమయం కేటాయిస్తానని ప్రకటించారు. డిజిటల్ హెల్త్ లాకర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి ఆధార్‌తో అనుసంధానం చేస్తామని, దీనివల్ల రోగులు ఆస్పత్రికి వెళ్లినప్పుడల్లా వైద్యపరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం ఉండబోదని ముఖ్యమంత్రి తెలిపారు.

ఒక్కసారి వైద్య పరీక్షలు చేయించుకుంటే ఆ వివరాలను డిజిటల్ లాకర్‌లో నమోదు చేస్తామన్నారు. పలకరింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం నుంచి ఇది జరుగుతుందని అన్నారు.

రాష్ట్రంలో ఆర్ఎంపీ నుంచి ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల వివరాలను సేకరించి మ్యాపింగ్ చేయాలని సీఎం ఆదేశించారు. దీనివల్ల ఏ ప్రాంతంలో ఏ డాక్టర్ ఉన్నారు. వారు ఎలాంటి వైద్యసేవలు అందిస్తున్నారో సులువుగా తెలుసుకోవచ్చని తెలిపారు. కొందరు వైద్యంపై అవగాహన లేకపోయినా చికిత్స చేస్తుంటారు. ఎక్కువ మందులు ఇస్తుంటారని చెబుతూ తనకు ఎదురైన ఒక అనుభవాన్ని ఉదహరించారు. 'అనారోగ్యంతో బాధపడుతున్న మా ఫ్రెండ్ కూతురికి అవసరం లేని మందులు ఇవ్వడం వల్ల సీరియస్ అయ్యింది. మరో డాక్టర్ దగ్గరకు వెళ్తే ఆ మందులు వాడొద్దన్నారు. అవి ఆపేసిన తక్కువ కాలంలోనే పాప సాధారణ స్థితికి వచ్చింది' అని చంద్రబాబు వివరించారు.

డాక్టర్ చంద్రబాబు..!

'నేను ఎంబీబీఎస్ చదవలేదు. వైద్యపరంగా అంత పరిణతి లేదు. కానీ, అవగాహనతో ముందుకెళ్తున్నాను. పిండిపదార్థాలు తక్కువగా ఉండటం వల్ల షుగర్ వస్తుంది. తీవ్రమైన ఒత్తిడికి లోనైతే గుండె సంబంధిత రోగాలు వస్తాయి. అధిక ఆహారం తీసుకోవడం, అవసరం లేనివి తినడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. అందుకే నేను మితాహారం తీసుకుంటాను. ఎక్కువ పనిచేస్తాను. ఆ రోజుల్లో అన్నం తిన్నా ఎక్కువగా కష్టపడేవారు కాబట్టి అనారోగ్య సమస్యలు వచ్చేవి కావు. ప్రస్తుతం పాలిష్ బియ్యానికి అలవాటు పడ్డారు. దీంతో పిండిపదార్థాలు తగ్గి రోగాలు వస్తున్నాయి. ముఖ్యంగా బొప్పాయి వంటి పళ్ల ప్రతిరోజూ తీసుకోవాలి' అని ఒక డాక్టర్‌లా చంద్రబాబు సూచనలు చేశారు. వైద్యం పట్ల అవగాహన ఉండి కూడా చాలా మంది డాక్టర్లు నిర్లక్ష్యంగా ఉంటున్నారు. ముందు వారి ఆరోగ్యాన్ని సరి చేసుకుని, ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. లేదంటే ముందుగా వైద్యుల హెల్త్ బులెటిన్ విడుదల చేయాల్సి వస్తుందని సీఎం చమత్కరించారు.

ఉపాధ్యాయులు చెప్పాలి..

'ఉపాధ్యాయులు పిల్లలకు చెబితే తల్లిదండ్రులకు కూడా అవగాహన పెరుగుతుంది. తాను పాదయాత్ర చేస్తున్న సమయంలో ఊరిలోకి అడుగుపెట్టగానే ఇరువైపులా రహదారులు అపరిశుభ్రంగా ఉండేవి. ఇప్పుడా పరిస్థితి లేకుండా చేశాం. ప్రజలు మరుగుదొడ్లకంటే మొబైల్ ఫోన్లకే ప్రాధాన్యం ఇస్తున్నారు. మరో 15 రోజుల్లో వందశాతం ఓడీఎఫ్ సాధించిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను ప్రకటిస్తాం' అని చంద్రబాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి కామినేని శ్రీనివాస్, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి పూనం మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరులో 'అరవింద్'

(మొదటి పేజీ తరువాయి)

సంతకాలు చేశారు. వెనుక బడిన రాయలసీమలో అటు చెన్నై, ఇటు బెంగళూరుకు రవాణాపరంగా అనుకూలమైన చిత్తూరు జిల్లాలో ఈ పరిశ్రమ స్థాపనకు ప్రభుత్వం 125 ఎకరాలు కేటాయించింది. డెనిమ్ వస్త్ర ఉత్పత్తిలో ప్రపంచంలోనే నాలుగో స్థానంలో ఉన్న ఈ సంస్థ మొదటి దశలో ఇక్కడ రూ.300కోట్లు పెట్టుబడి పెట్టనుంది. దీంతో ఈ ప్రాంతంలో 15వేల మందికి ఉపాధి లభిస్తుంది. అందులో 80శాతం మహిళలకేనని, మొదటి దశలో 5వేల మంది స్కిల్డ్ వర్కర్లకు ఉద్యోగాలు వస్తాయని అధికార వర్గాలు వెల్లడించాయి. ఏపీఈడీబీ సీఈవో కృష్ణకిశోర్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లాల్లో ఏర్పాటు చేయబోతున్న ప్లాంటులో ఉత్పత్తయ్యే వస్త్రాన్ని దక్షిణాసియా దేశాలకు అరవింద్ యాజమాన్యం ఎగుమతి చేస్తుందని వెల్లడించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు పునిత్ లాల్‌భాయ్, కులిన్ లాల్‌భాయ్ మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం చూసి తమ పరిశ్రమను ఇక్కడ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చినట్లు వెల్లడించారు. విజనరీ లీడర్‌షిప్‌తో సీఎం చంద్రబాబు పారిశ్రామిక రంగానికి అద్భుతమైన సహకారం అందిస్తున్నారని కొనియాడారు. ఇదే వేగంతో ముందుకెళితే అనతికాలంలోనే రాష్ట్రం ఊహించని ఆర్థిక ప్రగతి సాధించడం ఖాయమని స్పష్టం చేశారు. పారిశ్రామిక ప్రగతితోపాటు మహిళల ఆర్థిక ఎదుగుదలపై సీఎం ప్రత్యేక దృష్టి సారించి అందుకు అనుగుణంగా పనిచేస్తున్నారన్నారు. టెక్నాలజీని అందిపుచ్చుకొంటూ, పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్య మానవ వనరులను అందిస్తూ మరోవైపు నిరుద్యోగులకు ఉపాధి కల్పించే చర్యలు ముమ్మరం చేశారని వివరించారు. వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ఏపీలో అన్ని అనుకూలతలు ఉన్నాయని, అరవింద్ పరిశ్రమను రాష్ట్రంలో మరింత విస్తరించి, మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వారు వివరించారు.

ఉపాధిలో నిర్మాణాలకు బ్రేక్!

- కూలీలతో పనులు పెరిగితేనే నిధులు విడుదల

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో నిర్మాణ పనులు చేపడుతున్న గ్రామ పంచాయతీలకు బిల్లులు విడుదల కాలేని పరిస్థితి నెలకొంది. పనులకొచ్చే కూలీల సంఖ్య అనుకున్న మేరకు పెరగకపోవడంతో.. మెటీరియల్ పనులకు చెల్లింపుల కోసం నిధులు విడుదలయ్యే పరిస్థితి లేదని పలు జిల్లాల్లో సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ పథకం ద్వారా చేపట్టిన పలు అభివృద్ధి పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లలేమని చెబుతున్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం జిల్లా ప్రాతిపదికగా కూలీలకు కల్పించే నైపుణ్యేతర పనులు 60శాతం, మెటీరియల్ పనులు 40 శాతంగా ఉండాలి. ఇలా ఉంటేనే ప్రభుత్వం నుంచి పంచాయతీలకు నిధులు వస్తాయి. ప్రస్తుతం లేబర్ కాంపోనెంట్ తగ్గి, మెటీరియల్ కాంపోనెంట్ 40 శాతాన్ని అధిగమించడంతో కర్నూలు, చిత్తూరు, నెల్లూరు, గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో మెటీరియల్ పనులకు నిధులు విడుదల కాలేదు. ఫిబ్రవరి నెలకు సంబంధించి తగిన నిష్పత్తిలో కూలీలు పనులకు రాకపోవడంతో ఒక్క విజయనగరం, విశాఖ జిల్లా తప్ప ఏ జిల్లాలోనూ మెటీరియల్ కాంపోనెంట్ బిల్లులు చెల్లించలేదు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు విస్తృతంగా పనులు కల్పించగలిగితేనే ప్రభుత్వం మంజూరు చేసిన సిమెంట్‌రోడ్లు, శ్మశానాలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం పూర్తి చేయగలమని అధికారులు పేర్కొంటున్నారు. ఉపాధి పనుల్లో ఎక్కువ శాతం లేబర్ కాంపోనెంట్ రావాలంటే 90 శాతం లేబర్‌పని ఉన్న పంటకుంటలు, చెరువుల పూడికతీత పనులు చేపట్టాల్సిందే అంటున్నారు. వ్యవసాయ సీజన్ అయిపోవడంతో ఉపాధి పనులకొచ్చే కూలీల సంఖ్య ఇప్పుడిప్పుడే పెరుగుతోంది. డిసెంబరు నెలలో 3.48 లక్షల మంది కూలీలు పనులకురాగా, జనవరిలో 4.3 లక్షలకు పెరిగారు. ఫిబ్రవరిలో 12.82 లక్షల మంది ఉపాధి పనుల్లో పాల్గొన్నారు. రాబోయే 2, 3 నెలల్లో ఎక్కువ మందికి పనులు కల్పిస్తే లక్ష్యం మేరకు పనులు పూర్తవుతాయి.

కాలుష్య రహితంగా ఏపీ

- ప్రభుత్వ శాఖలన్నిటికీ ఎలక్ట్రిక్ వాహనాలు
- లక్ష బండ్ల కొనుగోలుతో లక్ష ఉద్యోగాల సృష్టి
- 10వేల కోట్ల పెట్టుబడికి ఈఈఎస్‌ఎల్ సిద్ధం
- ఇంధనశాఖ అధికారులతో సీఎం టెలికాన్ఫరెన్స్

అమరావతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఏపీని కాలుష్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. దీనిలో భాగంగా లక్ష ఎలక్ట్రిక్ వాహనాలు(ఈవీ) కొనుగోలు చేయడంతో పాటు వాటిద్వారా లక్షకు పైగా ఉద్యోగాలను సృష్టించనున్నారు. దీనికోసం రూ.10,250కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్(ఈఈఎస్ఎల్) సుముఖత వ్యక్తం చేసింది. ఇప్పటికే కాలుష్యంపై యుద్ధం ప్రకటించిన ప్రభుత్వం ఇప్పుడు పర్యావరణ హిత ఎలక్ట్రికల్ రవాణా వ్యవస్థకు కేంద్రంగా అవతరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. సంప్రదాయ వాహనాలతో పోల్చితే ఈవీలు అతి తక్కువగా కాలుష్య ఉద్గారాలను విడుదల చేస్తాయి. వీటి నిర్వహణ వ్యయం కిలోమీటరుకు 89 పైసలు కాగా, సంప్రదాయ వాహనాలకు రూ.4.40వరకూ ఖర్చవుతోంది. ఈవీల వినియోగంపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఇంధనశాఖ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రభుత్వ శాఖలన్నీ తప్పనిసరిగా ఈవీలనే వినియోగించాలని, తర్వాత వాటిని ప్రైవేట్ రంగానికీ విస్తరించాలన్నారు. ఈవీల వినియోగంలోనూ మొదటి స్థానాన్ని సొంతం చేసుకోవడంపై దృష్టి పెట్టాలని.. ప్రపంచ రికార్డు సృష్టించాలని మార్గనిర్దేశం చేశారు. రాబోయే రెండేళ్లలో లక్ష ఈవీలను అందుబాటులోకి తెచ్చే విషయంపై చర్చించేందుకు ఈనెల మూడో వారంలో వాహన, బ్యాటరీ తయారీదారులు, టెక్నాలజీ ప్రొవైడర్లు, ప్రభుత్వ శాఖల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ తెలిపారు. వాతావరణ మార్పులను సమర్థంగా ఎదుర్కొనే విషయంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీనే అత్యంత క్రియాశీలంగా ఉందని ఈఈఎస్ఎల్ ఎండీ సౌరభ్‌కుమార్ చెప్పారని వివరించారు. ఈ ప్రాజెక్టు వల్ల ప్రజలంతా లబ్ధి పొందేలా చర్యలు చేపట్టాలని మంత్రి కళా వెంకట్రావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు, సీఎస్ దినేశ్‌కుమార్, సీఎం పేషీ అధికారులు సతీష్‌చంద్ర, సాయిప్రసాద్, ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో రచ్చ

- వైసీపీ-టీడీపీ పరస్పరం రాళ్లదాడి
- ట్రాఫిక్ ఎస్ఐ, మరో ఇద్దరికి గాయాలు
- బాష్పవాయువు ప్రయోగించిన పోలీసులు
- లాఠీపట్టిన ఎస్పీ.. పట్టణంలో 144 సెక్షన్

పులివెందుల, మార్చి 4: కడప జిల్లా పులివెందులలో ఆదివారం మధ్యాహ్నం టీడీపీ, వైసీపీ వర్గాలు పరస్పరం రాళ్లదాడులకు పాల్పడ్డాయి. పులివెందుల అభివృద్ధిపై చర్చకైనా, రచ్చకైనా సిద్ధమంటూ వారం రోజులుగా కవ్వించుకుంటున్న ఇరుపార్టీలూ.. చివరకు ఆదివారం మధ్యాహ్నం రచ్చకు దిగాయి. పూల అంగళ్ల కూడలిలో పోలీసుల సాక్షిగా సాగిన పరస్పర రాళ్లదాడుల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. జిల్లాఎస్పీ అట్టాడ బాబూజీ స్వయంగా రంగంలోకి దిగడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఉదయం రెండు పార్టీల కార్యకర్తలు తమ తమ కార్యాలయాలకు తరలివచ్చారు. వంటావార్పు కూడా అక్కడే చేపట్టారు. వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ఉదయాన్నే పాత ఎమ్మెల్యే కార్యాలయంలో మకాం వేశారు. మరోపక్క టీడీపీ కార్యాలయానికి ఎమ్మెల్సీ బీటెక్ రవి, టీడీపీ నాయకత్వ శిక్షణ శిబిరం డైరెక్టర్ రామగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చేరుకున్నారు. అప్పటికే పోలీసులు ప్రత్యేక బలగాలను మోహరించారు. పూల అంగళ్ల కూడలి వద్ద పాత ఎమ్మెల్యే కార్యాలయంలో ఉన్న వైసీపీ నేతలు, కార్యకర్తలు ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో.. ఇది తెలుసుకున్న టీడీపీ నాయకులు కూడా అక్కడకు వచ్చేందుకు ప్రయత్నించారు. బీటెక్ రవి, రామగోపాల్‌రెడ్డి తదితరులను పోలీసులు నిలువరించారు. కానీ అటువైపు నుంచి వైసీపీ, ఇటువైపు నుంచి టీడీపీ శ్రేణులు ఒకేసారి పరస్పరం కవ్వించుకున్నాయి. ఒక్కసారిగా రాళ్లు రువ్వుకున్నాయి. పరిస్థితి అదుపుచేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవి తలకు గాయమైంది. మరో ఇద్దరు గాయపడ్డారు. తీవ్ర ఉద్రిక్తత ఏర్పడడంతో జిల్లా ఎస్పీ బాబూజీ స్వయంగా రంగంలోకి దిగారు. వాహనం దిగుతూనే.. రాళ్లు రువ్వుతున్న వారిపై ఒక్కసారిగా లాఠీ ఝుళిపించారు. పోలీసులు కూడా లాఠీలకు పని చెప్పడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. పార్టీ కార్యాలయాల వద్ద ఉన్న కార్యకర్తలను అక్కడి నుంచి పంపేశారు. అనంతరం ఎస్పీ.. అవినాశ్‌రెడ్డి వద్దకు, టీడీపీ కార్యాలయానికి వెళ్లి మాట్లాడారు. అనంతరం పోలీసు స్టేషన్‌కు వెళ్లి భద్రతను సమీక్షించారు. శాంతి భద్రతల విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదని.. ఇరుపార్టీల వారికి ఇప్పటికే నోటీసులు కూడా జారీ చేశామని ఆయన తెలిపారు. ఒక వేదికను ఏర్పాటు చేసుకుని చర్చించుకోవాలే తప్ప ఇలా చేయడం పద్ధతి కాదన్నారు. ఘర్షణకు సంబంధించి కొందరిని అదుపులోకి తీసుకున్నామని, పట్టణంలో 144 సెక్షన్, 30-పోలీస్ యాక్టును అమలు చేస్తున్నామని చెప్పారు.





వైసీపీ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు, రోడ్డుపై బైఠాయించిన బీటెక్ రవి

హామీలపైనే తొలి చర్చ

- శాసనసభలో టీడీపీ వ్యూహం
- హోదా, నిధులు, విద్యాసంస్థలు.. ఇలా రోజుకో అంశంపై చర్చలు
- సభకు రావాలని వైసీపీ ఎమ్మెల్యేలకు స్పీకర్ వినతి

అమరావతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విభజన చట్టంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీల అమలుపైనే అసెంబ్లీ సమావేశాల్లో తొలి చర్చ నిర్వహించాలని పాలక తెలుగుదేశం పార్టీ భావిస్తోంది. పార్లమెంటు సమావేశాల్లో టీడీపీ ఎంపీలు చేసే ఆందోళనలకు సమాంతరంగా శాసనసభలో కూడా చర్చ నిర్వహించడం ద్వారా కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నది ఆ పార్టీ వ్యూహంగా కనిపిస్తోంది. సోమవారం నుంచి రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్నాయి. తొలి రోజు గవర్నర్ నరసింహన్ ప్రసంగంతో సభ ముగుస్తుంది. రెండో రోజు మంగళవారం నుంచి చర్చలు మొదలవుతాయి. ప్రశ్నోత్తరాల సమయం తర్వాత మాజీ మంత్రి ముద్దు కృష్ణమనాయుడి మృతికి సభ సంతాపం ప్రకటిస్తుంది. తర్వాత స్వల్ప వ్యవధి చర్చ చేపడతారు. విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావలసిన నిధులు, ప్రాజెక్టులు, ఇతర హామీలు ఏ మేరకు అమలయ్యాయన్నది తొలి చర్చగా చేపట్టాలని అధికార పక్షం ఆలోచిస్తోంది. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన హామీల అమలుపై రోజుకో కోణంలో చర్చ చేపట్టాలని కూడా భావిస్తోంది. ఉదాహరణకు.. ప్రత్యేక హోదా, దాని బదులు కేంద్రం ప్రకటించిన ప్రత్యేక ఆర్థిక సాయం (ప్యాకేజీ) అమలుపై ఒక రోజు.. ఈ నాలుగేళ్లలో కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన నిధులపై ఇంకో రోజు.. జాతీయ విద్యా సంస్థల పరిస్థితిపై మరో రోజు.. ఇలా వివిధ అంశాలపై స్వల్ప వ్యవధి చర్చలు నిర్వహించాలని యోచిస్తున్నారు. దీనివల్ల ప్రజలకు ఆయా అంశాలపై మరింత అవగాహన వస్తుందని, కేంద్రం ఏం చెబుతోంది.. నిజంగా ఏం జరిగిందన్నది వారు అర్థం చేసుకుంటారని అభిప్రాయపడుతున్నారు. సోమవారం గవర్నర్ ప్రసంగం తర్వాత జరిగే సభా వ్యవహారాల సలహా సంఘం (బీఏసీ) సమావేశంలో.. ఏ రోజు ఏయే అంశాలపై చర్చించేదీ ఖరారు చేసే అవకాశం ఉంది. వీటితోపాటు రాయలసీమ అభివృద్ధి, ఉత్తరాంధ్ర అభివృద్ధిపైనా ప్రత్యేక చర్చలు చేపట్టనున్నారు. సభ లో ఎలాగూ బీజేపీ సభ్యులు కూడా ఉంటారు గనుక చర్చ మరింత అర్థవంతంగా ఉంటుందన్న అభిప్రాయం అధికార పక్ష ఎమ్మెల్యేల్లో ఉంది. ఇప్పటి వరకూ ఉన్న సమాచారాన్ని బట్టి ఈ నెల 29వ తేదీ వరకూ సమావేశాలు జరిగే అవకాశం ఉంది. 8వ తేదీన బడ్జెట్ ప్రవేశపెట్టాక వరుసగా మూడు రోజులు సమావేశాలకు విరామమిస్తారు. 12 నుంచి సమావేశాలు యథావిధిగా కొనసాగుతాయి.



సోమవారం నుంచి ప్రారంభం కానున్న శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ వద్ద పోలీసుల బందోబస్తు

చర్చించే అవకాశం వదులుకోవద్దు..

అసెంబ్లీ సమావేశాలకు రాకూడదన్న నిర్ణయాన్ని పునఃపరిశీలించుకోవాలని శాసనసభాపతి కోడెల శివప్రసాదరావు వైసీపీ ఎమ్మెల్యేలను కోరారు. ఈ మేరకు వారికి ఫోన్లు చేశారు. ఎమ్మెల్యేలు వివిధ ప్రజా సమస్యలపై చర్చించడానికి అసెంబ్లీయే మంచి వేదికని, ఆ అవకాశం వదులుకోవద్దని విజ్ఞప్తి చేశారు. భిన్నాభిప్రాయాలు ఉన్నా వాటిని వినిపించడానికి... చర్చించేందుకు అసెంబ్లీలో అవకాశం ఉంటుందని వారికి తెలియజేశారు. కానీ రాలేమని వారు నిస్సహాయత వ్యక్తం చేశారు. అసెంబ్లీకి వెళ్లకూడదని తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ నిర్ణయం తీసుకున్నందున దానికి కట్టుబడి ఆగిపోతున్నామని చెప్పారు.



స్పీకర్‌కు వినతిపత్రం ఇస్తున్న విజయసాయి

వేటు వేయాల్సిందే

- ఫిరాయింపుదారులపై స్పీకర్‌కు వైసీపీ వినతి
- చింతమనేనినీ అనర్హునిగా ప్రకటించాలి
- నేడు సీఈసీని కలుస్తామన్న విజయసాయి

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ కోడెల శివప్రసాదరావు అనర్హత వేటు వేయాల్సిందేనని వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయ సాయిరెడ్డి డిమాండ్ చేశారు. విజయవాడలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీలో చేరిన 22 మంది వైసీపీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని తాను, శాసనమండలిలో ప్రతిపక్ష నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు కలిసి స్పీకర్ కోడెలకు వినతిపత్రం సమర్పించామని చెప్పారు. ఇది పార్టీ తరఫున ఇచ్చిన రెండో వినతిపత్రమని ప్రకటించారు. పశ్చిమ గోదావరి జిల్లా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు కోర్టు జైలు శిక్షను ఖరారు చేసినందున సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఆయన్ను అనర్హునిగా స్పీకర్ ప్రకటించాలని విజయసాయి డిమాండ్ చేశారు. రాజ్యసభ ఎన్నికల్లో చింతమనేనికి ఓటు వేసే అధికారం లేదన్నారు. దెందులూరు శాసనసభ్యునిపై ఒక కేసులో రెండేళ్లు, మరో కేసులో ఆరు నెలలపాటు జైలు శిక్ష పడినందున ఆ స్థానాన్ని ఖాళీ అయినట్లుగా ప్రకటించాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌ను కోరుతూ సోమవారం ఢిల్లీలో వినతి పత్రం అందిస్తామన్నారు.

సిరు..ద్యోగులకు 16 వరకు రిమాండ్

- వీఆర్‌వో సంజీవ్ ఆస్తులు రూ.60 కోట్లు

విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన మద్దిలపాలెం క్లస్టర్ వీఆర్‌వో వెంకటేశ్వరరావు, జీవీఎంసీ జోన్-4 ఎలక్ట్రికల్ మజ్దూర్ ఎం.నాగేశ్వరరావులకు ఈ నెల 16 వరకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించినట్టు డీఎస్పీ కె.రామకృష్ణప్రసాద్ తెలిపారు. వీఆర్‌వో వెంకటేశ్వరరావు ఇంట్లో సోదాలు చేసిన ఏసీబీ అధికారులకు సుమారు రూ.1.37 కోట్ల విలువైన ఆస్తుల వివరాలు లభ్యమయ్యాయి. వీటి విలువ మార్కెట్ ధర ప్రకారం రూ.12 కోట్లు ఉండవచ్చని అంచనా. అలాగే జీవీఎంసీ మజ్దూర్ నాగేశ్వరరావు ఇంట్లో సోదాలు చేసిన ఏసీబీ అధికారులు రూ.1.27 కోట్ల(డాక్యుమెంట్ విలువ) ఆస్తులను గుర్తించారు. వీటి మార్కెట్ విలువ రూ.10 కోట్ల వరకూ ఉండచ్చని అంచనా. పట్టుబడిన మరో వీఆర్‌వో సంజీవ్‌కుమార్ ఆస్తుల విలువను ఏసీబీ అధికారులు ఆదివారం తిరిగి లెక్కించగా రూ.ఆరు కోట్లకు పెరిగింది. మార్కెట్ ధర ప్రకారం వీటి విలువ రూ.60 కోట్లు ఉంటుందని అంచనా. సంజీవ్‌కుమార్ అధిక రక్తపోటు కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో అతడిని ఇంకా అరెస్టు చేయలేదు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసిన తర్వాత అతడిని అరెస్టు చేయాలని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు.



నైట్ రైడర్స్ కెప్టెన్‌గా దినేష్ కార్తీక్

ముంబై: వచ్చే ఐపీఎల్‌కు కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) కెప్టెన్‌గా వికెట్ కీపర్, బ్యాట్స్‌మన్ దినేష్ కార్తీక్ నియమితుడయ్యాడు. రాబిన్ ఊతప్పను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఈ విషయాన్ని కేకేఆర్ సీఈవో వెంకీ మైసూర్ ఆదివారం ఇక్కడ కార్తీక్ సమక్షంలో వెల్లడించాడు. టీమిండియా సారథి విరాట్ కోహ్లీ బాటలో నైట్‌రైడర్స్‌ను ముందుండి నడిపిస్తానని ఈ సందర్భంగా కార్తీక్ చెప్పాడు. 'కోహ్లీ తన ఆటతోనే కాదు చేతలతోనూ జట్టును నడిపిస్తాడు. నేనూ అతడి బాటలోనే పయనిస్తా' అని పేర్కొన్నాడు.



అరుణా రెడ్డిని అభినందిస్తున్న సీఎం కేసీఆర్

అరుణకు 2 కోట్లు

- ప్రపంచ పతక విజేతకు సీఎం కేసీఆర్ నజరానా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్‌లో కాంస్య పతకం సాధించి చరిత్ర సృష్టించిన తెలుగమ్మాయి బుద్దా అరుణా రెడ్డికి రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు భారీ నజరానా ప్రకటించారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో జరిగిన ప్రపంచ టోర్నీలో పతకం సాధించి రెండ్రోజుల క్రితమే స్వస్థలం హైదరాబాద్ చేరిన అరుణ.. ఆదివారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసింది. ఈ సందర్భంగా అరుణను అభినందించిన సీఎం.. ఆమెకు రూ. 2 కోట్లు రివార్డుగా అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే ఆమె కోచ్ బ్రిజ్ కిషోర్‌కు కూడా సాయం అందేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. అరుణతో పాటు క్రీడాశాఖ మంత్రి పద్మారావు, శాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, అరుణ తల్లి సుభద్రమ్మ, సోదరి పావని సీఎంను కలిశారు.

రిజ్వీ గోల్డెన్ షూట్

ప్రపంచ కప్ షూటింగ్‌లో భారత్‌కు మూడు పతకాలు





న్యూఢిల్లీ: మెక్సికోలో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్ షూటింగ్‌లో భారత షూటర్లు పతకాల పంట పండించారు. షాజర్ రిజ్వీ ప్రపంచ రికార్డుతో స్వర్ణం సాధించగా.. జీతు రాయ్, మెహులి ఘోష్ కాంస్య పతకాలు గెలుచుకున్నారు. పురుషుల వ్యక్తిగత 10మీ. ఎయిర్ పిస్టల్ ఈవెంట్ ఫైనల్స్‌లో రిజ్వీ 242.3 పాయింట్లు స్కోరు చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఒలింపిక్ చాంపియన్ క్రిస్టియన్ రీట్జ్ (జర్మనీ) 239.7 పాయింట్లతో రజతంతో సరిపెట్టుకున్నాడు. జీతు రాయ్ 219 పాయింట్లు సాధించి కాంస్యం దక్కించుకున్నాడు. ఓం ప్రకాష్ 198.4 పాయింట్లతో నాలుగోస్థానంలో నిలిచాడు. మహిళల 10మీ. ఎయిర్ పిస్టల్ ఫైనల్స్‌లో మెహులి 228.4 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం గెలుచుకుంది. అంజుమ్ నాలుగో స్థానానికి పరిమితమైంది. లారా జార్జెటా(రుమేనియా) స్వర్ణం, హాంగ్ జు (చైనా) రజతం కైవసం చేసుకున్నారు.

డ్రాతో సరి..

- ఇంగ్లండ్‌తో భారత్ మ్యాచ్
- సుల్తాన్ అజ్లాన్ షా కప్



ఇపో (మలేసియా): ప్రారంభ మ్యాచ్‌లో ఒలింపిక్ చాంపియన్ అర్జెంటీనాపై చక్కటి పోరాటాన్ని కనబరిచిన భారత్ తమ రెండో మ్యాచ్‌లో మాత్రం తేలిపోయింది. గోల్స్ చేసేందుకు వచ్చిన పలు అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంలో పూర్తిగా విఫలమైంది. దీంతో సుల్తాన్ అజ్లాన్ షా కప్‌లో భాగంగా ఆదివారం ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌ను 1-1తో డ్రా చేసుకుంది. గతేడాది కాంస్యం సాధించిన భారత్ ఈ ఫలితంతో పాయింట్ల ఖాతా తెరిచి నాలుగో స్థానంలో నిలిచింది. మంగళవారం భారత్ ప్రపంచ నెంబర్‌వన్ ఆస్ట్రేలియాతో ఆడుతుంది. జట్టుకు లభించిన ఏకైక గోల్‌ను శిలానంద్ లర్కా (14వ నిమిషంలో) సాధించాడు. సీనియర్లు లేకపోవడంతో అంతగా అనుభవం లేని యువ ఆటగాళ్లతో బరిలోకి దిగిన భారత జట్టుకు పేలవ ఆటతీరు కారణంగానే విజయం దక్కకుండా పోయింది. ఏకంగా తొమ్మిది పెనాల్టీ కార్నర్ (పీసీ)లు లభించినా వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఇందులో ఎనిమిది రెండో క్వార్టర్‌లోనే లభించాయి. పటిష్ఠ ఇంగ్లండ్ డిఫెన్స్‌ను ఏమార్చడంలో డ్రాగ్‌ఫ్లికర్స్ వరుణ్ కుమార్, రోహిదాస్ విఫలమయ్యారు. అలాగే కొన్ని ఫీల్డ్ గోల్స్‌లను కూడా నెట్‌లోకి పంపలేకపోయారు. మూడో క్వార్టర్‌లో ఇరు జట్లు పోటాపోటీగా తలపడ్డాయి. ఇంగ్లండ్‌కు ఓ పీసీ వచ్చినా వృథా అయ్యింది. అలాగే భారత్‌కు 48వ నిమిషంలో తొమిదో పీసీ లభించినా దాన్నీ సొమ్ము చేసుకోలేకపోయింది. చివరకు నాలుగో క్వార్టర్‌లో ఇంగ్లండ్ 53వ నిమిషంలో స్కోరును సమం చేయగలిగింది. మార్క్ గ్లెగోర్న్ ఈ గోల్‌ను చేసి తమ జట్టును ఓటమి నుంచి గట్టెక్కించాడు. ఆ తర్వాత ఆధిక్యం కోసం ఇరుజట్లు ఎదురు దాడులకు దిగినా లక్ష్యం సాధించలేకపోయాయి.

జింబాబ్వే, ఐర్లాండ్ బోణీ

- ప్రపంచకప్ క్వాలిఫయర్స్

బులవాయో (జింబాబ్వే): ఐసీసీ ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌లో జింబాబ్వే, ఐర్లండ్ బోణీ కొట్టాయి. హరారేలో జరిగిన గ్రూప్-బి మ్యాచ్‌లో జింబాబ్వే (380/6).. 116 పరుగులతో నేపాల్ (264/5)ను చిత్తు చేసింది. మరో మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్థాన్ (255 ఆలౌట్) ఏడు వికెట్లతో స్కాట్లాండ్ (256/3) చేతిలో ఓడింది. గ్రూప్-ఎలో ఐర్లాండ్ (268/7) 93 పరుగులతో (డక్‌వర్త్ లూయిస్ పద్ధతితో) నెదర్లాండ్స్ (లక్ష్యం 243..146/9)పై గెలుపొందింది. ఇక యూఏఈ (221 ఆలౌట్) 56 పరుగులతో (డక్‌వర్త్) పపువా న్యూగినియా (లక్ష్యం 170..113 ఆలౌట్)పై నెగ్గింది.

స్క్వాష్ కోచ్ ఇంటికి..

ఆందోళనలో ఆటగాళ్లు

న్యూఢిల్లీ: భారత స్క్వాష్ జట్టు విదేశీ కోచ్ అష్రఫ్ ఎల్ కరర్గుయ్ అనూహ్య పరిస్థితుల్లో స్వదేశాని (ఈజిప్టు)కి వెళ్లిపోయాడు. నెల లో కామన్వెల్త్ క్రీడలు ఆరంభం కానున్న నేపథ్యంలో అతడు తిరిగి వచ్చేది అనుమానంగా మారింది. కోచ్ అష్రఫ్ పదవీ కాలాన్ని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) జూలై 2019 వరకు పొడిగించినా వ్యక్తిగత కారణాలతో స్వదేశానికి వెళుతున్నట్టు తెలపడం సందేహాలకు తావిస్తోంది. వచ్చే నెలలో ఆస్ట్రేలియాలోని గోల్డ్ కోస్ట్‌లో కామన్వెల్త్ క్రీడలు ప్రారంభం కానున్నాయి. ఇందులో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న జోష్న చినప్ప, దీపిక పల్లికల్, సౌరవ్ ఘోషాల్.. అష్రఫ్ కోచింగ్ శైలి బాగుందని గతంలో కితాబిచ్చారు. గత కామన్వెల్త్‌లో భారత జోడీ జోష్న చినప్ప - దీపిక పల్లికల్ స్వర్ణం సాధించింది. ఈసారి కూడా పసిడి రేసులో ముందుంది. ఇలాంటి పరిస్థితుల్లో కోచ్ స్వదేశానికి తిరిగి వెళ్లిపోవడంతో పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. భారత స్క్వాష్ రాకెట్స్ సమాఖ్యతో విభేదాలే అష్రఫ్ తిరిగి వెళ్లిపోవడానికి కారణమని, అందుకే కోచ్ తన పదవిని త్యజించినట్టుగా సమాఖ్య వర్గాలు తెలిపాయి.

చుమ్మా.. దే దే!



ముంబై: వెటరన్ స్పిన్నర్ హర్భజన్‌సింగ్.. సహచరుడు మహ్మద్ కైఫ్‌ల సెల్ఫీ ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో చేస్తున్న హల్‌చల్ అంతా ఇంతాకాదు. హర్భజన్ సెల్ఫీ తీసుకుంటుండగా కైఫ్ అతడి బుగ్గను చుంబిస్తున్న ఈ ఫొటోకు లైక్‌లు వెల్లువెత్తుతున్నాయి. 'చుమ్మా.. దేదే' అనే హిందీ పాటను గుర్తుచేస్తూ ఆ ఫొటోకు హర్భజన్ ఓ మెసేజ్ జత చేస్తూ ట్విటర్‌లో పోస్ట్ చేశాడు.. ఇందుకు కైఫ్ ప్రతిస్పందిస్తూ.. 'ప్రియమైన భజ్జీ.. మరో ముద్దు (చుమ్మా) కోసం వేచి చూడాల్సిందే. నిన్ను కలవడం ఎప్పుడూ గొప్పగా ఉంటుంది' అని మరింత సరదాగా బదులిచ్చాడు.

శ్రీలంక, బంగ్లాదేశ్..! రేపటి నుంచి మొదలయ్యే ముక్కోణపు టీ-20 సిరీస్‌లో భారత్ ప్రత్యర్థులు. ఇటీవల రికార్డులు పరిశీలించినా.. బలాబలాలు చూసుకున్నా.. టీమిండియాకు ఏమాత్రం పోటీ ఇచ్చే ప్రత్యర్థులు కావవి. పైగా.. కోహ్లీ, ధోనీతో పాటు పలువురు స్టార్ ఆటగాళ్లు విశ్రాంతి తీసుకుంటున్నారు..! అయినా.. ఈ టోర్నీ భారత అభిమానుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది...! ఎందుకంటే.. భారత జట్టులో తమ స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలని తహతహలాడుతున్న యువ క్రికెటర్లు బరిలో నిలవడమే. ఇటీవలి కాలంలో ఎప్పుడూ కనిపించనంత కొత్త రూపుతో.. సరికొత్త లక్ష్యంతో బరిలోకి దిగుతోంది టీమిండియా!

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)



కొత్త రూపు.. లక్ష్యం!

26 టెస్టుల్లో 17 మ్యాచ్‌ల్లో జయకేతనం.. 43 వన్డేల్లో 32 విజయాలు.. టీ-20ల్లోకి వస్తే 27 మ్యాచ్‌ల్లో 17 గెలుపులు.. ఇదీ గత రెండేళ్లలో మన జట్టు ట్రాక్ రికార్డు. స్వదేశం అయినా... విదేశాల్లో అయినా కోహ్లీసేన గెలుపు జోరు ఎలా కొనసాగుతోందో చెప్పేందుకు ఈ గణాంకాలే నిదర్శనం. వరుసగా రెండో ఏడాదీ అగ్రస్థానంతో టెస్టు గద అందుకున్న భారత్ పరిమిత ఓవర్లలోనూ గొప్పగా రాణిస్తోంది. అటు బ్యాట్స్‌మెన్.. ఇటు బౌలర్లు.. ఒకరినిమించి ఒకరు చెలరేగడంతో సులభంగా సిరీస్‌లు చుట్టేస్తోంది. టెస్టుల సంగతి పక్కనబెడితే.. షార్ట్ ఫార్మాట్‌లో ఇంత జోరు చూపిస్తున్నా.. యువ ఆటగాళ్లకు పెద్దగా అవకాశాలు దక్కడం లేదు. యువ ప్రతిభావంతులు అరంగేట్రం చేస్తున్నా.. ఎక్కువ చాన్స్‌లు లేకపోవడంతో వారి సత్తాకు సరైన పరీక్ష ఎదురవడం లేదు. ఇప్పుడు ఆ లోటు పూడ్చే సమయం ఆసన్నమైంది. కెప్టెన్ కోహ్లీ, ధోనీ సహా పలువురు కీలక ఆటగాళ్లు విశ్రాంతి తీసుకోవడంతో లంకలో జరిగే ముక్కోణపు టీ-20 టోర్నీ రూపంలో కుర్రాళ్లకు చాన్స్ దక్కనుంది. రోహిత్ శర్మ సారథ్యంలో బరిలోకి దిగుతున్న టీమిండియా లక్ష్యం.. కుర్రాళ్లకు అవకాశం ఇచ్చి వారి సత్తాను పరీక్షించడమే.

వాస్తవానికి శ్రీలంకతో ఆట అనగానే భారత అభిమానులను ఒక రకమైన నిస్తేజం ఆవహిస్తుంది. దీనికి రెండు కారణాలు. ఒకటి ఆ జట్టుతో పదే పదే ఆడడం. రెండోది.. దిగ్గజాల రిటైర్మెంట్ తర్వాత సంధికాలంలో డీలా పడ్డ లంక ఆటతీరు దిగజారిపోవడం. ఇక, ఈ టోర్నీలో తలపడుతున్న మూడో ప్రత్యర్థి బంగ్లాదేశ్. బలహీన జట్టే అయినా దాని ఆటను అంచనా వేయడం కష్టమే. అయినా.. ప్రధాన ఆటగాళ్లు లేకుండా బరిలోకి దిగుతున్న భారత్.. టోర్నీలో ఫేవరెట్ అని చెప్పొచ్చు. కొత్త వారికి అవకాశం ఇవ్వడం కోసం సెలెక్టర్లు కోహ్లీ, ధోనీతో పాటు స్టార్ పేసర్లు భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రీత్ బుమ్రాలకు రెస్ట్ ఇచ్చారు. అలా జట్టులోకి వచ్చిన వారిలో కొందరికి ఈ టోర్నీ ఎంతో కీలకం కానుంది. ముఖ్యంగా రిషభ్ పంత్, మహమ్మద్ సిరాజ్‌లకు. ఇప్పటికే రెండేసి టీ-20లు ఆడిన ఈ ఇద్దరు కొంత విరామం తర్వాత అంతర్జాతీయ క్రికెట్ ఆడబోతున్నారు. ఈ ఫార్మాట్‌కు అచ్చుగుద్దినట్టు సరిపోయే 20 ఏళ్ల పంత్.. ఇటీవలే టీ-20ల్లో రెండో ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేసి జోరు మీదున్నాడు. ఢిల్లీ తరఫున హిమాచల్ ప్రదేశ్‌పై అతను 32 బంతుల్లోనే సెంచరీ చేశాడు. 2013 ఐపీఎల్‌లో గేల్ 30 బంతుల్లో కొట్టిన శతకం.. ఇప్పటికీ వేగవంతమైనది. ధోనీ వారసుడిగా కితాబందుకున్న ఈ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్.. ఐపీఎల్‌తో పాటు దేశవాళీల్లో మెప్పించాడు. కానీ, నిలకడ లేదు. ఈ సిరీస్‌లో రాణిస్తే జట్టులో చోటు ఖరారు చేసుకోవచ్చు. భువీ, బుమ్రా గైర్హాజరీలో హైదరాబాద్ పేసర్ సిరాజ్ ఈ టోర్నీలో తుదిజట్టులో చోటు గ్యారెంటీ అనొచ్చు. ఆడిన రెండు టీ-20ల్లోనూ నిరాశ పరిచిన సిరాజ్ లంక గడ్డపై మెప్పిస్తే సెలెక్టర్ల నమ్మకాన్ని నిలబెట్టినవాడవుతాడు. ఇక, 26 ఏళ్ల లెఫ్టార్మ్ సీమర్ జయదేవ్ ఉనాద్కట్ ఇప్పటికే ఆరు టీ-20ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. పక్కా టీ-20 బౌలర్ అయిన ఉనాద్కట్ మొన్నటి ఐపీఎల్ వేలంలో ఏకంగా రూ. 11.50 కోట్లు పలికి హెడ్‌లైన్స్‌లో నిలిచాడు. భారత జట్టు చాన్నాళ్ల నుంచి మంచి లెఫ్టార్మ్ పేసర్ కోసం ఎదురు చూస్తోంది. ఈ టోర్నీలో రాణిస్తే ఉనాద్కట్ ఆ కోటాలో జట్టులో సెటిల్ అయిపోయేందుకు అవకాశాలున్నాయి. అలాగే, సౌతాఫ్రికాతో చివరి వన్డేలో నాలుగు వికెట్లతో సత్తా చాటిన మరో యువ పేసర్ శార్దూల్ ఠాకూర్‌పై కూడా అందరి దృష్టి ఉన్నది. సఫారీ గడ్డపై టీ-20ల్లోనూ ఫర్వాలేదనిపించిన అతను.. లంకలోనూ మెరిస్తే జాతీయ జట్టులో చోటు కోసం పేసర్ల మధ్య పోటీ మరింత తీవ్రం కానుంది. ఇక, మణికట్టు ద్వయం కుల్దీప్, చాహల్ జోరులో.. తెరమరుగవుతున్న అక్షర్ పటేల్‌కు ఈ సిరీస్ కీలకం అనొచ్చు. కుల్దీప్‌కు విశ్రాంతినిచ్చి ఈ టోర్నీకి ఎంపిక చేసిన వాషింగ్టన్ సుందర్‌కు తుది జట్టులో చోటు దక్కుతుందో లేదో చెప్పడం కష్టమే. ఒకవేళ చాన్స్ వస్తే మాత్రం దాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని సుందర్ భావిస్తున్నాడు. ఈ తరం కపిల్ దేవ్ అనుకున్న ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా నిలకడ చూపడం లేదు. సౌతాఫ్రికా పర్యటనలో దారుణంగా విఫలమైన అతని స్థానంలో విజయ్ శంకర్, దీపక్ హుడా జట్టులోకొచ్చారు. పాండ్యాకు ప్రత్యామ్నాయంగా సెలెక్టర్ల దృష్టిలో పడేందుకు ఈ ఆల్‌రౌండర్లకు ఇంతకు మించిన సమయం ఉండబోదు. సౌతాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో నిరాశపరిచి, టీ-20ల్లో తుది జట్టులోకి రాలేకపోయిన లోకేశ్ రాహుల్ మళ్లీ ఫామ్ అందుకునేందుకు ఈ టోర్నీని ఉపయోగించుకోవాలని చూస్తున్నాడు. మొత్తంగా లంక, బంగ్లాతో గట్టి పోటీ ఉండకపోవచ్చు గానీ.. జట్టులో ప్రతి ఒక్క ఆటగాడికి ఈ సిరీస్ కీలకంగా మారిందనొచ్చు.

ముక్కోణపు టీ-20 సిరీస్ షెడ్యూల్

మార్చి 6	భారత్ x శ్రీలంక
8	భారత్ x బంగ్లాదేశ్
10	శ్రీలంక x బంగ్లాదేశ్
12	భారత్ x శ్రీలంక
14	భారత్ x బంగ్లాదేశ్
16	శ్రీలంక x బంగ్లాదేశ్
18	ఫైనల్

అన్ని మ్యాచ్‌లు కొలంబోలో రాత్రి 7 గం. నుంచి



శ్రీలంకకు బయలుదేరే ముందు టీమిండియా ఆటగాళ్లు

మరోసారి అబాట్ బౌన్సర్..



మెల్‌బోర్న్: షాన్ అబాట్.. ఈ ఆస్ట్రేలియా బౌలర్ గుర్తున్నాడుగా! మూడేళ్ల క్రితం అబాట్ విసిరిన బౌన్సర్ బలంగా తాకడంతో ఆస్ట్రేలియా ఆటగాడు ఫిల్ హ్యూస్ మైదానంలో కుప్పకూలి మరణించిన సంగతి తెలిసిందే. ఆ బౌన్సర్‌కు కారణమైన షాన్ అబాట్ ఈసారి కూడా మరో ఉత్కంఠ పరిస్థితికి కారణమయ్యాడు. దేశవాళీ టోర్నీ షెఫీల్డ్ షీల్డ్‌లో ఆదివారం విక్టోరియా బ్యాట్స్‌మన్ విల్ పుకోస్కీ బ్యాటింగ్ చేస్తుండగా న్యూ సౌత్‌వేల్స్ పేసర్ అబాట్ వేసిన షార్ట్ బాల్ అతడి హెల్మెట్‌కు బలంగా తాకింది. వెంటనే పుకోస్కీ మోకాళ్ల మీద కూర్చుని అలాగే కుప్పకూలాడు. దీంతో ఆటగాళ్లంతా ఒక్కసారిగా హతాశులయ్యారు. ఏం జరిగిందోననే ఆందోళన అందరిలో వ్యక్తమైంది. మెడికల్, ఫిజియో సిబ్బంది హుటాహుటిన అతడికి ప్రథమ చికిత్స చేశారు. ఆ తర్వాత తేరుకున్న పుకోస్కీని మైదానం నుంచి బయటకు తీసుకెళ్లారు. స్కానింగ్ అనంతరం అతడికి ఎలాంటి ప్రమాదం లేదని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు..

వికెట్ దూరంలో ఆసీస్ విజయం



డర్బన్: దక్షిణాఫ్రికా పర్యటనను గొప్పగా ఆరంభించేందుకు ఆస్ట్రేలియా రంగం సిద్ధం చేసుకుంది. సఫారీలతో తొలి టెస్టులో విజయానికి ఆసీస్ కేవలం వికెట్ దూరంలో నిలిచింది. నాలుగు టెస్టుల సిరీస్‌లో భాగంగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో పర్యాటక జట్టు నిర్దేశించిన 417 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో సౌతాఫ్రికా నాలుగో రోజైన ఆదివారం చివరకు 293/9 స్కోరుతో ఓటమి కోరల్లో చిక్కుకుంది. ఓపెనర్ మార్‌క్రమ్ (143) సెంచరీతో సత్తా చాటగా.. క్వింటన్ డికాక్ (81 నాటౌట్) పోరాడినా మిగతా వారు విఫలమయ్యారు. మిచెల్ స్టార్క్ (4/74), హాజెల్‌వుడ్ (2/57) ప్రత్యర్థిని దెబ్బకొట్టారు. అంతకు ముందు రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ 227 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో కంగారూలు 351, సఫారీలు 162 రన్స్ చేసిన సంగతి తెలిసిందే.

కోచ్‌ల నిర్లక్ష్యం.. సాక్షి చేజారిన స్వర్ణం!



న్యూఢిల్లీ: కిర్గిస్థాన్‌లోని బిష్కెక్‌లో ముగిసిన సీనియర్ ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో ఒలింపిక్ పతక విజేత సాక్షి మాలిక్ స్వర్ణం గెలవకపోవడానికి భారత కోచింగ్ బృందం నిర్లక్ష్యమే కారణమా? 62 కిలోల విభాగంలో చైనా రెజ్లర్ జియావో జువాన్ లువోతో సాక్షి ప్రారంభ బౌట్ సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలను గమనిస్తే అవుననక తప్పదు. జియావోతో మూడు నిమిషాల బౌట్ తొలి క్వార్టర్‌లో రెఫరీ పొరపాటుగా చైనా రెజ్లర్‌కు ఇచ్చిన పాయింట్‌ను సవాలు చేయడంలో భారత మహిళా జట్టు కోచ్‌లు విఫలమయ్యారు. కోచ్‌లు చేసిన పొరపాటుతో సాక్షి కాంస్య పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. తొలి క్వార్టర్ చివరి క్షణాల వరకూ సాక్షి 6-0తో ఆధిక్యంలో ఉంది. ఈ దశలో తన పట్టుతో సాక్షిని కిందపడేసిన చైనా రెజ్లర్ రెండు పాయింట్లు చేజిక్కించుకుంది. కానీ అప్పటికే మూడు నిమిషాల సమయం ముగిసింది. కానీ సాక్షిని తన 'పట్టు'నుంచి జి యావో వదలకపోగా మరోసారి అదే పట్టు పట్టడంతో రెఫరీ.. చైనా రెజ్లర్‌కు మరో రెండు పాయింట్లు కేటాయించడంతో సాక్షి ఆధిక్యం 6-4కు తగ్గింది. అయితే ఆ తర్వాత మూడు నిమిషాల టైమ్ ముగిసినట్టు గ్ర హించిన రెఫరీ ఇద్దరు రెజ్లర్లు విడిపోయి వారివారి స్థానాలకు వెళ్లాల్సిందిగా సూచించాడు. ఆ తర్వాత రెండో క్వార్టర్ (మూడు నిమిషాలు) మొదలైంది. భారత కోచ్‌లు ఇక్కడే నిర్లక్ష్యం ప్రదర్శించారు. మూడు నిమిషాల సమయం ముగిసినా చైనా రెజ్లర్.. సాక్షిని తన పట్టులో బంధించి ఉందని, అయినా రెఫరీ గ్రహించకుండా జియావోకు పాయింట్లు ఇచ్చిన విషయాన్ని సాంకేతిక జ్యూరీ దృష్టికి తీసుకుపోవడంలో విఫలమయ్యారు. రెండో క్వార్టర్‌లో జియావో 6-6తో స్కోరు సమం చేసింది. ఆపై సాంకేతికంగా మెరుగైన ప్రదర్శనతో ఆమె విజేతగా నిలిచింది. చైనా రెజ్లర్ ఫైనల్ చేరడంతో సాక్షి రెపిచేజ్ చాన్స్ దక్కించుకొని కాంస్యం సాధించింది.

పంజాబ్ కోచ్‌గా ప్రసాద్



మొహాలి: అనుకున్నట్టుగానే వెంకటేష్ ప్రసాద్ ఐపీఎల్ ఫ్రాంచైజీకి అనుసంధానమయ్యాడు. రెండురోజుల క్రితం జాతీయ జూనియర్ సెలెక్షన్ కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా చేసిన వెంకీ ఐపీఎల్ జట్టు కింగ్స్ లెవెన్ పంజాబ్‌కు బౌలింగ్ కోచ్‌గా నియమితుడయ్యాడు. ఈ మేరకు పంజాబ్ జట్టు ప్రకటన విడుదల చేసింది. ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు బ్రాడ్ హాడ్జ్ ప్రధాన కోచ్‌గా వ్యవహరించే పంజాబ్ సహాయ బృందంలో వెంకీ బౌలింగ్ కోచ్‌గా, మిథున్ మన్హాస్ అసిస్టెంట్ కోచ్‌గా, నిషాంత్ ఠాకూర్ కండీషనింగ్ కోచ్‌గా, శ్యామల్ వల్లభ్‌జీ టెక్నికల్ కోచ్‌గా, నిషాంత బార్డోలి ఫీల్డింగ్ కోచ్‌గా వ్యవహరించనున్నారు. జాతీయ అండర్-19 జట్టు ప్రపంచకప్‌ను గెలిచిన నెలరోజుల వ్యవధిలోనే వెంకటేష్ ప్రసాద్ పరస్పర విరుద్ధ ప్రయోజనాల దృష్ట్యా రాజీనామా చేస్తున్నట్టు పేర్కొన్నప్పటికీ బీసీసీఐ పెద్దలతో పొసగకనే అతడు తన పదవిని త్యజించినట్టు బోర్డు వర్గాలు పేర్కొంటున్నాయి.

కర్నూలులో 25 నుంచి రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ సెలెక్షన్స్

హైదరాబాద్: త్వరలో హర్యానాలోని పంచకులలో జరిగే జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ కోసం ఆంధ్రప్రదేశ్ పారా అథ్లెటిక్స్ అసోసియేషన్ (పీఎస్ఏపీ) సెలెక్షన్ ట్రయల్స్ నిర్వహిస్తోంది. ఈనెల 7వ తేదీన కర్నూలులోని ఔట్‌డోర్ స్టేడియంలో సెలెక్షన్స్ జరగనున్నాయి. 100 మీటర్లు, 200 మీ. 400 మీ. 800 మీ. 1500 మీ.లతో పాటు లాంగ్‌జంప్, షాట్ పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో ఈవెంట్లలో సెలెక్షన్స్ జరుగుతాయి. వివరాల కోసం పీఎస్ఏపీ ప్రతినిధుల (సెల్ నంబర్లు 9177551118, 9949288767)ను సంప్రదించగలరు.

చెలరేగిన విహారి

ధర్మశాల: హనుమ విహారి (76 బంతుల్లో 16 ఫోర్లు, సిక్సర్‌తో 95 నాటౌట్) అదరగొట్టడంతో దేవధర్ ట్రోఫీలో వర్ష ప్రభావిత మ్యాచ్‌లో భారత్-బి 8 వికెట్ల తేడాతో భారత్-ఎను చిత్తు చేసింది. ఆదివారం 43 ఓవర్లకు కుదించిన డే/నైట్ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్-ఎ.. ధర్మేంద్రసింహ్ జడేజా (4/36) దెబ్బకు 41.2 ఓవర్లలో 178 పరుగులకే కుప్పకూలింది. రికీ భుయ్ (78) టాప్ స్కోరర్. అనంతరం వీజేడీ పద్ధతి ఆధారంగా బి-టీమ్ లక్ష్యాన్ని 175 పరుగులుగా సవరించారు. దీన్ని శ్రేయాస్‌సేన రెండు వికెట్లు కోల్పోయి 26.2 ఓవర్లలోనే చేరుకుంది. విహారితో పాటు మరో ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ (43), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (28 నాటౌట్) రాణించారు.

యూపీలో 'కొత్త పొత్తు'

- ఉప ఎన్నికల్లో ఎస్పీకి బీఎస్పీ మద్దతు
- గోరఖ్‌పూర్, ఫూల్పూర్ లోక్‌సభ స్థానాలకు 11న ఎన్నికలు

లఖ్‌నవ్, మార్చి 4: మార్చి 11.. ఉత్తరప్రదేశ్ బీజేపీకి ఎంతో కీలకం. ఏడాది కిందట ఇదే రోజు యూపీ అసెంబ్లీలో మూడింట రెండొంతుల మెజారిటీ సాధించి అధికారాన్ని కైవసం చేసుకుంది. ఇప్పుడు మళ్లీ అదే రోజు అదే రాష్ట్రంలోని రెండు ప్రతిష్ఠాత్మక పార్లమెంటు స్థానాల్లో విజయం సాధించేందుకు పావులు కదుపుతోంది. యూపీ సీఎంగా యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రిగా కేశవ్‌ప్రసాద్‌మౌర్య ఎన్నిక కావడంతో అప్పటికే తాము ఎంపీలుగా ఉన్న గోరఖ్‌పూర్, ఫూల్పూర్ పార్లమెంటు స్థానాలకు రాజీనామాలు చేశారు. దాంతో ఆ రెండు స్థానాలకు మార్చి 11న ఎన్నికలు జరగనున్నాయి. ఈ రెండుచోట్లా అధికార బీజేపీ, సమాజ్‌వాదీ, కాంగ్రెస్ మధ్య ముక్కోణ పోటీ జరుగుతోంది. గోరఖ్‌పూర్ దాదాపు 4 దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోట. ఇక్కడి నుంచి ఆదిత్యనాథ్ 5సార్లు ఎంపీగా గెలిస్తే, అంతకుముందు మూడుసార్లు యోగి అవైద్యనాథ్ ప్రాతినిధ్యం వహించారు. ఇక, ప్రథమ ప్రధాని నెహ్రూ ప్రాతినిధ్యం వహించిన ఫూల్పూర్ ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోట. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి మౌర్య గెలిచారు. కాగా, బీజేపీని ఓడించడమే ధ్యేయంగా అనూహ్య పొత్తులు తెరపైకి వస్తున్నాయి. బీఎస్పీ తన అభ్యర్థిని బరిలో దించకుండా తన బద్ధ శత్రువు ఎస్పీకి మద్దతు ఇచ్చేందుకు ముందుకొచ్చింది. అయితే, మోదీ, యోగి అభివృద్ధి నినాదం తమను గెలిపిస్తుందని బీజేపీ అంచనా వేస్తోంది.

సంగ్మా కుమారుడే మేఘాలయ సీఎం

- 6న కాన్‌రాడ్ సంగ్మా ప్రమాణ స్వీకారం
- ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించిన గవర్నర్
- ఫలించిన బీజేపీ వ్యూహం
- కాంగ్రెస్‌కు భంగపాటు



షిల్లాంగ్, మార్చి 4: మేఘాలయలో బీజేపీ వ్యూహం ఫలించింది. లోక్‌సభ మాజీ స్పీకర్ పీఏ సంగ్మా కుమారుడు కాన్‌రాడ్ సంగ్మా నేతృత్వంలోని నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు గవర్నర్ గంగా ప్రసాద్ గ్రీన్ సిగ్నలిచ్చారు. మంగళవారం సీఎంగా ప్రమాణ స్వీకారానికి కాన్‌రాడ్ సన్నాహాలు చేస్తున్నారు. 21 సీట్లను సాధించినా.. కాంగ్రెస్‌కు ప్రభుత్వ ఏర్పాటులో భంగపాటు తప్పలేదు. ఎన్‌పీపీ 19 స్థానాలను కైవసం చేసుకోగా.. యునైటెడ్ డెమోక్రటిక్ పార్టీ (యూడీపీ), బీజేపీ, హెచ్‌ఎస్‌పీడీపీ, పీడీఎఫ్‌తో పాటు.. ఒక స్వతంత్ర అభ్యర్థి కాన్‌రాడ్‌కు మద్దతిచ్చారు. కాంగ్రెసేతర ప్రభుత్వ ఏర్పాటులో బీజేపీ కీలక పాత్ర పోషించింది. బీజేపీ వ్యూహకర్త హిమవంత్ బిస్వ శర్మ కన్వీనర్‌గా ఉన్న ఈశాన్య ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌ఈడీఏ) 34 మంది ఎమ్మెల్యేల మద్దతును కూడగట్టింది. ఎన్‌పీపీకి యూడీపీ మద్దతు కూడగట్టడంలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కీలక పాత్ర పోషించారు. ఆదివారం సాయంత్రం గవర్నర్‌ను కలిసిన కాన్‌రాడ్.. తనకు మద్దతిస్తున్న ఎమ్మెల్యేల జాబితాను అందించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రానున్న రెండు రోజులు తమకు అత్యంత కీలమని పేర్కొన్నారు. ఆరోతేదీన సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ప్రకటించారు. మరోవైపు హిమవంత్ బిస్వ శర్మ మాట్లాడుతూ.. మేఘాలయలో ఉప ముఖ్యమంత్రి ఉండబోరని ప్రకటించారు. 'మిత్రపక్షాలన్నిటికీ ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉంటుంది. మద్దతిచ్చిన పార్టీల్లోని ప్రతి ఇద్దరు ఎమ్మెల్యేల్లో ఒకరికి మంత్రి పదవిని ఇవ్వాలని నిర్ణయించాం' అని వివరించారు. కాగా.. మేఘాలయ ముఖ్యమంత్రి పదవికి ముకుల్ సంగ్మా రాజీనామా చేశారు. ప్రస్తుత అసెంబ్లీ పదవీకాలం మార్చి 7తో ముగియనుంది.

ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతిలా..

పార్టీ	సభ్యుల సంఖ్య
ఎన్‌పీపీ	19
యూడీపీ	6
పీడీఎఫ్	4
బీజేపీ	2
హెచ్‌ఎస్‌పీడీపీ	2
స్వతంత్ర అభ్యర్థి	1
మొత్తం	34

విద్వేషాలకు తిరస్కరణ

- బీజేపీకి ఏకగ్రీవ్రంగా 'ఈశాన్యం' ఓటు
- కన్నడిగుల్లోనూ ఇదే స్ఫూర్తి: ప్రధాని



బెంగళూరు, మార్చి 4: విద్వేషపూరిత రాజకీయాలను ఈశాన్య భారత ప్రజలు నిర్ద్వంద్వంగా తిరస్కరించారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అదే సమయంలో బీజేపీకి ఏకగ్రీవంగా ఓటేసి అధికారం కట్టబెట్టారని తెలిపారు. తుముకూరు రామకృష్ణ వివేకానంద ఆశ్రమం రజతోత్సవాలు, స్వామి వివేకానంద శిష్యురాలైన సిస్టర్ నివేదిత 150వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రసంగించారు. 'యువశక్తి-నవభారత విజన్' అన్న అంశంపై మాట్లాడారు. త్రిపురలో బీజేపీ ఘనవిజయం తనకు అమిత సంతోషాన్నిస్తోందని చెప్పారు. ఈశాన్య రాష్ట్రాల్లో గత వామపక్ష, కాంగ్రెస్ ప్రభుత్వాల వ్యవహార శైలిపై మండిపడ్డారు. వాటి విధానాలు, నిర్ణయాల వల్ల భారతదేశ ప్రధాన స్రవంతి నుంచి తమను దూరం చేశారని అక్కడి ప్రజలు ఇదివరకు భావించేవారని తెలిపారు. వారిలో నెలకొన్న ఆ భావనను చెరిపేసేందుకు తన ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషిచేస్తోందని చెప్పారు. అందుకే అక్కడి వారు విద్వేష రాజకీయాలను తోసిపుచ్చి.. బీజేపీకి విజయం అందించారని కొనియాడారు. 'దేశంలోని ఏ ప్రాంతానికీ, వర్గానికీ.. ప్రభుత్వం తమను నిర్లక్ష్యం చేస్తోందన్న భావన కలుగకుండా పనిచేస్తున్నాం. మూడు ఈశాన్య రాష్ట్రాల ప్రజలు ఇచ్చిన తీర్పే ఈ దిశగా పెద్ద మార్పు. నేనీ ఫలితాలను పార్టీల గెలుపోటముల దృష్టిలో చూడటం లేదు. ఆ రాష్ట్రాల ప్రజల సంతోషంలో దేశం మొత్తం పాలుపంచుకోవడమే ప్రధానం' అని ప్రధాని వ్యాఖ్యానించారు. ఈ సమగ్రతా స్ఫూర్తి కర్ణాటక ప్రజల్లోనూ వెల్లివిరుస్తుందన్న విశ్వాసం వ్యక్తంచేశారు.

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, గవర్నర్, లెఫ్టినెంట్ గవర్నర్ల కార్లకు కూడా త్వరలో మోటారు వాహనాల చట్టం ప్రకారం నంబరు ప్లేట్లు రాబోతున్నాయి. ఈ మేరకు ఆయా విభాగాలు ఢిల్లీ హైకోర్టుకు తెలిపాయి.

సీపీఎంలో అంతర్మథనం!

కాంగ్రెస్‌తో కలిసి సాగాలన్న అభిప్రాయాలు.. మళ్లీ తెరపైకి సీతారాం ఏచూరి ప్రతిపాదన

- వచ్చే నెల భేటీలో చర్చించే అవకాశం
- సీఎం పదవికి మాణిక్ రాజీనామా

కోల్‌కతా/తిరువనంతపురం/న్యూఢిల్లీ, మార్చి 4: త్రిపురలో దారుణ పరాజయం నేపథ్యంలో సీపీఎం తమ వ్యూహాల విషయంలో పునరాలోచించాల్సిన పరిస్థితులు తలెత్తాయి. కాంగ్రెస్‌తో కలిసి ముందుకు సాగాలన్న పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రతిపాదన మళ్లీ తెరపైకి వస్తోంది. ఏప్రిల్‌లో జరగనున్న కీలక సమావేశంలో ఈ అంశంపై చర్చించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. 'కాంగ్రెస్‌తో ఎటువంటి అవగాహన కుదుర్చుకోరాదని మా ముసాయిదా తీర్మానంలో పేర్కొన్నాం. కానీ, త్రిపురలో ఓటమి తరువాత మా వ్యూహాలు, రాజకీయ నిర్ణయాలపై పునరాలోచించక తప్పని పరిస్థితి నెలకొంది' అని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు హన్నన్ మొల్లా అన్నారు. మరోవైపు త్రిపుర ఓటమిని పార్టీ తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందని కేరళ యూనిట్ అభిప్రాయపడింది. సంఘ్ పరివార్ నుంచి దేశం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోందని, దానిని నిలువరించాలంటే కలిసివచ్చే లౌకిక శక్తులతో సీపీఎం కలిసి పోరాడాలని కేరళ మాజీ సీఎం వి.ఎస్.అచ్యుతానందన్ అన్నారు. కాగా త్రిపురలో బీజేపీ గెలుపు ప్రజలిచ్చిన తీర్పు కాదని సీపీఎం సీనియర్ నేత, కేరళ మంత్రి ఏకే బాలన్ అన్నారు. ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా, కేంద్ర మంత్రులు అధికార దుర్వినియోగానికి పాల్పడి గెలిచారని ఆరోపించారు. కాగా, త్రిపుర ఎన్నికల్లో సీపీఎం ఓటమిపాలు కావడంతో సీఎం మాణిక్ సర్కార్ ఆదివారం తన పదవికి రాజీనామా చేశారు. గవర్నర్ తథాగతరాయ్‌కి తన రాజీనామా లేఖను సమర్పించారు. మరోవైపు ఎన్నికల్లో బీజేపీతో కలిసి పోటీ చేసిన ఐపీఎఫ్‌టీ.. ఫలితాలు వెలువడి ఒక్కరోజు కూడా గడవకముందే ఆ పార్టీకి ఝలక్ ఇచ్చింది. గిరిజనులకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలన్న తమ డిమాండ్‌ను బీజేపీ నెరవేర్చాల్సిందేనని స్పష్టం చేసింది. ఎన్నికల్లో బీజేపీతో కలిసిపోటీ చేసినా.. ఏళ్ల తరబడి చేస్తున్న తమ పోరాటం నుంచి వెనక్కి పోలేదని ఐపీఎఫ్‌టీ అధ్యక్షుడు ఎన్.సి.దేవ్‌వర్మ స్పష్టం చేశారు. 59 సీట్ల త్రిపుర అసెంబ్లీలో బీజేపీ 35స్థానాలు సాధించడంతో ఆ పార్టీ ఐపీఎఫ్‌టీతో సంబంధం లేకుండానే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశం లభించనుంది. బీజేపీ ఎమ్మెల్యేలు శాసనసభాపక్ష నేతను ఎన్నుకునేందుకుగాను మంగళవారం సమావేశం కానున్నారు. సమావేశానికి కేంద్ర మంత్రి గడ్కరీ హాజరు కానున్నారు.



రాజీనామా సమర్పించి రాజ్‌భవన్ నుంచి తిరిగివెళ్తున్న త్రిపుర సీఎం మాణిక్ సర్కార్

కర్ణాటకలోనూ బీజేపీదే గెలుపు: అమిత్ షా

ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్‌తో బీజేపీ అధ్యక్షుడి భేటీ



నాగ్‌పూర్, మార్చి 4: కర్ణాటకలోనూ బీజేపీ ఘన విజయం సాధిస్తుందని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా అన్నారు. ఇందులో తిరుగులేదని ఈశాన్య రాష్ట్రాల్లో భారీ విజయంతో ఉత్సాహంగా ఉన్న షా అన్నారు. ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్, ఇతర సీనియర్ నేతలతో ఆయన 4 గంటల పాటు సుదీర్ఘ చర్చ జరిపారు. ఆర్‌ఎస్‌ఎస్ సీనియర్ నాయకుడు భయ్యాజీ జోషి, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీలను కూడా కలిశారు. మార్చి 9 నుంచి 11వ తేదీ వరకు జరిగే ఆర్‌ఎస్‌ఎస్ అత్యున్నత స్థాయి భేటీ అయిన అఖిల్ భారతీయ ప్రతినిధి సభలో అమిత్ షా పాల్గొంటారు.

నాగాలాండ్‌లో ఎన్డీపీపీ సర్కారే!

- రియోకు మెజారిటీ ఉంది: గవర్నర్

కోహిమా, మార్చి 4: నాగాలాండ్‌లో నేషనలిస్ట్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ(ఎన్డీపీపీ) నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు కానుంది. ఆ పార్టీ నేత నిఫియా రియోను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించినట్లు నాగాలాండ్ గవర్నర్ పీబీ ఆచార్య ఆదివారం తెలిపారు. 32 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని రియో గవర్నర్‌ను కలిసి వివరించారు. సోమవారం ఆయా ఎమ్మెల్యేల సంతకాలతో కూడిన పత్రాలను అందజేయాలని గవర్నర్ ఆదేశించారు. రియో ఇప్పటికే నాగాలాండ్ సీఎంగా మూడుసార్లు పనిచేశారు. కలిసి పోటీ చేసిన ఎన్డీపీపీ, బీజేపీలు 18, 12 సీట్లు సాధించాయి. జేడీయూ నుంచి ఒకరు, ఒక స్వతంత్ర ఎమ్మెల్యే మద్దతు ప్రకటించారు.

మిలిటెంట్ హతం

- కశ్మీర్‌లో అతడికి సహకరించిన మరో ముగ్గురి మృతి
- ఆర్మీ ప్రతినిధి వెల్లడి.. పోలీసుల దర్యాప్తు

శ్రీనగర్, మార్చి 4: దక్షిణ కశ్మీర్‌లోని షోపియాన్‌జిల్లా పహనూ ప్రాంతంలో జరిగిన కాల్పుల్లో ఒక మిలిటెంట్, అతడికి సహకరించినట్టుగా భావిస్తున్న మరో ముగ్గురు మరణించారు. ఆర్మీ అధికార ప్రతినిధి రాజేశ్ కాలియా తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో అక్కడి 44వ రాష్ట్రీయ రైఫిల్స్ మొబైల్ వెహికిల్ చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న సైనికులపై కాల్పులు జరిగాయి. దీంతో సైనికులు ఎదురుకాల్పులకు దిగారు. కొద్దిసేపటి తర్వాత అటువైపు నుంచి కాల్పులుఆగిపోవంతో సైనికులు అక్కడికి వెళ్లి చూడగా ఒక వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. అతడి ఆయుధం, ఒక పౌచ్ పక్కనే పడి ఉన్నాయి. అక్కడికి కొద్దిదూరంలో ఒక కారు ఉంది. దాంట్లో మరో ముగ్గురు వ్యక్తులు మరణించి ఉండటాన్ని గమనించారు. మృతుల్లో ఒకడిని షాహిద్ అహ్మద్ దార్ అనే తీవ్రవాదిగా గుర్తించారు. అతడి ఆయుధాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. మిగతా ముగ్గురినీ ఓవర్‌గ్రౌండ్ వర్కర్లుగా గుర్తించినట్టు ఆర్మీ అధికార ప్రతినిధి వెల్లడించారు. అయితే, స్థానికులు మాత్రం.. వారు ముగ్గురూ సామాన్య పౌరులని, తీవ్రవాదులకు సహకరించేవారు కాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాల్పులు జరిగిన చోటుకు పోలీసులు చేరుకుని పరిశీలించారు. దీనిపై దర్యాప్తు చేస్తామన్నారు.

కేంద్రంపై కాంగ్రెస్ పోరు.. 16 నుంచి ప్లీనరీ



న్యూఢిల్లీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టేందుకు కాంగ్రెస్ నేతలు సిద్ధమవుతున్నారు. నిరుద్యోగం, వ్యవసాయం, పేదరికం సమస్యలే ఎజెండాగా ముందుకు సాగనున్నారు. ఈ నెల 16 నుంచి 18 వరకు ఢిల్లీలో జరుగనున్న కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాల్లో ఈ మూడు అంశాలపై ప్రత్యేక తీర్మానాలను ఆమోదించే అవకాశం ఉంది. 'దేశంలో రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోతున్నది. నిరుద్యోగుల పరిస్థితి అంతే. వీటిపై పార్టీ కార్యాచరణను ప్లీనరీలో ప్రకటిస్తాం' అని కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు మీడియాతో అన్నారు. ప్లీనరీలో చేయాల్సిన తీర్మానాల ఎంపికపై మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అధ్యక్షతన ఆదివారం ఏఐసీసీ కార్యాలయంలో డ్రాఫ్ట్‌కమిటీ సమావేశమైంది. 44మంది డ్రాఫ్ట్‌కమిటీ సభ్యులకుగాను 34మంది హాజరయ్యారు. సమావేశంలో గులాం నబీ ఆజాద్, ఏకే ఆంటోని వంటి ముఖ్య నేతలు పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.